


సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 5

సోమవారం 18-9-2023



పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి
వినాయక చవితి శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'విశ్వకర్మ' పథకానికి శ్రీకారం

విశ్వకర్మ జయంతి సందర్భంగా ఢిల్లీలో 'పీఎం విశ్వకర్మ' పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు.

వివరాలు 6లో ▸



180 మందికి స్క్రబ్ టైఫస్

కేరళ రాష్ట్రంలో నిఫా వైరస్ మాదిరిగా ఒడిశాలో 180 మందిలో స్క్రబ్ టైఫస్ వైరస్ బయటపడింది.

వివరాలు 6లో ▸



విమానం కూలి 14 మంది మృతి

బ్రెజిల్‌లోని అమెజాన్ అడవుల్లో విమానం కూలిన ఘటనలో అందులోని మొత్తం 14 మందీ దుర్మరణం చెందారు.

వివరాలు 6లో ▸



'డిఫాల్టర్ల'కు చాక్లెట్ ప్యాకెట్లు

ఈఎంఐలు డిఫాల్టయ్యే అవకాశమున్న వారికి చాక్లెట్లు పంపి, వాయిదా చెల్లింపుల గురించి ఎస్‌బీఐ గుర్తు చేస్తోంది.

వివరాలు 13లో ▸

కరువు నేలకు.. 'కృష్ణా'భిషేకం

రేపు 77 చెరువులకు కృష్ణా జలాలు.. జాతికి అంకితం చేయనున్న సీఎం జగన్

- పాదయాత్రలో ఇచ్చిన మరో హామీ అమలుకు శ్రీకారం
- కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని దుర్భిక్ష ప్రాంతాల్లో 10,394 ఎకరాలకు సాగునీరు
- పెరగనున్న భూగర్భ జలమట్టం
- బోరు బావుల కింద విస్తారంగా పంటల సాగు
- ప్రజల జీవన ప్రమాణాలు మెరుగై వలసలకు బ్రేక్
- ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ మలుపు అంటున్న సామాజికవేత్తలు
- పాదయాత్రలో వైఎస్ జగన్ హామీ ఇవ్వడంతో 2018లో హడావుడిగా ఆ పథకాన్ని చేపట్టిన టీడీపీ సర్కార్
- జీవో ఇచ్చి కొబ్బరికాయ కొట్టి చేతులు దులుపుకున్న వైనం
- అధికారంలోకి వచ్చాక రూ.224.31 కోట్లతో ఈ పథకాన్ని పూర్తి చేసిన సీఎం జగన్
- పచ్చటి పంటలతో కోనసీమను తలపిస్తున్న కరువు నేల



కృష్ణా జలాలతో జలకళను సంతరించుకున్న నంద్యాల జిల్లా దోన్ మండలం వెంకటాపురం చెరువు

కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పశ్చిమ మండలాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి ఏ.రామగోపాలరెడ్డి:

రాష్ట్రంలో అత్యంత కరువు పరిస్థితులకు, వలసలకు మారుపేరైన కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పశ్చిమ మండలాలు కృష్ణమ్మ స్పర్శతో పరవశించిపోతున్నాయి. ఇన్నాళ్లూ కరువుతో తల్లడిల్లిన నేలతల్లిని ఇప్పుడు కృష్ణా జలాలు అభిషేకిస్తుండటంతో పులకరించిపోతోంది. ట్రయల్ రన్ (ప్రయోగాత్మకంగా నడిపించడం) ద్వారా కృష్ణా జలాలను నింపిన చెరువుల కింద రైతులు పంటలు సాగు చేయడంతో నిన్నటి దాకా నోళ్లు తెరిచిన బీడు భూములు ఇప్పుడు కోనసీమను తలపిస్తున్నాయి. దశాబ్దాలుగా దుర్భిక్షంతో తల్లడిల్లుతున్న ఈ ప్రాంతాల ప్రజల దశ మార్చే

మిగతా 2వ పేజీలో ▶

సువర్ణాక్షరాలతో లిఖించొచ్చు

"తీవ్రమైన దుర్భిక్షానికి కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని డోన్, పత్తికొండ, ఆలూరు, పాణ్యం నియోజకవర్గాలు పెట్టింది పేరు. ఇక్కడ వలసలు నిత్యకృత్యం. కృష్ణా జలాలతో ఈ ప్రాంతాన్ని అభిషేకించి, సుభిక్షం చేయడం ద్వారా వలసలకు అడ్డుకట్ట వేస్తానని పాదయాత్రలో ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్ అమలు చేశారు. యుద్ధ ప్రాతిపదికన చెప్పిన 68 చెరువుల కంటే 9 అదనంగా 77 చెరువులను నింపే పథకాన్ని పూర్తి చేసి, జాతికి అంకితం చేస్తున్నారు. ఇది చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. ఈ పథకంతో కరువు ప్రాంతం రూపురేఖలు సమూలంగా మారిపోతాయి.

– బుగ్గన రాజేంద్రనాథ్, ఆర్థిక శాఖ మంత్రి

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్‌కు మిగిలింది 100 రోజులే!



తెలంగాణలో బీజేపీ, ఎంఐఎం సహా ఎవరు మద్దతుగా వచ్చినా వంద రోజుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోవడం ఖాయమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎంలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం చేస్తోందన్నారు.

వివరాలు 5లో ▸

వారికి ప్రజలే బుద్ధి చెబుతారు



తెలంగాణ చరిత్రను తప్పుగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హెచ్చరించారు. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో 75వ హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన జాతీయజెండాను ఎగురవేశారు.

వివరాలు 14లో ▸



శ్రీనివాస సేతు ఫ్లైఓవర్

నేడు శ్రీనివాస సేతు ప్రారంభం

ప్రజలకు అంకితం చేయనున్న ముఖ్యమంత్రి జగన్

అనంతరం తిరుమలలో శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

రేపు నంద్యాల జిల్లా డోన్‌లో బహిరంగ సభ

2 లో

బ్రహ్మోత్సవ సంబరం ప్రారంభం

- శాస్త్రోక్తంగా సాలకట్ల బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- నేడు ధ్వజారోహణం, పెద్ద శేష వాహన సేవ
- 22న గరుడ వాహన సేవ..
- ఆ రోజు తిరుమలకు వచ్చే ఫోర్ వీలర్ల వాహనాలకు పాసులు ఉంటేనే అనుమతి

- వివరాలు 5లో



మాడవీధుల్లో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న శ్రీవారి సర్వ సేనాధిపతి విష్వక్సేనుడు

నేడు, రేపు అక్కడక్కడ వానలు

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్, యానాం పరిసర ప్రాంతాల్లో పశ్చిమదిశలో గాలులు వీస్తున్నాయి. దీని ప్రభావంతో సోమ, మంగళవారాల్లో కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వానలు కురిసే అవకాశాలున్నాయి. ఒకటిరెండు చోట్ల మోస్తరు వానలు పడే సూచనలున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదివారం రాష్ట్రమంతటా వేసవిని తలపించింది. కొన్నిచోట్ల సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బాపట్లలో సాధారణం కంటే 4.1 డిగ్రీలు అత్యధికంగా 37.6 డిగ్రీలు నమోదుకాగా, కావలిలో 37.7, జంగమహేశ్వరపురంలో 37.2, తునిలో 37.1, విశాఖపట్నంలో 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సెలవు

వినాయక చవితి సందర్భంగా నేడు (సోమవారం) సాక్షి కార్యాలయానికి సెలవు. కావున మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN
సూచించిన నేటి గ్రుడ్డు & చికెన్ తిరుపతి జోన్ ధరలు

గ్రుడ్డ రిటైల్ ధర ₹ 72 డజన్	ఫారం దగ్గర లైవ్ బర్డ్	115	డ్రస్స్‌డ్ స్కిన్‌తో	199
	రిటైల్ లైవ్ బర్డ్	137	స్కిన్‌లెస్	226



ఫైర్ సిరాజ్

6 వికెట్లతో చెలరేగిన భారత పేసర్

ఒకే ఓవర్లో 4 వికెట్లు

శ్రీలంక 50 ఆలౌట్


ఆసియా కప్ విజేత భారత్

ఫైనల్‌లో 10 వికెట్ల తేడాతో ఘన విజయం



భారత్ – శ్రీలంక మధ్య ఆసియా కప్ ఫైనల్.. గత రెండు మ్యాచ్‌లలో లంక జట్టు మెరుగైన ప్రదర్శన కారణంగా ఫైనల్ మ్యాచ్ కోసం అభిమానులు భారీగా తరలివచ్చారు. మ్యాచ్ ఆరంభమైన గంటకే ఖేల్ ఖతం.. సిరాజ్ నిప్పులు చెలరేగే బంతులతో లంక ఇన్నింగ్స్‌ని పేకమేడలా కుప్పకూల్చాడు. ఒకే ఓవర్లో నాలుగు వికెట్లు తీసి సంచలనం సృష్టించాడు. దీంతో 15.2 ఓవర్లలోనే లంక ఇన్నింగ్స్ ముగిసింది. భారత్ కేవలం 6.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేధించింది.

12 లో



నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక భేటీ

- 22 వరకు ఐదు రోజులు జరుగనున్న సమావేశాలు
- తొలిరోజు పార్లమెంట్ 75 ఏళ్ల ప్రయాణంపై చర్చ
- 19 నుంచి కొత్త పార్లమెంట్ భవనంలో కార్యకలాపాలు
- ఇప్పటికే అజెండాలో సీఈసీ సహా పలు కీలక బిల్లులు
- ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అదానీ అంశాలపై చర్చించాలంటున్న విపక్షాలు
- పార్లమెంట్ నూతన భవనం గజద్వారంపై త్రివర్ణ పతాకం ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

- వివరాలు 6లో ▸

స్కిల్ కుంభకోణం సూత్రధారి చంద్రబాబే

- సీఐడీ అదనపు డీజీ సంజయ్
- ఆధారాలున్నందుకే అరెస్టు చేశాం
- దర్యాప్తు ప్రారంభించింది కేంద్ర సంస్థలే
- ముద్దాయిలు సెల్ఫ్ సర్టిఫికెట్‌లు ఇచ్చుకుంటున్నారు: పొన్నవోలు



మాట్లాడుతున్న సంజయ్, చిత్రంలో పొన్నవోలు

సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) కుంభకోణం ప్రధాన సూత్రధారి అని నిర్ధారణ అయినందునే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేశామని సీఐడీ అదనపు డీజీ సంజయ్ స్పష్టం చేశారు. సీమెన్స్ అనే కంపెనీ ఉదారంగా రూ.3 వేల కోట్లు పెట్టుబడి పెడుతుందని చంద్రబాబు అసెంబ్లీలో చెప్పడంతోపాటు అలానే జీవోలు జారీ చేసి ఒప్పందం కుదుర్చుకున్నారని చెప్పారు. అయితే అందుకు విరుద్ధంగా 2015–16 ఆర్థిక సంవత్సరంలో మూడు నెలల వ్యవధిలో రూ.371 కోట్లు ప్రాజెక్టు నిమిత్తం హడావుడిగా విడుదల చేసి అవినీతికి పాల్పడ్డారని వెల్లడించారు. ఏపీ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆయన ఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీమెన్స్ కంపెనీ ద్వారా ఏపీలో ఆరు క్లస్టర్లుగా ప్రాజెక్టును ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందన్నారు. జీవోలో

మిగతా 10వ పేజీలో ▶

బాబుకు తోడు దొంగల వత్తాసు

- చంద్రబాబుకు సర్టిఫికెట్ ఇస్తున్న సహనిందితులు సుమన్‌బోస్, ఖన్విల్కర్
- స్కిల్ కుంభకోణంలో ఇప్పటికే వాళ్లిద్దరినీ అరెస్టు చేసిన ఈడీ, సీఐడీ
- జైల్లో ఉండి.. బెయిలుపై బయటకు వచ్చి.. ఇప్పుడు చిలకపలుకులు
- చంద్రబాబు తప్పులేదని వారు చెప్పటంపై న్యాయ నిపుణుల మండిపాటు

10 లో

ఇవాంటోకట్



ఊరుకోండి సార్!! వాళ్లకు లేనిపోని ఐడియాలిస్తున్నారు!

కొలంబియా వర్సిటీలో ఏపీ విద్యార్థుల ప్రసంగం

ఏపీలో విద్యా ప్రగతికి తామే ఉదాహరణ అని వెల్లడి

సీఎం వైఎస్ జగన్ హయాంలో విద్యా రంగంలో సమూల మార్పులు

సాక్షి, అమరావతి: న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితికి ఏపీ నుంచి వెళ్లిన 10 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల బృందం ఆదివారం కొలంబియా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సులో పాలుపంచుకున్నారు. ఇక్కడి సెంటర్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్‌లోని విద్యా విభాగం డైరెక్టర్ రాధికా అయ్యంగార్ ఆధ్వర్యంలో 'ఎడ్యుకేట్ ఎ చైల్డ్' లెక్చర్ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఏపీ విద్యార్థులు.. మాల శివలింగమ్మ, మోతుకూరి చంద్రలేఖ, గుండుమోగుల గణేష్, దడాల జ్యోత్స్న, సి.రాజేశ్వరి, పసుపులేటి గాయత్రి, అల్లం రిషితారెడ్డి, వంజివాకు యోగేశ్వర్, షేక్ అమ్మాజాన్, సామల మనస్విని ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా



యూఎన్‌వో సదస్సులో ఏపీ విద్యార్థులు

సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యంగా సీఎం జగన్ నాయకత్వంలో విద్యా సంస్కరణల అమల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న ద్విభాషా పాఠ్యపుస్తకాలు..

మిగతా 2వ పేజీలో ▶

పవన్ నువ్వెంత.. నీ బతుకెంత?

- ప్యాకేజీ కోసం సొంత కార్యకర్తలు, సామాజికవర్గాన్ని అమ్మేశావ్
- ఢిల్లీని ఢీకొట్టిన మా నేత ఎక్కడ.. ప్యాకేజీ కోసం బతికే నువ్వెక్కడ?
- నీ జెండా తప్ప అందరి జెండాలు మోసే కూలీగా మిగిలిపోయావు
- త్వరలో ఆరోగ్యశ్రీలో నీ పిచ్చి కుదురుస్తాం పవన్..
- పర్యాటక శాఖ మంత్రి రోజా ఆగ్రహం

10 లో



టీడీపీ, జనసేన పొత్తు అట్టర్ ఫ్లాప్

- తటస్థులే కాదు.. జనసేన కార్యకర్తలూ వ్యతిరేకిస్తున్నారు
- సున్నా సున్నా కలిస్తే వచ్చేది సున్నానేనంటూ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా



10 లో

పవన్‌ది 'ప్యాకేజీ' విశ్వాసం

- ఆయనది చంద్రబాబు పెంపుడు కుక్క స్థాయి
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై మంత్రి జోగి రమేష్ ఫైర్





రెండో దశ భూ హక్కు పత్రాల పంపిణీ

విడతల వారీగా పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్న రెవెన్యూశాఖ

సాక్షి, అమరావతి: భూముల రీ సర్వే పూర్తయిన రెండో దశలోని 2 వేల గ్రామాల్లో భూ హక్కు పత్రాల పంపిణీని రెవెన్యూ శాఖ ప్రారంభించింది. మొదటి దశ సర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లో 7.50 లక్షలకుపైగా భూ హక్కు పత్రాలను ఇప్పటికే రైతులకు అందించారు. ఇప్పుడు రెండో దశలోని 2 వేల గ్రామాల్లో సర్వే చివరి దశకు చేరుకోవడంతో ఆ గ్రామాల్లోని రైతులకు విడతల వారీగా భూ హక్కు పత్రాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. 26 జిల్లాల్లో 8.68 లక్షల భూ హక్కు పత్రాలు

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

ప్రధానికి సీఎం జగన్ పుట్టిన రోజు శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ 73వ పుట్టిన రోజు సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ఎక్స్(ట్విట్టర్) ద్వారా ప్రధానికి శుభాకాంక్షలు తెలిపారు. 'గౌరవనీయులైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి 73వ పుట్టిన రోజు సందర్భంగా నా శుభాకాంక్షలు' అంటూ సీఎం ఆదివారం ట్వీట్ చేశారు.

సామరస్యం పరిఢవిల్లాలి..

గవర్నర్ చవితి శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఆటంకాలు అన్నీ తొలగి ప్రజలకు మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఆ విఘ్నేశ్వరుడు కృపతో అంతటా శాంతి, సామరస్యం పరిఢవిల్లాలని గవర్నర్ అభిలషించినట్లు రాజ్‌భవన్ వర్గాలు ఆదివారం పేర్కొన్నాయి.

ప్రధానికి జన్మదిన శుభాకాంక్షలు

ప్రధానమంత్రి నరేంద్రమోదీకి గవర్నర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలను, సంతోషాన్ని ప్రసాదించాలని గవర్నర్ ఆకాంక్షించినట్లుగా రాజ్‌భవన్‌వర్గాలు వెల్లడించాయి.

అందరికీ గణనాథుని ఆశీస్సులుండాలి : సీఎం

సాక్షి, అమరావతి : వినాయక చవితి సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అందరిపై గణనాథుని ఆశీస్సులుండాలని, క్షేమ, స్థైర్య, ఆయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధించాలని, సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, పేదల సంక్షేమానికి ఎదురవుతున్న విఘ్నాలన్నీ తొలగిపోయి.. ప్రజలందరికీ విజయాలు సిద్ధించాలని అభిలషించారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో మరింత అభివృద్ధి చెందాలని సీఎం వైఎస్ జగన్ ఆకాంక్షించారు.

అక్టోబర్ 2 వరకు బ్లడ్ కలెక్షన్ క్యాంప్‌లు

సాక్షి, అమరావతి: అక్టోబర్ 2న గాంధీ జయంతి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఏపీ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్ కలెక్షన్ క్యాంప్‌లు, రక్తదానంపై అవగాహన కల్పిస్తామని చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్ రెడ్డి ఆదివారం తెలిపారు. ప్రధాని మోదీ పుట్టినరోజుని పురస్కరించుకుని ఆదివారం నుంచి అక్టోబర్ 2 వరకు సేవా పఖ్వాడా కార్యక్రమాన్ని కేంద్రం నిర్వహిస్తుందని, ఇందులో రెడ్‌క్రాస్ పాలుపంచుకుంటుందని చెప్పారు. రాష్ట్రంలో 18 బ్లడ్ బ్యాంక్‌లున్నాయని వీటి ఆధ్వర్యంలో 64 బ్లడ్ కలెక్షన్ క్యాంప్‌లు, నిర్వహించనున్నట్టు రాష్ట్ర కో-ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్ పేర్కొన్నారు.

చిరుతల డీఎన్‌ఏ నివేదిక

తిరుమల: అలిపిరి–తిరుమల నడకదారిలో గతనెలలో లక్షితపై దాడిచేసిన చిరుతను కనిపెట్టేందుకు 4 చిరుతలకు నిర్వహిస్తున్న డీఎన్ఏ పరీక్షల్లో రెండింటి రిపోర్టును ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ సంస్థ విడుదల చేసినట్లు తిరుపతి డీఎఫ్‌వో సతీష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఘటనాస్థలం నుంచి సేకరించిన నమూనాలతో సరిపోల్చేందుకు చిరుతల డీఎన్ఏలను పరీక్షిస్తున్నట్లు తెలిపారు. గతనెల 14, 17 తేదీల్లో చిక్కిన చిరుతలు చిన్నారిపై దాడి చేయలేదని ఈ నివేదిక ద్వారా తేలిందని, దీంతో ఓ చిరుతను గుండ్లబ్రహ్మేశ్వర అభయారణ్యంలో వదలగా, మరోదాన్ని విశాఖ ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకి తరలించామన్నారు. మరో రెండు చిరుతల డీఎన్‌ఏ నివేదికలు రావాల్సి ఉందని పేర్కొన్నారు.

'సహిత' పోస్టుల దరఖాస్తు గడువు పెంపు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ (పాఠశాల విద్యాశాఖ) ద్వారా నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహిత విద్యా రిసోర్స్ పర్సన్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తు గడువును 21 వరకు పొడిగించినట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక ప్రాతిపదికన 396 ఖాళీలు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు https://apie.apcfss.in/లో చూడవచ్చని తెలిపారు.

నేటి భవితలో..

- **యూపీఎస్సీ ఈఎస్ఈ 2024: ఇంజనీరింగ్ సర్వీస్.. సక్సెస్ ఇలా** ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.. సంక్షిప్తంగా ఈఎస్ఈ! కేంద్ర ప్రభుత్వ శాఖల్లో.. గ్రూప్–ఎ,గ్రూప్–బి హోదాలో ఉన్నత స్థాయి ఇంజనీరింగ్ పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నిర్వహించే పరీక్ష! తాజాగా ఈఎస్ఈ–2024 నోటిఫికేషన్ విడుదలైంది. యూపీఎస్సీ మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. ఈఎస్ఈ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..
- గ్రూప్స్ ప్రత్యేకం–కరెంట్ అఫైర్స్: పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్.
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

తిరుపతికి మణిహారం 'శ్రీనివాస సేతు'

- మార్కెట్ యార్డు నుంచి నంది సర్కిల్ వరకు ఎలివేటెడ్ స్మార్ట్ కారిడార్ ఎక్స్‌ప్రెస్ వే
- బైపాస్ రోడ్డులో రద్దీని తగ్గించడమే లక్ష్యంగా వంతెన నిర్మాణం
- నాలుగు లేన్ల కారిడార్ పొడవు 6.04 కి.మీ.
- రూ.650.50 కోట్లతో నిర్మాణం పూర్తి

ప్రాజెక్టు పేరు:	శ్రీనివాస సేతు
పనులు ప్రారంభం:	ఫిబ్రవరి 2019
మొత్తం పిల్లర్లు:	171
పిల్లర్లపై ఏర్పాటు చేసిన సెగ్మెంట్లు:	2,600
అంచనా వ్యయం:	రూ.684 కోట్లు
ఖర్చు చేసిన మొత్తం:	రూ.650.50 కోట్లు



సాక్షి, తిరుపతి: ప్రపంచ ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో నిర్మించిన ఎక్స్‌ప్రెస్ వే 'శ్రీనివాస సేతు' మణిహారంలా వెలిగిపోతోంది. అడుగడుగునా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వంతెన నిర్మాణం చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం దీనిని ప్రారంభించనున్నారు. ఈ వంతెన నిర్మించడంతో నగరంలో ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి కలుగుతుందని తిరుపతి వాసులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో 6.04 కిలోమీటర్ల మేర నిర్మించిన ఎలివేటెడ్ స్మార్ట్ కారిడార్ ఎక్స్‌ప్రెస్ వే అధునాతన సొబగులతో ఆకట్టుకుంటోంది. తిరుపతికి నిత్యం లక్షలాది మంది భక్తుల రాకపోకలతో నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తీవ్రంగా పెరిగింది. దశాబ్దాలు గడుస్తున్నా తిరుపతిలో రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణాల వంటివి జరగలేదు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతికి తొలి ఫ్లైఓవర్ సోమవారం నుంచి అందుబాటులోకి వస్తోంది.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా..

శ్రీనివాస సేతు పూర్తిగా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణం చేపట్టారు. పాదచారులకు సైతం ఇబ్బంది లేకుండా ఫుట్‌పాత్‌లను నిర్మించారు. వంతెన పొడవునా గరుడ పక్షి ఆకారంతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. పిల్లర్లపై ఆధ్యాత్మిక, చారిత్రక విశేషాలతో కూడిన చిత్రాలను తీర్చిదిద్దారు. వాహనాలు వెళ్లేందుకు సువిశాలమైన రోడ్డు అందుబాటులోకి తీసుకొచ్చారు. డివైడర్ల మధ్య వివిధ రంగుల్లో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు, సభైర్ సిగ్నల్స్‌తో నూతన అనుభూతిని కలిగిస్తోంది. డివైడర్, రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై అందమైన పూల మొక్కలను పెంచుతున్నారు. ఫ్లైఓవర్‌పై ప్రయాణించే వారికి ఆహ్లాదం పంచేలా సుందరీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. తిరుచానూరు మార్కెట్ యార్డు నుంచి రెండు పాయలుగా రామానుజం కూడలి వద్ద మెలితిరిగి నేరుగా కపిల తీర్థం కూడలి సమీపం వరకు శ్రీనివాస సేతు నిర్మించారు. రామానుజం కూడలి నుంచి మరో పాయ ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్తుంది. కరకంబాడి నుంచి వచ్చే వాహనాలు కపిల తీర్థం వెళ్లేందుకు నిర్మించిన రెండవ వంతెనపై ప్రయాణం .ప్రత్యేక అనుభూతిని కలిగిస్తోంది.

చేతల్లో అభివృద్ధి



అది చేస్తాం.. ఇది చేస్తాం అని మాయమాటలు చెప్పం. ఇది చేశాం అని చూపించిన తరువాతే ఆధారాలతో చెబుతాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు నేర్పించింది అదే. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే శ్రీనివాస సేతు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేశాం.

– భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే

నేడు శ్రీనివాస సేతు ప్రారంభం

ప్రజలకు అంకితం చేయనున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమ, మంగళవారాల్లో తిరుపతి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్నారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి తిరుపతి చేరుకుంటారు. తిరుపతిలోని నాలుగు దిక్కులను కలుపుతూ యాత్రికులు నేరుగా తిరుమల వెళ్లేందుకు అత్యాధునిక రీతిలో నిర్మించిన శ్రీనివాస సేతు (ఫ్లైఓవర్) ప్రారంభోత్సవం, ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్ హాస్టల్ బిల్డింగ్ వర్చువల్ ప్రారంభోత్సవం, టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల పట్టాల పంపిణీ (తిరుపతి–చెన్నై జాతీయ రహదారిలోని వడమాలపేట వద్ద 307 ఎకరాల్లో 3,518 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు) కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సీఎం జగన్ తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చేరుకుని దర్శనం చేసుకుంటారు. ఆ తర్వాత తిరుమల చేరుకుని వకుళమాత రెస్ట్ హౌస్, రచన రెస్ట్ హౌస్‌లు ప్రారంభిస్తారు. బేడీ ఆంజనేయ స్వామిని దర్శించుకుంటారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం పెద్ద శేష వాహనం సేవలో పాల్గొని, రాత్రికి పద్మావతి అతిథి గృహంలో బస చేస్తారు.

నీటి పథకాలకు ప్రారంభోత్సవం

మంగళవారం ఉదయం 6.20 గంటలకు శ్రీవారి ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్న అనంతరం కర్నూలు జిల్లా ఓర్వకల్లు చేరుకుంటారు. అక్కడి నుంచి కృష్ణగిరి మండలం లక్కసాగరం చేరుకుంటారు. అక్కడ డోన్, పత్తికొండ, ఆలూరు, పాణ్యం నియోజకవర్గాలకు తాగు, సాగు నీరందించే లక్ష్యంతో చేపట్టిన 68 చెరువులను కృష్ణా జలాలతో నింపే పథకాన్ని ప్రారంభిస్తారు. అనంతరం నంద్యాల జిల్లా డోన్‌కు చేరుకుని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. తర్వాత తాడేపల్లికి తిరుగు ప్రయాణమవుతారు.

న్యాయ విచారణపై సొంత వ్యాఖ్యానాలు సరికాదు

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఇటీవల కాలంలో సివిల్ సర్వెంట్లు న్యాయ విచారణపై సొంత వ్యాఖ్యానాలు చేస్తున్నారని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ధోరణి పెరగడం ఆందోళనకరమని, ఇది న్యాయవ్యవస్థ ఖ్యాతిని దెబ్బతీస్తుందన్నారు. ఏపీలో జరుగుతున్న వర్తమాన సంఘటనలపై ఆయన ఈ విధంగా స్పందించారు. 'ఇటీవల సివిల్ సర్వెంట్లు, ఇతరులు న్యాయ విచారణలపై న్యాయ వ్యవస్థపైనే నేరుగా పోరాటానికి (స్లగ్–ఫెస్ట్) దిగాలన్న ధోరణి పెరుగుతోంది. దీన్ని చూసి నేను చాలా ఆందోళన చెందుతున్నాను. న్యాయవ్యవస్థ ఖ్యాతి, న్యాయ నిర్వహణ అనేది సరైన వ్యాఖ్యాంపై ఆధారపడి ఉంటుంది. కానీ ఎవరికి వారే సొంతంగా న్యాయ వ్యాఖ్యానాలు చేయడం మంచిది కాదు. ముఖ్యంగా అత్యధిక మంది విశ్వసించేలా న్యాయ సంస్థలకు లైఫ్‌లైన్ ఉంటుంది. న్యాయ వ్యవస్థపై అవగాహన లేనివారు చేస్తున్న విమర్శలు విన్నప్పుడు 32 సంవత్సరాల పాటు న్యాయవ్యవస్థకు సేవలందించిన వ్యక్తిగా నేను బాధపడ్డాను. జ్యుడీషియల్ రిమాండ్ నుంచి కస్టడీకి వచ్చే క్రమంలో న్యాయపరమైన అనుమతిని న్యాయశాఖ మంజూరు చేస్తుంది. కానీ ఉన్నత వర్గాల్లోని ఒక వర్గానికి న్యాయపరమైన తీర్పులపై దూకుడుగా వ్యవహరించడం ఇటీవలి కాలంలో సర్వసాధారణమైపోయింది. బహుశా అన్నివైపులా రాజకీయ పక్షపాతంతో ఇలా జరుగుతుండొచ్చు. న్యాయమూర్తులపైనే వ్యక్తిగత దాడులు జరగడం మరింత ఆందోళన కలిగిస్తోంది. న్యాయపరమైన నిబంధనలు అటువంటి దాడులను అనుమతించవు. ఇటీవలి పరిణామాల దృష్ట్యా ఈ అత్యంత అభ్యంతరకరమైన ధోరణి వీలైనంత త్వరగా తొలగిపోతుందని నేను హృదయపూర్వకంగా ఆశిస్తున్నాను. న్యాయవ్యవస్థ గౌరవం క్రియాత్మకమైనది. జ్యుడీషియల్ తీర్పుల నుంచి ఉత్పన్నమయ్యే పరిణామాలను వ్యక్తిగత స్థాయిలో దూషణలు, దుర్భాషలతో వ్యవహరిస్తే అది సమాజానికి మరణ మృదంగమే అవుతుంది. వ్యవస్థలు, సంస్థలు మంచి లక్ష్యంతో ఉన్నప్పుడు సమాజంలో సామరస్యం కొనసాగుతుంది' అని పేర్కొన్నారు.

కొలంబియా వర్సిటీలో ఏపీ విద్యార్థుల ప్రసంగం

▶ మొదటి పేజీ తరువాయి

ట్యాబ్‌లు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఆంగ్ల విద్య, పాఠ్యాంశ సంస్కరణలను ప్రవేశపెట్టడం వల్ల విద్యారంగం ఎలా మారిందో.. తాము ఎలా ప్రగతి సాధించామో వివరించారు. మనబడి నాడు–నేడు, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాల ద్వారా పేద విద్యార్థులకు ఎంత మేలు జరుగుతోందో వివరించారు.

42 లక్షల మంది విద్యార్థులకు సీఎం జగన్ భరోసా

తమలాంటి 42.62 లక్షల మంది విద్యార్థులకు సీఎం జగన్ నాయకత్వంలోని ప్రభుత్వమే అన్ని విధాలుగా అండగా ఉందని విద్యార్థులు వివరించారు. సమీప భవిష్యత్‌లో తాము కూడా జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా ప్రతిష్టాత్మక కొలంబియా యూనివర్సిటీలో చదువుకోవాలన్న ఆకాంక్షను వెల్లడించారు. ఈ సందర్భంగా యూఎన్ఓ గ్లోబల్ స్కూల్స్ ప్రోగ్రామ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్ అధికారి అమెండా అబ్రూమ్, సెంటర్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జెఫ్రీ డి సాచ్‌తో ప్రత్యేకంగా సమావేశమై మన విద్యా విధానాలు, బోధనలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐఎఫ్‌పీ స్క్రీన్లు, ట్యాబ్స్, నూరు శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రతిభ గలవారికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని వివరించారు. మధ్యాహ్నం జరిగిన ఎకో అంబాసిడర్స్ వర్క్‌షాప్‌లో సైతం పాలుపంచుకున్నారు. యూఎస్‌వో స్పెషల్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు 20న జర్నలిస్ట్ అండ్ రైటర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూయార్క్‌లోని జాన్ జే కాలేజ్ ఆఫ్ క్రిమినల్ జస్టిస్‌లో జరిగే ఎస్‌డీఎస్ సర్వీస్ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థుల వెంట సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, కేజీబీవీ కార్యదర్శి మధుసూదనరావు ఉన్నారు.

రెండో దశ భూ హక్కు పత్రాల పంపిణీ

▶ మొదటి పేజీ తరువాయి

పంపిణీ చేయాల్సివుండగా ఇప్పటికే 5.12 లక్షల పత్రాలను ముద్రించి ఆయా జిల్లాలకు పంపారు. ఇందులో 2.48 లక్షల పత్రాలు ఈ–కేవైసీ పూర్తి చేసి పంపిణీ కూడా చేశారు. మిగిలిన పత్రాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్టీఆర్, అనంతపురం జిల్లాల్లో పంపిణీ దాదాపు పూర్తయింది. గుంటూరు, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఇంకా 5 శాతం లోపు పంపిణీ చేయాల్సి ఉంది. బాపట్ల, వైఎస్సార్, పార్వతీపురం మన్యం, అన్నమయ్య, శ్రీకాకుళం, తిరుపతి జిల్లాల్లో ఇంకా 30 శాతం వరకు పూర్తి చేయాల్సివుంది. పశ్చిమగోదావరి, కర్నూలు, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో 90 శాతం పెండింగ్ ఉండటంతో అక్కడ భూ హక్కు పత్రాల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మరో నెల రోజుల్లో పంపిణీ పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

కరువు నేలకు 'కృష్ణా'భిషేకం

▶ మొదటి పేజీ తరువాయి

మహత్తర పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం జాతికి అంకితం చేయనున్నారు. ఆ ప్రాంతంలో 68 చెరువులను కృష్ణా జలాలతో నింపే పథకం ఫలాలను సీఎం వైఎస్ జగన్ రైతులకు అందిస్తుండటం కర్నూలు, నంద్యాల జిల్లాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదిగా సామాజికవేత్తలు ప్రశంసిస్తున్నారు. ఈ మహత్తర ఆశయంతో రూ.224.31 కోట్ల వ్యయంతో చేపట్టిన 77 చెరువులను నింపే పథకాన్ని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసింది. ఈ పథకం వల్ల డోన్, పత్తికొండ, పాణ్యం, ఆలూరు నియోజకవర్గాల్లో నేరుగా 10,394 ఎకరాలకు నీళ్లందించనున్నారు. చెరువులు నింపడం వల్ల భూగర్భ జల మట్టం పెరుగుతుంది. దాంతో బోరు బావుల్లోనూ నీటి లభ్యత పెరుగుతుంది. దీని వల్ల వేలాది ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతాయి. తాగునీటి ఇబ్బందులు తీరతాయి. దుర్భిక్షానికి, వలసలకు పెట్టింది పేరైన ఆ ప్రాంతంలో జీవనోపాధులు పెరగడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. దాంతో వలసలకు పూర్తిగా అడ్డుకట్ట పడనుంది.

మరో హామీ అమలు

డోన్, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో ఎక్కడ చూసిన బోడి కొండలు, గుట్టలతో నిండి ఉంటుంది. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం ఇది. కొండలు, గుట్టల మీద కురిసిన వర్షపు నీరు వేగంగా కిందకు ప్రవహించడం వల్ల భూమిలోకి ఇంకని పరిస్థితి. ఫీడర్ ఛానల్స్ (వంకలు, వాగులు) సక్రమంగా లేకపోవడం వల్ల ఆ ప్రాంతంలో చెరువులు నిండని దుస్థితి. సాగునీటి మాట దేవుడెరుగు.. గుక్కెడు తాగునీళ్లకూ కరువే. దాంతో కుటుంబాన్ని పోషించుకోవడం కోసం బిడ్డలను, వృద్ధులైన తల్లిదండ్రులను ఇంట్లో వదిలి.. భార్యాభర్తలు సుదూర ప్రాంతాలకు వలస వెళ్లడం ఆ ప్రాంతంలో నిత్యకృత్యం. పాదయాత్రలో ఆ ప్రాంతాల ప్రజల కష్టాలు కళ్లారా చూసిన అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్.. అధికారంలోకి రాగానే కృష్ణా జలాలతో చెరువులను నింపి, సుభిక్షం చేయటం ద్వారా వలసలకు అడ్డుకట్ట వేస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీతో అప్పటి టీడీపీ సర్కార్ ఎన్నికలకు ముందు హడావుడిగా చెరువులను నింపే పథకాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా జీవో ఇచ్చి కొబ్బరి కాయ కొట్టి చేతులు దులుపుకుంది. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.224.31 కోట్లు వ్యయం చేసి.. 77 చెరువులను నింపే పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు.



కటారుకొండ చెరువు కింద రైతులు సాగు చేసిన పంటలతో కోనసీమను తలపిస్తున్న ఆయకట్టు

ఇదీ పథకం స్వరూపం


- కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం కృష్ణగిరి మండలంలో హంద్రీ–నీవా ప్రధాన కాలువ 90 కి.మీ సమీపంలో (ఆలంకొండ) రోజుకు 159 క్యూసెక్కులను ఎత్తిపోసేలా పంప్‌హౌస్ నిర్మించారు. ఇందులో 3,800 హార్స్‌పవర్ సామర్థ్యం కలిగిన మూడు పంప్‌లు, మోటార్లను అమర్చారు. ఒక్కో పంప్, మోటార్ ద్వారా 53 క్యూసెక్కులు ఎత్తిపోయవచ్చు.
- హంద్రీ–నీవా ప్రధాన కాలువ 90 కి.మీ వద్ద సముద్ర మట్టానికి 429 మీటర్ల ఎత్తున ఉంటుంది. అక్కడి పంప్‌హౌస్, 5.625 కి.మీల పొడవున నిర్మించిన ప్రెజర్ మెయిన్ ద్వారా సముద్ర మట్టానికి 545 మీటర్ల ఎత్తున ఉన్న కటారుకొండ వద్ద నిర్మించిన డెలివరీ చాంబర్‌లోకి 159 క్యూసెక్కులను ఎత్తిపోస్తారు.
- కటారుకొండ వద్ద నిర్మించిన డెలివరీ చాంబర్ నుంచి 43.40 కి.మీల పొడవున వేసిన గ్రావిటీ మెయిన్–1(పైపు లైన్ ద్వారా గురుత్వాకర్షణపై) ద్వారా 22 చెరువులను నింపి.. నేరుగా 4,217 ఎకరాల ఆయకట్టుకు నీళ్లందిస్తారు. 29.40 కి.మీ పొడవున నిర్మించిన గ్రావిటీ మెయిన్–2 ద్వారా 16 చెరువులను నింపి.. నేరుగా 8,018 ఎకరాల ఆయకట్టుకు నీళ్లందిస్తారు. 47.90 కి.మీ పొడవున నిర్మించిన గ్రావిటీ మెయిన్–3 ద్వారా 30 చెరువులు నింపి.. 2,895 ఎకరాలకు నేరుగా నీళ్లందిస్తారు. పైపుల ద్వారా నీటిని తరలిస్తుండటం వల్ల ప్రవాహ నష్టాలు లేనే లేవు. ఆవిరి నష్టాలు కూడా స్వల్పమే.
- డోన్, పత్తికొండ, పాణ్యం, ఆలూరు నియోజకవర్గాల్లోని 77 చెరువులను నింపడం ద్వారా నేరుగా 10,394 ఎకరాలకు సాగు నీరు, 57 గ్రామాల్లోని ప్రజలకు తాగునీరు అందిస్తారు.
- ఈ పథకం కింద తొలుత ప్రతిపాదించిన 68 చెరువులతోపాటు అదనంగా 9 చెరువులు (డోన్ నియోజకవర్గంలో 8, పత్తికొండ నియోజకవర్గంలో 1) కలిపి ప్రస్తుతం 77 చెరువులను నింపుతున్నారు. ఈ పథకం కింద చెరువుల నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులూ చేపట్టారు.

రూపు మారుతున్న కరువు ప్రాంతం

హంద్రీ–నీవా ప్రధాన కాలువ నుంచి కృష్ణా జలాలను ఎత్తిపోసి 77 చెరువులను నింపే పథకం ట్రయల్ రన్‌ను 15 రోజుల క్రితం చేపట్టారు. ఇలా డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లో దాదాపు 35 చెరువులను ఇప్పటికే నింపారు. ఈ చెరువుల కింద రైతులు భారీ ఎత్తున పంటలు సాగు చేసుకుంటున్నారు. డోన్ మండలం వెంకటాపురం చెరువు కింద రెండెకరాల్లో చాలా ఏళ్ల తర్వాత వరి పంట సాగు చేశానని మద్దిలేటి అనే రైతు 'సాక్షి'కి చెప్పారు. క్రిష్ణగిరి మండలం కటారుకొండ చెరువు కింద దాదాపు 25 ఏళ్ల తర్వాత ఒకటిన్నర ఎకరాలో మొక్క జొన్న పంట సాగు చేశానని జయరాముడు అనే రైతు సంతోషం వ్యక్తం చేశాడు. వర్షం పడకపోవడం వల్ల కొండల్లో మేత దొరకక.. చెరువుల్లో నీళ్లు లేక గొర్రెలు, మేకలను కర్ణాటకకు తోలుకెళ్లేవాళ్లమని.. ఇప్పుడు చెరువులు నింపుతుండటంతో పుష్కలంగా నీళ్లు దొరుకుతున్నాయని.. మేత కూడా దొరుకుతుండటం వల్ల ఎక్కడికీ వెళ్లాల్సిన పరిస్థితి లేదని కురుబ ఓబన్న అనే గొర్రెల కాపరి ఆనందం వ్యక్తం చేశాడు. పంటలు సాగు చేస్తుండటంతో రైతులకు చేతి నిండా పనితో ఆదాయం వస్తోంది. దాంతో ఎక్కడికైనా వలస వెళ్లాల్సిన దుస్థితి తప్పిందని రైతులు, రైతు కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చకచకా పూర్తవుతున్న ప్రాజెక్టులు

సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో పేదల ఖాతాల్లో రూ.2.31 లక్షల కోట్లను జమ చేసిన సీఎం వైఎస్ జగన్.. సాగునీటి ప్రాజెక్టులనూ అంతే ప్రాధాన్యతతో పూర్తి చేస్తూ జలయజ్ఞ ఫలాలను రైతులకు అందిస్తున్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన నెల్లూరు, సంగం బ్యారేజీలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసిన సీఎం వైఎస్ జగన్.. గతేడాది సెప్టెంబరు 6న జాతికి అంకితం చేసి.. నెల్లూరు డెల్టాను సస్యశ్యామలం చేశారు. ఇప్పుడు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పశ్చిమ మండలాలకు వరదాయిని వంటి 77 చెరువులను నింపే పథకాన్ని జాతికి అంకితం చేస్తున్నారు. గాలేరు–నగరిలో అంతర్భాగమైన అవుకు రెండో టన్నెల్ ఇప్పటికే పూర్తయింది. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. వంశధార ఫేజ్–2 స్టేజ్–2, వంశధార–నాగావళి అనుసంధానం, వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ దాదాపుగా పూర్తికావొచ్చాయి. పోలవరం సహా సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయడానికి సీఎం వైఎస్ జగన్ రచించిన ప్రణాళికను అమలు చేస్తున్న అధికారులు పనులను చకచకా చేస్తున్నారు.



డెలివరీ చాంబర్ నుంచి చెరువులకు కృష్ణా జలాల తరలింపునకు వేసిన గ్రావిటీ మెయిన్–1



77 చెరువులను నింపే ఎత్తిపోతల పథకం పంప్ హౌస్

సూక్ష్మ నీటి పారుదల పద్ధతులు అమలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు అతి తక్కువ ఖర్చుతో తీవ్ర కరవు ప్రాంతంలో 77 చెరువులను నింపే పథకాన్ని పూర్తి చేశాం. చెరువుల కింద ఆయకట్టులో సూక్ష్మ నీటి పారుదల పద్ధతుల (డ్రిప్, స్ప్రింక్లర్లు)లో పంటలు సాగుచేస్తే నీటి వృథాకు అడ్డుకట్ట వేయొచ్చు. వ్యవసాయ, ఉద్యాన వన శాఖలతో సమన్వయం చేసుకుని ఆ దిశగా రైతులను చైతన్య పరుస్తాం.

– శశిభూషణ్‌కుమార్, ముఖ్య కార్యదర్శి, జల వనరుల శాఖ

యాజమాన్య పద్ధతులకు పెద్దపీట



77 చెరువులను నింపే పథకం ఇంజనీరింగ్‌లో ఓ అద్భుతం. కొండ, గుట్టలతో నిండిన ప్రాంతంలో చెరువులను నింపడం శ్రమ, ఖర్చుతో కూడుకున్నది. కానీ.. హంద్రీ–నీవా ప్రధాన కాలువ నుంచి 116 మీటర్ల ఎత్తున ఉన్న కటారుకొండపైకి నీటిని ఎత్తిపోసి.. అక్కడి నుంచి గ్రావిటీ మెయిన్‌ల ద్వారా 68కి బదులుగా 77 చెరువులు నింపుతున్నాం. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు అతి తక్కువ ఖర్చుతో ఈ పథకం పూర్తి చేశాం. రాష్ట్రంలో పూర్తి స్థాయిలో గ్రావిటీ మెయిన్‌లతో చేపట్టిన మొదటి పథకం ఇది. యాజమాన్య పద్ధతుల్లో ఇది ప్రధానమైనది. దీని వల్ల ప్రవాహ నష్టాలు ఉండవు.

– సి.నారాయణరెడ్డి, ఇంజనీర్–ఇన్–చీఫ్, జల వనరుల శాఖ

ఆరుతడి పంటలే లాభం



సీఎం వైఎస్ జగన్, ఆర్థిక మంత్రి బుగ్గన ఆదేశాల మేరకు.. అతి తక్కువ ఖర్చుతో.. తక్కువ సమయంలో 77 చెరువులను నింపే పథకాన్ని పూర్తి చేశాం. ఒక క్యూసెక్ నీటితో 50 ఎకరాల్లో వరి సాగు చేస్తే.. 120 నుంచి 150 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేయొచ్చు. చెరువుల కింద ఆరుతడి పంటలు, ఉద్యాన వన పంటలు సాగుచేస్తే అధిక ఆయకట్టులో పంటలు సాగు చేసుకోవచ్చు. ఆ దిశగా రైతులను చైతన్యవంతం చేసి.. ఈ పథకం ఫలాలను పూర్తి స్థాయిలో అందేలా చేస్తాం.

– రెడ్డి శేఖర్‌రెడ్డి, ఎస్ఈ, కర్నూలు జిల్లా

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు సీఎం నెరవేర్చారు

- పారదర్శక పాలనలో భాగస్వాములవుదాం
- అవసరం వచ్చినప్పుడు రుణం తీర్చుకుందాం
- ఏపీజీఈఎఫ్ చైర్మన్ కాకర్ల.. కుప్పంలో ఉద్యోగుల భారీ ర్యాలీ



కుప్పంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

కుప్పం(చిత్తూరు జిల్లా): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న పారదర్శక పాలనలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్(ఏపీజీఈఎఫ్) చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఏపీజీఈఎఫ్ ఆధ్వర్యాన ఆదివారం కుప్పం పట్టణంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీసీఎన్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. నాలుగేళ్లలో ఉద్యోగులకు సంబంధించిన 42 సమస్యలను పరిష్కరించారని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన 10 హామీల్లో 8 అమలు చేశారని వివరించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తే ప్రభుత్వంపై ఏడాదికి రూ.3 వేల కోట్లు అదనపు భారం పడుతుందని తెలిసినా, ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని విలీనం చేసి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారని ప్రశంసించారు. కరోనా సమయంలో దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేదని, మన దగ్గర నెలనెలా జీతాలు అందజేశారని తెలిపారు. గతంలో ఉద్యోగులు ఇంక్రిమెంట్ కోసం రోడ్లపై ధర్నాలు చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు అలాంటి సమస్య లేదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో 1.30లక్షల ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా వారిని రెగ్యులరైజ్ చేసిన ఘనత 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రెవెన్యూశాఖలో పనిచేస్తున్న 3,790 మంది వీఆర్వోలకు, పంచాయతీరాజ్‌లో 1,500 మందికి పదోన్నతులు కల్పించారని వివరించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారని తెలిపారు. పదేళ్లుగా ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారికి త్వరలోనే మంచి రోజులు వస్తాయన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ రాకపోవడానికి సీఎం కారణం కాదని, కొన్ని ఉద్యోగ సంఘాల నాయకులే కారణమని ఆయన స్పష్టంచేశారు.

ఉద్యోగులను రెచ్చగొడుతున్నారు

ప్రభుత్వంపై నిందలు మోపేందుకు ప్రతిపక్షాలు కుట్ర పన్నాయని వెంకట్రామిరెడ్డి చెప్పారు. ప్రభుత్వంపై బురదజల్లే క్రమంలో ఉద్యోగులను రెచ్చగొట్టి రోడ్లపైకి పంపి నిరసన తెలపాలని, ధర్నాలు చేయాలని ప్రోత్సహిస్తున్నాయని, వారి మాటలు నమ్మొద్దని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల అన్ని సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వానికి, ఉద్యోగులకు వారధిగా ఫెడరేషన్ పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించినందుకు సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని చెప్పారు. అవసరమొచ్చినప్పుడు రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్సీలు భరత్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ ఉద్యోగుల సంఘ నేత చల్లా చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సఫాయివాలాలే నిజమైన స్వచ్ఛ అంబాసిడర్లు

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు



పారిశుధ్య కార్మికులతో కలిసి చెత్త సేకరిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు

సాక్షి, అమరావతి: వేకువ జామున కోడి కూతకన్నా ముందే లేచి.. అర్ధరాత్రి వరకు నిర్విరామంగా సేవలందిస్తున్న సఫాయివాలాలే నిజమైన స్వచ్ఛ అంబాసిడర్లు అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు ప్రశంసించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, విజయవాడ నగరపాలక సంస్థ సంయుక్తంగా నిర్వహించిన స్వచ్ఛతా లీగ్ 2.0 ర్యాలీలో గంధం చంద్రుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పల్లె, పట్టణం తేడా లేకుండా ఎక్కడ చెత్త ఉన్నా వెంటనే డంపింగ్ యార్డులకు తరలిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా సఫాయి కార్మికులు పనిచేస్తున్నారని కొనియాడారు. సఫాయి కార్మికుల కృషితో పారిశుధ్య నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ ఎంతో ముందంజలో ఉందన్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో పాల్గొనే యువతకు గాంధీ జయంతి రోజున అవార్డులను ప్రదానం చేస్తామని ప్రకటించారు. స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో జరిగే చెత్తపై పోరులో యువత పాల్గొనాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు కృషి చేయాలని, చెత్త రహిత గ్రామాలు, పట్టణాలు, నగరాలుగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం ఆయన పారిశుధ్య కార్మికులు, వలంటీర్లతో కలిసి చెత్త సేకరణలో పాల్గొని కార్మికుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు.


మోదీ పాలనలో పేదల జీవితాల్లో మార్పు

కేంద్ర మంత్రి భగవంత్ కుబా వెల్లడి



సాక్షి, అమరావతి/తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా అమలు చేస్తున్న వివిధ పథకాల వల్ల దేశవ్యాప్తంగా 13.5కోట్ల మంది పేదల స్థితిగతులు మారాయని కేంద్ర కెమికల్స్, ఫెర్టిలైజర్స్ శాఖ మంత్రి భగవంత్ కుబా అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా రాష్ట్రంలో చేపట్టిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం ఆయన విజయవాడ వచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భగవంత్ కుబా మాట్లాడుతూ చేతివృత్తుల వారిని సమాజ నిర్మాతలుగా ప్రధాని మోదీ భావిస్తారని చెప్పారు. అందువల్లే రూ.13వేల కోట్లతో పీఎం విశ్వకర్మ యోజన పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ పథకం కింద అతి తక్కువ వడ్డీకి రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు రుణం అందిస్తారని వివరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, చేతివృత్తుల కళాకారుల హబ్ విశాఖ: దేవ్‌సింగ్ చౌహాన్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి దేవ్‌సింగ్ చౌహాన్

వివిధ రకాల ఉద్యోగులు, చేతివృత్తుల కళాకారులకు హబ్ విశాఖపట్నం అని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి దేవ్‌సింగ్ చౌహాన్ అన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం ప్రారంభం సందర్భంగా వాల్తేర్ రైల్వే డివిజన్ ఆధ్వర్యాన ఆదివారం సాలగ్రామపురంలోని పోర్టు సాగరమాల కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ స్థానిక సంప్రదాయ చేతివృత్తులు, హస్తకళలను ప్రోత్సహించే విధంగా విశాఖపట్నం రైల్వేస్టేషన్ (వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్)లో ఏటికొప్పాక బొమ్మల స్టాల్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ సంప్రదాయ చేతివృత్తుల కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్‌సాహూ, సుధీర్ కుమార్ గుప్తా, గంధం ఆగ్రో, గంధం ఫ్లోరా సీఈవో గంధం సునీత పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్‌పై మేం స్పందించం

సాక్షి, విశాఖపట్నం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ సీఎం చంద్రబాబును అరెస్టు చేసిన విషయంపై తాము స్పందించే ప్రసక్తే లేదని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి దేవ్‌సింగ్ చౌహాన్ చెప్పారు. ఆయన ఆదివారం విశాఖలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుపై స్పందించబోమని, అధిష్టానం ఈ వ్యవహారంపై నిర్ణయం తీసుకున్న తర్వాతే మాట్లాడతామని స్పష్టం చేశారు.

నేటి నుంచి వైజాగ్ ఓపెన్ గోల్ఫ్

- ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహణ
- హాజరుకానున్న శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ గోల్ఫర్స్

విశాఖ స్పోర్ట్స్: ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఇండియా(పీజీటీఐ) ఆధ్వర్యంలో సోమవారం నుంచి 'వైజాగ్ ఓపెన్ గోల్ఫ్ 2023' ప్రారంభం కానుంది. ప్రొఫెషనల్ గోల్ఫ్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో పీజీటీఐ టోర్నీలు నిర్వహిస్తుండగా, విశాఖ ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ వేదికగా ఈ టోర్నీ జరగనుంది. తొలి రోజు ప్రాక్టీస్ రౌండ్స్ రెండో రోజు ప్రోటోర్నీ జరగనున్నాయి. 20 నుంచి 23వ తేదీ వరకు నాలుగు రౌండ్ల పాటు స్ట్రోక్ ప్లే ప్రధాన టోర్నీ జరగనుంది. ఈ సందర్భంగా ఆదివారం క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రోటోర్నీని వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ ప్రారంభించనుండగా.. విజేతలకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి బహుమతులు అందించనున్నారన్నారు. భారత్‌తో పాటు శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌కు చెందిన మేటి గోల్ఫర్స్ 126 మంది ఈ టోర్నీలో పాల్గొననున్నారని తెలిపారు. ఈ టోర్నీలో సత్తా చాటిన వారు ప్రైజ్‌మనీ పొందటంతో పాటు తమ ర్యాంకింగ్‌ను మెరుగుపర్చుకునేందుకు, అంతర్జాతీయ టోర్నీలో అర్హత సాధించేందుకు దోహదపడుతుందని వివరించారు. యూరోస్పోర్ట్స్, సోషల్ మీడియా, దూరదర్శన్ చానల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుందన్నారు. 1984లో నిర్మించిన ఈపీజీసీ ఉత్తమ పునఃనిర్మాణ గోల్ఫ్‌కోర్స్‌గానూ గతేడాది అవార్డు అందుకుందని చెప్పారు.



రెండో విడత ఎంబీబీఎస్ యాజమాన్య కోటా సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: 2023–24 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ యాజమాన్య కోటా రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయిస్తూ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులు ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోగా తమకు సీట్లు కేటాయించిన కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని ఈ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. రెండో దశలో 1,893 సీట్లకు గాను 1,683 సీట్లు భర్తీ అయ్యాయి.

మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

- ఇన్‌టెక్ గేట్‌కు మరమ్మతులు పూర్తి



ఇన్‌టెక్ గేటుకు మరమ్మతులు చేస్తున్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఇంజినీర్లు, సిబ్బంది

సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్రా,ఒడిశా సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఐదు రోజుల తర్వాత ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించారు. ఈ నెల 12వతేదీన విద్యుత్ కేంద్రానికి చెందిన టీపీ డ్యామ్‌లోని సొరంగ మార్గంలో ఇన్‌టెక్ గేట్ చైన్ తెగిపోయింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. వెంటనే మరమ్మతులు ప్రారంభించి శనివారం రాత్రికి పూర్తిచేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి మాచ్‌ఖండ్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించారు. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో ఆరు జనరేటర్ల ద్వారా గంటకు 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. ఐదురోజుల పాటు విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంతో 12 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి నష్టం వాటిల్లిందని అధికారులు చెబుతున్నారు.

చంద్రబాబు భూ ఆక్రమణలపై విచారణ చేపట్టాలి

ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యదర్శి అయినాపురపు డిమాండ్

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తూరు జిల్లాలో 14 ఏళ్ల కిందట చేసిన భూ ఆక్రమణలపై విచారణ జరిపించాలని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి ఒక ప్రకటన చేస్తూ.. 2009లో చంద్రబాబు భూ ఆక్రమణపై అప్పటి గవర్నర్‌కు చేసిన ఫిర్యాదును గుర్తు చేశారు. ప్రస్తుతం తిరుపతి జిల్లా ఐరాల మండలం గోవిందరెడ్డిపల్లి, పులిచర్ల మండలం కొత్తపేట, చంద్రగిరి మండలం కాశిపెంట్ల గ్రామాల సమీపంలో ఉన్న దాదాపు 1,500 ఎకరాలు చంద్రబాబు బినామీ పేర్లతో ఆక్రమణల చెరలో ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ ఆక్రమణలపై 2009లో హైకోర్టు న్యాయవాది బొజ్జా తారకం ఆధ్వర్యంలో నిజ నిర్ధారణ కమిటీగా తాము వెళ్లామని గుర్తు చేశారు. ఆ భూములను ఆద్యంతం పరిశీలించామన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని అప్పటి గవర్నర్ ఎన్‌డీ తివారీకి కమిటీ తరఫున ఫిర్యాదు చేశామని వివరించారు. భూ ఆక్రమణలపై నాటి నుంచి నేటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. చంద్రబాబు చేసిన భూ ఆక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

మధురం వాగ్గేయకార సంకీర్తనం



గురువందనం చేస్తున్న చిన్నారులు తన్విశ్రీ, సాత్విక్, శ్రేయ, చైతన్య శ్రుతి, అనఘ, హరిద్ర, చైత్రిక

విజయవాడ కల్చరల్: ప్రముఖ వయొలిన్ గాత్ర విద్వాంసులు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు శత జయంతి సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, దండమూడి రామ్మోహనరావు కళావేదికమీద ఆదివారం నిర్వహించిన వాగ్గేయకార వైభవం మధురంగా సాగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు కృష్ణమాచార్యులు రచించి స్వర పరచిన కీర్తనలతోపాటు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్ శ్యామశాస్త్రి రచించిన గీతాలను ఆలపించారు. కార్యక్రమాలను వీణ విద్వాంసుడు కేఎస్ గోవిందరాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీహెచ్ సంగీత, సాహిత్య సమ్మేళనంగా అభివర్ణించారు. హైదరాబాద్‌కు చెందిన తన్విశ్రీ, సాత్విక్, శ్రేయ, చైతన్యశృతి, అనఘ, హరిద్ర, చైత్రిక గాత్ర కచేరీతో కార్యక్రమం ప్రారంభించారు. దుడ్డు కార్తీక మనస్విని, సీహెచ్ సంజన, ఎన్‌సీ ప్రణవ్ కృష్ణ, శశాంక్ కృష్ణ, విశాఖపట్నం నుంచి వచ్చిన పాత్రా కృష్ణమూర్తి, నిఖిత శ్రీవల్లి కీర్తనలు ఆలపించారు. కృష్ణమాచార్యుల శిష్యప్రశిష్య బృందం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పండగ పూట.. తీపికబురు

- విశ్రాంత వ్రత పురోహితులకు సర్వీసును బట్టి ఏడాదికి రూ.10 వేల చొప్పున గ్రాట్యుటీ
- ప్రభుత్వం ఉత్తర్వులు
- 33 మందికి రూ.67.25 లక్షల మేర లబ్ధి
- రేపు పంపిణీ చేయనున్న మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే పర్వత



అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో సేవలందించిన 33 మంది విశ్రాంత వ్రత పురోహితులకు వినాయక చవితి పండగ పూట రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గతంలో ఇద్దరు విశ్రాంత పురోహితులకు చెల్లించినట్టుగానే ఈ 33 మందికి కూడా వారి సర్వీసును అనుసరించి ఏడాదికి రూ.10 వేల చొప్పున గ్రాట్యుటీ చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు వీరు గరిష్టంగా రూ.4.5 లక్షలు, కనిష్టంగా రూ.1.5 లక్షల వరకూ గ్రాట్యుటీ పొందనున్నారు. వీరికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ చేతుల మీదుగా ఈ నెల 19న గ్రాట్యుటీ చెక్కులు అందించనున్నారు.

గతంలో రూ.లక్షే..

అన్నవరం దేవస్థానంలో ఏటా సుమారు 7 లక్షల వ్రతాలు జరుగుతున్నాయి. వీటి ద్వారా ఏటా రూ.35 కోట్లు పైబడి ఆదాయం వస్తోంది. దేవస్థానంలో స్పెషల్‌గ్రేడ్ పురోహితులు 12 మంది, మొదటి తరగతి పురోహితులు 48 మంది, రెండు, మూడు తరగతుల వారు వంద మంది చొప్పున సేవలందిస్తున్నారు. వ్రతాల ఆదాయంలో వీరికి దేవస్థానం 40 శాతం పారితోషికంగా చెల్లిస్తోంది. వీరికి వరుసగా నెలకు రూ.40 వేలు, రూ.37 వేలు, రూ.35 వేలు, మూడో తరగతి వారికి రూ.25 వేల నుంచి రూ.31 వేల వరకూ చెల్లిస్తున్నారు. వీరు 65 సంవత్సరాల తరువాత పదవీ విరమణ చేస్తారు. గతంలో పురోహితులు ఎన్ని సంవత్సరాలు సేవలందించినా వారికి పదవీ విరమణ అనంతరం రూ.లక్ష మాత్రమే గ్రాట్యుటీ చెల్లించేవారు. వ్రత పురోహితులు ముత్య సత్యనారాయణ, ప్రయాగ వేంకట రమణ గత ఏప్రిల్ నెలాఖరున పదవీ విరమణ చేశారు. తాము సుమారు 40 సంవత్సరాల సర్వీసు పూర్తి చేశామని, తమ సర్వీసు ఆధారంగా గ్రాట్యుటీ చెల్లించాలని ప్రభుత్వానికి వారు అప్పట్లో దరఖాస్తు చేసుకున్నారు. దీంతవ ఆ ఇద్దరికీ సర్వీసు ఆధారంగా గ్రాట్యుటీ చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు గత జూలైలో వారికి రూ.4.70 లక్షల చొప్పున గ్రాట్యుటీ చెల్లించారు. ఈ ఉత్తర్వులను 2015 నుంచి 2023 వరకూ పదవీ విరమణ చేసిన వ్రత పురోహితులందరికీ కూడా వర్తింపజేయాలని విశ్రాంత పురోహితులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దీంతో దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఈ మేరకు ఆదేశాలిచ్చారు.

ఇది మాకు ప్రభుత్వ వరం

వృద్ధాప్యంలో వైద్య ఖర్చులకు పెన్షన్ సరిపోక చాలా మంది విశ్రాంత వ్రత పురోహితులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో సర్వీసును అనుసరించి గ్రాట్యుటీ చెల్లించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మాకో వరం. పదవీ విరమణ చేసిన 33 మంది విశ్రాంత పురోహితులం చాలా సంతోషిస్తున్నాం.

– నాగాభట్ల కామేశ్వరశర్మ, వ్రతబ్రహ్మ, దేవస్థానం వైదిక సలహాదారు

ప్రభుత్వం చాలా మేలు చేసింది

దేవస్థానంలో సేవలందిస్తున్న 260 మంది వ్రత పురోహితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసినంత మేలు గతంలో ఏ ప్రభుత్వం హయాంలోనూ జరగలేదు. కొత్తగా 50 మంది పురోహితులను నియమించడంతో పాటు 260 మంది పురోహితులకు పారితోషికాన్ని 30 నుంచి 40 శాతానికి పెంచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. తాజాగా సర్వీసును బట్టి గ్రాట్యుటీ అందించాలని ఆదేశించారు. ఇది చేతల ప్రభుత్వమనే విషయాన్ని ఈ నిర్ణయాలు రుజువు చేస్తున్నాయి.

– పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, ఎమ్మెల్యే, ప్రత్తిపాడు

చాలా సంతోషంగా ఉంది

దేవస్థానంలో 30 ఏళ్లు పైబడి పురోహితునిగా సేవలందించాను. పదవీ విరమణ చేసినపుడు రూ.లక్ష మాత్రమే గ్రాట్యుటీ చెల్లించారు. నాతో పాటు విశ్రాంత పురోహితులందరికీ గ్రాట్యుటీ పెంపు నిర్ణయం చాలా ఆనందాన్నిచ్చింది. పురోహితులకు అన్ని విధాలా మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నాం.

– కర్రి వైకుంఠం, విశ్రాంత వ్రత పురోహితుడు

సముచిత నిర్ణయం

దేవస్థానంలో విశ్రాంత వ్రత పురోహితుల గ్రాట్యుటీ పెంపు చాలా సముచిత నిర్ణయం. ఈ పురోహితులకు మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ చేతుల మీదుగా మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు గ్రాట్యుటీ చెక్కులు చెల్లించేందుకు ఏర్పాట్లు చేశాం.

– చంద్రశేఖర్ ఆజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం

ప్రకృతి సోయగాల కొల్లేరు

కొల్లేటి సరస్సులో తుళ్లేటి చేపల వయ్యారాలకు ప్రకృతి సోయగాలు తోడవుతున్నాయి. దక్షిణ కశ్మీర్‌గా పేరుగడించిన కొల్లేరు పర్యాటకాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోంది. చిత్తడి నేలల పరిరక్షణలో భాగంగా కొల్లేరు అంబాసిడర్‌గా వలస పక్షి గూడబాతు (స్పాట్ బిల్డ్ గ్రే పెలికాన్)ను ఇప్పటికే గుర్తించారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆపరేషన్ కొల్లేరు జరిగింది. పర్యావరణానికి విఘాతం కలిగించే ఆక్రమణ చెరువులు ధ్వంసం చేయడంతో కొల్లేరులో తిరిగి ప్రకృతి పరిఢవిల్లింది. దీంతో విదేశీ వలస పక్షులు సంఖ్య నానాటికి కొల్లేరులో పెరుగుతోంది.



కొల్లేరులో పక్షుల సందడి

- ఎకో టూరిజం కింద రూ.187 కోట్లతో అభివృద్ధికి ప్రణాళిక
- ఇటీవల కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన రాష్ట్ర ప్రభుత్వం
- బోటు షికారు, పక్షుల వీక్షణకు 20 ప్రదేశాల గుర్తింపు
- జీవవైవిధ్య యాజమాన్య కమిటీల ఏర్పాటుకు కసరత్తు

కైకలూరు: జిల్లాల పునర్విభజన తర్వాత కొల్లేరు ప్రాంతమంతా ఏలూరు జిల్లా పరిధిలోకి చేరింది. కొల్లేరు ఎకో టూరిజానికి రూ.187 కోట్ల ప్రణాళికతో ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. కొల్లేరు పరీవాహక ప్రాంతాల్లో 20 ప్రదేశాలను గుర్తించి బోటు షికారు, సంప్రదాయ గేలాలతో చేపలు పట్టుకోవడం, పక్షుల వీక్షణ వంటివి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే 10 ప్రదేశాలను పర్యాటక శాఖ గుర్తించింది. ఏలూరు జిల్లాలో ఆటపాక పక్షులు కేంద్రం, ఏలూరు సమీపంలో మాధవాపురం పక్షుల విహార కేంద్రాలు ప్రసిద్ధి గాంచాయి. ఆటపాక పక్షుల కేంద్రంలో పెలికాన్ పక్షులు ఎక్కువ సంఖ్యలో రావడంతో కేంద్రానికి పెలికాన్ ప్యారడైజ్‌గా నామకరణం చేశారు.

జీవవైవిధ్యానికి పెద్దపీట

మానవుడికి ప్రకృతి ప్రసాదించిన గొప్ప వరం పర్యావరణం. భూమిపై వృక్షాలు, జంతువులు సూక్ష్మజీవులు, ఔషధాలు వంటి జీవవైవిధ్య అంశాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. కొల్లేరు చిత్తడి నేలల ప్రాంతం. ఇక్కడ వివిధ జాతుల పక్షులు, చేపలు, చెట్లు, కీటకాలు, సర్పాలు నివసిస్తున్నాయి. కొల్లేరు సరస్సులో అరుదైన నల్లజాతి చేపలు ఉన్నాయి. గ్రామస్థాయిలో జీవవైవిధ్య యాజమాన్య కమిటీలు (బీఎంసీ)ల ఏర్పాటుపై అటవీశాఖ అధికారులు ప్రజల్లో అవగాహన కలిగిస్తున్నారు. గ్రామాల పరిధిలో ప్రత్యేకత కలిగిన ఔషధ మొక్కలు, పూర్వీకులు సాగు చేసిన వరి వంగడాలు వంటి వాటిపై ఆ ప్రాంత వాసులు పేటెంట్ సంక్రమింపజేసే అధికారాలు ఈ కమిటీ ద్వారా పొందవచ్చు. ఇప్పటికే పర్యావరణ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేశామని అటవీ అధికారులు చెప్పారు.

కొల్లేరులో పెరిగిన పక్షుల సంఖ్య

కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో ప్రకృతి అనుకూలంగా ఉండటంతో పక్షుల సంఖ్య పెరిగింది. ఈ ఏడాది కొల్లేరులో జరిగిన పక్షుల గణనలో 105 రకాల పక్షిజాతులను, 81,495 పక్షులు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో మొదటి స్థానంలో కోయిలలు (7,875) రెండో స్థానంలో పెలికాన్ పక్షులు(6,869) ఉండగా, అరుదైన పిన్‌టయిల్ స్నిప్ (సూది తోక పురైది) పక్షి ఒకటి, సిట్రిన్ వాగ్‌యల్(పసుపు తల జిట్టంగి) పక్షులు నాలుగు కనిపించాయి. పక్షుల విహార కేంద్రాల్లో వలస పక్షులు సంతానోత్పత్తి కోసం అటవీశాఖ ఇనుప స్టాండ్లను ఏర్పాటు చేసింది.

అభయారణ్య పరిరక్షణే లక్ష్యం

కొల్లేరు చిత్తడి నేలల ప్రాంతం. అనేక జీవరాశులకు ఇది నిలయం. కొల్లేరు అభయారణ్య పరిరక్షణకు అటవీశాఖ కట్టుబడి ఉంది. పక్షి ప్రేమికులకు స్వర్గధామంగా నిలుస్తున్న ఆటపాక పక్షుల కేంద్రంలో అన్ని వసతులు కల్పించాం. కొల్లేరు ప్రజల కోసం సర్కారు కాల్వపై వారధి నిర్మాణానికి శాఖపరమైన అనుమతులు ఇచ్చారు. త్వరలో వారధి ప్రారంభం కానుంది. కొల్లేరుల పక్షుల వేటను నిరోధించాం. రానున్న రోజుల్లో కొల్లేరు గొప్ప పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతోంది.

– జె.శ్రీనివాసరావు, అటవీశాఖ రేంజర్, కైకలూరు

భీమవరంలో యువకుడి హత్య





విజయ్‌బాబు (ఫైల్)

సాక్షి, భీమవరం: భీమవరంలో పట్టపగలు యువకుడి హత్య సంచలనం రేపింది. రౌడీషీటర్లకు సత్ప్రవర్తనపై కౌన్సెలింగ్ ఇచ్చి గంట గడవక ముందే ఈ హత్య జరిగింది. భీమవరం రెండో పట్టణం బలుసుమూడి గాంబీర్‌దొడ్డికి చెందిన బెవర విజయ్‌బాబు (23)ను గుర్తు తెలియని వ్యక్తులు కారుతో ఢీకొట్టి హత్య చేశారు. గతేడాది డిసెంబర్ 24న జరిగిన రౌతుల ఏసు హత్య కేసులో విజయ్‌బాబు నిందితుడు. రౌడీషీటర్లకు భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ద్విచక్రవాహనంపై వెళ్తున్న విజయ్‌బాబు, గోవిందరావును గొల్లవానితిప్ప రోడ్డులోని దుర్గాలక్ష్మి ఆలయ సమీపంలో కారుతో ఢీకొట్టగా బైక్ నడుపుతున్న విజయ్‌బాబు కిందపడిపోయాడు. సోదరుడు గోవిందరావు పక్కనే ఉన్న పంటకాలువలోకి దూకి అవతలి గట్టుకు చేరుకుని నేరుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు.

హంతకుల్లో ఒకరి అరెస్టు

ఢీకొట్టిన అనంతరం కారు విజయ్‌బాబును కొద్ది దూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. దుండగులు అతనిపై కత్తులతో దాడి చేసి తల, మెడపై విచక్షణారహితంగా నరకడంతో విజయ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హత్య అనంతరం కారు పట్టణం వైపు వెళ్లినట్లు పోలీసులు సీసీ కెమెరాల్లో గుర్తించారు. హత్య ఘటన తెలిసిన వెంటనే పోలీసులు ఒక యువకుడ్ని వెంటాడి పట్టుకోగా ఆ యువకుడి చేతిలో హత్య సమయంలో ఉపయోగించిన కత్తి ఉన్నట్లు తెలుస్తోంది. పట్టుబడిన యువకుడు భీమవరానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడిపై రౌడీషీట్ ఉందని, హత్యకు కారణాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.





సరైన భోజన సమయం - ధనవంతుడికి చేయాలనుకున్నప్పుడు! పేదవాడికి చేయగలిగినప్పుడు!!

- డైయోజినీజ్

సాక్షి

సోమవారం, 18 సెప్టెంబర్ 2023

ప్రకృత్యైనమః

గుర్తించాలే కానీ దేవుడు అనేక రూపాల్లో ఉంటాడు. వాటిలో కనిపించనివే కాదు, కనిపించేవీ ఉంటాయి. ఎక్కడో ఉన్నాడనుకునే దేవుడు... మన చేతికందే దూరంలో ఒక మొక్కలోనూ, కొమ్మలోనూ, ఆ కొమ్మకు పూసిన పువ్వులోనూ కూడా ఉన్నాడని గ్రహించడమే లౌకిక, పారలౌకిక సమన్వయంతో కూడిన ఆధ్యాత్మిక ప్రస్థానంలో తొలి ఎరుక. దైవం మానుషరూపేణ అంటారు. అలాగే, దైవం ప్రకృతి రూపేణ కూడా!

రామకృష్ణ పరమహంస ఓసారి ఆకాశంలో రెక్కలు విప్పుకుంటూ ఎగిరే పక్షిని చూసి సమాధిలోకి వెళ్లిపోయారట. చెట్టును, పిట్టను, పువ్వును, పసిపాప నవ్వును, పారే ఏటినీ, ఎగిరే తేటినీ చూసి తన్మయులైతే చాలు; ఆ రోజుకి మీ పూజ అయిపోయిందని ఒక మహనీయుడు సెలవిస్తాడు. షడ్రసోపేతంగా వండిన తన వంటకాలను తృప్తిగా ఆరగిస్తే ఇల్లాలు ఎంత ఆనందిస్తుందో, తన వ్యక్తరూపమైన ప్రకృతిని చూసి పరవశిస్తే దేవుడు అంతే ఆనందిస్తాడని ఆయన అంటాడు. నది ఒడ్డున నిలబడి దాని పుట్టుకను, గమనాన్ని, పోను పోను అది చెందే వైశాల్యాన్ని, అది ప్రవహించిన పొడవునా దానితో అల్లుకున్న మన జీవనబంధాన్ని స్మరించుకున్నా అది పుణ్య స్నానంతో సమానమేనని ఒక కథకుడు రాస్తాడు. కృష్ణశాస్త్రి గారు పల్లవించినట్టు అడుగడుగునా, అందరిలోనే కాదు; ప్రకృతిలో అన్నింటిలోనూ గుడి ఉంది.

అనాది నుంచీ నేటివరకూ మనిషి ఊహలో, భావనలో మనిషీ, దేవుడూ, ప్రకృతీ పడుగూ పేకల్లా అల్లుకునే వ్యక్తమయ్యారు. ఋగ్వేద కవి చూపులో ప్రకృతి పట్ల వలపు, మెరుపు ఎంతో ముగ్ధంగా, సరళంగా, సహజసుందరంగా జాలువారుతాయి. ''వెలుగులు విరజిమ్మే ఓ ఆకాశపుత్రీ, సకల సంపదలకూ నెలవైన ఉషాదేవీ! వస్తూ వస్తూ మాకు ధనరూపంలోని ఉషస్సును వెంట బెట్టుకుని రా'' అని ఒక ఋక్కు అంటుంది. ఋగ్వేద కవి చింతనలో అగ్ని ధూమధ్వజుడు; సూర్యకాంతితో తళతళా మెరుస్తూ ధ్వనిచేసే సముద్రపు అలల్లా వ్యాపిస్తాడు. ''తమసానదీ జలాలు మంచివాడి మనసులా స్వచ్ఛంగా ఉన్నా''యని వాల్మీకి వర్ణిస్తాడు. సుగ్రీవుడితో అగ్ని సాక్షిగా స్నేహం చేసిన రాముడు, ''వర్షాకాలంలో మంచి పొలంలో వేసిన పంట ఫలించినట్టు నీ కార్యాన్ని సఫలం చేస్తా''నంటాడు. ఆ మాటలకు సుగ్రీవుడు, ''నదీవేగంలా హఠాత్తుగా ఉరవడించిన కన్నీటివేగాన్ని ధైర్యంతో నిలవరించుకున్నా''డని రామాయణ కవి అంటాడు.

ఏ కాలంలోనూ మనిషీ, ఋషీ, కవీ ప్రకృతి పొత్తిళ్లలో పసివాడిగానే ఉన్నాడు తప్ప ప్రకృతికి దూరం కాలేదు. ఇతిహాస కావ్య ప్రబంధాలలో ప్రకృతి వర్ణనలు తప్పనిసరి భాగాలు. శారద రాత్రుల్లో ఉజ్వల తారకలు, కొత్త కలువ గంధాన్ని మోసుకొచ్చే సమీరాలూ, కర్పూరపు పొడిలా చంద్రుడు వెదజల్లే వెన్నెల వెలుగులూ, చెంగలువ కేదారాలూ, మావులూ క్రోవులూ పెనవేసుకున్న అడవులూ, పక్షులు బారులు కట్టి ఇంటిముఖం పట్టే సూర్యాస్తమయ దృశ్యాలూ, తలను రెక్కల్లో పొదవుకుని పంటకాలువల దగ్గర నిద్రించే బాతువుల సన్నివేశాలూ... ఇలా కవి ఊహల రస్తాకెక్కని ప్రకృతి విశేషం ఏదీ ఉండదు. పత్రం పుష్పం ఫలం తోయం రూపంలో ప్రకృతి భాగం కాని పూజా ఉండదు. వినాయకుని పూజలో ఉపయోగించే మాచీ, బృహతి, బిల్వం, ధత్తూరం, బదరి, తులసి, మామిడి, కరవీరం, దేవదారు, మరువకం లాంటి ఇరవయ్యొక్క పత్రాల పేర్లే చెవులకు హాయిగొలిపి ఆకుపచ్చని చలవపందిరి వేసి మనసును సేదదీర్చుతాయి. అమ్మవారి స్తుతుల నిండా పూవులూ, వనాలూ పరచుకుంటాయి. చంపకాలు, సౌగంధికాలు, అశోకాలు, పున్నాగాలతో అమ్మ ప్రకాశించిపోతుంది. కదంబ పూలగుత్తిని చెవికి అలంకరించుకుంటుంది. చాంపేయ, పాటలీ కుసుమాలు తనకు మరింత ప్రియమైనవి. శిరసున చంద్రకళను ధరిస్తుంది.

ప్రకృతి వెంటే పర్యావరణమూ గుర్తురావలసిందే. పర్యావరణ స్పృహ ఇప్పుడే మేలుకొందనుకుంటాం కానీ, ప్రకృతిలో భాగంగా మనిషి పుడుతూనే పెంచుకున్న స్పృహ అది. రావణ సంహారం తర్వాత రాముడు అయోధ్యకు వెడుతూ, వానరులు ఎక్కడుంటే అక్కడ చెట్లు సమృద్ధిగా ఉండాలనీ; అవి అన్ని కాలాల్లోనూ విరగ కాయాలనీ; నదుల్లో నీరు నిత్యం ప్రవహిస్తూ ఉండాలనీ ఇంద్రుని వరం కోరాడు. పాండవులు ద్వైతవనంలో ఉన్నప్పుడు ఆ అడవిలోని చిన్న జంతువులు ధర్మరాజుకు కలలో కనిపించి, ''మీరు రోజూ మమ్మల్ని వేటాడి చంపడంవల్ల మా సంఖ్య తగ్గిపోయింది, బీజప్రాయంగా మిగిలాం, మేము పూర్తిగా నశించేలోగా దయచేసి మరో చోటికి వెళ్లం''డని ప్రార్థించాయి. విశ్వనాథవారు తన 'వేయిపడగలు' నవలలో పర్యావరణానికి ప్రతీకగా పసరిక అనే పాత్రనే సృష్టించారు. ఆధునిక వేషభాషల వ్యామోహంలో పడీ, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీసే వ్యవసాయ పద్ధతుల వల్ల పర్యావరణ విధ్వంసం ఏ స్థాయిన జరుగుతోందో ఆ పాత్ర ద్వారా గంట కొట్టి చెప్పారు.

పూర్వకాలపు రాజులు అడవిని, అటవీ జనాన్ని, సంపదను పర్యావరణ భద్రతకు తోడ్పడే స్వతంత్ర అస్తిత్వాలుగా చూశారు తప్ప, తమ రాజ్యంలో భాగం అనుకోలేదు. ఇప్పుడా వివేచన అంతరించి అడవులు రాజ్యానికి పొడిగింపుగా మారి బహుముఖ ధ్వంసరచనకు లక్ష్యాలయ్యాయి. ప్రకృతికి పండుగకు ఉన్న ముడి తెగిపోయి ప్రతి పండుగా పర్యావరణంపై పిడికిటిపోటుగా మారడం చూస్తున్నాం. ప్రకృతిని మనం రక్షిస్తే ప్రకృతి మనల్ని రక్షిస్తుందన్న సంగతిని గుర్తు చేసుకోడానికి నేటి వినాయకచవితి కన్నా గొప్ప సందర్భం ఏముంటుంది!

ఒకేసారి ఓటు ప్రజాస్వామ్యానికి చేటు

కామెంట్



కరణ్ థాపర్

'ఒకే దేశం– ఒకే ఎన్నిక'ను సమర్థించే వారి దగ్గర రెండు వాదనలు ఉన్నాయి. మొదటిది – ఖర్చు తగ్గుతుంది. రెండవది – ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల ఎన్నికల నియమావళి ఆంక్షలు దేశవ్యాప్తంగా ఒకే కాలానికి వర్తింపులో ఉంటాయి. దాని వల్ల అభివృద్ధి కుంటుపడదు. ఇక వ్యతిరేక వాదనలు వివేచన, వాస్తవికతల్లోంచి జనించినవి. ఓటు హక్కును 'ప్రజాస్వామ్యంలోని అత్యంత ప్రాథమికమైన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ' అని చెబుతారు. ఆ హక్కుకు 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానం పరిమితులను విధిస్తుంది. పార్లమెంటరీ ఎన్నికలు ఇప్పటికే అధ్యక్ష తరహా ఎన్నికలుగా మారుతున్న పరిస్థితుల్లో, ఈ ఏకకాల ఎన్నికలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మొత్తంగానే నాశనం చేసే ప్రమాదం ఉంది.

'ఒకే దేశం–ఒకే ఎన్నిక' వల్ల ప్రయోజనాలు, నిష్ప్రయోజనాలను నేను సరిగ్గా, సరళంగా, సమతులంగా చెప్పగలనేమో చూద్దాం! 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' అనే భావన పైన, ఆ ఆవశ్యకత పైన అవగాహన కోసం ఇది మీకు సహాయకారిగా ఉండవచ్చు.

'ఒకే దేశం – ఒకే ఎన్నిక'ను సమర్థించే వారి దగ్గర రెండు వాదనలు ఉన్నాయి. మొదటిది, ఖర్చు తగ్గుతుంది. కదా మరి, దేశ వ్యాప్తంగా ఒకేసారి ఐదేళ్లకు జరిగే ఎన్నికల ఖర్చు... వివిధ సమయాలలో అనేకసార్లు జరిగే పలు ఎన్నికల మొత్తానికీ అయ్యే ఖర్చు కంటే తక్కువగానే ఉంటుంది. అయితే థరూర్, చక్రవర్తి అదేమంత చెప్పుకోదగిన పొదుపు కాదని అంటున్నారు. ఏడాదికి రూ. 5,000 కోట్ల లోపే ఉండే ఆ పొదుపు మొత్తం లేకున్నా కూడా భారత్ వంటి ఒక పెద్ద ఆర్థిక వ్యవస్థలో అది ఏమంత నిర్ణయాత్మకమైన ఆందోళన కారకం కాదనేది వారి వాదన.

రెండవ అనుకూల వాదన ఏమిటంటే, దేశం మొత్తానికీ ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల ఎన్నికల నియమావళి ఆంక్షలు దేశవ్యాప్తంగా ఒకే కాలానికి వర్తింపులో ఉంటాయి. దాని వల్ల ఎప్పుడూ ఏదో ఒకచోట అమలులో ఉండే ఎన్నికల ఆంక్షల కారణంగా అభివృద్ధి కుంటుపడటం అనే సమస్య ఉండదు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల నియమావళి అన్నది దేశవ్యాప్తంగా అమలుకావలసి ఉన్నప్పటికీ రాష్ట్ర స్థాయిలో ఆ నియమావళి అమలు పెద్ద విషయంగా ఉండటం లేదు. అసలు అమలవుతోందా అన్నది కూడా ముఖ్యమైన ప్రశ్న. అక్కడ ఆంక్షల్ని అతిక్రమిస్తున్నది అధికార పార్టీకి చెందినవారైతే నియమావళి నిస్సందేహంగా అమలు కానట్లే!

ఇక వ్యతిరేక వాదనలు వివేచన, వాస్తవికతల్లోంచి జనించే ప్రాథమికమైన స్వభావం కలిగి ఉన్నవి. ఓటు హక్కును ''ప్రజాస్వామ్యంలోని అత్యంత ప్రాథమికమైన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ'' అని చెబుతారు. ఆ హక్కుకు 'ఒకే దేశం– ఒకే ఎన్నిక' పరిమితులను విధిస్తుంది. ఉదాహరణకు, ప్రభుత్వం తన మెజారిటీ కోల్పోయినప్పుడు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఓటర్లకు ఉన్న హక్కును హరించేలా పార్లమెంటును కొనసాగించే మార్గాల అన్వేషణ జరిగే అవకాశం ఉంటుంది.

అలాగే 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' అనే ఈ భావన మనం కోరుకుంటున్న ప్రజాస్వామ్య ప్రయాణ మార్గాన్ని విఘాత పరచనూవచ్చు. ఆ మార్గాన్ని మనం విస్తృతపరచుకోవడానికి, మరింత లోతుకు తీసుకు వెళ్లడానికి 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానం అడ్డుపడుతుంది. ఉదాహరణకు, ఓటు వేసి ఎన్నుకున్న నాయకులను తిరిగి వెనక్కు పంపే హక్కు మనకు ఉండాలి. 50 ఏళ్ల క్రితమే 1974లో వాజ్‌పేయి ఈ 'రీకాల్' హక్కు అవసరాన్ని గుర్తించారు. అయితే 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' ఈ హక్కుకు విరుద్ధమైనది. ఐదేళ్లకోసారి ఎన్నికలు అనే విధానం... ఓటు వేసి, ప్రభుత్వాలను ఎన్నుకునేందుకు పౌరులకున్న అవకాశాన్ని కుదించడం ద్వారా మన ప్రజాస్వామ్యాన్ని ఇరుకైనదిగా మార్చేస్తుంది.



ఇప్పుడిక 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానం అమలుకు అవసరమైన రాజ్యాంగ సవరణల చిక్కుల దగ్గరికి వద్దాం. మొదటిది– ఎన్నికల ఏకకాలీనత కోసం సవరణలు! ఆ సవరణల వల్ల కొన్ని రాష్ట్రాల్లో శాసనసభలు పొడిగింపును పొందుతాయి. మరికొన్ని చోట్ల శాసనసభల కాలపరిమితిని కుదించాల్సి వస్తుంది. అప్పుడది కచ్చితంగా ప్రజాతీర్పునకు వ్యతిరేకంగా ఆడుతున్న ఆట అవదా? ఓటర్లు ఇచ్చిన ఐదేళ్ల కాలాన్ని ఏకపక్షంగా తగ్గించడమో, పెంచడమో చేసినట్లే కదా!

ఐదేళ్ల కన్నా ముందే ప్రభుత్వం పడిపోతే అప్పుడు రెండో రకం సవరణలు అవసరం అవుతాయి. మిగిలిన కాలానికి రాష్ట్రపతి పాలన రాష్ట్ర స్థాయిలో అవాంఛనీయమైనదీ, కేంద్రస్థాయిలో అసాధ్యమైనదీ.

ఇందుకు ఒక పరిష్కారం– జర్మనీ తరహా నిర్మాణాత్మక అవిశ్వాస తీర్మానం. ఎలాగంటే, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బలం ఉంటే తప్ప అవిశ్వాస తీర్మానంతో ప్రభుత్వాన్ని పడగొట్టడానికి లేదక్కడ. పడగొట్టినవాళ్లే ప్రభుత్వాన్ని నిలబెట్టాలి. వినడానికి బాగుంది కానీ, ఆచరణలో ఎల్లవేళలా ఇది సాధ్యమా? ఉదాహరణకు, పాలకపక్షం నుంచి చీలిపోయిన పక్షం, ప్రతిపక్షం వైపు మొగ్గు చూపడానికి నిరాకరిస్తే అప్పుడేం జరుగుతుంది? ఆ పరిస్థితుల్లో ప్రభుత్వం తన మెజారిటీని కోల్పోతుంది, కానీ ఆ స్థానంలోకి వచ్చేవారెవరూ లేకపోవడం వల్ల అలాగే కుంటుతూ నడుస్తుంది.

లేదా ఒకవేళ సంకీర్ణ కూటమిలోని భేదాభిప్రాయాల వల్ల బడ్జెట్‌కు పార్లమెంటులో ఆమోదం లభించలేదనే అనుకుందాం? అప్పుడిక పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో అటువంటి ప్రభుత్వం తప్పనిసరిగా రాజీనామా చేయాల్సిందే. కానీ సభ్యుల బలం ఉన్న కారణంగా బడ్జెట్‌కు ఆమోదం పొందలేని ఆ ప్రభుత్వం ఏమీ కుప్పకూలి పోదు.

ఇలాంటి సందర్భాలలో ఐదేళ్ల కాల వ్యవధిలో మిగిలి ఉన్న కాలానికి మాత్రమే ఎన్నికలు నిర్వహించుకోవచ్చని ఎన్నికల సంఘం సూచించింది. అయితే అది ఓటు అనే వనరును నిర్లక్ష్యంగా ఉపయోగించుకున్నట్టు అవదా? ఓటు విలువ కొన్నిసార్లు ఐదేళ్ల కాలానికీ, మరి కొన్నిసార్లు ఐదేళ్లలో మిగిలిన భాగానికీ ఉంటుందా? ప్రజాస్వామ్యంలో రెండు రకాల ఓట్లు ఉండొచ్చా?

ఇవీ 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' భావనకు సంబంధించి పైపైన ఆలోచిస్తేనే ఉత్పన్నమయ్యే ప్రాథమిక ఆందోళనలు. భారతదేశ ప్రజాస్వామ్యానికి సంబంధించి మరొక మూడు ఆందోళనకరమైన ప్రశ్నలు కూడా ఉన్నాయి. మొదటిది – పార్లమెంటరీ ఎన్నికలు ఇప్పటికే అధ్యక్ష తరహా ఎన్నికలుగా మారుతున్న పరిస్థితుల్లో, ఈ ఏకకాల ఎన్నికలనేవి ఆ ధోరణిని తీవ్రతరం చేసి మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మొత్తంగానే నాశనం చేసే ప్రమాదం లేదా? రెండవది – ఒక జాతీయ పార్టీ మంచి ఊపులో ఉన్నప్పుడు, ఏక కాల ఎన్నికలు బహుళ పార్టీ వ్యవస్థను ఒకే పార్టీ ఉన్న దేశంగా మార్చకుండా ఉంటాయా? మూడవది – ఎన్నికలు మన ప్రజా శాసన సభ్యులను ప్రతిస్పందించే వారిగా, జవాబుదారీగా ఉండేవారిగా చేస్తాయని మనకొక నమ్మకం. అయితే ఐదేళ్లకోసారి మాత్రమే ఎన్నికలను నిర్వహిస్తే మధ్యలో ఏం జరిగినా వారు తమకు పట్టనట్లుగా, అహంకారంగా ఉండిపోయే అవకాశం లేదా?

ఈ సమస్యల గురించి జాగ్రత్తగా ఆలోచించండి. మరీ ముఖ్యంగా మూడు అంశాలపై మీరు దృష్టి పెట్టవలసిన అవసరం ఉంది: ఏకకాల ఎన్నికల ఆవశ్యకత, వాటిని అమలు చేయడంలో వచ్చే చిక్కులు, అనంతరం వచ్చే పర్యవసానాలు. ఆ తర్వాత 'ఇది సరైనదేనా?' అనే ప్రశ్నకు జవాబు ఇచ్చుకోండి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

విడిపోయామా?



2014కు ముందు మనం అందరం భారతీయులం. 2014 తర్వాత మనం హిందువులం, ముస్లింలం, క్రైస్తవులం అయ్యాం.

- రేష్మా ఆలమ్, కాంగ్రెస్ సమన్వయకర్త

ఒక పరిష్కారం



నల్లమందు(పాపీ) సమస్యను నియంత్రించాలంటే, దాన్ని చట్టబద్ధం చేయాలి. అప్పుడు ఔషధ పరిశ్రమ కోసమే తప్ప, అక్రమ మాదక ద్రవ్యంగా ఉండదు కాబట్టి, లాభాలు పడిపోతాయి. సమస్య ఏమిటంటే – అధికారిక ధరలు గిట్టుబాటు కాక, చిన్న రైతులు దీని సాగును విరమించుకుంటారు; పెద్ద ఫార్మా కంపెనీలు జొరబడతాయి.

- ప్రదీప్ ఫన్‌జౌబామ్, మణిపూర్ కాలమిస్ట్

అవి నాటొచ్చుగా!



తమిళనాడు ప్రభుత్వ గ్రీన్ మిషన్‌లో భాగంగా 5.5 కోట్ల మొక్కలను సిద్ధం చేశారని వార్త. కానీ ఇందులో పళ్ల మొక్కలు ఎందుకు లేవు? రోడ్డుకు ఇరువైపులా ఉండే వేలాది పళ్ల మొక్కలు ఎంత మందికి ఉపయోగపడతాయో ఊహించండి!

- ఆర్. ప్రసాద్, జర్నలిస్ట్


అది చాలదా?



జాతి వివక్ష కారణంగా క్రికెట్ నుంచి దక్షిణాఫ్రికాను (ఒకప్పుడు) నిషేధించినప్పుడు, రాజ్య ప్రాయోజిత తీవ్రవాదం కారణంగా పాకిస్తాన్‌ను ఎందుకు నిషేధించకూడదు?

- నవరూప్ సింగ్, మేధాహక్కుల న్యాయవాది

అసలు సమస్య



మూర్ఖులను, తప్పడువార్తల వ్యాపకులనూ స్వేచ్ఛా సమాజాలు సహించవలసిందే. 'తప్పడు' వార్తల నుంచి మీ మెదడును శుద్ధి చేయడానికి ప్రభుత్వం పూనుకున్నదంటే, అది నిరంకుశాధికారానికి దారి తీస్తుంది.

- గాడ్ సాద్, బిహేవియరల్ సైంటిస్ట్

విశ్వాసంలో స్వేచ్ఛ



మెజారిటీ సంస్కృతి వల్ల యూదులు పీడనకు గురికాని అతి తక్కువ దేశాల్లో ఇండియా ఒకటి. భారత హిందువులు మత మార్పిళ్లకు బలవంతం చేయకపోవడం యాదృచ్ఛికం కాదు. ఒత్తిడి, బోధన, అప్రతిష్ఠపాలు చేయడం, ఇలా ఏ విధంగానూ... పరస్పరం మతాంతరీకరణకు పూనుకోని జనాల మధ్య సహజమైన గౌరవం ఉంటుంది.

- డేవిడ్ కోహెన్, జియు-జిత్సు ఛాంపియన్

సనాతన ధర్మమా? సమానత్వమా?

తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు, సినీ నటుడు, స్వయానా మంత్రి అయిన ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని డెంగ్యూ, కలరా, మలేరియా లాంటి వ్యాధులతో పోల్చి దాన్ని నిర్మూలించాలనీ, దాని స్థానంలో రాజ్యాంగ విలువైన సమానత్వాన్ని స్థాపించాలనీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారాన్ని రేపాయి. ప్రస్తుతం దేశాన్ని పరిపాలిస్తున్నది... సనాతన ధర్మాన్నీ, హిందూత్వ భావజాలాన్నీ సమాజంలో నెలకొల్పాలని తీవ్రంగా కృషి చేస్తూ ఉన్నటువంటి ఆర్ఎస్ఎస్, దాని రాజకీయ విభాగం అయిన బీజేపీ కనుక సహజంగానే ఈ వ్యాఖ్యల్ని వారు తీవ్రంగా ఖండిస్తూ ఉన్నారు.

అరిషడ్వర్గాలకు దూరంగా ఉంటూ శాంతిని, సాత్విక భావాన్ని ప్రచారం చేయవలసిన సాధు పుంగవులు సైతం ఒక అడుగు ముందుకే వేసి ఉదయనిధి స్టాలిన్ తల నరికి తీసుకువస్తే వారికి కోట్ల రూపాయల నగదు బహుమతిని కూడా ప్రకటించారు. అన్ని స్థాయుల్లోని బీజేపీ నాయకులు ఉదయనిధిపై నిప్పులు చెరుగుతున్నారు. కానీ మణిపూర్‌లో ఇద్దరు స్త్రీలను మానవత్వం సిగ్గుపడేలా, ప్రపంచ దేశాల ముందు మనం తలదించుకునేలా, నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన సంఘటన పట్ల ఈ నాయకులంతా, దేశ ప్రధానితో సహా కొన్ని నెలల పాటు మౌనం వహించారు. ఒక్క మాట మాట్లాడలేదు.

ఇంతకీ సనాతన ధర్మం అంటే ఏమిటి? సనాతన ధర్మం అంటే నిత్యమైన, ఎప్పుడూ మారని, శాశ్వతమైన జీవిత విధానం అని అర్థం చెప్పుకోవచ్చు. నిజానికి శాశ్వతమైనది ఏదైనా ఉన్నదీ అంటే, అది కేవలం 'మార్పు' మాత్రమే! మారనిది అంటూ ఈ ప్రపంచంలో ఏదీ లేదు. సనాతన ధర్మానికి వేద ప్రామాణికతే మూలం. అదేం చెప్పింది? ఏ మత గ్రంథం చెప్పని విధంగా వేదాలు, పుట్టుకతోనే మనుషులు అసమానులనీ, నాలుగు వర్ణాలుగా పుట్టారనీ, ఈ అసమానమైన, భేద భావంతో కూడిన సృష్టిని సాక్షాత్తు పరబ్రహ్మే చేశాడనీ, మనుషులు ఎన్నటికీ సమానులు కాలేరనీ చెబుతాయి.

ఈ చాతుర్వర్ణ వ్యవస్థను కేవలం వేదాలు మాత్రమే ప్రామాణికం చేశాయి అనుకుంటే పొరపాటు. ఆనక వచ్చిన రామాయణం, మహాభారతం లాంటి ఇతిహాసాలతో సహా భగవద్గీత లాంటి తాత్విక గ్రంథాలు కూడా ప్రామాణికం చేశాయి. వీటన్నింటినీ మించి మనుస్మృతి చాతుర్వర్ణ వ్యవస్థను శిలా సదృశ్యంగా మార్చడమే కాకుండా ఆ నాలుగు వర్ణాలకు ధర్మాలను, విధులను సైతం నిర్దేశించింది. ఆ విధులను ఉల్లంఘిస్తే వేయవలసిన శిక్షలను కూడా చాలా స్పష్టంగా వివరించింది.

ఈ వర్ణ వ్యవస్థ మెజారిటీ ప్రజలను బానిసలుగా మార్చటానికి ఉపయోగపడిందే తప్ప సమానత్వాన్ని సాధించడానికి కానీ, సమానమైన అవకాశాలను కల్పించడానికి కానీ ఉపయోగపడలేదు. అయినా నేడు ఈ హిందూత్వవాదులు సనాతన ధర్మమే ఉన్నతమైనదనీ, అది శాశ్వతమైనదనీ మానవాళి జీవించడానికి అత్యున్నతమైన జీవిత విధానాన్ని సమకూర్చేది సనాతన ధర్మమే అనీ నిస్సిగ్గుగా నమ్మబలుకుతున్నారు.

తమ మత విశ్వాసాలకు వ్యతిరేకమైన అభిప్రాయాలు వెలిబుచ్చిన వారిని చంపి వేస్తామంటూ ఫత్వాలు జారీ చేసే తాలిబన్లకూ, ఉదయనిధి స్టాలిన్‌ను చంపివేస్తామనీ, చంపివేసిన వారికి కోట్ల రూపాయల నగదు బహుమతిని ఇస్తామనీ ప్రకటిస్తున్న సనాతన వాదులకూ మధ్య తేడా లేదని కూడా మనం గమనించాలి.

పదేళ్ల సనాతనవాదుల పరిపాలన తరువాతైనా ఈ దేశపు మెజారిటీ ప్రజలైన బహుజనులు తమకు సనాతన ధర్మం కావాలో, లేక రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వ విలువలు కావాలో తేల్చుకోవలసిన సమయం ఆసన్నమైంది. మేల్కొనకపోతే మనకు రానున్నవి చీకటి రోజులే!

- టి. హరికృష్ణ, మానవ హక్కుల వేదిక

మొబైల్: 94940 37288

పర్సనల్ చట్టాలను క్రోడీకరించినప్పుడే...

విశ్లేషణ



ప్రొ॥ మాడభూషి శ్రీధర్

స్వాతంత్ర్యానంతరం (1955–58) భారత ప్రభుత్వం 'హిందూ వివాహ చట్టం', 'హిందూ వారసత్వ చట్టం', 'హిందూ మైనారిటీ–సంరక్షకత్వ చట్టం', 'హిందూ దత్తత–నిర్వహణ' వంటి చట్టాలను తీసుకువచ్చి 'హిందూ కోడ్'గా క్రోడీకరించింది. కాని ముస్లిం, క్రైస్తవం, పార్శీ వంటి ఇతర మతాల వారి సివిల్ చట్టాలను క్రోడీకరించే పని జరగలేదు. బ్రిటిష్‌వాళ్ల కాలంలో ఏమున్నాయో అవే కొనసాగుతున్నాయి. అందుకే అందరికీ కామన్‌గా వర్తించే ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) ఉండాలనే వాదం తరచూ తెరమీదికి వస్తూ ఉంది. స్వాతంత్ర్యానికి ముందే భారతీయ క్రిమినల్ కోడ్‌ను బ్రిటీష్‌వాళ్లు తయారు చేశారు. కానీ ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) జోలికి మాత్రం పోలేదు.

ప్రస్తుతం 21వ లా కమిషన్ ముస్లింలు 'మూడుసార్లు తలాక్' అని పలికి విడాకులు తీసుకునే విషయం తప్ప ఇతర యూసీసీ అంశాల మీద చర్చించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బల్బీర్ సింగ్ చౌహాన్ కమిషన్‌కు నాయకత్వం వహించారు. దేశంలో పెళ్లి, విడాకులు, వారసత్వంగా వచ్చే ఆస్తి, పిల్లలను దత్తత తీసుకోవడం వంటి విషయాలకు సంబంధించి చట్టాలు అన్ని మతాలకూ ఒకేలా లేవు. ఆ యా మతాల విశ్వాసాలూ, నమ్మకాలను బట్టి పర్సనల్ లా ఉంటుంది. ఇప్పుడు అందరికీ ఉమ్మడి సివిల్ కోడ్ తేవాలంటే వీటన్నింటినీ హేతుబద్ధంగా క్రోడీకరించవలసి ఉంటుంది.



ముస్లిం పర్సనల్ లా (షరియత్) అప్లికేషన్ యాక్ట్–1937, విడాకుల చట్టం–1869 వంటి చట్టాల్లో భిన్నమైన నియమాలు ఉన్నాయి. వాటిని ఇతర మతాలతో హిందూ నియమాలతో సమానం చేయడానికి సమగ్రంగా పరిశోధించవలసి ఉంది. ముస్లిం మతంలో భర్త భార్యకు విడాకులు ఇస్తే భరణం చెల్లించవలసిన అవసరం లేదు. కేవలం విడాకులు పొందిన 90 రోజుల (ఇద్దాత్) కాలానికి మాత్రమే ఆమెకు భరణం లభిస్తుంది. కానీ 1985 నాటి షాబానో కేసులో సుప్రీం కోర్టు ముస్లిం పర్సనల్ లాను పరిగణించకుండా భర్త జీవితాంతం షాబానోకు భరణం చెల్లించాలని ఆదేశించింది. ముస్లింలు తమ మత చట్టాల్లో ఇది జోక్యం చేసుకోవడమేనని ఆందోళనలు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీం తీర్పుకు వ్యతిరేకంగా చట్టం చేసి ముస్లిం పర్సనల్ లా ప్రకారం 90 రోజులే భరణం ఇవ్వాలని చట్టం చేసింది.

ఇక హిందూ సివిల్ కోడ్ విషయానికి వస్తే... హిందువులలో దత్తత ముఖ్యమైంది. దత్తత ప్రక్రియలో హోమం, దత్తత, లిఖిత పత్రం కూడా ఉంటాయి. ఇటువంటి సంప్రదాయం వేరే దేశంలో లేదు. సంతానాన్ని కనలేనివారు ప్రపంచవ్యాప్తంగా దత్తత తీసుకోవడం మామూలు విషయమే. అనాథల సమస్య పరిష్కారమవ్వడానికి దత్తత ఒక దివ్య మార్గం. కానీ లక్షలాది రూపాయలు వెచ్చించి రకరకాల పద్ధతుల్లో పిల్లలను కనడానికి ప్రయత్నించడం ముఖ్యంగా భారత్‌లో కనిపిస్తుంది. జువెనైల్ జస్టిస్ చట్టం–2000లో దత్తతకు సంబంధించిన విషయాలు అనేకం ఉన్నాయి.

'హిందూ అవిభక్త కుటుంబం' అంటారు కదా, ఇది 'హిందూ' లేదా 'అవిభక్త' అనవచ్చునా? 'హిందూ అవిభక్త కుటుంబ (హెచ్‌యూఎఫ్) రద్దును ప్రతిపాదిస్తున్న నిబంధనను చేర్చడం తప్పనిసరా? ఆ విధంగా చేయడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి' అని 2018 లా కమిషన్ అధ్యక్షులు అన్నారు. హిందూ చట్టాల కింద లోపభూయిష్టమైన కోపార్సెనరీ (కోపార్సెనరీ అంటే హిందూ సమష్టి కుటుంబంలో పుట్టినందుకు వారసత్వంగా ఆస్తి, కొన్ని అధికారాలు పొందే హక్కుదారుడు) లెక్క చాలా సంక్లిష్టంగా తయారైంది. దాదాపు సమష్టి కుటుంబాలు లేకుండా పోయినా కొందరు హెచ్‌యూఎఫ్ పేరు చెప్పి పన్నులు ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అందుకే 'హిందూ అవిభక్త కుటుంబా'నికి సంబంధించిన వెసులుబాటులను రద్దు చేయాలని 2018 లా కమిషన్ అధ్యక్షులు సూచించారు. సమష్టి టెనెన్సీ బదులు 'టెనెన్సీ ఇన్ కామన్'తో జన్మతో వచ్చే హక్కులు కోపార్సెనర్లకు ఉండకూడదు అని కూడా సిఫార్సు చేశారు.

ఇంతకు చెప్పొచ్చేదేమిటంటే... యూసీసీని రూపొందించాలంటే హిందూ మతంతో సహా అన్ని మతాలకు సంబంధించిన చట్టాల్లో మార్పు చేర్పులు చేయడమో, కొన్నింటిని తొలగించడమో చేయవలసి ఉంటుంది.

వ్యాసకర్త మహీంద్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా ఎడ్వైజర్

ఏకదంతం ఉపాస్మహే!

వేదకాలం నుంచి నేటిదాకా ఈ దేశంలో ఆస్తికులందరూ ఏ ముఖ్యమైన పని తలపెట్టినా, దాన్ని గణపతి పూజతోనే ఆరంభం చేస్తూ వస్తున్నారు. ఇష్ట దేవత ఎవరయినా కావచ్చు. కార్యారంభంలో అగ్రపూజ్యుడు మాత్రం గజాననుడు. కారణమేమిటి?

ఎవరు ఏ కార్యం సంకల్పించి ఆరంభించినా, కార్యసిద్ధినీ, విజయాన్నీ, సాఫల్యాన్నీ కోరుకొంటారు. కార్య నిర్వహణలో ఎదురయ్యే అనుకోని ఆటంకాలు 'విఘ్నాలు'. ఇవి కార్యసాధకుడి సమర్థతకు పరీక్షలు. పురుష కారానికి దైవానుగ్రహాన్ని తోడు చేసి, విఘ్నాలను తొలగించుకోగలిగితేనే విజయం.



ధైర్యం లేని అల్పులు ఈ విఘ్నాలు కలుగుతాయన్న భయం చేత అసలు కార్యాలు చేపట్టరు. 'ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై'. మధ్యస్థులైన సామాన్యులు, పని మొదలెట్టి పదడుగులు వేస్తారు. కానీ కొంచెం పెద్ద విఘ్నాలు ఎదురవగానే 'మన వల్ల కాదులే' అని మధ్యలో వదిలేస్తారు. 'ఆరంభించి పరిత్యజింతురు–ఉరు విఘ్నాయత్తులై మధ్యముల్'. ధీరులూ, సమర్థులూ మాత్రం ఎంత పెద్ద విఘ్నాలు వచ్చినా భయపడక, ధైర్యోత్సాహాలతో వాటిని అధిగమించి విజయులవుతారు.

మనిషికీ కార్యసిద్ధికీ మధ్య నిలిచే ఈ 'విఘ్నా'లకు అధిపతి విఘ్నేశ్వరుడు. కనక ఏ సత్కార్యం ప్రారంభించినా – చిన్నదైనా పెద్దదైనా, లౌకికమైనదైనా, ఆధ్యాత్మికమైనదైనా, ముందు ఆయనను పూజించుకోవడంలో ఔచిత్యం ఉంది. విద్యారంభంలోనూ, వివాహాది కార్యాలలోనూ, యుద్ధాలలోనూ, సంఘర్షణలలోనూ, సంకటాలు ఎదురైనప్పుడూ, తొలుత 'అవిఘ్నమస్తు' అని ధూర్జటి నందనుడికి భక్తి శ్రద్ధలతో మొక్కుకొన్న వారికి విఘ్నాలను ఆయనే తొలగిస్తాడు. దాంతో అనుకొన్న పని అనుకున్నట్టు జరిగి విజయం సిద్ధిస్తుందని సాంప్రదాయికమైన విశ్వాసం.

ధీరులకూ, భీరులకూ, మధ్యస్థులకూ అందరికీ సర్వదా, సర్వ కార్యాలలో, విఘ్నవారణుడి అనుగ్రహం అవసరమే. భాద్రపద శుద్ధ చవితి – ఈ రోజు– సకల కార్యసిద్ధి ప్రదాయకుడైన 'శ్రీ శంభు తనయునకు, సిద్ధి గణ నాథునకు, వాసిగల దేవతా వందితునకు, ఆ సకల విద్యలకు ఆది గురువైనట్టి భూసురోత్తమ లోక పూజితునకు' త్రికరణ శుద్ధితో పూజలు జరిపి, ఆయన అనుగ్రహం పొందడానికి మరింత అనువైనది వినాయక చతుర్థి మహా పర్వదినం.

సర్వ విఘ్న హరం దేవం / సర్వ విఘ్న వివర్జితమ్,
సర్వ సిద్ధి ప్రదాతారం / వందేహం గణనాయకమ్!

- ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.తదియ ఉ.10.16 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** చిత్త ఉ.11.06 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** సా.4.55 నుండి 6.34 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.20 నుండి 1.09 వరకు, తదుపరి ప.2.44 నుండి 3.34 వరకు, **అమృతఘడియలు:** రా.2.56 నుండి 4.34 వరకు, వినాయక చవితి; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.51, **సూర్యాస్తమయం:** 6.00.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

తిరుమలకు కోవింద్



తిరుమలలో కోవింద్ దంపతులకు స్వాగతం పలుకుతున్న ఈవో ధర్మారెడ్డి

తిరుమల: శ్రీవారిని దర్శించుకునేందుకు గాను మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదివారం తిరుమలకు చేరుకున్నారు. ఆయనకు ఫినిక్స్ అతిథి గృహం వద్ద టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్వాగతం పలికారు. శ్రీవారిని కోవింద్ సోమవారం దర్శించుకోనున్నారు. కాగా, శ్రీవారిని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ఆయనకు పండితులు వేదాశీర్వచనాలను, ఈవో ప్రసాదాలను, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

కార్పొరేట్ ఆస్పత్రులు సేవా దృక్పథంతో పనిచేయాలి

- విధాత హాస్పిటల్ ప్రారంభోత్సవంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



విధాత ఆస్పత్రిని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

లబ్బీపేట(విజయవాడ తూర్పు): కార్పొరేట్ ఆస్పత్రుల నిర్వాహకులు సేవా దృక్పథంతో పనిచేయాలని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ సూచించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురం చంద్ర రాజేశ్వరరావు వీధిలో ఏర్పాటు చేసిన విధాత హాస్పిటల్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలోని వైద్య విభాగాలు, సాంకేతిక పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కార్పొరేట్ ఆస్పత్రులు భాగస్వాములవ్వాలని చెప్పారు. విధాత హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆస్పత్రిలోని వసతులను వివరించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు.

బోయి భీమన్న జీవిత సాఫల్య పురస్కారాల ప్రదానం



డాక్టర్ ప్రతాప్‌కు బోయి భీమన్న పురస్కారాన్ని అందచేస్తున్న మంత్రి రోజా

భవానీపురం(విజయవాడ పశ్చిమ)/సఖినేటిపల్లి: ఏపీ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ భవానీపురంలోని హరిత బరంపార్క్‌లో ఆదివారం మహాకవి బోయి భీమన్న జయంతి వేడుకలు, భీమన్న జీవిత సాఫల్య పురస్కారాల ప్రదానం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2022 సంవత్సరానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన కవి, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కు, 2023 సంవత్సరానికి చెన్నైకి చెందిన ఆచార్య డాక్టర్ విస్తలి శంకరరావుకు బోయి భీమన్న జీవిత సాఫల్య పురస్కారాలు ప్రదానం చేశారు. పురస్కారంతో పాటు రూ.2 లక్షల ప్రోత్సాహక బహుమతి అందజేశారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కె.రోజా మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చిన బహు ముఖ ప్రజ్ఞాశాలి పద్మభూషణ్ బోయి భీమన్న అని కొనియాడారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఆర్.మల్లికార్జునరావు, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి చైర్‌పర్సన్ వంగపండు ఉష పాల్గొన్నారు.

మహిళపై టీడీపీ కార్యకర్త లైంగిక దాడి

రొంపిచెర్ల: ఒక మహిళపై టీడీపీ కార్యకర్త లైంగిక దాడికి తెగబడిన ఘటన చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలం బండకిందపల్లెకు సమీపంలోని చెరువులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సదుం మండలానికి చెందిన ముస్లిం మహిళ(37) సదుం నుంచి రొంపిచెర్లకు వచ్చి తిరిగి ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఆటోలో పీలేరుకు బయలుదేరింది. పెద్దగొట్టిగల్లు గ్రామ పంచాయతీ బోనంవారిపల్లెకు చెందిన ఆటో డ్రైవర్ గుర్రప్ప (45) అనే టీడీపీ కార్యకర్త ఆమెను బండకిందపల్లె–బోనంవారిపల్లెకు మధ్య గల చెరువులోకి బలవంతంగా తీసుకువెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మహిళ ప్రాణభయంతో తిరుపతి–మదనపల్లె రోడ్డులోకి కేకలు వేస్తూ పరుగులు తీసింది. వినాయక చవితి కోసం విగ్రహాన్ని తీసుకుని వెళుతున్న యువకులు గుర్తించి ఆటో డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. అనంతరం రొంపిచెర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కొందరు టీడీపీ నాయకులు రంగంలోకి దిగి మహిళ శీలానికి వెల కట్టే ప్రయత్నం చేస్తున్నారు. మహిళ మాత్రం కేసు నమోదుకు పట్టు పడుతుండగా.. టీడీపీ నాయకులు రాజీ ప్రయత్నాలకు దిగారు.

బ్రహ్మోత్సవ సంబరం ప్రారంభం

- శాస్త్రోక్తంగా తిరుమల బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- నేడు ధ్వజారోహణం, పెద్ద శేష వాహన సేవ



తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవంలో చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి తదితరులు

తిరుమల/తిరుపతి క్రైం: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి 7–8 గంటల మధ్యలో వైదికంగా అంకురార్పణ చేశారు. వైఖానస ఆగమ శాస్త్ర బద్ధంగా ఈ వేడుకను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ముందురోజైన ఆదివారం సాయంసంధ్యా సమయంలో శ్రీవారి సర్వ సేనాధిపతి అయిన విష్వక్సేనుడు ఛత్రచామర, మేళతాళాల నడుమ మాడవీధుల్లో ఊరేగింపుగా బయలుదేరి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం రంగనాయక మండపంలో ఆస్థానం నిర్వహించారు.

నేడు ధ్వజారోహణం, పెద్ద శేషవాహనం

సోమవారం సాయంత్రం 6.15–6.30 గంటల మధ్య మీన లగ్నంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి 9 గంటలకు పెద్ద శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగనున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చారు.

వాహనాలకు పాసులు ఉంటేనే అనుమతి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 22న గరుడ సేవ సందర్భంగా తిరుమలకు వచ్చే వాహనాలకు (ఫోర్‌వీలర్లకు) పాసులను టీటీడీ తప్పనిసరి చేసింది. దీంతో తిరుమల వెళ్లే ప్రతి వాహనదారుడు పాసులు పొందాల్సి ఉంటుంది. కాగా, గరుడ సేవ రోజు ద్విచక్రవాహనాలను తిరుమలకు అనుమతించేది లేదని టీటీడీ స్పష్టం చేసింది.

పాసులు అందించే ప్రదేశాలు

- బెంగళూరు, చిత్తూరు నుంచి వచ్చే వాహనాలకు చంద్రగిరి నియోజకవర్గంలోని ఐతేపల్లి దగ్గర
- మదనపల్లి నుంచి వచ్చే వాహనాలకు రంగంపేట కేఎంఎం కళాశాల వద్ద
- చెన్నై, నగరి, పుత్తూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు వడమాలపేట టోల్ ప్లాజా సమీపంలోని అగస్త్య ఎన్‌క్లేవ్ వద్ద
- కడప వైపు నుంచి వచ్చే వాహనదారులకు కుక్కల దొడ్డి వద్ద ఉన్న కేశవరెడ్డి హైస్కూల్‌లో
- నెల్లూరు, శ్రీకాళహస్తి వైపు నుంచి వచ్చే వాహనాలకు ఆర్ మల్లవరం పెట్రోల్ బంక్ వద్ద
- తిరుపతి పట్టణ ప్రజలకు, చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చేవారికి కరకంబాడి రోడ్డులోని ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజ్ వద్ద.

మహనీయుల స్ఫూర్తితో ఉత్తమ న్యాయవాదులుగా ఎదగండి

- ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి



ఫాస్ట్‌ట్రాక్ కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ శేషసాయి, జస్టిస్ కృపాసాగర్ తదితరులు


చిలకలపూడి (మచిలీపట్నం): సహనంలో మహాత్మాగాంధీ, జ్ఞానంలో బీఆర్ అంబేడ్కర్, ధైర్యంలో అల్లూరి సీతారామరాజు, సాహసంలో టంగుటూరి ప్రకాశం పంతులును ఆదర్శంగా తీసుకున్నప్పుడే సంపూర్ణ న్యాయవాదులుగా ఎదుగుతారని హైకోర్టు న్యాయమూర్తి, కృష్ణా జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్మించిన ఫాస్ట్‌ట్రాక్ కోర్టు మొదటి అంతస్తు భవనాన్ని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. బార్ అసోసియేషన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ శేషసాయి మాట్లాడారు. న్యాయ వ్యవస్థకు ఎంతో మంది గొప్ప న్యాయమూర్తులు, న్యాయవాదులను అందించిన ఘనత మచిలీపట్నం బార్ అసోసియేషన్‌కు ఉందన్నారు. జస్టిస్ కృపాసాగర్ మాట్లాడుతూ..తన సొంత బార్ అసోసియేషన్ అయిన మచిలీపట్నం బార్ అసోసియేషన్‌కు రావటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ పాలసీదారులకు బోనస్ పెంచాలి

లబ్బీపేట (విజయవాడ తూర్పు): కేంద్రం, ఎల్‌ఐసీ సంస్థ అనుసరిస్తోన్న విధానాలతో ఏజెంట్ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతోందని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు రణవీర్ శర్మ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఫెడరేషన్ జాతీయ మహాసభలు జరుగుతున్నాయి. దీనికి దేశం నలుమూలల నుంచి సుమారు 5,000 మంది ఎల్‌ఐసీ ఏజెంట్లు హాజరయ్యారు. రణవీర్ శర్మ మాట్లాడుతూ..ఎల్‌ఐసీ పాలసీలపై జీఎస్టీని రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఏజెంట్లకు ఉద్యోగ భద్రత లేక వృత్తిని కొనసాగించలేని పరిస్థితి నెలకొందన్నారు. పాలసీదారులకు ఇచ్చే బోనస్‌ను పెంచాలని కోరారు.

తప్పు చేయకపోతే గగ్గోలెందుకు?

- 'స్కిల్' స్కామ్‌లో స్పష్టమైన ఆధారాలున్నాయి
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వంగాల ఈశ్వరయ్య స్పష్టీకరణ
- పక్కా సాక్ష్యాధారాలతోనే సీఐడీ కేసు దర్యాప్తు చేస్తోంది
- విచారణకు చంద్రబాబు సహకరించి నిజాయితీ నిరూపించుకోవాలి
- రూ.241 కోట్ల ప్రజాధనం అక్రమంగా మళ్లించినట్టు తెలుస్తోంది
- ఇదీ అసలు సంగతని ఆ షెల్ కంపెనీలు ఎందుకు చెప్పడం లేదు?
- ఈ ప్రాజెక్టుతో తమకు సంబంధం లేదని సిమన్స్ చెబుతోంది
- ఇన్ని ఆధారాలు కనిపిస్తుంటే అరెస్ట్ చేయడం ఎలా తప్పవుతుంది?



సాక్షి, అమరావతి : 'అవినీతికి పాల్పడకపోతే చంద్రబాబుకు భయమెందుకు? అనేక కేసుల్లో జరిగే తరహాలోనే ఈ కేసు విచారణ జరుగుతున్నప్పటికీ ఏదో జరిగిపోతున్నట్టు గగ్గోలు ఎందుకు? విచారణకు సహకరించి నిజాయితీ నిరూపించుకోవచ్చు' అని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వంగాల ఈశ్వరయ్య అన్నారు. స్కిల్ స్కామ్‌లో సీఐడీ పోలీసులు పక్కా సాక్ష్యాధారాలతోనే దర్యాప్తు చేస్తున్నారని, రూ.241 కోట్ల ప్రజాధనం అక్రమంగా మళ్లించినట్టు స్పష్టమవుతోందని చెప్పారు. కస్టోడియల్ కస్టడీలో విచారిస్తే నిజ నిర్ధారణ జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక సెల్ఫీ వీడియో విడుదల చేశారు. కొద్ది రోజులుగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో తన చేతికి ఆ రిమాండ్ రిపోర్టు అందినందున, ఇందులో నిజా నిజాలు, క్రెడిబులిటీ చెప్పదల్చుకున్నానని తెలిపారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

క్లియర్ ఎవిడెన్స్ కనిపిస్తున్నాయి..

- ఎంతో మంది నాయకులు క్రిమినల్ కేసులు ఎదుర్కొన్నారు. కొంత మందికి శిక్షలు పడ్డాయి. నిర్దోషులు హానరబుల్ (గౌరవం)గా బయటకొచ్చారు. కానీ ఎక్కడా జరగని విధంగా ఇక్కడే ఏదో జరిగిపోయినట్టు చంద్రబాబు కేసు విషయంలో కొంత మంది గగ్గోలు పెడుతున్నారు. ఆయన అరెస్టు సరైనదే అని కొందరు సమర్థిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.241 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం కేసులో ఈ నెల 9న సీఐడీ పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు.
- ప్రభుత్వ డబ్బు (ప్రజాధనం) బోగస్ ఇన్వాయిస్‌ల ద్వారా టెక్నాలజీ పార్ట్‌నర్స్‌కు, ఇతరులకు డిస్ట్రిబ్యూట్ అయ్యింది. ఆ సిక్స్ క్లస్టర్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ చేయలేదు. వారికి ఇచ్చిన డబ్బుకు లెక్కలేదు. దానికి జీఎస్టీ కట్టలేదని జీఎస్టీ అథారిటీ వారు కూడా ఎంక్వైరీ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వాళ్లు విచారించారు. తర్వాత ఇన్‌కంట్యాక్స్ డిపార్ట్‌మెంట్ కూడా ఇన్‌వాల్వ్ అయ్యింది. ఇంత క్లియర్ ఎవిడెన్స్ ఉన్న తర్వాత.. దీనికి సంబంధించి కొన్ని కీ నోట్ ఫైల్స్ మిస్ అయ్యాయి కాబట్టే చంద్రబాబును అరెస్టు చేశారు.
- 141 మంది సాక్ష్యులను కూడా విచారించి ఆధారాలు సేకరించారు. ఆ డబ్బు ఎవరి అకౌంట్‌లో పడింది.. నిధులు ఎలా దారి మళ్లాయి.. షెల్ కంపెనీల ద్వారా తిరిగి వీళ్ల వద్దకు ఆ డబ్బు ఎలా వచ్చింది.. ఇవన్నీ మరింత స్పష్టంగా విచారించడానికే చంద్రబాబును అరెస్టు చేశారు.

నేరం చేయకపోతే భయమెందుకు?

- చంద్రబాబు ఏ రకమైన నేరం (ఫ్రాడ్) చేయకపోతే, నిధులు దుర్వినియోగం చేయకపోతే, నిబంధనలు ఉల్లంఘించకపోతే, ప్రివెన్షన్ ఆఫ్ కరెప్షన్ యాక్ట్ కిందకు రాకపోతే, అది 409 కిందకు రాకపోతే ఎందుకు భయపడుతున్నట్లు? నిధులు అక్రమంగా మళ్లింపు(సైఫెన్) అని తెలుస్తోంది. ఆ డబ్బు దుర్వినియోగం అయినట్టు తేటతెల్లమైంది. సీఐడీ పోలీసులు రికార్డును బట్టే ముందుకెళ్తున్నారు.
- ఇది సరికాదనుకున్నప్పుడు మా దగ్గర రికార్డు ఉంది.. జరిగిందిదీ అని ఆ ఆరు షెల్ కంపెనీలు వచ్చి చెప్పడం లేదు. మేనేజింగ్ డైరెక్టర్ ప్రైవేటు కెపాసిటీతో ఏదైనా లెటర్ ఇచ్చి ఉండొచ్చు. అండర్ స్టాండింగ్ ఉండొచ్చు. కానీ దాంతో మా కంపెనీకి ఏ సంబంధం లేదని సిమన్స్ ఇండస్ట్రీ వాళ్లు చెబుతున్నారు. డిజైన్ టెక్ ప్రైవేట్ కంపెనీ కూడా మాకు సంబంధం లేదన్నట్టుగానే వ్యవహరిస్తోంది. షెల్ కంపెనీలు కూడా వాస్తవ సమాధానం చెప్పడం లేదు. ఇంత మందికి శిక్షణ ఇచ్చామని, ఇన్ని పరికరాలు కొన్నామని బెయిల్ పిటిషన్లలో ఎందుకు చెప్పలేదు?
- ఇంత క్లియర్‌గా కేసు ఉంటే ఏదో ఘోరం జరిగిపోయిందని గగ్గోలు పెట్టడం విచిత్రం అనిపిస్తోంది. ఆయన సత్యవంతుడని నిరూపించుకుంటే రేపు పరువు నష్టం దావా వేయొచ్చు. ఇలా గగ్గోలు పెట్టడం అనవసరం. ఇంత కంటే పూర్తి ఆధారాలతో కూడిన(ఫుల్ ప్రూఫ్) కేసు నేను చూడలేదు. అనుమానాలకు తావులేదు.

గవర్నర్ అనుమతి అవసరం లేదు

- ప్రివెన్షన్ ఆఫ్ కరెప్షన్ యాక్ట్ ప్రకారం గవర్నర్ అనుమతి కావాలనే వాదన జరుగుతోంది. సెక్షన్ 17ఎ ప్రివెన్షన్ ఆఫ్ కరెప్షన్ యాక్ట్ 2018లో ఫోర్స్‌లోకి వచ్చింది. అంతకు ముందు జరిగిన నేరాలకు అది వర్తించదు. కాబట్టి అవి అంతకంటే ముందు నేరాలు కాబట్టి 17ఎ లో గవర్నర్ అనుమతి తీసుకోవాలనేది వర్తించదు. అచ్చెన్నాయుడు కేసులో ఇది డిసైడ్ అయ్యింది.
- అరెస్టు, కస్టోడియల్ ఇంట్రాగేషన్ ఇవన్నీ విచారణలో భాగమే. దాదాపు 141 మంది సాక్ష్యులను విచారించారు. ఏడుగురిపై రిమాండ్ రిపోర్టు ఇచ్చారు. తర్వాత అత్యంత ఎక్కువ సమాచారం సేకరించారు. దర్యాప్తునకు సహకరించడ లేదు. అంతకు ముందు చంద్రబాబు పీఏ పెండ్యాల శ్రీనివాసరావు విదేశాలకు వెళ్లిపోయాడు. వాళ్లిద్దరూ సహకరించడం లేదు. తర్వాత కొన్ని నోట్ ఫైల్స్ మిస్సింగ్. షెల్ కంపెనీల ద్వారా ప్రజాధనం వీరికి చేరిందనేది నిర్ధారణ కావాలంటే అరెస్ట్ చేసి విచారిస్తేనే నిజానిజాలు బయటపడతాయి.

చంద్రగిరిలో లక్ష 'మట్టి గణపతుల' పంపిణీ

ఎమ్మెల్యే చెవిరెడ్డి సేవా కార్యక్రమాలను ప్రశంసించిన కలెక్టర్



మట్టి విగ్రహాలను అందిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్(తిరుపతి జిల్లా): పర్యావరణ హితం కోసం ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని, భక్తి విషయంలో ఆయన బాహుబలి అంతటి వారని తిరుపతి జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, తిరుపతి వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, నవీన్‌కుమార్‌రెడ్డిలు కొనియాడారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఇంటింటికీ అందించేందుకు లక్ష మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఆదివారం తిరుచానూరు మార్కెట్ యార్డులో నిర్వహించారు. కలెక్టర్, ఎమ్మెల్యే చెవిరెడ్డి, వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు ముఖ్య అతిథులుగా పాల్గొనగా, వారికి తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి స్వాగతం పలికారు. తాను వినాయక చవితి పండుగను జరుపుకోవడమే కాదు.. నియోజకవర్గంలోని ప్రజలందరూ జరుపుకోవాలని ప్రతి ఇంటికీ మట్టి విగ్రహాలను అందిస్తున్నట్టు ఎమ్మెల్యే చెవిరెడ్డి చెప్పారు. తుమ్మలగుంటలో నెమలి ఈకలతో తీర్చిదిద్దనున్న వినాయక ప్రతిమను అందరూ దర్శించాలని మోహిత్‌రెడ్డి కోరారు. తిరుపతి వినాయక నిమజ్జన కమిటీకి ఈ ఏడాది రూ.25 లక్షలు కేటాయిస్తున్నట్టు చెప్పారు.

బాబు రాష్ట్రం పరువు తీశారు

- విభజన హామీలు అమలుచేయాలని అఖిలపక్ష భేటీలో డిమాండ్ చేశాం
- వైఎస్సార్‌సీపీ ఎంపీ భరత్
- స్కిల్ స్కాంపై టీడీపీ ఎంపీలకు విజయసాయిరెడ్డి కౌంటర్



సాక్షి న్యూఢిల్లీ: అంతర్జాతీయ కంపెనీల పేరుతో అవినీతికి పాల్పడి చంద్రబాబు రాష్ట్ర పరువు తీశారని వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్ విమర్శించారు. సాంకేతిక అంశాల ఆధారంగా బాబు తప్పించుకునే ప్రయత్నం చేశారన్నారు. ఢిల్లీలో ఆదివారం అఖిలపక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిప్పు అని చెప్పుకునే చంద్రబాబు కేసులకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావాలని సమావేశంలో కోరామని.. జనగణనలో కులగణన చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఏపీ విభజన చట్టంలోని హామీలన్నీ అమలుచేయాలని కూడా డిమాండ్ చేశామని, ప్రత్యేక హోదా, పోలవరం నిధుల్ని ఇవ్వాలని కోరామని భరత్ చెప్పారు.

టీడీపీకి వైఎస్సార్‌సీపీ ఎంపీల చెక్

ఇక చంద్రబాబు అరెస్టుపై సానుభూతి పొందేందుకు అఖిలపక్ష సమావేశాన్ని వేదికగా మార్చుకునేందుకు టీడీపీ చేసిన ప్రయత్నాన్ని వైఎస్సార్‌సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మార్గాని భరత్ తిప్పికొట్టారు. చంద్రబాబు ఒక క్రిమినల్ అని, అవినీతికి పాల్పడ్డారని.. కుట్రకు ప్రధాన సూత్రధారి, లబ్ధిదారు ఆయనేనని వారు తెలిపారు. అందుకే చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసిందని అఖిలపక్ష సమావేశంలో విజయసాయిరెడ్డి స్పష్టంచేశారు. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సహా ఇతర కేంద్ర మంత్రులు, అన్ని పార్టీల నేతల సమక్షంలోనే విజయసాయిరెడ్డి కుంభకోణం గురించి వివరించారు. ఈ సమయంలో.. జి–20 సమావేశాల సమయంలో చంద్రబాబును అరెస్టుచేయడం ప్రజాస్వామ్యానికి దుర్దినమని టీడీపీ నేతలు అంటుండగా.. ఆ సమావేశాలు జరుగుతున్నాయని 420లను వదిలేయాలా? అని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు.

మహిళా మనో వికాస్ సంస్థకు గిన్నిస్ రికార్డు



పుత్తూరు రూరల్ (తిరుపతి జిల్లా): ఊలు దారాలతో పోంచోస్ (మహిళలు ధరించే వస్త్రం) తయారీపై విశాఖపట్నానికి చెందిన 'మహిళా మనో వికాస్' సంస్థకు గిన్నిస్ వరల్డ్ రికార్డు దక్కింది. ఈ నెల 10వ తేదీన విశాఖపట్నం అక్కయ్యపాలెంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో సంస్థ వ్యవస్థాపకురాలు సూరిబాట్ల మాధవి ఆధ్వర్యంలో 250 మంది మహిళలు కలిసి ఆరు నెలల్లో 2,719 పోంచోస్‌లు తయారు చేయడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. ప్రదర్శనలో పాల్గొన్న గిన్నిస్ వరల్డ్ రికార్డు సంస్థ ప్రతినిధి స్వప్నిల్ డంగారికర్ 'ది లార్జెస్ట్ డిస్‌ప్లే ఆఫ్ క్రోచెట్ పోంచోస్' రికార్డు ధ్రువీకరణ పత్రం అందించినట్లు మహిళా మనో వికాస్ సంస్థ సభ్యురాలు, తిరుపతి జిల్లా పుత్తూరు పట్టణం ఎన్జీవో కాలనీకి చెందిన గాదిరాజు సునంద ఆదివారం 'సాక్షి'కి తెలిపారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధనలో తాను భాగస్వామి అయినందుకు గర్వంగా ఉందన్నారు.

ఐటీ ముసుగులో కృత్రిమ ఉద్యమం

- చంద్రబాబు అరెస్ట్ తర్వాత ఏపీలో ఎక్కడా స్పందన లేదు
- కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విమర్శ

కాకినాడ: అమెరికా, యూరప్, బెంగళూర్, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఐటీ ఉద్యోగుల పేరుతో చంద్రబాబుకు మద్దతుగా చేస్తున్న నిరసనలు కొంతమంది కమ్మ కులస్తుల కృత్రిమ ఉద్యమాలేనని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్ట్ తర్వాత ఏపీలో ఎక్కడా స్పందన లేదని, అయితే విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో ఐటీ ఉద్యోగులు రోడ్డెక్కారంటూ 'స్పాన్సర్డ్' ప్రోగ్రామ్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి నిరసనలకు ఐటీ పేరు వాడొద్దని, కమ్మ కులస్తుల నిరసనగా చెప్పుకుంటే మంచిదని హితవు పలికారు. ఐటీ ఉద్యోగాల్లో వేలాది మంది స్థిరపడ్డారంటే వైఎస్సార్ అందించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం, ఇతర ప్రోత్సాహకాలే ప్రధాన కారణమన్న వాస్తవం ప్రజలందరికీ తెలుసన్నారు. అవినీతి కేసులో ఆధారాలతో సహా చంద్రబాబు పట్టుబడితే మెజార్టీ కమ్మ కులస్తులు ఉలిక్కిపడి.. అది వారిపై కేసుగా భావించడం సరికాదన్నారు. ఈ వైఖరి సమాజానికి మంచిది కాదని, భవిష్యత్‌లో కమ్మ కులస్తులు ఇతర వర్గాల నుంచి వెలివేతకు గురయ్యే పరిస్థితికి చేరుకుంటారని ద్వారంపూడి చెప్పారు. వైఎస్సార్ మరణించినప్పుడు ఆ బాధను తట్టుకోలేక జరిగిన మరణాలు, రంగా హత్యానంతరం జరిగిన నిరసనలు, ప్రజల్లో నుంచి వచ్చిన నిజమైన స్పందనలని, చంద్రబాబు అరెస్టును వాటితో పోల్చడం సరికాదన్నారు. సాధారణ మరణాలను కూడా చంద్రబాబు ఖాతాలో వేసి, ఆయన అరెస్ట్‌ను జీర్ణించుకోలేక మృతి చెందారంటూ ఎల్లో మీడియా నిస్సిగ్గుగా ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. లోకేశ్ రాజకీయ రంగ ప్రవేశం చేశాకే ఏపీలో అవినీతి పెచ్చుమీరిపోయిందని విమర్శించారు. చంద్రబాబు అవినీతికి పవన్ కళ్యాణ్ వత్తాసు పలుకుతున్నారంటూ మండిపడ్డారు. టీడీపీ నేతలు చేసే విమర్శలను జనసేన నాయకులు పట్టించుకోవద్దని పవన్ చెప్పడం చూస్తుంటే.. తమ పార్టీ నేతలు వ్యక్తిత్వాన్ని చంపుకొని రాజకీయాల్లో కొనసాగమంటూ ఆయన సందేశం ఇచ్చినట్టుగా ఉందని ద్వారంపూడి ఎద్దేవా చేశారు.

రాష్ట్రానికి గుర్తింపు తెచ్చిన బాబునే జైల్లో పెడతారా?: యనమల

సాక్షి, రాజమహేంద్రవరం: తప్పుడు ఆరోపణలతో చంద్రబాబుపై కేసు పెట్టారని టీడీపీ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. రాజమహేంద్రవరం విద్యానగర్‌లోని లోకేశ్ క్యాంపు వద్ద ఆదివారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చిన వ్యక్తిని జైల్లో పెట్టినందుకు దేశ వ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు సీమెన్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. దోపిడీ వ్యవస్థకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిపతని, దోపిడీదారులను అరికట్టాల్సిన వారే దోచుకుంటున్నారని ఆరోపించారు.

సార్వత్రిక ఎన్నికలకు సై..!

- త్వరలో ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాల్లో విజయం ఖాయం
- ఏప్రిల్, మేలో జరిగే లోక్‌సభ ఎన్నికలకూ సిద్ధంగా ఉన్నాం
- దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు... వారి ఆశలను నెరవేరుస్తాం
- సీడబ్ల్యూసీ సమావేశాల్లో ఐదు రాష్ట్రాల ఎన్నికలపై చర్చ
- ముగిసిన కాంగ్రెస్ కీలక భేటీ



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎప్పుడు, ఎక్కడ ఎన్నికలు జరిగినా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నామని, త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో విజయం సాధిస్తామని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ధీమా వ్యక్తం చేసింది. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం, రాజస్తాన్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పు ఇస్తారనే విశ్వాసాన్ని ప్రకటించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్లో రెండోరోజు సీడబ్ల్యూసీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకతోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు అశోక్‌గహ్లోత్, సిద్ధరామయ్య, భూపేశ్‌భగేల్, సీడబ్ల్యూసీ సభ్యులు, అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు పాల్గొన్నారు. త్వరలో ఐదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు, పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు, దేశ రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. ఐదు రాష్ట్రాలకు చెందిన పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు, ఆయా రాష్ట్రాలకు చెందిన ముఖ్య నేతలు ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలు ఎదుర్కొనేందుకు అనుసరిస్తున్న వ్యూహాల గురించి వివరించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, పదేళ్ల బీజేపీ పాలనా వైఫల్యాలు, పార్టీ అనుసరించాల్సిన వైఖరి తదితర అంశాలపై ఖర్గే వారికి దిశానిర్దేశం చేశారు. చర్చ అనంతరం వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు పార్టీ పరంగా సిద్ధంగా ఉండాలని సీడబ్ల్యూసీ తీర్మానించింది. ఎన్నికల యుద్ధానికి సంసిద్ధం కావాలని నిర్ణయించింది. దేశ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, దేశంలో శాంతిభద్రతల నిర్వహణ, స్వేచ్ఛ, సామాజిక, ఆర్థిక న్యాయం, సమానత్వం, అన్ని రంగాల్లో ప్రజలకు వాటా ఇచ్చేలా ప్రజల ఆశలను నెరవేరుస్తామని చెప్పింది. ఆదివారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన సీడబ్ల్యూసీ భేటీ మధ్యాహ్నం 4 గంటలకు ముగిసింది. అనంతరం ప్రియాంక ఢిల్లీ వెళ్లిపోగా, సోనియా, రాహుల్, ఖర్గేతోపాటు మిగిలిన సీడబ్ల్యూసీ సభ్యులు, అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు తుక్కుగూడ బహిరంగ సభకు వెళ్లారు.

బీఆర్‌ఎస్‌కు మిగిలింది వంద రోజులే!

- 'విజయభేరి' సభలో రాహుల్ గాంధీ

తెలంగాణలో బీజేపీ, ఎంఐఎం సహా ఎవరు మద్దతుగా వచ్చినా సరే వంద రోజుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోవడం ఖాయమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కేవలం బీఆర్‌ఎస్‌తో కొట్లాడటం లేదని.. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎంలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తోందని చెప్పారు. ఈ మూడు పార్టీలు కలిసే కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఆదివారం జరిగిన 'కాంగ్రెస్ విజయభేరి' సభలో రాహుల్ ప్రసంగించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది తామేనని.. ఆ వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'బీఆర్‌ఎస్ అంటే బీజేపీ రిష్తేదార్ (బంధువుల) సమితి. పార్లమెంట్‌లో బీజేపీకి అవసరమైన ప్రతి సందర్భంలో బీఆర్‌ఎస్ మద్దతు పలకడం నా కళ్లతో చూశాను. కిసాన్ బిల్లులు, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికలు, జీఎస్టీ తదితరాలపై నరేంద్ర మోదీ ఒక్క సైగతోనే బీఆర్‌ఎస్ మద్దతు పలికింది. మేం ఎక్కడ బీజేపీతో కొట్లాడతామో ఆయా రాష్ట్రాలకు ఎంఐఎం వచ్చి అంతరాయం కలిగిస్తుంది. ఈ మూడు పార్టీలు భాగస్వాములుగా మారి ప్రజలకు నష్టం చేస్తున్నాయి' అని రాహుల్ పేర్కొన్నారు. సోనియాగాంధీ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూడటం తన కల అన్నారు. మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్‌ను ఇస్తామని, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు.

క్లుప్తంగా...

హెచ్1బీ లాటరీ విధానం రద్దు చేస్తా



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి(38) హెచ్-1బీ వీసా విధానంపై కీలకవ్యాఖ్యలు చేశారు. హెచ్-1బీ వీసాల జారీకి ప్రస్తుతం అనుసరిస్తున్న లాటరీ విధానం కాంట్రాక్టు సర్వీస్ మాదిరిగా ఉందని, సదరు స్పాన్సర్ కంపెనీకే లాభం చేకూర్చుతోందని తప్పుబట్టారు. తాను అధికారంలోకి వస్తే హెచ్-1బీ లాటరీ విధానాన్ని రద్దు చేసి, దాని స్థానంలో ప్రతిభ ఆధారిత వీసా జారీ విధానాన్ని తీసుకువస్తానని ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ ఇమిగ్రాంట్ హెచ్-1బీ వీసాకు భారతీయ ఐటీ నిపుణుల్లో ఎక్కువ డిమాండ్ ఉంది. అమెరికాకు చెందిన టెక్ కంపెనీలు ఈ విధానం ద్వారా ప్రతిభావంతులైన విదేశీ ఉద్యోగులను కొన్ని ప్రత్యేక విభాగాల్లో ఏటా వేల సంఖ్యలో నియమించుకుంటున్నాయి. గతంలో వివేక్ రామస్వామికి చెందిన రొయివంట్ సైన్సెస్ కంపెనీ సైతం హెచ్-1బీ వీసాను 29 సార్లు వాడుకున్నట్లు 'పొలిటికో' పేర్కొంది.

బాలిక ఉసురుతీసిన పోకిరీలు

అంబేడ్కర్‌నగర్(యూపీ): సైకిల్‌పై వెళ్తున్న బాలికను వేధించేందుకు బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆకతాయిలు ప్రయత్నించారు. దుపట్టాను లాగేయడంతో ఆమె అదుపుతప్పి సైకిల్‌పై నుంచి పడిపోయింది. ఆ వెనుకే మరో యువకుడు ఆమెను బైక్‌తో ఢీకొట్టి చంపేశాడు. ఒళ్లుగగుర్పొడిచే ఈ ఘటన యూపీలోని అంబేడ్కర్‌నగర్‌లో చోటుచేసుకుంది. బర్హి అయిదిల్‌పూర్‌కు చెందిన నయన్‌శీ పటేల్(17) ఇంటర్ చదువుతోంది. శుక్రవారం సాయంత్రం సైకిల్‌పై ఇంటికి వెళుతోంది. వేగంగా బైక్‌పై వచ్చిన ఆకతాయిలు ఆమె దుపట్టాను లాగడంతో అదుపుతప్పి కిందపడి పోయింది. ఆ వెనుకే బైక్‌పై వచ్చిన మరో యువకుడు ఆమె మీదుగా బైక్‌ను పోనిచ్చాడు. తీవ్రగాయాలతో బాలిక చనిపోయింది. ఈ అమానుషానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు సెహబాజ్, అర్బాజ్, ఫైసల్ అనే వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను ఆదివారం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా పారిపోయేందుకు యత్నించారు. పోలీసుల కాల్పుల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. మరొకరు పారిపోయేక్రమంలో కిందపడి కాలు విరగ్గొట్టుకున్నాడు. సదరు పోకిరీలు తన కూతుర్ని వేధిస్తున్నారంటూ వారం క్రితమే పోలీసులకు తెలిపినట్లు తండ్రి సభజీత్ వర్మ తెలపడంతో స్టేషన్ హౌస్ ఆఫీసర్ రితేశ్ పాండేను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

అమెరికా భూమికి పగుళ్లు!

పెను ప్రమాదంలో అగ్రరాజ్యం

- ఎక్కడ పడితే అక్కడ నేలపై భారీ బీటలు
- ఒక్కోటీ కిలోమీటర్ల పొడవు, మీటర్ల కొద్దీ వెడల్పు
- పర్యావరణ పెను విధ్వంసం తాలూకు దారుణ దుష్పరిణామమే
- భూగర్భ జలాలను విపరీతంగా తోడేయడమే ప్రధాన కారణం



అగ్రరాజ్యం అమెరికాకు పెను ప్రమాదం ముంచుకొస్తోంది. దేశవ్యాప్తంగా ఎక్కడ పడితే అక్కడ నేలపై పుట్టుకొస్తున్న మైళ్ల కొద్దీ పొడవైన భారీ పగుళ్లు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. పొంచి ఉన్న పెను ఉత్పాతాలకు ఇది బహుశా ముందస్తు సంకేతం మాత్రమే కావొచ్చన్న సైంటిస్టుల హెచ్చరికలు మరింత భయం పుట్టిస్తున్నాయి. పర్యావరణంతో ఇష్టారాజ్యంగా చెలగాటం ఆడితే ఎలా ఉంటుందో ఆ దేశానికిప్పుడు బాగా తెలిసొస్తోంది!

అమెరికా అతి పెద్ద పర్యావరణ విపత్తును ఎదుర్కొంటోంది. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా వాయవ్య రాష్ట్రాల్లో ఎక్కడ పడితే అక్కడ నేల నిట్టనిలువుగా చీలుతోంది. అది కూడా చిన్నాచితకా సైజులో కాదు! మైళ్ల పొడవునా, మీటర్ల వెడల్పులో పగుళ్లిస్తోంది. ఫిషర్స్‌గా పేర్కొనే ఈ చీలికలు దశాబ్దాలుగా భూగర్భ జలాలను విపరీతంగా తోడేస్తున్న తాలూకు దుష్పరిణామమేనని పర్యావరణవేత్తలు మాత్రమే గాక భూభౌతిక శాస్త్రవేత్తలు కూడా నిర్ధారిస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభమంటూ ఇప్పుడు తీరిగ్గా నెత్తీ నోరూ బాదుకుంటున్నారు!

పగుళ్లు ఎక్కడెక్కడ?

- అరిజోనా, ఉటా, కాలిఫోర్నియా రాష్ట్రాల్లో ఇవి మరీ ఎక్కువగా కనిపిస్తున్నాయి.
- ముఖ్యంగా అరిజోనాలో 2002 నుంచే ఈ తరహా పగుళ్లు వస్తున్నాయి. కానీ ఈ మధ్యకాలంలో కనిపిస్తున్న పగుళ్ల పరిమాణంలో గానీ, సంఖ్యలో గానీ ముందెన్నడూ చూడనివి కావడమే కలవరపరుస్తున్న అంశం.

జాతీయ సంక్షోభమే: న్యూయార్క్ టైమ్స్

ఈ పగుళ్లు ఇప్పుడు జాతీయ సంక్షోభం స్థాయికి చేరాయని న్యూయార్క్ టైమ్స్ మీడియా గ్రూప్ పరిశోధక బృందం తేల్చడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. సర్వే ఏం చెప్పిందంటే...

- అమెరికాలో 90 శాతానికి పైగా జల వనరులకు ప్రధాన ఆధారమైన జల ధారలు శరవేగంగా ఎండిపోతున్నాయి.
- ఎంతగా అంటే, అవి కోలుకోవడం, బతికి బట్ట కట్టడం ఇక దాదాపుగా అసాధ్యమే!
- సర్వే బృందం పరిశీలించిన సగానికి సగం చోట్ల భూగర్భ జల ధారలు గత 40 ఏళ్లలో చెప్పలేనంతగా చిక్కిపోయాయి.
- 40 శాతం ధారలైతే కేవలం గత పదేళ్లలో ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయాయి.



> "ఇవి ప్రాకృతికంగా జరుగుతున్న పరిణామాలు కావు. నూటికి నూరు శాతం మనుషుల తప్పిదాలే ఇందుకు కారణం"
> – జోసెఫ్ కుక్, పరిశోధకుడు, అరిజోనా జియాలాజికల్ సర్వే

- వాయవ్య అమెరికావ్యాప్తంగా అతి ప్రధాన మంచినీటి వనరుగా ఉంటూ వస్తున్న కొలరాడో నది కేవలం గత 20 ఏళ్లలో ఏకంగా 20 శాతానికి పైగా కుంచించుకుపోయింది.
- గ్లోబల్ వార్మింగ్ తదితర పర్యావరణ సమస్యలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి.

భూగర్భ జలమే ముఖ్య ఆధారం

మనిషుల నీటి అవసరాలను తీర్చడంలో భూగర్భ జలం కీలకంగా మారింది. ఎంతగా అంటే...

- ప్రపంచ తాగునీటి అవసరాలూ సగం భూగర్భ జలంతోనే తీరుతున్నాయి.
- ఇక 40% సాగునీటి అవసరాలకు ఇదే ఆధారం.
- అయితే, అసలు సమస్య భూగర్భ జలాలను తోడేయడం కాదు. వెనకా ముందూ చూసుకోకుండా విచ్చలవిడిగా తోడేయడమే అసలు సమస్య. అంత వేగంగా భూమిలోకి నీరు తిరిగి చేరడం లేదు.

ఏం జరుగుతోంది?

- భూగర్భం నుంచి నీటిని విచ్చలవిడిగా తోడేయడం నేల కుంగిపోవడానికి దారితీస్తోంది.
- అదే చివరికిలా పగుళ్లుగా బయట పడుతోంది.
- ఫిషర్లుగా పిలిచే ఈ పగుళ్లు సాధారణంగా పర్వతాల మధ్య ప్రాంతాల్లో కనిపిస్తుంటాయి.
- వీటితో ఇళ్లకు, రోడ్లకు, కాల్వలకు, డ్యాములకు తదితరాలకు నష్టం అంతా ఇంతా కాదు.
- చాలాసార్లు ఈ భారీ పగుళ్ల వల్ల ఊహించలేనంతగా ప్రాణ నష్టం కూడా సంభవించవచ్చు. పశు సంపదకు కూడా నష్టం కలగవచ్చు.

– సాక్షి, నేషనల్ డెస్క్

కలవో, లేవో...!

ఏలియన్స్ ఉనికిపై వీడని సందిగ్ధం

- ఎటూ తేల్చని నాసా ఏడాది అధ్యయనం
- అర్థం కాని కొన్ని ఘటనలైతే ఉన్నాయన్న ప్యానల్
- మరిన్ని నిధులు, మరింత పరిశోధన అవసరమని ముక్తాయింపు



ఏలియన్స్. ఎక్స్‌ట్రా టెరిస్ట్రియల్స్. గ్రహాంతరవాసులు.. ఇలా వాళ్లకు ఎన్నెన్నో పేర్లు. వాళ్ల చుట్టూ ఎన్నెన్నో కథలు. వాళ్ల ఉనికిపై ఎన్నెన్నో కథనాలు. వాళ్లు భూమిపైకి వచ్చిపోయేందుకు ఉపయోగిస్తారని చెప్పే ఫ్లయింగ్ సాసర్స్ (ఎగిరే పళ్లాలు) చుట్టూ మరెన్నో పుకార్లు. వాటిని చూశామంటూ గత ఒకట్రెండు శతాబ్దాలలో ఎంతోమంది పత్రికలకు, టీవీలకు ఎక్కారు. కొన్నిసార్లు వినువీధిలో కొన్ని వింత వస్తువులు కెమెరాలకు చిక్కాయి. అవి ఎగిరే పళ్లాలేనని నమ్మిన వాళ్లు, వాటిలో గ్రహాంతరవాసులు వచ్చారని ఇప్పటికీ నమ్ముతున్న వాళ్లు ఎందరో! దాంతో ఈ విషయంపై నాసా ఇటీవల కాస్త గట్టిగానే దృష్టి పెట్టింది. దీన్ని ఇప్పటిదాకా గుర్తించని అసాధారణ దృగ్విషయం (అన్ ఐడెంటిఫైడ్ అనామలస్ ఫినామినా - యూఏపీ)గా పేర్కొంటూ, దీని తాలూకు నిజానిజాలను నిగ్గుదేల్చేందుకు ఒక స్వతంత్ర కమిటీ వేసింది. అది ఏడాది పాటు అన్ని కోణాల్లో పరిశోధన చేసి 33 పేజీల నివేదిక సమర్పించింది. అయితే ఏలియన్స్ గానీ, అవి ప్రయాణించే ఎగిరే పళ్లాలు గానీ ఉన్నాయని గానీ, లేవని గానీ ఇదమిత్థంగా నివేదిక ఎటూ తేల్చకపోవడం విశేషం!

నాసా యూఏపీ ప్యానల్ నివేదిక ముఖ్యాంశాలు

- ఇప్పటిదాకా మా పరిశీలనకు వచ్చిన అసాధారణ దృగ్విషయాల్లో (అన్ ఐడెంటిఫైడ్ అనామలస్ ఫినామినా - యూఏపీ) చాలావాటి అసలు స్వభావాన్ని కచ్చితంగా నిర్ధారించలేకపోయాం.
- ఎగిరే పళ్లాలుగా చెప్పిన వాటికి నిజంగా గ్రహాంతర మూలాలున్నట్టు తేలలేదు.
- వీటిలో చాలావరకు బెలూన్లు, డ్రోన్లు, విమానాలుగా తేలాయి.
- అయితే కొన్ని యూఏపీ కేసులు అప్పటిదాకా మనకు తెలిసిన ఏ దృగ్విషయంతోనూ సరిపోలలేదు.
- ఏలియన్స్, ఎగిరే పళ్లాల విషయంలో ప్రజల్లో నెలకొని ఉన్న అంతులేని ఆసక్తి అర్థం చేసుకోదగిందే. అందుకే ఈ విషయమై ఎలాంటి కొత్త సమాచారం తెలిసినా ఎప్పటికప్పుడు వారితో పంచుకుంటాం.

– సాక్షి, నేషనల్ డెస్క్

> 'ఎగిరే పళ్లాలను గురించి జనాల్లో నెగటివ్ భావజాలం ఎంతగానో పాతుకుపోయింది. ఏలియన్స్ ఉనికి తాలూకు నిజానిజాలను నిర్ధారించేందుకు అత్యంత కీలకమైన డేటాను సేకరించడంలో ఇదే అతి పెద్ద అడ్డంకిగా నిలుస్తోంది'
> – నాసా యూఏపీ అధ్యయన బృందం


> 'ఏలియన్స్ ఉన్నదీ లేనిదీ పక్కాగా తేల్చాలన్నా, దీనిపై లోతుగా పరిశోధన చేయాలన్నా ఇప్పుడున్న వాటికి చాలా భిన్నమైన, సృజనాత్మక శాస్త్రీయ అధ్యయన పద్ధతులు అత్యాధునికమైన శాటిలైట్ టెక్నాలజీ కావాలి. అంతకు మించి, ఈ అంశంపై జనం దృక్కోణంలోనే మౌలికంగా చాలా మార్పు రావాలి'
> – నాసా

నాసాకు యూఏపీ ప్యానల్ సిఫార్సులు

- యూఏపీ సంబంధిత డేటా సేకరణ, విశ్లేషణ కోసం ఒక స్టాండర్డ్ విధానాన్ని ఏర్పాటు చేయాలి.
- యూఏపీలపై అవగాహనను విస్తృతం చేసుకోవడానికి కృత్రిమ మేధ తదితర టెక్నాలజీల సాయం తీసుకోవాలి.
- యూఏపీల అధ్యయనంలో పారదర్శకత, ఇతర దేశాలు, అధ్యయన సంస్థలతో పరస్పర సహకారం చాలా అవసరం.
- యూఏపీ పరిశోధనలకు, డేటా సేకరణ, అధ్యయనం, ప్రభుత్వ, విదేశీ, అంతర్జాతీయ సంస్థలతో మరింత సమన్వయం తదితరాల నిమిత్తం ఈ ప్రాజెక్టుకు నిధులను మరింత పెంచాలి.

'యశోభూమి'కి తరలిరండి

- సినిమా, టీవీ పరిశ్రమకు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు సకల సౌకర్యాలున్నాయ్
- ఢిల్లీలో అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ పిలుపు



కన్వెన్షన్ సెంటర్‌లో విశ్వకర్మ విగ్రహానికి పూజలు చేస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్లలో ఒకటైన ఇండియా ఇంటర్నేషన్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్ 'యశోభూమి' మొదటి దశను ప్రధాని మోదీ ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ఇదే వేదికపై 'పీఎం విశ్వకర్మ' పథకానికి శ్రీకారం చుట్టారు. ఢిల్లీలోని భారత్ మండపం, యశోభూమిలో సకల సౌకర్యాలున్నాయని, వీటిని ఉపయోగించుకోవాలని, ఇక్కడ కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు రావాలని సినిమా, టీవీ పరిశ్రమను, అంతర్జాతీయ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలను ప్రధాని ఆహ్వానించారు. పీఎం విశ్వకర్మ పథకంలో సంప్రదాయ వృత్తి కళాకారులకు, కార్మికులకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. 18 మంది లబ్ధిదారులకు 'విశ్వకర్మ సర్టిఫికెట్లు' అందజేశారు. వారు ఎలాంటి పూచీకత్తు లేకుండానే తక్కువ వడ్డీకే రూ.3 లక్షలదాకా రుణం పొందవచ్చు.

కాన్ఫరెన్స్ టూరిజంకు పెద్దపీట

దేశంలో సదస్సుల పర్యాటకానికి ఉజ్వలమైన భవిష్యతు ఉందని మోదీ స్పష్టం చేశారు. యశోభూమి కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. భారత్‌లో ఈ రంగం విలువ రూ.25,000 కోట్లకుపైగా ఉందన్నారు. అనంతరం 'యశోభూమి ద్వారక సెక్టార్ 25'మెట్రో రైల్వే స్టేషన్‌ను మోదీ ప్రారంభించారు.

ప్రధాని మోదీకి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

ప్రధాని మోదీ 73వ జన్మదినం సందర్భంగా ఆదివారం రాష్ట్రపతి ముర్ము, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధికార బీజేపీ 'సేవా పఖ్వారా'ను ప్రారంభించింది. అక్టోబర్ 2 దాకా ఇది కొనసాగుతుంది.

రూ.13 వేల కోట్లతో 'విశ్వకర్మ' పథకానికి శ్రీకారం

దేశంలో పౌరుల రోజువారీ జీవనంలో విశ్వకర్మల పాత్ర చాలా కీలకమని మోదీ ఉద్ఘాటించారు. ఎంతటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా సమాజంలో వారి స్థానం చెక్కుచెదరని ప్రశంసించారు. రూ.13,000 కోట్లతో పీఎం విశ్వకర్మ పథకాన్ని అమలు చేస్తామని, సంప్రదాయ వృత్తి కళాకారులకు, కార్మికులకు అండగా నిలుస్తామని అన్నారు. ఈ పథకంతో వడ్రంగులు, స్వర్ణకారులు, కమ్మరులు, శిల్పకారులు, కుమ్మరులు, దర్జీలు, తాపీ మేస్త్రీలు, రజకులు, క్షురకులు తదితరులకు మేలు జరుగుతుందన్నారు.

న్యాయ వ్యవస్థ ప్రగతికైనా, వినాశనానికైనా

నిజాయతీయే కీలకం

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు



ఛత్రపతి శంభాజీనగర్: న్యాయ వృత్తిలో నిజాయతీ అత్యంత కీలకమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. 'ప్రజల నమ్మకాన్ని చూరగొన్నప్పుడే న్యాయ వ్యవస్థ, ఆ వృత్తి రాణిస్తాయి. లేదంటే వాటి పయనం సాగేది స్వీయ వినాశనం వైపే' అంటూ కుండబద్దలు కొట్టారు. ఆ నిజాయతీని, నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత న్యాయ వ్యవస్థలో భాగస్వాములైన లాయర్లు మొదలుకుని న్యాయమూర్తుల దాకా అందరి పైనా ఉంటుందన్నారు. ఆదివారం ముంబైలోని మహాత్మా గాంధీ మిషన్ యూనివర్సిటీలో కార్యక్రమంలో ప్రసంగం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'చిన్నవిగా అనిపించే విషయాల్లో మనం రాజీ పడ్డప్పుడే న్యాయ వ్యవస్థ మీద ప్రజలకు నమ్మకం సన్నగిల్లేది' అని సీజేఐ అభిప్రాయపడ్డారు.

ప్రపంచ వారసత్వ జాబితాలోకి శాంతినికేతన్



న్యూఢిల్లీ: నోబెల్ గ్రహీత, విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన పశ్చిమ బెంగాల్‌లోని ప్రఖ్యాత శాంతినికేతన్ విశ్వవిద్యాలయానికి యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో చోటు దక్కింది. యునెస్కో ఆదివారం 'ఎక్స్'లో ఈ మేరకు ప్రకటించింది. 'వారసత్వ కట్టడాల జాబితాలో చోటు దక్కినందుకు శాంతినికేతన్‌కు అభినందనలు'అని పేర్కొంది. బీర్భూమ్ జిల్లాలోని ఈ చారిత్రక నిర్మాణానికి వారసత్వ గుర్తింపు కోసం భారత్ ఎప్పటినుంచో కృషి చేస్తోంది. ఈ విశ్వవిద్యాలయ నగరి పశ్చిమ కోల్‌కతాకు 160 కి.మీ.ల దూరంలో ఉంది. గీతాంజలి కర్త, విశ్వ కవి రవీంద్రుని తండ్రి దేవేంద్రనాథ్ ఠాగూర్ దీన్ని మొదట్లో ఒక ఆశ్రమంగా ప్రారంభించారు. కులమతాలతో నిమిత్తం లేకుండా ఎవరైనా ఇక్కడ ధ్యానం చేసుకోవచ్చు. శాంతినికేతన్ ప్రాంగణంలో చిన్న విద్యా సంస్థగా రవీంద్రుని ఆధ్వర్యంలో మొదలైన విశ్వ భారతి నేడు దేశంలో అతి పెద్ద విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఎదిగింది. హ్యూమానిటీస్, సోషల్ సైన్స్, ఫైన్ ఆర్ట్స్, సంగీతం, అగ్రికల్చరల్ సైన్స్, రూరల్ రీ కన్‌స్ట్రక్షన్ వంటి వాటిలో ఎన్నెన్నో కోర్సులు అందిస్తోంది. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ, మరో నోబెల్ గ్రహీత అమర్త్య సేన్ వంటి మహామహులు ఎందరో ఈ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులే.

ఒడిశాలో 180 మందికి స్క్రబ్ టైఫస్

భువనేశ్వర్: కేరళలో నిఫా వైరస్ మాదిరిగానే ఒడిశాలో స్క్రబ్ టైఫస్ ప్రజలను వణికిస్తోంది. ఒడిశాలో స్క్రబ్ టైఫస్ బాధితుల సంఖ్య ఆదివారానికి 180కి చేరుకుంది. ఇప్పటివరకు సేకరించి పంపిన 59 శాంపిళ్లలో 11 స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా వెల్లడైనట్లు ఆరోగ్య శాఖాధికారులు వెల్లడించారు. మొత్తం 180 మంది బాధితుల్లో ఇతర రాష్ట్రాల వారు 10 మంది ఉన్నారన్నారు. సుందర్‌గఢ్, బర్గఢ్ జిల్లాల్లో కేసులు ఎక్కువగా బయటపడుతున్నాయని అన్నారు. ఈ వ్యాధితో రాష్ట్రంలో ఇప్పటివరకు ఏడుగురు చనిపోయారు. ఒక రకమైన లార్వా పురుగులు కుట్టడం వల్ల ఇది సోకుతుంది. పొలాలు, అటవీ ప్రాంతాలకు దగ్గర్లోని వారు తొందరగా ఈ వ్యాధికి గురవుతారు. జ్వరం, పురుగు కుట్టిన చోట చర్మంపై ఎశ్చర్ అనే నల్ల మచ్చ ఏర్పడటం దీని లక్షణాలు.

బ్రెజిల్‌లో విమానం కూలి..14 మంది మృతి

రియో డి జనీరో: బ్రెజిల్‌లోని అమెజాన్ అడవుల్లో చిన్న ప్యాసింజర్ విమానం కూలిన ఘటనలో అందులోని మొత్తం 14 మందీ దుర్మరణం చెందారు. మనాస్ నుంచి బయలుదేరిన విమానం బర్సెలోస్ సమీపంలో కూలిందన్నారు. ప్రమాద సమయంలో ఆ ప్రాంతంలో భారీగా వర్షం కురుస్తోందన్నారు. మృతుల్లో 12 మంది ప్రయాణికులు కాగా, ఇద్దరు విమాన సిబ్బంది అని అమెజొనాస్ రాష్ట్ర గవర్నర్ విల్సన్ లిమా చెప్పారు.



చిత్రంలో కనిపిస్తున్న ఈ జంతువు పూర్తిగా కుక్క కాదు, పూర్తిగా నక్క కాదు. రెండింటి లక్షణాల కలబోత. 2021లో బ్రెజిల్‌లో కారు ఢీకొని గాయపడగా, ఆసుపత్రికి తరలించారు. ఇది నక్క, కుక్క మధ్య సంపర్కం వల్ల పుట్టిన హైబ్రిడ్ జంతువుగా గుర్తించారు. ఇలా జరగడం అత్యంత అరుదు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి డాగ్-ఫాక్స్ హైబ్రీడ్ 'డాగ్ జిమ్'గా తేల్చారు. దురదృష్టవశాత్తూ కొన్ని నెలల క్రితమే మృతి చెందింది.

ఆర్మీ జవాన్ కిడ్నాప్.. హత్య

ఇంఫాల్: మణిపూర్ రాష్ట్రంలో సాయుధ ముఠా ఒకటి ఆర్మీ జవాన్‌ను పొట్టనబెట్టుకుంది. రాష్ట్రంలోని ఇంఫాల్ పశ్చిమ జిల్లా తరుంగ్ గ్రామానికి చెందిన సిపాయి సెర్తో థంగ్‌థంగ్ కొమ్.. కంగ్‌పొక్పి జిల్లా లీమఖోంగ్‌లోని ఆర్మీ డిఫెన్స్ సెక్యూరిటీ ఫోర్స్‌కు చెందిన ప్లటూన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఆయన సెలవుపై స్వగ్రామానికి చేరుకున్నారు. శనివారం ఉదయం ఇంట్లో ఉన్న ఆయనను గుర్తు తెలియని సాయుధులు తుపాకీతో బెదిరించి తమ వాహనంలో తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం ఖునింగ్‌థెక్ గ్రామ సమీపంలో నుదుటిపై బుల్లెట్ గాయంతో ఆయన విగతజీవిగా పడి ఉండగా స్థానికులు గుర్తించారు.

పాకిస్తాన్‌పై పీఓకే కన్నెర్ర

- చుక్కలనంటుతున్న కరెంటు బిల్లులపై జనం ఆగ్రహ జ్వాలలు

కోట్లి (పీఓకే): పాకిస్తాన్‌పై పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే) వాసులు కన్నెర్రజేస్తున్నారు. దశాబ్దాలుగా పాక్ తమపై సవతి తల్లి ప్రేమ చూపుతోందంటూ మండిపడుతున్నారు. చివరికి కరెంటు బిల్లుల మదింపులో కూడా ఈ వివక్ష భరించలేనంత ఎక్కువగా ఉందంటూ వాపోతున్నారు. 'మా ప్రాంతం నుంచే ఏకంగా 5,000 మెగావాట్ల కరెంటు ఉత్పత్తి అవుతోంది. దాన్నంతటినీ తరలించుకుపోయి దేశమంతటికీ వాడుకుంటున్నారు. బిల్లుల విషయానికి వచ్చేసరికి ప్రధాన భూభాగంలో వారికి తక్కువగా, మాకు భరించలేనంత ఎక్కువగా వేస్తున్నారు. ఇది మా పట్ల సహించరాని అన్యాయం' అంటూ ఆక్రోశిస్తున్నారు. అది కాస్తా కొద్ది రోజులుగా ఆగ్రహంగా మారి కట్టలు తెంచుకుంటోంది. భారీ కరెంటు బిల్లులకు వ్యతిరేకంగా జనం నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఒక్క కోట్లి జిల్లాలోనే కేవలం ఒక్క నెలలో రూ.139 కోట్ల బిల్లులు వచ్చాయని ప్రముఖ స్థానిక నేత తౌకీర్ వాపోయారు. 'అందులో కేవలం రూ.19 కోట్ల బిల్లులు కట్టారు. వచ్చే నెల నుంచి అవి కూడా కట్టేది లేదు' అని అన్నారు. తమకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.



పీఓకేలో స్థానికుల బైక్ ర్యాలీ

నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాలు పాత భవనంలో మొదలై మంగళవారం గణేశ్ చతుర్థి సందర్భంగా కొత్త భవనంలోకి మారనున్నాయి. సమావేశాల్లో తొలిరోజు పార్లమెంట్‌లో 75 ఏళ్ల ప్రయాణంపై చర్చతో పాటు పలు కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి.

ప్రత్యేక చర్చ సహా కీలక బిల్లులు...

సమావేశాల్లో ప్రధానంగా డిసెంబర్ 9, 1946న తొలిసారి పార్లమెంట్ సమావేశమైంది. అది మొదలు 75 ఏళ్ల ప్రయాణంపై తొలిరోజు చర్చ జరగనుంది. ఈ 75 ఏళ్ల ప్రస్థానంలో పార్లమెంట్ విజయాలు, అనుభవాలు, జ్ఞాపకాలపై సభ్యులు మాట్లాడనున్నారు. దీంతో పాటే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకానికి సంబంధించిన బిల్లును కూడా ప్రభుత్వం సభ ముందుకు తేనుంది. గత వర్షాకాల సమావేశాల్లోనే ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దీంతో పాటే లోక్‌సభలో 'ది అడ్వొకేట్స్ (సవరణ) బిల్లు, 2023', 'ది ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు, 2023'ఉన్నాయి. 'ది పోస్టాఫీస్ బిల్లు, 2023'నూ లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. 'వన్ నేషన్-వన్ ఎలక్షన్', మహిళా రిజర్వేషన్ బిల్లు, ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) బిల్లులు సైతం ఈ సమావేశాల్లోనే తెస్తారనే ప్రచారం జరుగుతున్నా కేంద్ర వర్గాలు ధ్రువీకరించడం లేదు.

నిరుద్యోగం..ద్రవ్యోల్బణంపై విపక్షాల పట్టు..

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో పాల్గొనేందుకు ఇండియా బ్లాక్‌కు చెందిన మొత్తం 24 పార్టీలు అంగీకరించాయి. చైనా దురాక్రమణ, కుప్పకూలుతున్న ఆర్థిక వ్యవస్థ, పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అదానీ కంపెనీ అక్రమాలు సహా పలు కీలక అంశాలను సమావేశాల్లో చర్చించాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ ఇదివరకే ప్రధాని మోదీకి లేఖ రాశారు.

పార్లమెంట్ నూతన భవనంపై జాతీయ జెండా

పార్లమెంట్ నూతన భవనం గజద్వారంపై ఆదివారం సాయంత్రం ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన వెంట లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉన్నారు. అంతకుముందు ధన్‌ఖడ్, బిర్లాలకు సీఆర్‌పీఎఫ్ పార్లమెంట్ డ్యూటీ గ్రూప్ బలగాలు వేర్వేరుగా గౌరవవందనం సమర్పించాయి.

రేపు ఎంపీల ఫొటో సెషన్

ఎంపీలందరికోసం మంగళవారం ప్రత్యేక ఫొటో సెషన్ ఏర్పాటు చేశారు. పార్లమెంట్ సభ్యులంతా మంగళవారం ఉదయం 9.30 గంటలకు జరిగే గ్రూప్ ఫొటో సెషన్‌కు రావాల్సిందిగా లోక్‌సభ సెక్రటేరియట్ కోరింది.



మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టాల్సిందే

అఖిలపక్షం భేటీలో రాజకీయ పార్టీల పట్టు

సోమవారం నుంచి మొదలయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని పలు రాజకీయ పార్టీలు ప్రభుత్వాన్ని గట్టిగా కోరాయి. అయితే, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రత్యేక సెషన్ నేపథ్యంలో ఆదివారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్షం భేటీకి పలు రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఈ సమావేశంలోనే సభ ముందుంచాలని పలువురు నేతలు కోరారు. బిల్లు ఏకాభిప్రాయంతో ఆమోదం పొందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, కొన్ని ప్రాంతీయ పార్టీలు మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీలు, ఎస్సీలకు ప్రత్యేక కోటా కావాలంటూ డిమాండ్ చేస్తుండటం అడ్డంకిగా మారింది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
సోమవారం : 18 : సెప్టెంబర్ : 2023

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు
అన్నాడీఎంకే మాజీ మంత్రిపై కేసు

కొరుక్కుపేట: వాలాథికులంలో జరిగిన ఏఐఏడీఎంకే సమావేశంలో డీఎంకే నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అన్నాడీఎంకే మాజీ మంత్రి సీటీ చెల్లపాండిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 15వ తేదీ రాత్రి వాలాథికులంలో ఏఐఏడీఎంకే సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో చెల్లపాండియన్ మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి, సీఎం ఎం.కె.స్టాలిన్, మంత్రులను దూషించారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని వాలధికులం పారిష్ అసోసియేషన్ కార్యదర్శి వేలుచ్చామి వాలధికులం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మాజీ మంత్రిపై 294(బి), 153(ఎ), 505(2) అనే మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

మెరీనాలో క్లీన్ డ్రైవ్



కార్యక్రమంలో కమిషనర్ రాధాకృష్ణన్

సాక్షి, చెన్నై : చెన్నై మెరీనా బీచ్‌లో మద్రాసు నైట్స్ రౌండ్ టేబుల్, లేడిస్ సర్కిల్ 200 సంస్థల నేతృత్వంలో ఆదివారం శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడున్న చెత్త చెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమాన్ని చెన్నై కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్ ప్రారంభించారు. ఇండియన్ కోస్టుగార్డ్ డీజీ సతీష్‌కుమార్ నేతృత్వంలోని బృందం కూడా ఈ క్లీనింగ్ కార్యక్రమంలో పాల్గొన్నాయి. మెరీనా బీచ్ పరిసరాలను కొన్ని కిలో మీటర్లు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విజయకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ మాట్లాడుతూ తరచూ మెరీనా తీరాన్ని ఈ రకంగా క్లీన్ చేయడం ద్వారా పరిసరాలు మరింత శుభ్రంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఇక్కడకు నిత్యం వచ్చే వేలాది మంది సందర్శకులు తాము తీసుకొచ్చే వ్యర్థాలను చెత్త కుండీలలో వేయడం అలవాటు చేసుకోవాలని కోరారు. సముద్ర తీరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు.

తెన్ పెన్నై నదిలో 169 తుపాకీ తూటాలు లభ్యం

తిరువొత్తియూరు: కడలూరు తెన్ పెన్నై నదిలో 169 తుపాకీ తూటాలు లభ్యమయ్యాయి. వీటిని ఎవరు పడేశారు అనే విషయంపై పోలీసు విచారణ సాగుతోంది. వివరాలు.. కడలూరు జిల్లా కొత్త కలెక్టర్ కార్యాలయం ఎదురుగా తెన్‌పెన్నై నదిలో గుంతామేడు వద్ద నేల వంతెన ఉంది. ప్రస్తుతం నదిలో నీరు తక్కువగా ప్రవహిస్తోంది. ఈ వంతెన సమీపంలో శనివారం సాయంత్రం పుదుచ్చేరి రాష్ట్రం గుంతమేడు ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలురు చేపలు పట్టేందుకు వెళ్లారు. వారు బురదలో కాలు పెట్టిన సమయంలో వారికి ఏదో లోహ వస్తువు తగిలినట్లు ఉండడంతో అక్కడ తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో 169 తూటాలు లభ్యమయ్యాయి. డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ ప్రభు, పుదునగర్ ఇన్‌స్పెక్టర్ అక్కడికి వెళ్లి తూటాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకర్లకు తంగం హెచ్చరిక

సాక్షి, చెన్నై: మహిళా హక్కు పథకం ద్వారా బ్యాంక్‌లలో జమ అయ్యే రూ. 1000 నగదును పలు బ్యాంకర్లు ఖాతాదారులకు ఇవ్వక పోవడం వివాదానికి దారి తీసింది. ఇందులో పాత బాకాయిలను జమ చేయడం, సేవా పన్ను వసూలు చేయడం వంటి పరిణామాలు చోటు చేసుకోవడంతో ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు తీవ్ర హెచ్చరికలు చేశారు. కలైంజ్ఞర్ మహిళా హక్కు పథకం నుంచి జమయ్యే రూ. 1000 నగదును సంబంధిత ఖాతాదారులకు అందజేయాలని, దీనిని పాత బకాయిలకు లేదా, సేవా పన్నులకు జమ చేసినట్లు ఇప్పటికే అనేక బ్యాంక్‌లపై ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఇక నైనా ఈ పథకం మొత్తాన్ని లబ్ధిదారులకు బ్యాంకర్లు అందజేయాలని లేని పక్షంలో ఆయా బ్యాంక్ ఖాతాలను లబ్ధిదారుల వద్ద రద్ద చేయించి, మరో బ్యాంక్‌లలో ఖాతాలను తామే ఏర్పాటు చేయిస్తామని హెచ్చరించారు. అలాగే సంబంధిత బ్యాంక్‌లపై చరలు తప్పదని హెచ్చరించారు. రూ. 1000 నగదును ఏదేని బ్యాంకర్లు సేవా పన్ను, ఇతర సేవలకు జరిమానాగా వసూలు చేసి ఉంటే 1100 టోల్ ఫ్రీకి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆరోగ్య కేంద్రంలో మంత్రి తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి

సాక్షి, చెన్నై : శ్రీపెరంబదూరు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆదివారం ఉదయం ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. వైద్యులు ఎవ్వరూ ఆస్పత్రిలో లేకపోవడంతో అందరిపై శాఖ పరంగా చర్యలకు ఆదేశించారు. వివరాలు.. మంత్రి సుబ్రమణియన్ ఇటీవల కాలంలో ఆరోగ్య కేంద్రాలు, నగర శివార్లలోని ఆస్పత్రులను తనిఖీలు చేస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం కాంచీపురం జిల్లా శ్రీపెరంబదూరు సమీపంలోని మధుర మంగళం ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. అక్కడ కేవలం ఒక్క నర్సు మాత్రమే విధుల్లో ఉన్నారు. వైద్యులు విధులకు హాజరై సంతకాలు పెట్టి బయటకు వెళ్లి ఉండడం వెలుగు చూసింది. దీంతో సంతకం పెట్టి వెళ్లిన వైద్యులకు స్వయంగా మంత్రి ఫోన్‌చేసి ఎక్కడున్నారో ఆరా తీశారు. వారు సరైన సమాధానం ఇవ్వక పోవడంతో మంత్రి ఆగ్రహానికి లోనయ్యారు. రోగులతో మాట్లాడారు. వైద్యులు సక్రమంగా స్పందించడం లేదని రోగులు ఫిర్యాదు చేశారు. చివరకు ఆ జిల్లా వైద్యాధికారిని మంత్రి పిలిపించారు. విధుల్లో లేని వారిపై శాఖ పరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

లంబోదరుడు.. భక్త వరదుడు

రాష్ట్రంలో వినాయక చవితి సందడి నెలకొంది. వాడవాడలా సోమవారం గణపయ్య విగ్రహాలు కొలువు దీర్చి భక్తిశ్రద్ధలతో పూజలు జరుపుకునేందుకు ప్రజలు సిద్ధయ్యారు. పండుగను పురస్కరించుకుని ఆదివారం రాష్ట్రంలోని మార్కెట్లలో రద్దీ నెలకొంది. డిమాండ్ పెరగడంతో పూజా సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

- రాష్ట్రంలో 'చవితి' సందడి
- పూజా సామగ్రి కొనుగోలుతో మార్కెట్ల కిటకిట
- నేడు వాడవాడలా కొలువుదీరనున్న బొజ్జ గణపయ్యలు



ప్రతిమకు మెరుగులు దిద్దుతున్న కార్మికురాలు



చెన్నైలో కిటకిటలాడుతున్న మార్కెట్

సాక్షి, చెన్నై: వినాయక చవితిని ఘనంగా నిర్వహించుకునేందుకు రాష్ట్రప్రజలు సిద్ధమయ్యారు. ఈసారి వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో ఇంటిల్లి పాది ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకునేందుకు ఇప్పటికే స్వస్థలాలకు చేరుకున్నారు. ఆదివారం రాష్ట్రంలోని చిన్నా, పెద్ద మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. జన సంచారం అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో, రోడ్ల వెంబడి దుకాణాలు వెలిశాయి. బంకమన్నుతో సిద్ధం చేసిన, రంగు రంగులతో ముస్తాబైన వినాయకుడి ప్రతిమల్ని, పూజా వస్తువుల్ని కొనుగోలు చేయడానికి జనం మార్కెట్ల వైపుగా తరలివచ్చారు. వినాయకుడి విగ్రహాలకు, బొమ్మల ధరలకు రెక్కలొచ్చాయి. ఇక పూజా కైంకర్య వస్తువుల ధరలు అదేబాటలో సాగాయి. ధరలు భారీగా పెరిగినా తమతమ స్తోమతకు తగ్గట్టుగా పూజాసామగ్రిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబడ్డారు. ఉండ్రాలు, గుగ్గిల్లు తయారు చేసి బొజ్జగణపయ్యకు నైవేద్యంగా సమర్పించేందుకు సిద్ధం అయ్యారు. అదే సమయంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో సిద్ధం చేసిన వినాయక విగ్రహాల కొలువును నిషేధించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో అధికారులు దూకుడుగా ముందుకెళ్లారు. వినాయక విగ్రహాలను తయారు చేసే ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. కొన్నిచోట్ల ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను సీజ్ చేశారు.





మార్కెట్లో కొలువు తీరిన గణపయ్య విగ్రహాలు



వినాయక స్వామి ప్రతిమలతో యువతులు

ఆలయాల్లో కొత్త శోభ..

భక్తుల దర్శనార్థం ఆయా ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేకువ జాము నుంచే ఆలయాల్లో విశేష కార్యక్రమాలు చేపట్టనున్నారు. తిరుచ్చిలో ప్రసిద్ధి చెందిన ఉచ్చి పిళ్లయార్ ఆలయం, కారైకుడి పిళ్లయార్ పట్టిలోని కర్పగ వినాయగర్ ఆలయం, తిరువారూర్ జిల్లా పూనతోట్టంలోని ఆది వినాయగర్, మదురైలోని ముక్కుర్ని వినాయగర్, తిరువయ్యారు, చిదంబరం, తంజావూరు, కోయంబత్తూరు, కుంబకోణంలోని అతిపెద్ద గణపయ్య ఆలయాల్లో ప్రత్యేక వేడుకలు ప్రారంభం కానున్నాయి. తిరుచ్చి ఉచ్చి పిళ్లయార్ ఆలయంలో చవితి ఉత్సవాలు కోలాహలంగా సాగనున్నాయి.

నిబంధనల మేరకు..

హిందూ మక్కల్ కట్చి, హిందూ మున్నని, శివసేన, బీజేపీ నేతృత్వంలో వాడవాడలా వేలాది విగ్రహాలు కొలువు దీరనున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా 5 నుంచి 10 అడుగుల వరకు విగ్రహాలను కొలువు దీర్చనున్నారు. ఇతర మతస్తుల మనో భావాలు దెబ్బ తినకుండా, ట్రాఫిక్‌కు ఆటంకాలు కలిగించకుండా ఉండే రీతిలో విగ్రహాల ఏర్పాటుకు పోలీసులు అనుమతి ఇచ్చారు. అలాగే, విగ్రహాల కోసం ఏర్పాటు చేసిన స్టేజీలు, పందిళ్లు, అలంకరణ సామగ్రి అగ్ని ప్రమాదాలకు గురికాకుండా రక్షణ చర్యలు తీసుకున్నారు. ఇక, లక్షలకు పైగా పెద్దసంఖ్యలో విగ్రహాలు కొలువు దీరనున్నడంతో రాష్ట్ర పోలీసు యంత్రాంగం భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల విగ్రహాలు, చెన్నైలో ఐదు నుంచి ఏడు వేలకు పైగా విగ్రహాల ప్రతిష్ఠ, పూజలకు నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

ప్రముఖుల శుభాకాంక్షలు

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు పుదుచ్చేరి ఎల్జీ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, మాజీ సీఎంలు పళనిస్వామి , పన్నీరు సెల్వం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, కో- ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, అమ్మమక్కల్ మున్నేట్ర కళగం నేత దినకరన్, తమిళ మానిల కాంగ్రెస్ నేత జీకే వాసన్, ఎస్ఎంకే నేత శరత్‌కుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ ఆటంకాలు తొలగి విజయాలు వరించాలని వేడుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా నిఘా కట్టుదిట్టం

గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో ఐఎస్ఐఎస్ మద్దతుదారులు చాప కింద నీరులా సాగిస్తున్న వ్యవహారాలు వెలుగులోకి రావడంతో నిఘాను మరింత పటిష్టం చేయాలనే ఆదేశాలు జారీ అయ్యాయి. శనివారం కూడా రాష్ట్రంలో 30 చోట్ల ఎన్ఐఏ సోదాలు విస్తృతంగా జరిగాయి. వినాయక చవితితో అలజడి సృష్టించేందుకు ఏదైనా కుట్ర జరిగినా తిప్పి కొట్టేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. సిబ్బంది అందరూ తప్పనిసరిగా విధుల్లో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసే చోట్ల నిర్వాహకుల సహకారంతో భద్రతా కమిటీలు ఏర్పాటు చేశారు. చిన్న చిన్న విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాల్లో నిర్వాహకులే భద్రతా చర్యలు తీసుకోవాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది సిబ్బంది భద్రతా విధుల్లోకి పోలీసు యంత్రాంగం దించింది. ఇక చెన్నైలో 15 వేల మందితో భద్రతా చర్యలు తీసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాలతో పాటుగా మరి కొన్నిచోట్ల విగ్రహాల ఏర్పాటుకు పోలీసులు అనుమతి నిరాకరించిన దృష్ట్యా, అక్కడ ఆజ్ఞల్ని ఉల్లంఘించి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కొందరు నిర్వాహకులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

చెన్నై శివార్లలో కుండపోత వర్షం

- ట్రాఫిక్ కష్టాలు
- 38 విమాన సేవలకు ఆటంకం
- రోడ్లపై పోటెత్తిన వర్షపునీరు



తాంబరం రైల్వేస్టేషన్ వద్ద నిలిచిన వర్షపు నీరు

సాక్షి, చెన్నై : మహానగరం చెన్నై శివారు ప్రాంతాల్లో శనివారం రాత్రంతా కుండ పోత వర్షం పడింది. ఇక చెన్నై విమానాశ్రయ పరిసరాల్లో భారీ వర్షం కారణంగా విమానాల సేవలకు తీవ్ర ఆటంకం నెలకొంది. పలు మార్గాలలో వర్షపు నీరు రోడ్లపై వరదలా పారడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. గత కొద్ది రోజులుగా చెన్నై, శివారు జిల్లాల్లో రాత్రుల్లో వర్షం పడుతున్న విషయం తెలిసిందే. శనివారం రాత్రి తొమ్మిది గంటల నుంచి వర్షం పడింది. వేకువ జామున రెండు గంటల వరకు వర్షం శివారు ప్రాంతాల్లో వరుణ బీభత్సం కొనసాగింది. పల్లావరం, క్రోంపేట, తాంబరం, పెరుంగళత్తూరు, వండలూరు, కిలాంబాక్కం , ముడిచ్చూరు, పడ్డపై మార్గాల్లో రోడ్లపై వరద పోటెత్తడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వండలూరు నుంచి కిలాంబాక్కం మీదుగా చెంగల్పట్టు వైపు మార్గంలో తీవ్ర ట్రాఫిక్ జాంతో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వాహనాలు ఎక్కడి వాహనాలు అక్కడే ఆగాయి. ఉరుముల మెరుపుల వాన ఉదయం వరకు కొనసాగింది. ఈ వర్షం కారణంగా చెన్నైలో 38 విమాన సేవలకు ఆటంకం ఏర్పడింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన విమానాలు ల్యాండింగ్ కోసం గాల్లో చక్కర్లు కొట్టాయి. టేకాఫ్ తీసుకోవాల్సిన మరెన్నో విమానాలు గంటల తరబడి ఆలస్యంగా బయలుదేరి వెళ్లాయి. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలలో చేరిన నీటిని ఆదివారం ఉదయాన్నే ఆగమేఘాలపై అధికారులు తొలగించారు. ఇక కాంచీపురం, అరక్కోణం, తిరుత్తణి పరిసరాల్లో భారీ వర్షం కురిసింది.

తమిళిసై కాన్వాయ్‌లో ప్రమాదం

సాక్షి, చెన్నై : పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కాన్వాయ్‌లో శనివారం రాత్రి స్వల్ప ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. చెన్నై పాండిబజార్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి తమిళిసై హాజరయ్యారు. అనంతరం రాత్రి విరుగంబాక్కం నివాసానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గం మధ్యలో తేనాంపేట మీదుగా అన్నాసాలైలోకి వెళ్తుండగా ముందుగా వెళ్తున్న వాహనం హఠాత్తుగా ఆగింది. దీంతో తమిళిసై భద్రతా వాహనం ఆ కారును ఢీకొంది. స్వల్పగాయాలతో బయటపడ్డ కాన్వాయ్‌లోని భద్రతా సిబ్బంది ఆ కారులో ఉన్న వ్యక్తిని మందలించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే, ఆ కారును కొడుంగయూరుకు చెందిన సయ్యద్ ఇమ్రాన్ (37) నడుపుతున్నట్లు తేలింది. దీంత అతడ్ని రాత్రంతా పోలీసులు విచారించారు. ముందుగా వెళ్లిన వాహనం హఠాత్తుగా బ్రేక్ కొట్టడంతో తానూ వేయాల్సి వచ్చిందని ఇమ్రాన్ తెలిపారు. ఇక తన వాహనాన్ని ఢీ కొనడమే కాకుండా తనపై కాన్వాయ్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని ఆరోపించాడు.

నేడు ఢిల్లీకి అఖిలపక్షం



కావేరి నది

సాక్షి, చెన్నై: కావేరి జలాల సాధన లక్ష్యంగా రాష్ట్ర నీటి పారుదల శాఖమంత్రి దురై మురుగన్ నేతృత్వంలో 12 మంది ఎంపీల బృందం రంగంలోకి దిగింది. ఇందులో డీఎంకే, అన్నాడీఎంకే, సీపీఎం, సీపీఐ, పీఎంకే, వీసీకే, ఎండీఎంకే తదితర పార్టీల ఎంపీలు ఉన్నారు. కావేరి జలాలను విడుదల చేయబోమని కర్ణాటక తేల్చి చెప్పడంతో ఇక కేంద్రంపై ఒత్తిడికి అఖిలపక్షాన్ని డీఎంకే రంగంలోకి దించేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. శనివారం ఇందుకు సంబంధించిన ప్రకటనను సీఎం స్టాలిన్ చేశారు. ఢిల్లీ వెళ్లి కేంద్ర జల శక్తి మంత్రి షెకావత్‌పై ఒత్తిడి తీసుకు రానున్నామని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఆదివారం సీఎం విడుదల చేసిన ప్రకటనలో ఢిల్లీ వెళ్లనున్న ప్రత్యేక బృందంలో ఉన్న ఎంపీల వివరాలను ప్రకటించారు.

అన్నాడీఎంకే సైతం..

కావేరి జల వ్యవహారం రాష్ట్రంలో డెల్టా జిల్లాల రైతుల జీవన్మరణ సమస్య అన్న విషయం తెలిసిందే. ఈ ఏడాది నీరు విడుదల కాని పక్షంలో వేలాది మంది రైతులు రోడ్డున పడే పరిస్థితి. ఇప్పటికే వేలాది ఎకరాల కరువై వరి పంట ఎండి పోయింది. మరెన్నో వేలాది పంటలు కరిగేలోపు నీళ్ల తెప్పించాల్సిన అవసరం పాలకులకు ఏర్పడింది. ఇందుకు డీఎంకే మిత్రపక్షాలే కాదు, ప్రతి పక్ష పార్టీలు అన్నాడీఎంకే, పీఎంకే , తమిళ మానిల కాంగ్రెస్‌లు స్పందించాయి. రాష్ట్ర నీటి పారుదల శాఖమంత్రి దురై మురుగన్ నేతృత్వంలో సోమవారం ఢిల్లీ వెళ్లనున్న రాష్ట్ర ఎంపీల బృందంలోపై పార్టీలు కూడా ఉన్నాయి. ఈ బృందంలో మొత్తం 12 మంది ఎంపీలు ఉన్నారు. డీఎంకే తరపున ఆ పార్టీ పార్లమెంటరీ నేత టీఆర్‌బాలు, అన్నాడీఎంకే రాజ్య సభ సభ్యులు తంబిదురై, ఎస్ చంద్రశేఖరన్, సీపీఐ సుబ్బరాయన్, సీపీఎం పీఆర్ నటరాజన్, ఎండీఎంకే వైకో, వీసీకే తోళ్ తిరుమావళవన్, పీఎంకే అన్బుమణి రాందాసు, తమిళమానిల కాంగ్రెస్ జీకే మణి, ఇండియన్ యూనియన్‌ముస్లీం లీగ్‌నవాజ్ ఖని, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి ఎంపీ చిన్న రాజ్‌లు ఈ బృందంలో ఉన్నారు. అధికార, మిత్ర పక్షం, ప్రతిపక్ష పార్టీలన్నీ సోమవారం ఉదయం చెన్నై నుంచి ఢిల్లీకి వెళ్లనున్నారు. కేంద్ర జల వనరుల శాఖమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో భేటీ కానున్నారు. తమిళనాడుకు నీటిని విడుదల చేయాల్సిందేనని కర్ణాటకపై ఒత్తిడి తీసుకురానున్నారు. ఈ ప్రయత్నం విఫలమైన పక్షంలో సుప్రీంకోర్టు ద్వారా న్యాయ పోరాటానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది.

తక్కువ ఎత్తులో హెలికాప్టర్ చక్కర్లు

- స్థానికుల భయాందోళన

కొరుక్కుపేట: తిరునెల్వేల్లి పాళయంగొట్టై ఎన్‌జీఓ కాలనీ ప్రాంతంలో ఐఎన్ఎస్ కట్టబొమ్మన్ నేవల్ బేస్‌కు చెందిన క్యాంపస్ ఏరియా రెడ్డియార్‌పట్టిపై హెలికాప్టర్ తక్కువ ఎత్తులో దూసుకెళ్లి బీభత్సం సృష్టించింది. చాలా మంది సెల్‌ఫోన్‌లలో హెలికాప్టర్‌ను వీడియోలు, ఫొటోలు తీశారు. ఆదివారం హెలికాప్టర్ ఈ ప్రాంతంలో రెండుసార్లు తక్కువ ఎత్తులో ఎగిరింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

దేశ రక్షకుడు మోదీ



హెల్మెట్లను అందజేస్తున్న కేంద్ర మంత్రి

సాక్షి, చెన్నై : మనదేశాన్ని రక్షించేందుకు అవతరించిన మహానాయకుడు ప్రధాని నరేంద్రమోదీ అని కేంద్ర మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాల కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ 73వ జన్మదినాన్ని పురస్కరించుకుని చెన్నైలో బీజేపీ జాలర్ల విభాగం నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి పురుషోత్తం రూపాల హాజరయ్యారు. చెన్నై పట్టినంబాక్కం సమీపంలో జరిగిన కార్యక్రమంలో ద్విచక్ర వాహన దారులు 373 మందికి హెల్మెట్లను అందజేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రతి ఒక్కరూ హెల్మెట్లు ధరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పురుషోత్తం రూపాల మాట్లాడుతూ, వాహనదారులకు హెల్మెట్ రక్షని, దేశానికి ప్రధాని నరేంద్ర మోదీ రక్షకుడు అని వ్యాఖ్యానించారు. దేశానికి ప్రధాని లాంటి నాయకుడు అవసరమని, ఆయన అందిస్తున్న సేవలు అజరామరం అని కొనియాడారు. ప్రజాహిత పాలనతో ముందుకెళ్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి రానున్న ఎన్నికలలో తిరుగు లేదని, ప్రజలు మళ్లీ ఆయనకు పట్టం కట్టడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. జాలర్ల సంక్షేమాన్ని కాంక్షిస్తూ కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని వివరించారు. ఈ ఏడాది రూ. 35 వేల కోట్లు జాలర్ల అభ్యున్నతికి కేటాయించినట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళని స్వామి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే, ప్రధాని జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో పలుచోట్ల బీజేపీ నేతృత్వంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా సాగాయి.

పెరియార్‌కు ఘన నివాళి

- ఘనంగా ద్రవిడ సిద్ధాంతకర్త 145వ జయంతి



నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్



అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళని స్వామి



మంత్రులు

సాక్షి, చెన్నై: ద్రవిడ సిద్ధాంతకర్త పెరియార్ జయంతి వేడుక వాడవాడలా ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్ర పటాలకు నేతలు పుష్పాంజలి ఘటించారు. తమిళుల నాట పెరియార్ గురించి తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. జాతీయ పార్టీలకు భిన్నంగా 1917లో బ్రహ్మణేతరులతో కూడిన దక్షిణ భారత సంక్షేమ సంఘాన్ని ఈవీ రామస్వామి నాయకర్ (పెరియార్) ఏర్పాటు చేశారు. 1944లో సేలం వేదిగా జరిగిన సభతో దక్షిణ భారత సంక్షేమ సంఘాన్ని ద్రవిడ కళగం (డీకే)గా మార్చారు. నేటికీ ఈ ద్రవిడ కళగం కొనసాగుతోంది. అప్పట్లో పెరియార్‌కు అనుంగు శిష్యుడిగా ఉన్న కాంజీవరం నటరాజ అన్నాదురై (సీఎన్ అన్నాదురై) అభిప్రాయబేదాల కారణంగా బయటకు వచ్చారు. ఇదే తమిళనాటే కాదు, దేశంలో తొలి ప్రాంతీయ పార్టీ ఆవిర్భావానికి పరిస్థితులు కల్పించాయి. ఆ పార్టీ డీఎంకే అన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ దృష్ట్యా, ఈ ఇద్దరు నేతలు తమిళనాడులోని ద్రవిడ పార్టీలకు ఆదర్శనీయులు. ద్రవిడ సిద్ధాంత కర్తగా పెరియార్ అవతరిస్తే, ద్రవిడ పార్టీల ఆవిర్భావ కర్తగా అన్నాదురై నిలిచారు. ఈ ఇద్దరి జయంతి వేడుకలు ఒక రోజు వ్యవధిలో రావడం గమనార్హం. ఈనెల పదిహేనున అన్నా జయంతిని ఘనంగా నిర్వహించగా, ఆదివారం పెరియార్ 145వ జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా డీఎంకే, అన్నాడీఎంకే, డీఎండీకే, ఎండీఎంకే, ద్రవిడ కళగం, తంథై పెరియార్ ద్రవిడ కళగం తదితర పార్టీలు వేర్వేరుగా ఘనంగా జరుపుకున్నాయి. వాడవాడల్లో ఆయన చిత్ర పటాల్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు.

నేతల నివాళులు..

చెన్నై సిమ్సన్, జెమిని వంతెన సమీపాల్లోని పెరియార్ విగ్రహ పరిసరాల్ని వివిధ పుష్పాలతో అలకరించారు. వివిధ పార్టీల నేతలు విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వేలూరులో సీఎం స్టాలిన్, మంత్రి దురైమురుగన్ తదితరులు పెరియార్‌కు నివాళులు అర్పించారు. అన్నాసాలైలోని విగ్రహానికి మంత్రులు ఎం. సుబ్రమణియన్, పీకే శేఖర్‌బాబు, మేయర్‌ప్రియ, తదితరులు అంజలి ఘటించారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళని స్వామి నేతృత్వంలో ఆయన మద్దతుదారులు పెద్దఎత్తున సేలంలోని పెరియార్ విగ్రహం వద్దకు తరలి వచ్చిన అంజలి ఘటించారు. చెన్నై జెమినీ వంతెన వద్ద ఉన్న విగ్రహానికి పార్టీ నాయకులు జయకుమార్, గోకుల ఇందిర, తమిళ్ మగన్ హుస్సేన్, పొన్నయ్యన్ తదితరులు నివాళులర్పించారు. సేలంలోని పెరియార్ విగ్రహానికి రాష్ట్రమంత్రి ఉదయనిధి స్టాలిన్ అంజలి ఘటించారు.

సీఎం ప్రతిజ్ఞ..

పెరియార్ జయంతిని సామాజిక దినోత్సవంగా అధికారిక వేడుకను డీఎంకే ప్రభుత్వం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఉద్యోగులతో సీఎం స్టాలిన్ ప్రతిజ్ఞ చేయించారు. వివక్ష అన్నపదానికి చోటు లేకుండా, సమనత్వం, సోదరభావం, సామాజిక న్యాయం ప్రతి ఒక్కరిలోనూ పెంపొందాలని కాంక్షిస్తూ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. తమిళనాడులో అధికారంలో ఉన్న తమ ప్రభుత్వ విజయాలన్నీ పెరియార్‌కు కానుకగా సమర్పించారు. ఇక, వేప్పేరిలోని పెరియార్ దిడల్‌లో ద్రవిడ కళగం నేత వీరమణి నేతృత్వంలో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిరువళ్లూరు: గుర్తు తెలియని వ్యక్తి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు..తిరువల్లూరు జిల్లా పొన్నేరి బస్టాండు సమీపంలో వ్యక్తి అపస్మార స్థితిలో పడివున్నట్టు వీఏఓ వినోద్‌కు స్థానికులు సమాచారం అందించారు. దీంతో ఆయన 108 ద్వారా పొన్నేరి వైద్యశాలకు ఆగస్టు 26న తరలించారు. అక్కడ రెండు రోజుల పాటు చికిత్స అందించిన తరువాత సంబంధిత వ్యక్తికి టీబీ వ్యాధి ఉన్నట్లు నిర్ధారించి తాంబరంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ దాదాపు 18 రోజుల చికిత్స పొందారు. శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి సుమారు 40 ఏళ్ల వయస్సు వుండొచ్చని మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని పొన్నేరి పోలీసులు వెల్లడించారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తిరువళ్లూరు: కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా పొన్నేరి తాలుకా పరిక్కుపట్టు గ్రామానికి చెందిన దీపన్(31). ఇతడికి అదే ప్రాంతానికి చెందిన ముత్తులక్ష్మితో మూడేళ్ల క్రితం వివాహమైంది. గత కొద్ది రోజులుగా కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపం చెందినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి గుమ్మిడిపూండిలో భారీ వర్షం పడడంతో విద్యుత్‌ను నిలిపి వేశారు. దీంతో ముత్తులక్ష్మితో పాటు ఇతర సభ్యులు బయట కూర్చుని మాట్లాడుతున్న సమయంలో ఇంటిలోనికి వెళ్లిన దీపన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన బంధువులు ఉరికి వేలాడుతున్న దీపన్‌ను కిందకు దింపి వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై మృతుడి భార్య ముత్తులక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ హత్య

తిరువొత్తియూరు: నెల్లై జిల్లాలో ఆటో డ్రైవర్ హత్య కేసులో దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. నెల్లై మున్నీర్‌పాళయానికి చెందిన విజయకుమార్ అలియాస్ అప్పాసామి (58) ఆటో డ్రైవర్. భార్య ఇసకియమ్మాళ్. వీరికి ఇద్దరు కుమార్తెలు ఓ కుమారుడు ఉన్నారు. కూతుళ్లు, కొడుకు పెళ్లిళ్లు చేసుకుని వేరే ప్రాంతాల్లో ఉంటున్నారు. విజయకుమార్‌కు మేల్ చేవల్‌లోని కల్మడయి బస్టాండ్‌లో ఆటో నిలపడం అలవాటు. శనివారం విజయకుమార్ ఫోన్‌కు వచ్చిన కాల్ కారణంగా కరిసాలపట్టి గ్రామంలో ప్రయాణికులను ఎక్కించుకుని మేలే చేవల్‌కు వెళ్లాలని తెలిపారు. అనంతరం విజయకుమార్ మెలే చేవల్ నుంచి ఆటోలో కరిసాలపట్టికి వెళ్లగా బైక్‌లపై వచ్చిన ఆరుగురు సభ్యుల ముఠా ఆటోను అడ్డగించి కొడవళ్లతో అతడిని నరికి హత్య చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు విజయకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఆలయ కుంభాభిషేకం


గోపుర కలశాన్ని పుణ్యజలాలతో అభిషేకిస్తున్న అర్చకులు


హాజరైన భక్తులు

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లా కాకలూరు హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతంలో పదేళ్ల క్రితం రాజ రాజేశ్వరి ఆలయాన్ని నిర్మించాలని పనులను ప్రారంభించారు. అయితే 50 శాతం పనులు పూర్తయిన తర్వాత అనివార్య కారణాల వల్ల ఆలయ నిర్మాణం ఆగిపోయింది. ఈ నేపథ్యంలో కాకలూరుకు చెందిన పలువురు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు. పనులు పూర్తయిన తర్వాత కుంభాభిషేకం చేపట్టారు. ఇందులో భాగంగా మొదటి రోజైన గురువారం దీపారాధన, విఘ్నేశ్వరపూజ, గోపూజ, ధన పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రతిష్టించారు. సాయంత్రం ఐదు గంటలకు వాస్తుశాంతి, ప్రవేశపూజ, యాగమండపం పూజలను నిర్వహించారు. రెండవ రోజైన శుక్రవారం ఉదయం విశేషశాంతి, మండపపూజ, కాలయాగ పూజలు, బింబం ప్రతిష్ట రాత్రి 8 గంటలకుపూర్ణాహుతి, దీపారాధన పూజలు నిర్వహించారు. నాలుగోకాలయాగ పూజలు నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కలశానికి పుణ్యజలాలతో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఆర్యశ్రీనివాసన్, సురేష్, వెంకటేషన్, అరుల్, కరుణాకరన్, బాలసుబ్రహ్మణ్యం , టీఆర్ఎస్ జ్యోతి, ధర్మలింగం, రఘు పాల్గొన్నారు.

తిరుత్తణి కొండ కిటకిట


ఆలయంలో వివాహాల సందడి


ఘాట్‌రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

తిరుత్తణి: శుభముహూర్త రావడంతో తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. వాహనాలు పోటెత్తడంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ చోటుచేసుకుంది. వివరాలు.. ఆవణి నెల చవరి ముహూర్తదినంతో పాటు ఆదివారం రావడంతో తిరుత్తణి కొండలో ఇకే సమయంలో 40 వివాహాలు, అలాగే పట్టణంలోని వందలాది ప్రయివేటు కల్యాణ మండపాల్లో వివాహాలతో పట్టణంలో శనివారం సాయంత్రం, ఆదివారం ఉదయం వాహనాలతో జనం పట్టణంలో పోటెత్తారు. దీంతో అరక్కోణంరోడ్డు, మాపోసీ రోడ్డుతో పాటు కొండ ఆలయ ఘాట్‌రోడ్డు మార్గంలో వాహనాలు కిక్కిరిశాయి. ఫలితంగా రెండు గంటల పాటు ట్రాఫిక్ సమస్య నెలకొంది. అదే సమయంలో సెలవుదినం కావడంతో కొండకు సైతం భక్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. వివాహాల వేడుకలతో పాటు స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తజనంతో పట్టణం ట్రాఫిక్‌లో చిక్కి ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్వామి దర్శనానికి రెండు గంటల సమయం వేచివుండాల్సి వచ్చింది. చిన్న పిల్లలు, వృద్ధులు ట్రాఫిక్ మధ్య చిక్కి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు అతి తక్కువ సంఖ్యలో మాత్రమే విధుల్లో హాజరు కావడంతో సకాలంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు వీలులేక సమస్యలు తలెత్తాయి. శుభముహూర్త రోజుల్లో పోలీసుల సంఖ్య పెంచి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ప్రయాణికులు కోరారు.

పురాణకాలం నుంచే ధ్వని అనుకరణ


మిమిక్రీతో ఆకట్టుకున్న సుబ్బారావు

కొరుక్కుపేట : పురాణకాలం నుంచే ధ్వని అనుకరణ చేసినట్లు ఆధారాలు ఉన్నట్లు మిమిక్రీ కళాకారులు ఎస్. వి. సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి ఆధ్వర్యంలో నెల నెలా వెన్నెల 40వ కార్యక్రమం శనివారం రాత్రి ఆహ్లాదకరంగా సాగింది. తెలుగు శ్రవ్య నాటక రత్నాలలో బహుళ ప్రచారంలో ఉన్న కొన్ని నాటకాల నుంచి కొన్ని ఘట్టాలను ప్రముఖ ధ్వన్యనుకరణ కళాకారుడు ఎస్.వి. సుబ్బారావు మిమిక్రీ ద్వారా వినిపించారు. ముందుగా సుబ్బారావు మాట్లాడుతూ ×స్వరవంచన్ని అని కూడా పేరున్న ఈ మిమిక్రీ కళకు మూలాలు పురాణకాలంలోనే ఉన్నాయని వెల్లడించారు. రామాయణంలో మారీచుడు రాముని గొంతును అనుకరిస్తూ ×హా సీతా ! హా లక్ష్మణా !₹ అంటూ ఆర్తనాదాలు చేసి సీతాపహరణానికి కారణం అయ్యాడని పేర్కొన్నాడు. ద్వాపర యుగంలో ।కీచక వధ₹ వృత్తాంతంలో బీముడు నర్తనశాలలో వేచి ఉండి, కీచకుడు రాగానే సైరంధ్రిగా ఉన్న ద్రౌపది గొంతును అనుకరిస్తాడని గుర్తు చేశారు. ప్రతి మనిషిలోనూ అంతర్లీనంగా ఓ మిమిక్రీ కళాకారుడుంటాడని, అవసరాన్ని బట్టి బయిటకు వస్తూ ఉంటాడని వ్యాఖ్యానించారు. అయితే, కొందరు మాత్రం సాధన చేసి పరిపూర్ణమైన కళాకారులుగా రూపుదిద్దుకుంటారని చెప్పారు. ఈ కళను ఒక ప్రదర్శనగా తెలుగునాట పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చి స్థిరపరిచిన వారిలో ధ్వన్యనుకరణ సామ్రాట్ నేరెళ్ల వేణుమాధవ్ అని గుర్తు చేశారు. ప్రముఖ తెలుగు సినీ రచయిత టి. సోమేశ్వర్ కార్యక్రమానికి స్వాగతం పలికి కళాకారుడిని పరిచయం చేశారు.

అల్జీమర్స్‌పై అప్రమత్తత అవసరం

కొరుక్కుపేట: దీర్ఘకాలిక వ్యాధుల్లో ఒకటైన అల్జీమర్స్‌పై అప్రమత్తంగా ఉండాలని మహిడోల్ విశ్వవిద్యాలయం బ్యాంకాక్ న్యూరాలజీ ప్రొఫెసర్ వోరపున్ సెనానారోంగ్ తెలిపారు. ప్రపంచ అల్జీమర్స్ డేను పురస్కరించుకుని బుద్ధి క్లినిక్ ఆధ్వర్యంలో చెన్నైలోని మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్‌లో సదస్సు నిర్వహించారు. అల్జీమర్స్‌పై పలువురు ప్రసంగించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యాయామం, మంచి ఆహారం, నిద్రతో అల్జీమర్స్ నుంచి బయటపడవచ్చని పేర్కొన్నారు. బుద్ధి క్లినిక్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ ఎన్నపాదం ఎస్.కృష్ణమూర్తి, వివేక్ మిశ్రా, రెమా రఘు పాల్గొన్నారు.

కోడిని రక్షించబోయి వృద్ధుడు మృతి

తిరువొత్తియూరు: బావిలో పడిన పెంపుడు కోడిని రక్షించేందుకు ప్రయత్నించిన వృద్ధులో నీట మునిగి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం ధర్మపుర్లిలో చోటుచేసుకుంది. నల్లంపల్లి సమీపంలోని చిన్ననూలఅల్లికి చెందిన గోవిందస్ (70) రైతు. ఇతను పెంచుకుంటున్న కోడి ఇంటికి సమీపంలోని బావిలో పడిపోయింది. గోవిందస్ కోడిని బయటకు తీయడానికి ప్రయత్నించే క్రమంలో జారి పడ్డాడు. స్థానికులు ధర్మపురి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అతన్ని బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. ఆదియన్ కోట్టై పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అంకితభావమే విజయానికి సోపానం


అవార్డు గ్రహీతలతో సురేష్ నారాయణన్, రంగనాథన్

కొరుక్కుపేట: అంకితభావంతో పనిచేస్తే విజయం తప్పక వరిస్తుందని నెస్లే ఇండియా లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ నారాయణన్ అన్నారు. చిన్నికృష్ణన్ ఇన్నోవేషన్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం చెన్నై తరమనిలోని ఐఐటీ రీసెర్చ్ పార్క్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ఔత్సాహిక వ్యాపారవేత్తలను ప్రోత్సహిస్తూ కెవిన్ కేర్, మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ అవార్డులను ప్రదానం చేశాయి. కెవిన్ కేర్ సంస్థ తరపున ఒక్కొక్కరికి రూ.లక్ష అందించారు. హిందుస్థాన్ ఆయిల్ ఎక్స్‌ప్లోరేషన్ ఎండీ పి.ఇలంగో, డోర్మాకబా ఇండియా దక్షిణాసియా ఎండీ నటేష్ బాలకృష్ణ, సుందరం హోమ్ ఫైనాన్స్ మేనేజింగ్ డైరెక్టర్ నారాయణన్ దురైస్వామి, సీఈఓ మృదుల రమేష్, సీకే రంగనాథన్, మహాలింగం పాల్గొన్నారు.

ఒడిశా మహిళపై గ్యాంగ్ రేప్
– బాలుడి సహా ఐదుగురి అరెస్ట్

కొరుక్కుపేట: మానామదురై సమీపంలో ఓ ఒడిశా రాష్ట్రం మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన బాలుడితో పాటు ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. రేప్ వీడియోలు ఉన్న సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని సైబర్ క్రైమ్ విభాగానికి పంపారు. వివరాలు.. శివగంగై జిల్లాలోని మనమదురై సమీపంలో కుళంగ్రామంలో పాండికి చెందిన ఇటుక బట్టీ ఉంది. ఇక్కడ ఒడిశాకు చెందిన 30 ఏళ్ల వితంతువు తన ఇద్దరు కుమారులతో కలిసి పనిచేస్తోంది. కొన్ని నెలల క్రితం సమీప గ్రామానికి చెందిన శంకర్ కుమారుడు ఆది(20) ఆ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో ఆది, అతడి నలుగురు స్నేహితులు యువతి ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం పారిపోయారు. యువతి ఫిర్యాదు మేరకు మనమదురై పోలీసులు కేసు నమోదు చేసి ఆదితో పాటు అతడి స్నేహితులు రంజిత్ (22), గజేంద్రన్ (19), అరుణ్ కుమార్ (22), 16 ఏళ్ల బాలుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

తిరువళ్లూరు: ద్విచక్ర వాహనంలో వైద్యశాలకు వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండికి చెందిన లియాకత్ అలీఖాన్(55). ఇతను తన ద్విచక్ర వాహనంలో మంజాకారణై వద్ద ఉన్న ప్రైవేటు వైద్యశాలకు బయలుదేరాడు. జీఎన్‌టీ రోడ్డు సమీపంలో వెళ్తుండగా లారీ అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లియాకత్ అలీఖాన్ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు మహ్మద్ అజారుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిప్‌కాట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనిరుధ్‌తో పెళ్లా?

తమిళసినిమా: అనిరుధ్ ప్రస్తుతం దక్షిణాదిలో క్రేజీ సంగీత దర్శకుడిగా వెలిగిపోతున్న విషయం తెలిసిందే. తమిళంలో రజనీకాంత్, కమల్ హాసన్, విజయ్, అజిత్ వంటి స్టార్ హీరోల చిత్రాలకు ఈయనే సంగీతం అందిస్తున్నారు. ఇటీవల రజనీకాంత్ నటించిన జైలర్ చిత్రానికి ఈయన అందించిన బాణీలు, నేపథ్య సంగీతం ఆ చిత్రానికి పక్కబలంగా నిలిచాయి. ప్రస్తుతం విజయ్ నటిస్తున్న లియో చిత్రంలోని నా వరువా రెడీ పాట ఇప్పటికే విడుదలై పెద్ద ట్రెండింగ్‌గా మారింది. రజినీకాంత్ నటించిన 171 చిత్రానికి ఈయనే సంగీతాన్ని అందించమన్నారు. ఇలా సంగీత దర్శకుడిగా గాయకుడిగా ట్రెండ్ సెట్టర్‌గా మారిన అనిరుధ్ వ్యక్తిగతంగాను నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. ఈయన రొమాన్స్ గురించి చాలా కాలంగానే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా నటి కీర్తి సురేష్‌తో కలిసి ఉన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఆ మధ్య వరుస ఫ్లాపులతో నిరాశతో ఉన్న కీర్తి సురేష్‌కు తెలుగులో దసరా, తమిళంలో ఉదయనిధి స్టాలిన్ సరసన నటించిన మామన్నన్ చిత్రాలు విజయం సాధించడంతో ఈమె మళ్లీ క్రేజ్‌లోకి వచ్చారు. ఇక కీర్తి సురేష్ ప్రేమ, పెళ్లి వ్యవహారం గురించి చాలా కాలంగానే ప్రచారం జరుగుతోంది. ఇంతకుముందు ఒక రాజకీయ పెళ్లి అంటూ ప్రచారం జరిగింది ఆ తర్వాత కేరళ రాష్ట్రానికి చెందిన ఓ యువ వ్యాపారవేత్తను పెళ్లి చేసుకోబోతున్నారని ప్రచారం హోరెత్తింది. తాజాగా యువ సంగీత దర్శకుడు అనిరుధ్‌తో ప్రేమకలాపాలు అంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. అంతేకాకుండా వీరిద్దరూ సన్నిహితంగా ఉన్న ఫొటోలు వైరల్ అవుతున్నాయి. అయితే అనిరుధ్ నటి కీర్తి సురేష్‌కు మంచి ఫ్రెండ్ మాత్రమేనని ఆమె సన్నిహితులు పేర్కొంటున్నారు.


అనిరుధ్ , కీర్తీ సురేష్

కోలీవుడ్ టాక్స్

బ్రహ్మాయుగాన్ని పూర్తి చేసిన మమ్ముట్టి

తమిళసినిమా: మలయాళం సూపర్ స్టార్ మమ్ముట్టి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం బ్రహ్మయుగం. తమిళం తెలుగు మలయాళం కన్నడం భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని నైట్ షిఫ్ట్ స్టూడియోస్, వైనాట్ స్టూడియోస్ సంస్థల అధినేతను చక్రవర్తి రామచంద్ర, ఎస్. శశికాంత్ కలిసి నిర్మిస్తున్నారు. మమ్ముట్టి చిత్రం అనగానే కథ, కథనాలు వైవిధ్యంగా ఉంటాయని ప్రేక్షకులు భావిస్తుంటారు. అలాంటి కథాంతంతో ఈ చిత్రానికి రాహుల్ సదాశివన్ దర్శకత్వం వహిస్తున్నారు. అర్జున్ అశోకన్, సిద్ధార్థ్ భరతన్, అమల్దా లైజ్ తదితరులు ముఖ్యపాత్ర పోషిస్తున్న ఈ చిత్ర షూటింగ్ గత ఆగస్టు 17వ తేదీన షూటింగ్ కేరళా రాష్ట్రం సమీపంలోని ఒట్టపాలెం ప్రాంతంలో ప్రారంభమైంది. కాగా ఈనెల 17వ తేదీతో నటుడు మమ్ముట్టి పాత్రకు సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణ పూర్తి అయినట్లు నిర్మాతలు తెలిపారు. అంటే సరిగ్గా నెల రోజుల్లో మమ్ముట్టి బ్రహ్మ యుగం చిత్ర షూటింగ్ పూర్తి చేశారన్న మాట. అదేవిధంగా ఇతర నటీనటులకు సంబంధించిన సన్నివేశాలను త్వరలో పూర్తి చేసి చిత్రాన్ని 2024 ప్రథమార్థంలో భారీ ఎత్తున విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నట్లు నిర్మాతలు పేర్కొన్నారు.


బ్రహ్మయుగం చిత్ర యూనిట్

మహాభారత ఇతిహాసంలో సూర్య

తమిళసినిమా: మహాభారతం పురాణ ఇతిహాసమే కాదు చిన్ని పరిశ్రమకు అదో బాండాగారం అనే చెప్పాలి. మహాభారతం ఇది మొత్తంతో ఎన్నో భాషల్లో ఎన్నో చిత్రాలు రూపొంది ప్రేక్షకులను భక్తి సంద్రంలో ముంచెత్తాయి. మరెన్నో చిత్రాలు రానున్నాయి. మహాభారతం ఇతిహాసంలో ఒక్కో పాత్ర ఒక్కో చరిత్ర. అలా తాజాగా మహాభారతంలోని దానకర్ణుని ఇతివత్తాన్ని తీసుకొని ఒక చిత్రం తెరకెక్కనుందన్నది. తాజా సమాచారం మేరకు ఈ చిత్రం ద్వారా కోలీవుడ్ స్టార్ నటుడు సూర్య బాలీవుడ్ రంగ ప్రవేశం చేయబోతున్నట్లు సమాచారం. ఈయన ప్రస్తుతం కంగువ అనే భారీ చారిత్రక కథా చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. దీని తర్వాత మహిళ దర్శకురాలు సుధా కొంగర దర్శకత్వంలో తన 43 చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. దీంతోపాటు వెట్రిమారన్ దర్శకత్వంలో వాడివాసల్ చిత్రం కూడా ఈయన చేయాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో సూర్య బాలీవుడ్ ఎంట్రీ చిత్రం గురించి టాక్ స్ప్రెడ్ అయ్యింది. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు రాకేష్ ఓం ప్రకాష్ మెహ్రా దర్శకత్వంలో సూర్య నటించడానికి సిద్ధమవుతున్నట్లు తాజా సమాచారం. ఇంతకుముందు రంగ్ దే బసంతి భాగ్ మిల్కా భాగ్, వంటి సంచలన విజయం సాధించిన హిందీ చిత్రాలను తెరకెక్కించడం గమనార్హం. కాగా తాజాగా కర్ణ అనే చిత్రాన్ని సూర్య కథానాయకుడిగా పాన్ ఇండియా స్థాయిలో రూపొందించడానికి తెలుస్తోంది. ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌లో రెండు భాగాలుగా రూపొందించడానికి యత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. కాగా దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అయితే సూర్య దర్శకుడు రాకేష్ ఓం ప్రకాష్ మెహ్రా కలిసి దిగిన ఫొటో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.


దర్శకుడు ఓం ప్రకాష్‌తో నటుడు సూర్య

సినీ, టీవీ కళాకారులకు
అవార్డుల ప్రదానం


అవార్డుల ప్రదానోత్సవం

తమిళసినిమా: వెండితెర, బుల్లితెర తారలకు, సామాజిక సేవకులకు ప్రోత్సాహక అవార్డుల కార్యక్రమం శనివారం సాయంత్రం స్థానిక వడపలణిలోని శిఖరం హాల్లో ఘనంగా జరిగాయి. మహా ఆర్ట్స్ సంస్థ అధినేత అనురాధ జయరామన్ యునైటెడ్ ఆర్టిస్ట్ ఆఫ్ ఇండియా సంస్థ అధినేత కలైమామణి, డాక్టర్ నెల్లై సుందర్ రాజన్ సంయుక్తంగా నిర్వహించిన వేడుకలో హైకోర్టు విశ్రాంతి న్యాయమూర్తి ఎస్.కె కృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వేదికపై నటి గీత నారాయణన్, నటుడు మధుసూదన్, కేరళకు చెందిన బుల్లి తెర నటుడు జోస్ తదితరులకు విశ్రాంతి న్యాయమూర్తి ఎస్కే కృష్ణన్ ప్రోత్సాహ అవార్డులను ప్రదానం చేసి అభినందించారు. అదేవిధంగా విశేష కళా సేవలను అందిస్తున్న కలైమామణి, డాక్టర్ నెల్లైసుందరరాజన్, స్పోర్ట్స్ చైర్మన్ డాక్టర్ ఎంఆర్ సౌందర్ రాజన్‌ను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. సామాజిక సేవ అవార్డును కోడంబాక్కం శ్రీకి ప్రదానం చేశారు. కాగా అంతకుముందు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

అలా కాకపోతే
ముందుకు సాగలేం


నటి ఐశ్వర్య లక్ష్మి

తమిళసినిమా: రంగుల ప్రపంచం అయిన సినిమా ఇప్పుడు హీరోయిన్ల గ్లామర్ లోకంగా మారిపోయింది. నటీమనులు సినీ రంగ ప్రవేశం చేయాలన్నా, ఇక్కడ నిలదొక్కుకోవాలన్నా ప్రతిభ, నెక్స్ గ్లామర్ ఫస్ట్‌గా మారింది. విషయాన్ని చాలామంది హీరోయిన్లు పబ్లిక్ గానే అంగీకరిస్తున్నారు. నటి ఐశ్వర్య లక్ష్మి కూడా ఇదే అంటున్నారు. ఈ కేరళ కుట్టికి మొదట్లో నటనపై ఆసక్తి లేదట. ఇంకా చెప్పాలంటే డాక్టర్ అవ్వాలని చదివిన ఐశ్వర్య లక్ష్మి ఆ తర్వాత మోడలింగ్‌పై ఆసక్తితో ఆ రంగంపై దృష్టి సారించారట. అలా పలు వాణిజ్య సంస్థలకు మోడల్‌గా పని చేసిన ఈమె ఫొటోలు పత్రికల్లో ముఖచిత్రంగా ప్రచురితమవడం, దాంతో సినిమా అవకాశాలు రావడం జరిగిపోయ్యిందట. మలయాళంలో కథానాయకిగా ఎంట్రీ ఇచ్చిన ఐశ్వర్య లక్ష్మి 2019లో విశాల్ కథానాయకుడు నటించిన యాక్షన్ చిత్రం ద్వారా ఎంట్రీ ఇచ్చింది. ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించకపోవడంతో ఈమెకు పెద్దగా గుర్తింపు రాలేదు. అదేవిధంగా ధనుష్‌కు జంటగా నటించిన జగమే తంధిరం కూడా నేరుగా ఓటీపీలో స్ట్రీమింగ్ కావడంతో ఆ చిత్రం కూడా ఈమెకు పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. ఆ తర్వాత విష్ణు విశాల్ సరసన నటించిన కట్టా కుస్తీ చిత్రం మంచి పేరు తెచ్చి పెట్టింది. ఇక ఇటీవల మణిరత్నం దర్శకత్వం వహించిన పొన్నియిన్ సెల్వన్ చిత్రంలో పూంగుళి పాత్రలో నటించి అందరి ప్రశంసలను అదేవిధంగా గార్గీ చిత్రం ద్వారా నిర్మాత గాను అవతారం ఎత్తింది. తాజాగా దుల్కర్ సల్మాన్‌కు జంటగా కింగ్ ఆఫ్ కొత్త చిత్రంలో నటించింది. భారీ అంచనాల మధ్య పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. దీంతో ఐశ్వర్య లక్ష్మి ఇప్పుడు అవకాశాల బాట పట్టింది. అందుకు గ్లామర్‌ని మార్గంగా ఎంచుకుంది. అందాలను ఆరబోస్తూ తీయించుకున్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది. అలాంటి ఫొటోల గురించి నెటిజన్లు రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. దీని గురించి ఐశ్వర్య లక్ష్మి స్పందిస్తూ గ్లామర్‌కు మారడం తప్పనిసరి అని, లేకపోతే వృత్తిపరంగా ఇక్కడ కొనసాగలేమని పేర్కొంది.

క్లుప్తంగా

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

తిరువొత్తియూరు: వాల్పరై పర్యటనకు వచ్చిన కారు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. మదురైకి చెందిన వినోద్ (23) తన స్నేహితులతో కలిసి మోటార్ సైకిల్‌పై వాల్పరై పర్యటనకు వచ్చారు. వాల్పరై కొండ మార్గంలో వెళ్తున్న సమయంలో వినోద్ మోటార్ సైకిల్‌ను ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వినోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. పోలీసులు మాట్లాడుతూ వాల్పరై ద్విచక్ర వాహనంలో పర్యటనకు వచ్చే వారి సంఖ్య ఎక్కువైందని, దీంతో కొండ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాల్లో వాల్పరైకి వచ్చే వారు నిదానంగా వెళ్లాలని సూచించారు.

కొల్లిడం నదిలో మొసలి దాడిలో రైతు మృతి

తిరువొత్తియూరు: కొల్లిడం నదిలో ఎద్దును కడుగుతుండగా మొసలి దాడి చేసింది. దీంతో రైతు మృతి చెందాడు. చిదంబరం సమీపంలో ఉన్న కాట్టు కూడలూర్ అమ్మన్ ఆలయ వీధికి చెందిన సుందర మూర్తి (55)కి భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుందర మూర్తి శనివారం సాయంత్రం కాట్టు కూడలూర్ వద్ద ఉన్న పాత కొలవడం నదిలో తన ఎద్దును కడుగుతున్నాడు. ఆ సమయంలో మొసలి అతని కాలు పట్టుకుని లోపలికి లాక్కెళ్లింది. ఈ దృశ్యాన్ని అక్కడున్న వారు చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. చిదంబరం తాలూకా పోలీసులు, చిదంబరం, కొమరాచి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని వలల ఆధారంగా నదిలో దిగి సుందరమూర్తి కోసం గాలించారు. మృతదేహం చిక్కింది. అనంతరం మృతదేహాన్ని చిదంబరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వృద్ధురాలి హత్య

తిరువొత్తియూరు: ఇంటిలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలని హత్య చేసి ఆమె ధరించి ఉన్న బంగారు కమ్మలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. అలాగే అదే ప్రాంతంలో ఉన్న విఘ్నేశ్వర ఆలయం తలుపులు పగలగొట్టి పంచలోహ విగ్రహాన్ని చోరీ చేశారు. చెన్నై తాంబరం సమీపంలోని పీర్కాంకరణై వేల్ నగర్ అంబేడ్కర్ వీధిలో నివాసం ఉంటున్న రాజమ్మాల్ (70) వడ్డీ వ్యాపారం చేస్తుంది. శనివారం ఉదయం ఆమె చాలా సమయం వరకు ఇంటి నుంచి బయటకు రాలేదు. దీంతో సందేహించిన స్థానికులు ఆమె ఇంటి వద్దకు వెళ్లి చూశారు. రాజమ్మాల్ రక్తపు మడుగులో మృతి చెంది పడి ఉంది. దీనిపై సమాచారం అందుకున్న పీర్కాంకరణై పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. రాజమ్మాల్ ధరించి నగలు చోరీకి గురైనట్టు గుర్తించారు. ఇంటిలో ఒంటరిగా ఉన్న రాజమ్మాల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి హత్య చేసి నగలు చోరీ చేసినట్లు తేలింది. కేసు నమోదు చేసి రాజమ్మాల్ మృతదేహాన్ని క్రోమ్‌పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదే ప్రాంతంలో ఉన్న సెల్వ వినాయక ఆలయం తలుపులు పగలగొట్టిన వ్యక్తులు గర్భగుడిలో ఉన్న పంచలోహ విగ్రహాన్ని చోరీ చేశారన్న ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

జాలర్ల వలలో అరుదైన చేపలు

తిరువొత్తియూరు: చెన్నై కాశిమేడు జాలర్ల వలలో అరుదైన రకానికి చెందిన పాదరక్షల ఆకారంలో వున్న చేపలు చిక్కాయి. వాటిని రూ.30 కోట్లకు ఎగుమతి చేశారు. చెన్నై కాశిమేడు చేపల పట్టు హార్బర్ నుంచి 700కు పైబడిన ఫైబర్ పడవల్లో జాలర్లు లోతైన సముద్రం ప్రాంతంలోకి వెళ్లి చేపలు పడుతున్నారు. గత జూలై నెల మొదటి నుంచి శుక్రవారం శనివారం వరకు లెదర్ జాకెట్ అనబడే అరుదైన రకానికి చెందిన చేపలు టన్నుల్లో చిక్కాయి. ఈ సంవత్సరం మూడు నెలల్లో మోతాదు కన్నా ఎక్కువగా లభించాయి. ఈ చేపలను ఎవరూ ఇష్టపడరని అని, వీటిని కాశిమేడు చేపల హార్బరు నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తారు. ఈ చేపలు విదేశాలలో కోట్, టోపీ, తయారీకి ఉపయోగిస్తున్నారని, చేపలు కిలో రూ.300 వరకు ధర పలుకుతుంది. ఈ క్రమంలో టన్నుల కొద్దీ గత మూడు నెలల్లో మాత్రమే ఎక్కువగా లభించడంతో, వాటిని రూ.30 కోట్ల వరకు ఎగుమతి చేసినట్టు జాలర్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

BUSINESS SERVICE



BUSINESS OFFER

Gamgana Flutures కంపెనీలో కేవలం అతి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే గొప్ప అవకాశం, డైలీ బ్యాంక్ ట్రాన్స్‌ఫర్, Dont Miss సంప్ర:: 7396065388

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించ వల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తిరువళ్లూరులో కుండపోత

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి ఏకదాటిగా నాలుగు గంటల పాటు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. పలుచోట్ల మురుగునీరుతో కలిసి వర్షపు నీరు ప్రవహించడంతో దుర్వాసన వెదజల్లింది. అత్యధికంగా తిరుత్తణిలో 129 మిమీ వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా పొన్నేరిలో 17 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మొత్తానికి 748మిమీ వర్షపాతం నమోదు కాగా, సరాసరిన 49.87 శాతం నమోదయ్యింది. గుమ్మిడిపూండిలో 22 మిమీ, పల్లిపట్టులో 42 మిమీ, ఆర్కేపేటలో 23 మిమీ, చోళవరంలో 48 మిమీ, రెడ్‌హిల్స్‌లో 39 మిమీ, జమీన్‌కొరట్టూరులో 24, పూందమల్లిలో 39, తిరువేళాంగాడులో 66, పూండిలో 72 మిమీ, తామరపాక్కంలో 74, తిరువళ్లూరులో 70, ఊత్తుకోటలో 53, ఆవడిలో 30 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

పెరుగుతున్న ప్రధాన రిజర్వాయర్‌ల నీటి మట్టం

గత వారం రోజుల నుంచి రాత్రి సమయంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చెన్నై ప్రజలకు తాగునీటిని అందించే ప్రధాన రిజర్వాయర్‌ల నీటి మట్టం స్వల్పంగా పెరుగుతోంది.

పూండి సత్యమూర్తి సాగర్ రిజర్వాయర్: చెన్నై ప్రజలకు తాగునీటిని అందించే రిజర్వాయర్‌లో పూండి సత్యమూర్తి సాగర్ రిజర్వాయర్ ప్రధానమైనది. ఈ రిజర్వాయర్‌కు ఆంధ్ర నుంచి వచ్చే కృష్ణాజలాలతో వర్షపు నీరు ప్రధాన ఆధారం. రిజర్వాయర్ నుంచి చెమరంబాక్కం, రెడ్‌హిల్స్, చోళవరం, కన్నన్‌కోట తేరువాయి కండ్రిగ తదితర రిజర్వాయర్‌లకు నీటిని తరలించి అక్కడి నుంచి చెన్నై ప్రజల తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తున్నారు. పూండి రిజర్వాయర్ మొత్తం ఎత్తు 35 అడుగులు కాగా ప్రస్తుతం 32 అడుగుల నీరు నిల్వ వుంది. ఇక్కడ 3.23 టీఎంసీల నీటిని నిల్వ చేసుకొనే అవకాశం వుండగా ప్రస్తుతం 2.472 టీఎంసీల నీరు నిల్వ వుంది. ఇన్‌ఫ్లో 1250 క్యూసెక్కులు,


తిరువళ్లూరులో శనివారం రాత్రి కురుస్తున్న భారీ వర్షం

అవుట్‌ఫ్లో 360 క్యూసెక్కులు ఉంది.

రెడ్‌హిల్స్: చెన్నైకు తాగునీటిని అందించే ప్రధాన రిజర్వాయర్‌లో రెడ్‌హిల్స్ కూడా ఒకటి. ఈ రిజర్వాయర్ ఎత్తు 21.20 కాగా ప్రస్తుతం 14.76 అడుగుల నీరు నిల్వ వుంది. మొత్తం 3.30 టిఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం వుండగా ప్రస్తుతం 2.04 టీఎంసీల నీరు నిల్వ వుంది. ఇన్‌ఫ్లో 582 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 159 క్యూసెక్కులు ఉంది.

చోళవరం : చోళవరం రిజర్వాయర్ మొత్తం ఎత్తు 18.86 అడుగులు కాగా ప్రస్తుతం 2.99 అడుగుల నీరు మాత్రమే ఇక్కడ నిల్వ వుంది. మొత్తం నీటి సామర్థ్యం 1.081 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.132 టీఎంసీల నీరు నిల్వ వుంది. ఇన్‌ఫ్లో 60 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 38 క్యూసెక్కులుగా వుంది.

చెమరంబాక్కం: చెమరంబాక్కం రిజర్వాయర్ ఎత్తు 24 అడుగులు కాగా ప్రస్తుతం 20.21 అడుగుల నీరు నిల్వ వుంది. రిజర్వాయర్ మొత్తం నీటి సామర్థ్యం 3.645 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.655 అడుగులు నీరు నిల్వ వుంది. ఇన్‌ఫ్లో 484 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 137 క్యూసెక్కులు ఉంది.

కన్నన్‌కోట –తేరువాయి కండ్రిగ ప్రాజెక్టు : కన్నన్‌కోట–తేరువాయి కండ్రిగ రిజర్వాయర్ మొత్తం ఎత్తు 36.61 అడుగులు కాగా ప్రస్తుతం 31.23 అడుగుల నీరు నిల్వ వుంది. ఇక్కడ 0.500 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం వుండగా ప్రస్తుతం 0.329 నీరు నిల్వ వుంది. ఇన్‌ఫ్లో 50 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 16 క్యూసెక్కులు ఉంది.

భారీ వర్షం.. ప్రయాణికులకు కష్టం

తిరుత్తణి: తిరుత్తణిలో శనివారం రాత్రి రెండు గంటల పాటు కుమ్మరించిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరుత్తణిలో శనివారం వందలాది కల్యాణ మండపాల్లో జరిగిన వివాహాల రిసెప్షన్‌లో పాల్గొనేందుకు వందలాది వాహనాల్లో వేలాది మంది తిరుత్తణి చేరుకున్నారు. రాత్రి ఏడు గంటల సమయంలో వర్షం ప్రారంభమై రెండు గంటల పాటు భారీగా కుమ్మరించింది. ఆ సమయంలో వాహనాలు రోడ్ల మీద నిలిచి పోవడంతో ద్విచక్ర వాహన చోదకులు, ప్రయాణికులు తడుస్తూ నిలవాల్సి వచ్చింది. పట్టణంలోని మపోసీ వీధి, గాంధీ రోడ్డు, పాత బజారు, మిట్టవీధి ప్రాంతాల్లో వరదనీరు వీధుల్లో ప్రవహించి ఇళ్లు, దుకాణాల్లో చేరడంతో వ్యాపారులు, కుటుంబీకులు ఇబ్బంది పడ్డారు. రోడ్లు దుస్థితిలో వుండడంతో పాటు మరుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో వర్షపు నీటితో పాటు కలుషిత నీరు రోడ్ల మీద పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లింది.


తిరుత్తణి గాంధీ రోడ్డులో వరద నీటి ప్రవాహం

శ్రీలంక శరణార్థుల సంక్షేమానికి చర్యలు


శ్రీలంక శరణార్థులకు ఇళ్ల తాళాలు అందజేస్తున్న సీఎం స్టాలిన్

- రూ: 79.70 కోట్లతో ప్రత్యేక ఇళ్ల నిర్మాణం

వేలూరు: శ్రీలంక శ్రీలంక శరణార్థులను ఆదుకునేందుకు తమ ప్రభుత్వం ఎన్నటికీ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. వేలూరు సమీపంలోని మేల్ మనూరులో రూ.11 కోట్లతో నిర్మించిన 220 ఇళ్లను ఆదివారం ప్రారంభించారు. అనంతరం తాళాలను లబ్ధిదారులకు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఎం స్టాలిన్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13 జిల్లాలోని 19 స్థిరవాసుల కేంద్రాల్లో రూ.79..70 లక్షలతో నిర్మించిన భవనాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. అనంతరం శ్రీలంక శ్రీలంక శరణార్థులను ఇంటికి అవసరమైన నిత్యావసర సరుకులు అందజేశారు. లబ్ధిదారులు మాట్లాడుతూ ఇంతకు ముందు చాలా కష్టాలతో జీవించామని, ప్రస్తుతం తమకు ఇళ్లు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సీఎం స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శ్రీలంక శరణార్థులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శ్రీలంక శరణార్థులకు ప్రత్యేకంగా ఇళ్లు నిర్మించి ఇచ్చినట్టు తెలిపారు. ఇంటితో పాటు వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురై మురుగన్, సెంజి మస్తాన్, అన్బిల్ మహేష్ పొయ్యామొయి, గాంధీ, పార్లమెంట్ సభ్యులు జగద్రక్షగన్, కదీర్ ఆనంద్, ఎమ్మెల్యేలు కార్తికేయన్, నందకుమార్, అములు, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, కలెక్టర్ కుమరవేల్ పాండియన్, నార్త్ జోన్ ఐజీ కన్నన్, డీఐజీ ముత్తుస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ముందుగా తందై పెరియార్ జయంతిని పురస్కరించుకొని వేలూరు అన్నా రోడ్డులోని పెరియార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

సీఎంకు వేలూరులో ఘన స్వాగతం:

వేలూరులో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం స్టాలిన్ శనివారం సాయంత్రం వేలూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా వర్షాలు అధికంగా వస్తున్నప్పటికీ వాటిని కూడా లెక్క చేయకుండా డీఎంకే జిల్లా కార్యదర్శి నందకుమార్, మంత్రి దురై మురుగన్ అధ్యక్షతన కాట్పాడి రైల్వే స్టేషన్ నుంచి వేలూరు కొత్త బస్టాండ్ వరకు ఘన స్వాగతం పలికారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు


మొక్కలు పంపిణీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లోకనాథన్

తిరువళ్లూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను ఆదివారం తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా బీజేపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. మనవాలనగర్‌లో జరిగిన కార్యక్రమంలో వెయ్యి మొక్కలు, స్వీట్లు పంపిణీ చేశారు. దీనికి బీజేపీ కార్యదర్శి పన్నీర్‌సెల్వం అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లోకనాథన్ పాల్గొని మొక్కలు పంపిణీ చేశారు. తిరువళ్లూరు నగరంలో వెయ్యి మందికి అన్నదానం చేశారు. తిరుప్పచ్చూర్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయుష్మాన్‌భవ పథకం కింద అర్హులకు కార్డులు అందజేశారు. 60 మంది ఎస్టీలకు బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు లయన్ కరుణాకరన్, శ్రీనివాసన్, ఓబీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజ్‌కుమార్, మండల అధ్యక్షులు సతీష్‌కుమార్, రవికుమార్, మహిళా విభాగం కార్యదర్శి చిత్రదేవి పాల్గొన్నారు.

షూటింగ్‌లో తమిళనాడు క్రీడాకారిణికి స్వర్ణం

కొరుక్కుపేట: ప్రపంచకప్ షూటింగ్ పోటీల్లో తమిళనాడు ప్లేయర్ ఇలవెనిల్ వాలారివన్ స్వర్ణం సాధించి రికార్డు సష్టించింది. అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బ్రెజిల్‌లో ప్రపంచ షూటింగ్ పోటీలు జరిగాయి. శనివారం రాత్రి జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో తమిళనాడుకు చెందిన ఇలావెనిల్ వాలారివన్ పాల్గొంది. ఫైనల్‌లో 252.2 పాయింట్లు సాధించి స్వర్ణం సాధించి భారత్‌కు తొలి పతకాన్ని అందించింది. ఫ్రాన్స్‌కు చెందిన ఓషన్ ముల్లర్ 251.9 పాయింట్లతో రజతం సాధించాడు. చైనా క్రీడాకారిణి జియాలే జాంగ్ 229 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించింది. 2023లో ప్రపంచకప్‌లో ఇప్పటివరకు భారత క్రీడాకారులు ఏడు స్వర్ణాలు, నాలుగు రజతాలు సాధించారు. అలాగే 12 కాంస్యాలతో సహా మొత్తం 23 పతకాలను గెలుచుకున్నారు. పతకాల పట్టికలో భారత్ అథ్లెట్లు నాలుగో స్థానంలో ఉన్నారు. తదుపరి 23న చైనాలోని హాంగ్‌జౌలో ప్రారంభమయ్యే ఆసియా క్రీడల్లో పాల్గొంటారు. స్వర్ణం సాధించిన ఇలావెనిల్ వాలారివన్‌కు పలువురు అభినందనలు తెలిపారు.


స్వర్ణంతో మెరిసిన క్రీడాకారిణి ఇలవెనిల్ వాలారివన్

దేవనాథస్వామి ఆలయంలో ఒకే రోజు 76 పెళ్లిళ్లు

కొరుక్కుపేట: అవని మాసం ఆఖరి రోజైన ఆదివారం తిరువనంతపురం దేవనాథస్వామి ఆలయంలో ఒకే రోజు 76 వివాహాలు జరిగాయి. కడలూరు సమీపంలో తిరువనంతపురం దేవనాథస్వామి ఆలయం ఉంది. 108 వైష్ణవ క్షేత్రాల్లో ఇది ప్రసిద్ధ దేవాలయం. ఇక్కడ వివాహం చేసుకుంటే వారి జీవితం బాగుంటుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో అవని మాసం చివరి రోజున ఔషధగిరి కొండ వద్దనున్న కళ్యాణ మండపంలో వివాహానికి పెద్ద సంఖ్యలో వధూవరులు తమ బంధువులతో తరలివచ్చారు. ఆలయం ప్రాంగణం జనంతో కిక్కిరిసిపోయింది. ఒకే రోజు దేవనాథస్వామి ఆలయంలో 76 వివాహాలు జరిగినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ పరిసరాల్లోని కల్యాణ మండపాల్లో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరిగాయన్నారు.

కొత్త జంటలకు సహాయకాల పంపిణీ

సాక్షి, చెన్నై: కోయంబత్తూరులో విశ్వకర్మ యోజన పథకం లబ్ధిదారులకు ఆదివారం సహాయకలను పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సామూహిక వివాహం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి పంకజ్ చౌదరి, బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్, ప్రొఫెసర్లు బాలాజీ, కనకసభాపతి, సెల్వరాజ్ పాల్గొన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ కోసం ప్రధాని మోదీ అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన పుట్టిన రోజున ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని స్థానాలు కైవసం చేసుకోవడమే లక్ష్యం

వేలూరు: పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు. వేలూరు జిల్లా పల్లిగొండ సమీపంలో ఆదివారం డీఎంకే ఆధ్వర్యంలో మహానాడు, అన్నా జయంతి ఉత్సవాల సందర్భంగా పార్టీలో విశిష్ట సేవలు అందించిన కార్యకర్తలకు అవార్డుల ప్రదానోత్సవం చేశారు. సీఎం స్టాలిన్ మాట్లాడుతూ ఇండియాలోనే మొదటి సారిగా సిపాయిలు స్వాతంత్ర్యం కోసం పోరాటం జరిగిన వేలూరులో డీఎంకే మహానాడు జరగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ ప్రభుత్వంలోనే వేలూరును కార్పొరేషన్‌గా చేశామన్నారు. వేలూరుకు తాగునీటి పథకాన్ని తీసుకొచ్చిన ఘనత తమకే దక్కిందన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురై మురుగన్, పొన్‌ముడి, ఉదయనిధి స్టాలిన్, గాంధీ, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, పార్లమెంట్ సభ్యులు రాజ, కదీర్ ఆనంద్, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మేట్టుపాలయం - ఊటీ మధ్య కొండ రైలు సేవలు ప్రారంభం

తిరువొత్తియూరు: వినాయక చతుర్దిని పురస్కరించుకొని మేట్టుపాలయం– ఊటీ మధ్య ప్రత్యేక కొండ రైలు నడుస్తోంది. కొండలో రాణి అని పిలిచే నీలగిరి జిల్లా ఊటీకి, కోవై జిల్లా మేట్టుపాలయం నుంచి కొండ రైలు నడుస్తుంది. ఈ రైలు పర్యటనలో ప్రకృతి సహజ సౌందర్యాన్ని దర్శించుటకు పర్యాటకులు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. స్థానికులు మాత్రమే కాక పర్యాటకు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. సాధారణంగా ఈ రైలు రోజు మేట్టుపాలయం నుంచి ఊటీకి ఉదయం 7.10 గంటలకు, ఊటీ నుంచి మేట్టుపాలయంకు మధ్యాహ్నం 2 గంటలకు కొండ రైలు నడుస్తుంది. ఈ క్రమంలో వినాయక చతుర్దిని పరిస్కరించుకుని శనివారం ఉదయం 9.10 గంటలకు మేట్టుపాలయం మధ్య ఫెస్టివల్ స్పెషల్ కొండ రైలు నడిచింది. ఇందులో 180 మంది ప్రయాణికులు ప్రయాణించారు. ఈ రైలు మధ్యాహ్నం తిరిగి రెండు గంటలు 2.25 నిమిషాలకు ఫస్ట్ క్లాస్‌లో 40 సీట్లు, రెండో తరగతి బోగీలో 140 సీట్లు ఉన్నాయి. మేట్టుపాలయం నుంచి ఊటీకి మొదటి తరగతి బోగీలో ప్రయాణించేందుకు రూ.1470, 2వ తరగతి బోగీలో ప్రయాణించుటకు రూ.965, మేట్టుపాలయం – కున్నూరు మధ్య మొదటి తరగతికి రూ.1,105, రెండవ తరగతికి రూ.715 టికెట్ ధరను నిర్ణయించారు. ఈ నెల 18వ తేదీన ఊటీ నుంచి మేట్టుపాళయంకు ప్రత్యేక రైలు నడుపుతారు. రైలు ఊటీలో నుంచి ఉదయం 11:25 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.20 గంటలకు మేట్టుపాలయంకు చేరుకుంటుంది.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకార వేతనాలు

వేలూరు: విశ్వకర్మ విద్యార్థులు విద్యలో మొదటి స్థానం తీసుకు వచ్చేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తమిళనాడు విశ్వకర్మ స్నేహితుల సంఘం వ్యవస్థాపకుడు, కార్యదర్శి సేనా జనార్ధనన్ తెలిపారు. విశ్వకర్మ స్నేహితుల సంఘం ఆధ్వర్యంలో 23వ వార్షికోత్సవ కార్యక్రమం, ప్లస్‌టు, పదవ తరగతిలో మొదటి స్థానాలు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు తల్లి దండ్రులు ప్రోత్సాహం అవసరం ఉందన్నారు. ప్రస్తుతం విద్యతోనే విశ్వకర్మకు చెందిన వారు ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. ఈ సంఘాన్ని మొదటిలో నలుగురు స్నేహితులతో ప్రారంభించామని ప్రస్తుతం వెయ్యి మందికి పైగా సభ్యులు వీటిలో ఉండడం ఆనందంగా ఉందన్నారు.


విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు

కొరుక్కుపేట: శ్రీచెన్నపురి దేవాంగ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. చెన్నై పాత చాకలిపేటలోని శ్రీరామలింగ చౌడేశ్వరిదేవి ప్రేయర్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. దేవాంగ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద డిగ్రీ, పీజీ, డిప్లొమా చదువుతున్న 67 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు కొనంకి జనార్ధనం, జనరల్ సెక్రటరీ జి.రఘు, కరుణమూర్తి, పముజుల బ్రహ్మయ్య, డి.శరవణన్, బుద్ధి జయరామ్ చేతుల మీదుగా స్కాలర్‌షిప్‌లు అందజేశారు. అలాగే పది, ప్లస్ టూలో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు పతకాలు, నగదు ప్రోత్సాహకాలు అందించారు. అసోసియేషన్ నేతలు బి.ప్రతాప్, యారాశి యుగంధర్, తారా చంద్రన్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.


ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

కత్తితో పొడిచి భార్య హత్య

తిరువొత్తియూరు: పొల్లాచ్చి సమీపంలో భార్యను కత్తితో పొడిచి హత్య చేసిన భర్త కోసం పోలీసులు గాలిస్తున్నారు. కోవై జిల్లా పొల్లాచ్చి సమీపంలోని తొప్పంబట్టి పుదుకాలనీకి చెందిన ఆర్ముగం అలియాస్ డేవిడ్ (34), కర్పగం (33) 14 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గరు బిడ్డలు ఉన్నారు. ఎనిమిది నెలల క్రితం ఇద్దరి మధ్య గొడవలు ఏర్పడి విడిపోయారు. కర్పగం తిరుపూర్ జిల్లా పల్లడంలో ఉన్న తల్లిదండ్రులకు ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో ఆర్ముగం శనివారం రాత్రి పల్లడం వెళ్లి భార్యను తన ఇంటికి రమ్మని పిలిచాడు. ఆమె తిరస్కరించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహించిన ఆర్ముగం కత్తితో దాడి చేసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన కర్పగం అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని కర్పగం మృతదేహాన్ని పొల్లాచి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి ఆర్ముగం కోసం గాలిస్తున్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శన చేస్తున్న ప్రీతి సాయి


నాట్య విశారద బిరుదుతో సత్కారం

కొరుక్కుపేట: చెన్నై ఆర్ఏపురంలోని కూచిపూడి ఆర్ట్ అకాడమీలో శనివారం శ్రీమయి వెంపటి శిష్యురాలు ప్రీతిసాయి కృష్ణమణి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా ఐఏఎస్ అధికారిణి సీకే గరియాళి, గౌరవ అతిథిగా కళాక్షేత్ర ఫౌండేషన్ మాజీ ప్రిన్సిపల్ జనార్దనన్ నృత్య ప్రదర్శనను ప్రారంభించారు. ఆది తాళం, రాగ మాలిక రాగంలో నటరాజ స్వామి, సరస్వతి దేవిని స్మరిస్తూ జయము జయము అనే కీర్తనతో ప్రారంభించి కల్యాణి రాగం, మిశ్ర చాపు తాళంలో రుక్మిణి ప్రవేశం, మరకత మణి మాయ, శివాష్టకం తదితర కీర్తనలకు నృత్యం చేసి ఆకట్టుకుంది. నట్టువాంగంపై శ్రీమయి వెంపటి, గాత్రం స్వాతి ఆత్మానందన్, మృదంగంపై వి.శ్రీధరాచారి, వయొలిన్‌పై ఆరోగ్య మనోజ్ సహకారం నత్య ప్రదర్శనకు మరింత వన్నె తెచ్చింది. కూచిపూడి ఆర్ట్ అకాడమీ నాట్య విశారద బిరుదుతో ఆమెను సత్కరించారు. ఇందిరా పమ్మి, కృష్ణమణి, పరిమళ పాల్గొన్నారు.

తిరుత్తణిలో వినాయక చవితి సందడి


కిటకిటలాడుతున్న గాంధీ మార్కెట్


పూజా సామగ్రి దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి

తిరుత్తణి: వినాయక చతుర్ది సందర్భంగా తిరుత్తణి గాంధీ మార్కెట్‌లో ఆదివారం సందడి నెలకొంది. పూజ సామగ్రి కొనుగోలుకు జనం ఆసక్తి చూపారు. దీంతో దుకాణాలు కిటకిటలాడాయి. సోమవారం వినాయక చతుర్దిని జరుపుకోనున్నారు. ఈ క్రమంలో పది అడుగుల వినాయక విగ్రాహాలు ఏర్పాటు చేసి పూజలు చేసుకోవడానికి పోలీసులు అనుమతి ఇచ్చారు. పేపర్, బంకమట్టితో చేసిన వినాయకుడి విగ్రహాలను విక్రయించేందుకు అనుమతివ్వడంతో ఉత్సవ వేడుకలు కమిటీ సభ్యులు ఉత్సాహంగా విగ్రహాలు కొనుగోలు చేసి వాహనాల్లో తరలించారు. మహిళలు పెద్ద సంఖ్యలో మార్కెట్‌కు చేరుకుని పూజ సామగ్రి, పుష్పాలు, పండ్లు కొనుగోలు చేశారు. గొడుగులు, బొరుగులు, కొబ్బరికాయలు, పండ్ల వ్యాపారం జోరుగా సాగింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు దుకాణాలు కిటకిటలాడాయి. పళ్లిపట్టు, పొదటూరుపేట, ఆర్కేపేట, షోళింగర్, అరక్కోణం మార్కెట్లు సైతం కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి.

జిల్లాలో 452 వినాయకుడి విగ్రహాలకు అనుమతి

తిరువళ్లూరు: జిల్లా వ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో 452 విగ్రహాలను ఏర్పాటు చేయడానికి పోలీసులు అనుమతి ఇచ్చారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏటా వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సోమవారం వినాయక చవితి కావడంతో పెద్ద ఎత్తున వేడుకలను నిర్వహించుకోవడానికి ప్రజలు సిద్ధమయ్యారు. తిరువళ్లూరులో 63, తిరుత్తణిలో 98, ఊత్తుకోటలో 204, పొన్నేరిలో20, గుమ్మిడిపూండిలో 67 విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. కాగా విగ్రహాల నిమజ్జనం కోసం 17 ప్రాంతాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇప్పటికే గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. తిరువళ్లూరు, కాకలూరు, ఆరణి, తిరుప్పచ్చూర్, ఆవడితో పాటు ఇతర ప్రాంతాల్లో తయారైన విగ్రహాలను గ్రామాలకు తరలిస్తున్నారు. ఇక పూజా సామగ్రి కొనుగోలు చేయడానికి పల్లెల నుండి ప్రజలు తరలివస్తున్నారు. తిరువళ్లూరు, ఊత్తుకోట, ఆవడి, అంబత్తూరు, పూందమల్లి, పొన్నేరి, గుమ్మిడిపూండి తదితర ప్రాంతాల్లో పూజ సామగ్రిని కొనుగోలు చేయడానికి పెద్ద ఎత్తున బజారుకు రావడంతో రద్దీ కనిపించింది. వినాయచవితి వేడుకల సందర్భంగా పూలు, పండ్లు, పూజసామగ్రి ధరలు అమాంతం పెరిగాయి. సాధారంగా కిలో చామంతి రెండు వందల రూపాయలు ఉండగా ఆదివారం నాలుగు వందల రూపాయలకు పెరిగింది. పండ్లు, టెంకాయ, జిల్లేడు పువ్వు, గొడుగు లాంటి వస్తువుల ధరలు సైతం గత ఏడాది కంటే ఎక్కువగా పెరిగాయి.


గ్రామాలకు తరలి వెళుతున్న వినాయకుడి విగ్రహాలు


విక్రయానికి ఉంచిన గొడుగులు

జిల్లాలో 452 విగ్రహాల ప్రతిష్టకు అనుమతి: తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా వినాయకుడి విగ్రహాల ప్రతిష్టకు అనుమతి తప్పని సరి చేశారు. ఇప్పటి వరకు 452 విగ్రహాలను ఏర్పాటు చేయడానికి పోలీసులు అనుమతి ఇచ్చారు. విగ్రహాలకు సమీపంలో నిఘాను పెంచారు.

క్లుప్తంగా...

చంద్రబాబును కోర్టే జైలుకు పంపింది..

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం రూరల్: చంద్రబాబును కోర్టే జైలుకు పంపిందని, కేంద్ర ఏజెన్సీలే ఆయనను దోషిగా తేల్చాయని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. ఆయన ఆదివారం శ్రీకాకుళం మండలం బైరి గ్రామంలో సచివాలయ ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. స్కిల్‌స్కామ్‌లో సూత్రధారి, పాత్రధారి చంద్రబాబేనని, ఈ కేసు 2021లో నమోదైందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి, జర్మనీ కంపెనీకు ఒప్పందమంటూ ఫేక్ అగ్రిమెంట్‌లతో అడ్డంగా దొరికిపోయి అడ్డగోలు వాదనలు చేయడం బాబు కోటరీకి తగదని హితవుపలికారు. సాంకేతిక విద్య పేరుతో రూ.371 కోట్ల ప్రజాధనాన్ని 6 షెల్ కంపెనీల్లో పెట్టుబడుల పేరిట దోచేసిన వారిని జైల్లో పెట్టకుండా ఉత్తమ పురుషుడంటూ పొగడాలా.. అంటూ ధర్మాన ప్రశ్నించారు. ఈడీ తనిఖీల్లో ఈ దోపిడీ వ్యవహారం బట్టబయలైందని తెలిపారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు.

నైతికత వదిలేసిన చంద్రబాబు

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



కాకినాడసిటీ: రాష్ట్రంలో తమకు ప్రజాదరణ తగ్గిపోయిందని గ్రహించిన చంద్రబాబు తన కేడర్‌ను, నాయకులను నమ్మలేక జనసేనను పక్కన పెట్టుకొని రాజకీయ నైతికతను మొత్తం వదిలేశారని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. కాకినాడలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2014లో చంద్రబాబుకు మద్దతు ఇచ్చిన పవన్ కల్యాణ్ తనను నమ్ముకున్న అనేక వర్గాలను హింసించడానికి తోడ్పడ్డాడని విమర్శించారు. పవన్ కల్యాణ్ ప్రతిసారీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ది అరాచక పాలన అంటున్నారని, పేదలు ఎక్కడున్నా వెతికి పట్టుకొని మరీ వారి సంక్షేమం కోసం పాటు పడటమే అరాచకమా? వెనుకబడిన వర్గాల జీవితాలను మార్చడం కోసం పని చేయడం అరాచకమా? చెప్పాలని మంత్రి వేణు నిలదీశారు.

బాబు నుంచి పవన్‌కు రూ.1,500 కోట్లు ముట్టాయి

కేఏ పాల్ ఆరోపణ



సీతమ్మధార (విశాఖ ఉత్తర): చంద్రబాబు నుంచి రూ.1,500 కోట్లు పవన్‌కు ముట్టాయని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డా.కేఏ పాల్ ఆరోపించారు. ఆదివారం విశాఖలోని ఆశీలమెట్టలోని కేఏ పాల్ ఫంక్షన్ హాలులో మీడియాతో ఆయన మాట్లాడారు. చంద్రబాబుకు పవన్ కల్యాణ్ కుక్కలాగా అమ్ముడుపోయాడని వ్యాఖ్యానించారు. చిరంజీవి, పవన్ కల్యాణ్ ప్యాకేజీ స్టార్లు అని, అందువల్లే పవన్ వెంట కాపులు లేరన్నారు. వారిద్దరూ కాపులను అమ్ముకోవడానికే ప్రజారాజ్యం, జనసేన పార్టీలు పెట్టారని చిరంజీవి, పవన్‌లను ఉద్దేశించి అన్నారు. 2019లో జనసేనలో లక్ష్మీనారాయణ, తోట చంద్రశేఖర్ ఇద్దరే చేరారని, ఎన్నికలు అయిపోయిన వెంటనే వారూ బయటకు వచ్చారని గుర్తు చేశారు. పార్టీ జాతీయ వైస్.ప్రెసిడెంట్ డాక్టర్.కుమార్, మమత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏడో రోజుకు చేరిన బాబు రిమాండ్

సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు జైలు జీవితం ఏడో రోజుకు చేరింది. ఎప్పటిలాగే ఆదివారం కూడా ఉదయం యోగా అనంతరం అల్పాహారం తీసుకున్నారు. అల్పాహారం, భోజనం రాజమహేంద్రవరంలోని లోకేశ్ క్యాంప్ కార్యాలయం నుంచే వండి పంపుతున్నారు. ఇదిలా ఉండగా బాబు అరెస్ట్‌కు నిరసనగా జిల్లాలో టీడీపీ శ్రేణుల ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయి. లోకేశ్ ఢిల్లీలో ఉన్నారు. బ్రాహ్మణి, భువనేశ్వరి రాజమహేంద్రవరంలోని తమ క్యాంపులో ఉంటున్నారు. ఆదివారం బాలకృష్ణ సతీమణి వసుంధర, లోకేశ్ తనయుడు దేవాన్ష్‌లు క్యాంపునకు చేరుకున్నారు. ములాఖత్‌లు ముగియడంతో కుటుంబ సభ్యులకు బాబును కలిసే అవకాశం రాలేదు.

చంద్రబాబు అరెస్ట్‌కు బీజేపీ వ్యతిరేకం: పురందేశ్వరి



సాక్షి, అమరావతి/వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): చంద్రబాబు అరెస్టును బీజేపీలో ప్రతి కార్యకర్త ఖండిస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. ఆదివారం విజయవాడలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ 'చంద్రబాబు అరెస్టును మొదట ఖండించింది మా రాష్ట్ర నాయకత్వమే. బీజేపీలోని కార్యకర్తలందరూ అదే రకమైన కామెంట్ చేశారు. మేం దీనిని ఖండిస్తున్నామని ప్రతి కార్యకర్తా చెప్పారు. తెలంగాణ బీజేపీ నేతలూ ఇదే మాట మాట్లాడారు' అని వ్యాఖ్యానించారు. చంద్రబాబు అరెస్టుకు కేంద్రంలోని బీజేపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. జనసేన అధినేత పవన్ ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్నారని చెప్పారు.

బాబుకు తోడు దొంగల వత్తాసు

చంద్రబాబుకు సర్టిఫికెట్ ఇస్తున్న సహనిందితులు సుమన్‌బోస్, ఖన్విల్కర్

- స్కిల్ కుంభకోణంలో ఇప్పటికే వాళ్లిద్దరినీ అరెస్టు చేసిన ఈడీ, సీఐడీ
- జైల్లో ఉండి.. బెయిలుపై బయటకు వచ్చి.. ఇపుడు చిలకపలుకులు
- చంద్రబాబు తప్పులేదని వారు చెప్పటంపై న్యాయ నిపుణుల మండిపాటు
- వాళ్ల స్టేట్‌మెంట్లనే పతాక శీర్షికలుగా ప్రచురిస్తున్న 'ఈనాడు', దాని తోక మీడియా
- సీమెన్స్‌కు తెలియకుండా దాని తరఫున సంతకాలు చేసిన సుమన్ బోస్
- ఈ విషయాన్ని న్యాయస్థానంలో స్పష్టంగా చెప్పిన సీమెన్స్
- విచారణకు పూర్తిగా సహకరిస్తామని చెప్పి, ఆధారాలిచ్చిన కంపెనీ
- సుమన్‌బోస్‌తో తమకు సంబంధం లేదని స్పష్టంచేసిన సీమెన్స్

సాక్షి, అమరావతి: ఓ దొంగ... మరో దొంగకు మద్దతిస్తే ఎలా ఉంటుంది? ఒకరికి మద్దతుగా మరొకరు తెరమీదికొచ్చి 'తనేమీ తప్పు చేయలేదు' అని చెప్పటం!!.. వినటానికే విచిత్రంగా ఉంది కదూ? నిజానికి కోర్టుల్లో కనుక ఇలా సాక్ష్యాలు చెబితే జైల్లో పడేస్తారు. కానీ ఎల్లో మీడియా మాత్రం... ఆ దొంగలు చంద్రబాబు నాయుడికి ఇస్తున్న సర్టిఫికెట్లను పతాక శీర్షికల్లో ప్రచురిస్తోంది. అవే నిజాలని జనాలను మభ్య పెట్టే ప్రయత్నాలు చేస్తోంది. ఒకవేళ అవి నిజాలే అనుకుంటే... ఇలా ఎల్లో మీడియాలో సాక్ష్యాలు చెబుతున్న దొంగలను గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇదే కేసులో ఎందుకు అరెస్టు చేసింది? ఐటీ శాఖ ఎందుకు వాళ్లకు నోటీసులిచ్చింది? తాము తప్పు చేశామని వాళ్లు ఎందుకు 'ఈడీ' ఎదుట ఒప్పుకున్నారు? ఈ ప్రశ్నల్లో దేనికీ 'ఈనాడు' దగ్గర గానీ, దాని తోక మీడియా దగ్గర గానీ సమాధానాలు లేవు. వారికి తెలిసిందల్లా... చంద్రబాబు శుద్ధ పూస అని జనాన్ని నమ్మించేందుకు మొత్తం తమ మీడియా సామ్రాజ్యాన్ని అబద్ధాలకు తాకట్టు పెట్టడమే. అదే జరుగుతోంది కూడా!.

దుర్యోధనుడు మంచోడని దుశ్శాసనుడు, శకుని సాక్ష్యం చెబుతున్నట్లే ఉంది టీడీపీ వ్యవహారం. స్కిల్ కుంభకోణంలో ఆధారాలతోసహా అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబుకు మద్దుతుగా ఆ కేసులో ఇతర నిందితులు వికాస్ ఖన్విల్కర్, సుమన్ బోస్ వంటి వారు ఇంటర్వ్యూలిస్తుండటం... సిగ్గులేకుండా వాటిని ఎల్లో మీడియా పతాక శీర్షికల్లో ప్రచురిస్తుండటం రాష్ట్రం మొత్తాన్ని విస్మయపరుస్తోంది. షెల్ కంపెనీల ద్వారా నిధుల తరలింపులో కీలక పాత్ర పోషించిన డిజైన్ టెక్ కంపెనీ ఎండీ వికాస్ వినాయక్ ఖన్విల్కర్ ఇటీవల చంద్రబాబుకు అనుకూలంగా వీడియో విడుదల చేశారు. కాగా తాజాగా ఈ కేసులో మరో నిందితుడు సుమన్ బోస్ 'మా చంద్రబాబు నీతిమంతుడు' అని సర్టిఫికెట్ ఇచ్చేశారు. నిజానికి సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ కంపెనీ పేరిట ఒప్పందం చేసుకుని కోట్లు కొల్లగొట్టడంలో కీలక పాత్రధారి ఈ సుమన్ బోసే. ఈయనను, వికాస్ ఖన్విల్కర్‌ను ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీఐడీ రెండూ అరెస్టు చేశాయి. జైల్లో ఉండి... బెయిలుపై బయటకు వచ్చారు. ఇలా బెయిలుపై వచ్చిన వాళ్లు కేసులోని మరో నిందితుడికి మద్దతుగా మీడియాతో మాట్లాడటమే చిత్రాతిచిత్రం. వాస్తవానికి సుమన్‌బోస్ అసలు బండారాన్ని బయటపెడుతూ సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయం ఇప్పటికే ఇటు సీఐడీకీ అటూ న్యాయస్థానానికి కూడా వాంగ్మూలాన్ని ఇచ్చిందన్నది టీడీపీ ఉద్దేశపూర్వకంగానే తొక్కిపెడుతోంది.

మాకు తెలీదు.. సంబంధం లేదు: సీమెన్స్

టీడీపీ ప్రభుత్వంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ప్రాజెక్ట్‌లో తమ అవినీతి దందాకు 'సీమెన్స్ కంపెనీ ముసుగు వేయాలన్న చంద్రబాబు పన్నాగం బెడిసికొట్టింది. అసలు ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్ గురించి తమకు తెలియనే తెలియదని సీమెన్స్ కంపెనీ కుండబద్దలు కొట్టింది. డిజైన్ టెక్ కంపెనీతో కలసి ఏపీఎస్ఎస్‌డీసీతో తాము కుదుర్చుకున్నట్టు చెబుతున్న త్రైపాక్షిక ఒప్పందానికి, తమకు ఏమాత్రం సంబంధం లేదని స్పష్టం చేసింది. ఏదైనా ప్రాజెక్ట్ కింద 90 శాతం నిధులు గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా సమకూర్చే పద్ధతి



SIEMENS

స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రాజెక్ట్ గురించి తమకు తెలియదని, తమకు సంబంధం లేదని సీమెన్స్ కంపెనీ పంపిన ఈ మెయిల్‌లో ఓ భాగం

అసలు తమ కంపెనీ పాలసీలోనే లేదని విస్పష్టంగా తేల్చింది. తమ కంపెనీ పేరిట సుమన్ బోస్ టీడీపీ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంతో తమకు ఎలాంటి సంబంధం లేదని... అసలు అటువంటి ఒప్పందాలు చేసుకునే అధికారాన్ని ఆయనకు కంపెనీ అప్పగించనే లేదని వెల్లడించింది. ఈ మేరకు ఏపీఎస్ఎస్‌డీసీ ప్రశ్నలకు సవివరంగా సమాధానాలు చెబుతూ పంపిన ఈ–మెయిల్ తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇక ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణాన్ని దర్యాప్తు చేస్తున్న సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందానికి సీమెన్స్ కంపెనీ పూర్తిగా సహకరిస్తోంది.

కుంభకోణంలో ప్రధాన పాత్రధారులు వారిద్దరే..

స్కిల్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి చంద్రబాబు కాగా, సుమన్ బోస్, వికాస్ వినాయక్ ఖన్విల్కర్ ప్రధాన పాత్రధారులుగా వ్యవహరించారు. వారి బండారాన్ని సీఐడీ, ఈడీ ఆధారాలతోసహా బట్టబయలు చేశాయి. ఒప్పందంలో ఓ చోట సుమన్ బోస్ అని మరో చోట సౌమ్యాద్రి బోస్ అని సంతకాలు చేసినట్టు ఆడిట్ నివేదిక నిగ్గు తేల్చింది. సీమెన్స్ కంపెనీ కూడా అంతర్గతంగా విచారించి సుమన్ బోస్ తమ కంపెనీ పేరిట చేసిన మోసాన్ని నిర్ధారించింది. ఆయన అప్పటికే డిలీట్ చేసిన ఈ-మెయిల్స్, వాట్సాప్, ఎస్ఎంఎస్ సందేశాలను రిట్రీవ్ చేసి ఆ రికార్డులను సీఐడీకి అప్పగించింది. తమ కంపెనీకి తెలియకుండానే సుమన్ బోస్ ఏపీఎస్ఎస్‌డీసీతో ఒప్పందం చేసుకున్నారని, అటు తమ కంపెనీని మోసం చేయడంతోపాటు ఇటూ ఏపీ ఖజానాను కొల్లగొట్టడంలో కీలకంగా వ్యవహరించారని న్యాయస్థానంలో 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం ఇచ్చింది. ఇక షెల్ కంపెనీల ద్వారా నిధులు అక్రమంగా తరలించడంలో డిజైన్ టెక్ ఎండీ వికాస్ వినాయక్ ఖన్విల్కర్ కీలక పాత్ర పోషించారు. దాంతో సుమన్ బోస్, వికాస్ వినాయక్ ఖన్విల్కర్‌లను సీఐడీ 2021, డిసెంబర్10న అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించింది. వారిద్దరు 2022, జనవరి 18 వరకు అంటే 40 రోజులపాటు జైలులో ఉన్నారు. బెయిలుపై వచ్చి ఎల్లో మీడియాలో చిలకపలుకులు చెబుతుండటమే ఘోరాతిఘోరం.

సుమన్‌బోస్, ఖన్విల్కర్‌లను అరెస్ట్ చేసిన ఈడీ

ఇక స్కిల్ కుంభకోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. సుమన్ బోస్, వికాస్ వినాయక్ ఖన్విల్కర్‌లతోపాటు షెల్ కంపెనీల ప్రతినిధులు సురేష్ గోయల్, ముకుల్ చంద్ర అగర్వాల్‌లను ఈ ఏడాది మార్చి 4న అరెస్ట్ చేసింది. వారికి విశాఖపట్నంలోని సీబీఐ న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఆ నలుగురినీ ఈడీ అధికారులు కస్టడీకి తీసుకుని 10 రోజులపాటు విచారించారు. అటువంటి సుమన్ బోస్, వికాస్ వినాయక్ ఖన్విన్వేల్కర్ ప్రస్తుతం స్కిల్ కుంభకోణంలో అవినీతి జరగలేదని చెబుతూ చంద్రబాబుకు వత్తాసు పలుకుతుండటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందని పరిశీలకులకు వ్యాఖ్యానిస్తున్నారు.



వికాస్ వినాయక్ ఖన్విల్కర్, మరో నలుగురుని అరెస్టు చేసినట్లు ఈడీ ట్వీట్

ఈ అంశంలో ప్రశ్నావళికి సీమెన్స్ కంపెనీ ఈమెయిల్ ద్వారా చెప్పిన సమాధానాలు ఇలా ఉన్నాయి..

ప్రశ్న: జీవోలో పేర్కొన్నట్టుగా రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కోసం సీమెన్స్–డిజైన్ టెక్ కంపెనీలు రూ.3,300కోట్లతో ప్రాజెక్ట్ నెలకొల్పడానికి అంగీకరించారా? మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.3,300 కోట్లలో ప్రభుత్వం వాటా 10 శాతంగా, గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా సీమెన్స్ 90శాతం వాటా సమకూర్చేందుకు సమ్మతించిందా? గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద అటువంటి ప్రాజెక్టులు చేపట్టే విధానం సీమెన్స్ కంపెనీలో ఉందా?

సీమెన్స్ కంపెనీ సమాధానం: గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద ప్రాజెక్ట్‌లకు 90% నిధులు సమకూర్చే విధానం సీమెన్స్ కంపెనీలో లేనే లేదు. డిజైన్ టెక్ కంపెనీతో కలసి మేము స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌తో ఎలాంటి ఒప్పందం చేసుకోలేదు. అలాంటి ఒప్పందం గురించి మాకు అసలు తెలీదు.

ప్రశ్న: ఏపీలో యువతకు నైపుణ్య శిక్షణ కోసం కుదుర్చుకున్న త్రైపాక్షిక ఒప్పందానికి సంబంధించి ఏపీఎస్ఎస్‌డీసీ నుంచిగానీ డిజైన్ టెక్ కంపెనీ నుంచి ఏమైనా వర్క్ ఆర్డర్ మీకు వచ్చిందా?

సీమెన్స్ కంపెనీ సమాధానం: ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టుకు సంబంధించి మాకు ఏపీఎస్ఎస్‌డీసీ నుంచిగానీ డిజైన్ టెక్ కంపెనీ నుంచి ఎలాంటి వర్క్ ఆర్డర్ రాలేదు.

ప్రశ్న: ఏపీఎస్ఎస్‌డీసీ, డిజైన్‌టెక్‌తో కలిసి సీమెన్స్ కంపెనీ పేరున కుదుర్చుకున్నట్టు చెబుతున్న ఒప్పందంపై సీమెన్స్ కంపెనీ తరపున అని చెబుతూ సుమన్ బోస్ సంతకాలు చేశారు. సీమెన్స్ కంపెనీలో ఆయన హోదా ఏమిటి? ప్రస్తుతం ఆయన ఎక్కడ ఉన్నారు?

సీమెన్స్ కంపెనీ సమాధానం: సీమెన్స్ కంపెనీ తరపున ప్రాజెక్ట్‌లు కుదుర్చుకునేందుకుగానీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద నిధులు సమకూరుస్తామని ఒప్పందం చేసుకునేందుకుగానీ సుమన్ బోస్‌కు ఎలాంటి అధికారం లేదు. కంపెనీ ఆ అధికారాన్ని ఆయనకు ఎప్పుడూ ఇవ్వ లేదు. సుమన్ బోస్ మా కంపెనీకి ఎప్పుడో రాజీనామా చేశారు. ఆయనకు మా కంపెనీకి ఎలాంటి సంబంధం లేదు. ఆయన ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో కూడా మాకు సమాచారం లేదు. ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్ పేరిట అవినీతి కేసులో సుమన్ బోస్‌ను సీఐడీ దర్యాప్తు చేస్తోందని మాకు తెలిసింది. సీమెన్స్ కంపెనీ ఎలాంటి ప్రాజెక్ట్‌లలోనూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద నిధులు వెచ్చించదు. కాబట్టి సుమన్ బోస్ సంతకాలు చేసినట్టు చెబుతున్న ఒప్పందంతో సీమెన్స్ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదు.

కరెంటు పోయింది.. కొవ్వొత్తుల వెలుగులోసంతకాలు చేశా

ఏపీఎస్ఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్‌లో అవినీతి జరగలేదంటూ బుకాయించేందుకు యత్నించి సుమన్ బోస్ అడ్డంగా దొరికిపోయారు. అసలు ఆ ప్రాజెక్ట్ ఒప్పంద పత్రంలో ఏమని రాసి ఉందో కూడా తెలియదని ఆయన పరోక్షంగా చెప్పడం గమనార్హం. ఆ ఒప్పందంపై సంతకాలు చేసిన రోజున కరెంట్ పోయిందని... కొవ్వొత్తులు తెప్పించారని...ఆ కొవ్వొత్తుల వెలుగులోనే తాము సంతకాలు చేశామని చెప్పారు. ఇంతకీ ఆ ఒప్పందంతో తమకు ఏమాత్రం సంబంధం లేదని సీమెన్స్ కంపెనీ ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

స్కిల్ కుంభకోణం సూత్రధారి చంద్రబాబే

▶ మొదటి పేజీ తరువాయి

నిధుల వెచ్చింపు 90:10 నిష్పత్తిగా చెప్పినప్పటికీ ఒప్పందంలో మాత్రం ఆ ప్రస్తావనే లేదని చెప్పారు. అయితే వాస్తవంగా సీమెన్స్ కంపెనీకి ఆ ప్రాజెక్ట్ గురించే తెలియదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం వాటా కింద రూ.371 కోట్లు విడుదల చేసి, 2015–16లో అందులోంచి రూ.271 కోట్లు ఇతర సంస్థలకు అక్రమంగా నిధులు మళ్లించారని చెప్పారు.

సీమెన్స్ కంపెనీకి తెలియదు

సీమెన్స్ కంపెనీకే తెలియకుండా ఆ కంపెనీ మాజీ ఎండీ సుమన్‌బోస్ ఈ కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించారని సంజయ్ తెలిపారు. ఆ విషయాన్ని సీమెన్స్ కంపెనీ కూడా గుర్తించిందన్నారు. నిందితుల్లో ఒకరైన సుమన్ బోస్.. ఒప్పందం కుదిరిన రోజున విద్యుత్తు లేనందున కొవ్వొత్తుల వెలుగులో సంతకాలు చేశామని.. కాబట్టి అందులో వివరాలు సరిగా చూడలేదని చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ విద్యుత్తు రాలేదా అని ప్రశ్నించారు. అసలు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు

ప్రైవేటు వ్యక్తి అయిన గంటా సుబ్బారావుకు ఏకంగా నాలుగు పోస్టులు కట్టబెట్టి, ప్రభుత్వ అధికారులపై పెత్తనం అప్పగించడం.. ఆయన చెప్పినట్టే నిధులు విడుదల చేయాలని చెప్పడం ఏమిటని నిలదీశారు. నిధులు విడుదల చేయాలని చంద్రబాబు ఆదేశించినట్టు సమావేశం మినిట్స్ రికార్డులను గంటా సుబ్బారావు చూపించినట్టు ఆర్థిక శాఖ అధికారులు తెలిపారన్నారు.

త్వరలో మరో ఏడుగురి అరెస్ట్

కుంభకోణం తాలూకు ఫైళ్లలో చంద్రబాబు 13 డిజిటల్ సంతకాలు చేశారని సంజయ్ తెలిపారు. మొత్తం కుంభకోణంలో చంద్రబాబు పాత్ర ఆధారాలతోసహా బయట పడటంతోనే ఆయన్ను అరెస్ట్ చేశామని, ఏసీబీ న్యాయస్థానం రిమాండ్ విధించిందన్నారు. ఈ కేసులో మరో ఏడుగురిని అరెస్ట్ చేయాల్సి ఉందని చెప్పారు. స్కిల్ కుంభకోణంపై ఈడీ కూడా దర్యాప్తు చేస్తూ ఇప్పటికే సుమన్ బోస్, డిజైన్ టెక్ ఎండీ వికాస్ వినాయక్ ఖన్విల్కర్, స్కిల్లర్ ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఆర్థిక సలహాదారు ముకుల్ చంద్ర అగర్వాల్, సీఏ సురేష్ గోయెల్‌లను అరెస్ట్ చేసిందన్నారు. ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ లక్షల డాలర్లు లాటరీ తగిలిందని చెప్పి అందులో పది శాతం కడితేనే మొత్తం ఇస్తాననే రీతిలో ఈ కుంభకోణానికి పాల్పడ్డారని చెప్పారు. తేదీ, లెటర్ నంబరు లేకుండా ఒప్పందం చేసుకోవడం ఎక్కడన్నా జరుగుతుందా.. అని ప్రశ్నించారు. ఈ కేసులో ముద్దాయిలు సెల్ఫ్ సర్టిఫికెట్‌లు ఇచ్చుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

పవన్ నువ్వెంత.. నీ బతుకెంత?

ప్యాకేజీ కోసం సొంత కార్యకర్తలు, సామాజికవర్గాన్ని అమ్మేశావ్.. పర్యాటక శాఖ మంత్రి రోజా ఫైర్

సాక్షి, అమరావతి: ప్యాకేజీ కోసం కన్న తల్లిని దుర్భాషలాడిన వ్యక్తుల దగ్గర పవన్‌కళ్యాణ్ బానిసలా బతుకుతున్నారని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. అవినీతి కేసులో జైలులో ఉన్న చంద్రబాబుతో పొత్తు పెట్టుకుని.. సొంత కార్యకర్తలు, సొంత సామాజికవర్గాన్ని అమ్మేసిన పవన్‌ను 'నువ్వెంత? నీ బతుకెంత?'.. అంటూ ఆగ్రహంతో ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ దేశ చరిత్రలో పవన్‌లాంటి సిగ్గులేని రాజకీయ నాయకుడిని ఎవరూ చూసి ఉండరన్నారు. ప్రజలకిచ్చిన మాట కోసం ఢిల్లీని ఢీకొట్టి.. ప్రతిపక్ష నేతగా.. ముఖ్యమంత్రిగా జగన్ తనను తాను నిరూపించుకుంటే.. పవన్ మాత్రం పార్టీ పెట్టి దశాబ్దం గడిచినా ఇప్పటికీ అందరి జెండాలు మోసే కూలీగానే మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. ఆమె ఇంకా ఏమన్నారంటే..

ఆరోగ్యశ్రీలో నీ పిచ్చి కుదురుస్తాం..

జనసేన పోటీచేసిన 136 స్థానాల్లో 120 చోట్ల డిపాజిట్లు గల్లంతయ్యాయి. నీ స్థాయికి తగ్గట్టు నువ్వు మాట్లాడాలి పవన్. అసలు నువ్వు ఒక్క దానిలోనైనా సక్సెస్ అయ్యావా? చదువులో, ఫ్యామిలీలో, కొడుకుగా, భర్తగా, రాజకీయ నాయకుడిగా అన్నింట్లోనూ ఫెల్యూర్. నీ తల్లిని తిట్టిన వాళ్లతో అంటకాగుతున్నావు.. త్వరలోనే ఆరోగ్యశ్రీ కింద నీ పిచ్చి కుదురుస్తాం. ఇక అమిత్ షా దగ్గరకెళ్లి ఏమని ఫిర్యాదు చేస్తావు? నీ మీద చెప్పులు, రాళ్లు వేయించిన చంద్రబాబుతో నేను పొత్తు పెట్టుకున్నా.. మీరూ రండి.. అని చెప్తావా? మోదీని, ఆయన భార్యను, తల్లిని తిట్టించిన టీడీపీతో కలుద్దామని పిలుస్తావా? ఎన్నికల్లో సొంతంగా పది మంది అభ్యర్థులను నిలపలేని వ్యక్తి యుద్ధానికి సిద్ధమనడం హాస్యాస్పదంగా ఉంది.

బ్రాహ్మణి బ్రహ్మాస్త్రం తుస్సుమంది..

చంద్రబాబు అరెస్టును ప్రజలు పట్టించుకోకపోవడంతో పచ్చ బ్యాచ్‌కు పిచ్చెక్కిపోతోంది. లోకేశ్, భువనేశ్వరి, బాలకృష్ణ, పవన్ విఫలమవడంతో బ్రహ్మాస్త్రంగా బ్రాహ్మణిని తీసుకొచ్చారు. రాజకీయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడిన బ్రహ్మాస్త్రం తుస్సుమంది. చంద్రబాబును డైరెక్టుగా ఎలా అరెస్టు చేశారని బ్రాహ్మణి అంటోంది. సాక్ష్యాధారాలతో దొరికిన దొంగను జైలుకు పంపుతారు కానీ.. జైలర్ సినిమాకు పంపుతారా? అలాగే, దేవాన్ష్‌కి దయచేసి బాబు రిమాండ్ రిపోర్ట్ చూపించొద్దు. వాళ్ల తాత ఎంతపెద్ద దొంగో తెలిస్తే అసహ్యించుకునే పరిస్థితి వస్తుంది. మీ మామ(చంద్రబాబు) గురించి మీ తాత ఎన్టీఆర్ చివరి క్షణాల్లో విడుదల చేసిన వీడియో చూడు. చంద్రబాబు గొడ్డుకన్నా హీనం.. గాడ్సే కన్నా ఘోరం అని స్వయంగా ఎన్టీఆర్ విలపించారు. మీ మామ నిరపరాధని మీ దగ్గర ఆధారాలుంటే మీడియాలో కాదు కోర్టుల్లో చూపించాలి. ఇక స్కిల్ స్కాంలో లోకేశ్, అచ్చెన్నాయుడుతో పాటు పాత్రధారులందరూ జైలుకెళ్లకతప్పదు.

పవన్‌ది 'ప్యాకేజీ' విశ్వాసం

- ఆయనది బాబు పెంపుడు కుక్క స్థాయి
- అందుకే దత్తపుత్రుడి అరుపులు
- జోగి రమేష్ ఫైర్

సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ది చంద్రబాబు పెంపుడు ప్యాకేజీ కుక్క స్థాయిగా ప్రజలు చర్చించుకుంటున్నారని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఎద్దేవా చేశారు. ప్యాకేజీ అందుకున్నందుకు ఆ విశ్వాసంతోనే పవన్ అరుస్తున్నారన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పవన్‌ను మానసిక రోగి, పిచ్చోడిగా అభివర్ణించారు. నీ నిజస్వరూపం తెలిసింది కాబట్టే ఇక నిన్ను శాశ్వతంగా దూరం పెట్టేందుకు నీ అభిమానులు, కాపు సోదరులు సిద్ధమయ్యారన్నారు. ఇక నీతో మాకు అవసరంలేదని నీ అభిమానులు తేల్చిచెబుతున్నారంటూ పవన్‌కు ఆయన స్పష్టంచేశారు. ఇలాంటి నీచమైన స్థాయిలో ఉన్న నువ్వు.. విశేష ప్రజాదరణ ఉన్న సీఎం జగన్‌పై నోరుపారేసుకుంటే ప్రజలే నిన్ను రాళ్లతో తరిమి తరిమి కొడతారంటూ మంత్రి హెచ్చరించారు. మంత్రి జోగి రమేష్ ఇంకా ఏమన్నారంటే..

- చంద్రబాబుతో ములాఖత్‌కు వెళ్లి మిలాఖత్ అయ్యాక తాడూబొంగరం లేనోళ్లను పక్కన పెట్టుకుని విస్తతస్థాయి సమావేశం నిర్వహించిన పవన్ పిచ్చోడిలా మాట్లాడాడు.
- ఢిల్లీలో మహాశక్తిగా ఉన్న సోనియాగాంధీని ఎదిరించి.. వైఎస్సార్‌సీపీని స్థాపించి.. రాజకీయాల్లో అజేయమైన శక్తిగా ఎదిగిన దమ్మున్న నాయకుడు సీఎం జగన్.
- సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో జనరంజక పాలన అందిస్తున్నారు. అందుకే జనమంతా జయహో జగన్ అంటున్నారు.
- పవన్.. అరగేంట్రంలోనే పార్టీ మొత్తాన్ని చంద్రబాబుకు హోల్‌సేల్‌గా అమ్ముకున్న పాలేరువి నువ్వు. చంద్రబాబు మోచేతి నీళ్లు తాగుతూ.. ప్యాకేజీ స్టార్‌గా పిలిపించుకుంటున్న నీకు సీఎం జగన్ పేరెత్తే అర్హతలేదు.
- జనసేనలో ఇన్నాళ్లూ పవన్ అభిమానులుగా, పార్టీ సైనికుల్లా పనిచేసినోళ్లంతా చంద్రబాబుతో మిలాఖత్ ప్రకటనతో కళ్లు తెరుచుకున్నారు. తామంతా పవన్ సీఎం అవుతాడని ఓ పక్కన కష్టపడుతుంటే.. ఆయనేమో బాబే సీఎం అంటాడేంటని ప్రశ్నిస్తున్నారు.
- తామెప్పటికీ జెండా కూలీలుగానే మిగిలిపోవాల్సిందేనా అంటూ వారు మథనపడుతున్నారు.

'స్కిల్'లో చంద్రబాబు దోపిడీ

- బాలకృష్ణను మధ్యవర్తిగా పెట్టుకుని పవన్ జైల్లో డీల్ మాట్లాడుకున్నాడు
- తండ్రిని బయటకు తెచ్చుకునేందుకే లోకేశ్ ఢిల్లీ యాత్ర: మంత్రి కాకాణి

నెల్లూరు(దర్గామిట్ట): మాజీ సీఎం చంద్రబాబు తన నైపుణ్యాన్ని ప్రదర్శించి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో రూ.371 కోట్లు దోచుకున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ నిర్మాతల వద్ద రెమ్యూనరేషన్ తీసుకుని కెమెరాల ముందు మాట్లాడిన విధంగానే చంద్రబాబు దగ్గర ప్యాకేజ్ తీసుకుని ప్రజల ముందు మాట్లాడడం అలవాటు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. అందుకే చంద్రబాబు, లోకేశ్‌లపై నమ్మకం లేక బాలకృష్ణను మధ్యవర్తిగా పెట్టుకుని జైల్లో డీల్ కుదుర్చుకున్నారని మండిపడ్డారు. కేంద్రంలోని నాయకుల కాళ్లమీద పడి తన తండ్రిని బయటకు తెచ్చుకునేందుకు లోకేశ్ ఢిల్లీలో గడప గడపకు తిరుగుతున్నాడని అన్నారు. గతంలో అనేక



కేసుల్లో చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేసి, కోర్టులకు వెళ్లి సాంకేతిక కారణాలు చూపించి స్టేలు తెచ్చుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం చంద్రబాబు అక్రమాలపై కోర్టులకు కూడా స్పష్టత వచ్చిందన్నారు. చంద్రబాబు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయా.. అని టీడీపీ శ్రేణులే అనుకుంటున్నాయని, చివరకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా బాబు పనైపోయిందని మాట్లాడుతున్నారని చెప్పారు. వీటన్నింటినీ పరిశీలిస్తే చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని టీడీపీ క్యాడర్‌కు కూడా అర్థమైందని తెలుస్తోందన్నారు. తన భార్య ఆస్పత్రిలో ఉన్నారని రాజమహేంద్రవరం జైలు సూపరింటెండెంట్ సెలవు పెడితే పచ్చ మీడియా ప్రజలను రెచ్చగొట్టేలా అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో మీ కుటుంబాలకు మేలు జరిగితేనే తమకు ఓటు వెయ్యాలని సీఎం జగన్ ధైర్యంగా చెబుతున్నారని, కానీ చంద్రబాబు మాత్రం ఎవరో ఒకరితో పొత్తులు పెట్టుకుని ప్రజలను బలి చేయాలని చూస్తున్నారని విమర్శించారు.

టీడీపీ, జనసేన పొత్తు అట్టర్ ఫ్లాప్

తటస్థులే కాదు.. జనసేన కార్యకర్తలూ వ్యతిరేకిస్తున్నారు

- సున్నా సున్నా కలిస్తే వచ్చేది సున్నానేనంటూ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా
- వ్యక్తిగత, రాజకీయ జీవితాల్లో అస్సలు నైతిక విలువల్లేని, నమ్మకూడని వ్యక్తి పవన్
- బీజేపీతో పొత్తులో ఉంటూ ఆ పార్టీకి చెప్పకుండా టీడీపీతో కలయికా?
- టీడీపీ, జనసేనలు కలిసే పోటీచేస్తాయని తొలినుంచి చెబుతున్నాం.. అది నిజమైంది
- పోటీచేసిన రెండుచోట్ల ఓడిపోయిన నీ స్థాయి ఎంత పవన్?
- సీఎం జగన్‌పై పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడితే తగిన శాస్తి తప్పదు

సాక్షి, అమరావతి: టీడీపీ, జనసేన పొత్తును తటస్థులే కాదు.. జనసేన కార్యకర్తలు కూడా వ్యతిరేకిస్తున్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. టీడీపీ, జనసేన పొత్తు అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని తేల్చిచెప్పారు. సున్నా సున్నా కలిస్తే వచ్చేది సున్నానేనంటూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల కలయికను ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడల్లా ప్రభుత్వ ఖజానాను దోచేస్తూ.. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ తప్పించుకు తిరుగుతున్న దొంగ చంద్రబాబు స్కిల్ స్కాంలో దొరికిపోయి జైలుపాలు కావడంతో ఇన్నాళ్లకు ధర్మం, న్యాయం గెలిచిందని ప్రజలు హర్షిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు అరెస్టుతో సానుభూతి పొంది, తద్వారా రాజకీయంగా లబ్ధిపొందాలనే నెపంతో టీడీపీ నేతలు కృత్రిమంగా చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు స్పందించడంలేదన్నారు. పవన్‌కళ్యాణ్ జనసేన ప్రాణం తీయగలడేమోగానీ టీడీపీకి ప్రాణం పోయలేడంటూ సెటైర్లు వేశారు. సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో సీఎం వైఎస్ జగన్ ప్రజల హృదయాలను గెలుచుకున్నారని.. ఆ ప్రజాబలంతోనే వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేనలను బంగాళాఖాతంలో కలిపి తిరుగులేని విజయం సాధిస్తారని తేల్చిచెప్పారు. అంబటి ఇంకా ఏమన్నారంటే..

- టీడీపీ–జనసేన పొత్తు నిర్ణయాన్ని ఇప్పుడే తీసుకున్నామని పవన్ చెప్పడం పచ్చి అబద్ధం. తొలి నుంచి వారు కలిసే వస్తారని మేం చెబుతున్నాం. అదే నిజమైంది.
- రాజకీయాల్లోనూ, వ్యక్తిగత జీవితంలోనూ నైతిక విలువల్లేనివాడు, నమ్మకూడని వ్యక్తి పవనే. బీజేపీతో పొత్తులో ఉంటూ ఆ పార్టీకి చెప్పకుండా టీడీపీతో పొత్తు ప్రకటించడం హేయం.
- పోటీచేసిన రెండుచోట్ల ఓడి.. చంద్రబాబు మోచేతి నీళ్లు తాగుతున్న నువ్వెక్కడ? ప్రజాబలంతో 151 సీట్లను గెలుచుకున్న సీఎం జగన్ ఎక్కడ? నువ్వెంత? నీ స్థాయి ఎంత పవన్? సీఎం జగన్‌పై పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడొద్దు.
- ఎంపీడీ (మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్) అనే మానసిక వ్యాధితో బాధపడుతున్న నువ్వా సీఎం జగన్‌పై మాట్లాడేది. మనోహర్ కొంగు పట్టుకుని సముద్రంలో కలవడం ఖాయం.

వినాయక చవితి ప్రత్యేకం

ఒజ్జ గణపతికి వందనాలు



"ఓ బొజ్జ గణపయ్య! నీ బంటు నేనయ్య! ఉండ్రాళ్ళ మీదికి దండు పంపు."

అంటూ పిల్లలు సంబరంగా జరుపుకునే పండగ వినాయక చవితి. యావద్భారత దేశం వేడుకగా జరుపుకునే పండగ ఇది. కలియుగంలో అతి త్వరగా అనుగ్రహించే దైవం వినాయకుడు.

ఋుగ్వేద కాలం నుండి కీర్తించబడి పూజించబడుతున్న దేవత ఒక్క గణపతి మాత్రమే.

దేవతలలో ప్రథముడు, జ్యేష్ఠుడు ఐన గణపతిని అన్ని సందర్భాలలోను పూజించటమే కాదు దేవతలందరూ త్రిమూర్తులతో సహా పూజించినట్టు ఆధారాలున్నాయి. గణపతి కున్న నామాలలో బాగా ప్రసిద్ధమైనవి వినాయకుడు, గజాననుడు. గణనాథుడికి ఉన్న పన్నెండు నామాలలో ప్రతి దాని వెనక ఒక చరిత్ర ఉంది. ముఖ్యంగా వినాయకోత్పత్తి, వినాయకుడు గజాననుడు కావటానికి గల కారణాలు ఒక్కొక్క పురాణంలో ఒక్కొక్క విధంగా ఉన్నాయి. అంతే కాదు ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క రూపంలో అవతరించినట్టు కనపడుతుంది.

సృష్టికార్యం ప్రారంభించే ముందు బ్రహ్మ ప్రార్థించిన గణపతి ఓంకార స్వరూపుడు. కృత యుగంలో కశ్యపునికి అదితికి జన్మించి 'మహోత్కటుడు' అనే పేరుతో దేవాంతక నరాంతక రాక్షసులను సంహరించి లోకకల్యాణం గావించాడు. త్రేతాయుగంలో, మయూరేశుడుగా అవతరించి త్రిమూర్తులకు వారు కోల్పోయిన స్థానాలను తిరిగి ఇప్పించాడు. అప్పుడే బ్రహ్మ తన కుమార్తెలైన సిద్ధి, బుద్ధిలను వినాయకుడికిచ్చి, వివాహం చేస్తాడు. ఈ అవతారంలో వినాయకుడి వాహనం నెమలి. ద్వాపరయుగంలో గజాననుడుగా అవతరించి, సింధూరుడనే రాక్షసుని సంహరించాడు. మనం వినాయకవ్రత కల్పంలో చదివే కథ ఈ గజాననునిదే. కలియుగంలో ధూమ్రకేతువుగా అవతరించి, అశ్వారూఢుడై ప్రతిప్రాణిలో పెచ్చుపెరిగిన రాక్షసప్రవృత్తిని నశింప చేస్తూ ఉన్నాడట.

వివిధ పురాణాలలో గణపతి వినాయకుడి ఆవిర్భావం, రూపు రేఖలు విభిన్నంగా ఉన్న కారణంగా శిల్పులు వాటికి గణపతి తత్త్వాన్ని, తమ సృజనాత్మకతను జోడించి రకరకాల గణపతులను మన ముందు ఉంచుతున్నారు. మిగిలిన లక్షణాలను ఏరకంగా చూపించినా అన్నింటిలోనూ సామాన్యంగా ఉండేవి – గజ ముఖం, కురచ మెడ, పెద్ద బొజ్జ, నాగయజ్ఞోపవీతం, చేతిలో మోదకం, మూషిక వాహనం మొదలైనవి. గజముఖంలో తొండం, పెద్ద చెవులు, చిన్న కళ్ళు భాగాలు.

ప్రపంచ సాహిత్యంలో మొదటిది అయిన ఋుగ్వేదంలో గణపతిగానే పేర్కొనటం జరిగింది. బ్రహ్మాండ పురాణంలో ''కామేశ్వర ముఖాలోక కల్పిత శ్రీ గణేశ్వరా'' అని లలితాదేవి కల్పించినది గణేశ్వరుణ్ణే అని తెలుస్తోంది. తరువాత విఘ్నాలకి అధిపతి అయి విఘ్నేశ్వర నామాన్ని పొందటం జరిగింది. గణాలకు అధిపతి కనుక గణపతి, గణాధిపతి అనే నామాలు కలిగాయి. ఏవైనా గణములు అంటే గుంపులు, సముదాయాలు ఉంటే వాటి మీద అధికారం కలిగి, అవన్నీ ఏకోన్ముఖంగా పని చేసేట్టు చేయించ కలిగిన ప్రజ్ఞయే గణపతి. ఏకాత్మతా భావన కలిగించ గలవాడు గణపతి. ఆ ప్రజ్ఞ లేనట్టయితే సృష్టిలోని అన్ని భాగాలు దేనికవే ఉండేవి. కనుకనే సృష్టి చేసే సమయంలో బ్రహ్మ గణపతిని ప్రార్థించాడట!

డా. ఎస్.అనంతలక్ష్మి

దేవతారూపాలన్నీ ఆయా తత్త్వాలకి ప్రతీకలు. ముఖ్యంగా ప్రత్యేక రూపాలున్న మూర్తులు. గణపతి అనగానే గుర్తు వచ్చేది పెద్ద పొట్ట. దాని నిండా ఉన్నవి విద్యలు. "కోరిన విద్యలకెల్ల నొజ్జయయి యుండెడి ఓయి గణాధిప నీకు మ్రొక్కెదన్" అంటాము కదా! వొజ్జ అంటే గురువు అని అర్థం. అందుకే గణపతి పూజలో పిల్లల చేత పుస్తకాలు పెట్టించుతాము. పనిలో పనిగా గుంజీలు తీయిస్తాము. గుంజీలు తీయటం వల్ల కుదురు వస్తుంది. మెదడు చురుకుగా పని చేస్తుంది. పెద్ద చెవులు బాగా వినమని చెపుతున్నాయి. చిన్న కళ్ళు సూక్ష్మ మైన అంశాలని ఎంత నిశితంగా ఏకాగ్రతతో చూడాలో తెలియ చేస్తాయి. తొండం, ఎప్పుడు నోటిని మూసుకుని ఉండాలని తెలియ చేస్తుంది.

చంద్రుణ్ణి చూసిన దోషం తొలగటానికి శమంతకోపాఖ్యానం చదువుకోవాలనటం కూడా విశేషమే. ఆ కథని అర్థం చేసుకుంటే సమాజం ఎంత బాగుంటుందో కదా! ఏదైనా ఒక వరం ఒకరికి ఇస్తే దాన్ని వారు మాత్రమే ఉపయోగించాలి. ఇతరులకి అది ఉపయోగ పడక పోగా ప్రాణాంతకం కూడా కావచ్చును అని సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనజిత్తు వృత్తాంతమ్ తెలుపుతుంది. ప్రభుత్వం వద్ద కాక వ్యక్తుల దగ్గర ధనం పోగు అయితే ప్రాణాలకే మోసం జరుగుతుందని సత్రాజిత్తు మరణం తెలుపుతుంది. ఎంతటి అవతార పురుషుడికి అయినా దోషఫలం అనుభవించక తప్పదు అని కృష్ణుడికి నీలాపనిందలు రావటం తెలియ చేస్తుంది. సర్వ మానవుల మూలాధారంలో కుండలినీ శక్తిగా ఉన్న జగన్మాతకి గుమ్మం దగ్గర కాపలా కాస్తూ ఉంటాడు. అదే పార్వతీ దేవి గుమ్మంలో కాపలా పెట్టింది అని కథలో చదువుకుంటాం. విఘ్నాధిపతి కనుక మనం చేసే పనుల్లో ఎటువంటి అడ్డంకులు రాకుండా చూడమని అన్ని కార్యాలకి ముందుగా విఘ్నేశ్వరుణ్ణి పూజించటం సంప్రదాయంగా మారింది.



గణపతి పూజ మనకి ఏం చెపుతోంది?

1 మాతా పితృభక్తి అది ఉంటే లోకాలన్నీ చుట్టి రావచ్చు. విజయం సాధించవచ్చు.




2 భౌతిక బలం కన్న బుద్ధి బలం మిన్న తమ్ముడు నెమలి వాహనం మీద ఎగురుతూ వెళ్ళాడు. తాను ఎలుకనెక్కి వెళ్ళి గెలవటం ఎంత కష్టం? కనుక బుద్ధిబలాన్ని ఉపయోగించాడు.

3 ఆకుపచ్చని ఆహారం తింటే తెలివితేటలు పెరుగుతాయి. ఆకుపచ్చరంగులో ఉన్న ఆహారం తింటే తెలివి తేటలు పెరుగుతాయి. చూపు మెరుగుగా ఉంటుంది. అందుకే గరిక తనకి పరమప్రీతి అని చెప్పాడు. బుద్ధి కావాలంటే ఆరాధించవలసింది గణపతినే. గణపతి నక్షత్రమైన హస్తకి అధిపతి బుధుడు. బుద్ధి కారకుడు బుధుడే కదా!

4 ఏక వింశతి 21 రకాల పత్రితో పూజ చేయటం ఒక్క గణపతి పూజలో మాత్రమే కనిపిస్తుంది. పిల్లలకి పత్రి సేకరణ పేరుతో చెట్లని, పర్యావరణాన్ని పరిచయం చేయటం జరుగుతుంది. అవన్నీ ఆ సమయంలో వచ్చే తరుణ వ్యాధులకి ఔషధాలు. ప్రత్యేకంగా గరిక పూజ ద్వారా గరికకి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తున్నాడు. గరిక పవిత్రమైనదే కాదు, భూమి ఆక్కతిని పరిరక్షిస్తుంది.

5 రెండు సార్లు ఆవిరిమీద ఉడకబెట్టిన ఆహారం వానా కాలంలో మంచిది. బలం కలిగిస్తుంది. నూనెలో వేయించిన ఆహారం వానలు పడుతున్నప్పుడు అరగటం కూడా కష్టం.





6 మనలో సామర్థ్యం ఉండాలే కాని పరికరాలు ప్రధానం కాదు అని ఎలుక వంటి అతి చిన్న వాహనం ఎక్కి లోకాలన్నిటిని జయించి చూపించాడు.

సినిమా





"నాకు చాలా చాలా ఇష్టమైన పండుగ వినాయక చవితి. వినాయక విగ్రహాన్ని ఇంటివద్దకు తీసుకొచ్చేటప్పుడు, నిమజ్జనానికి తీసుకెళ్లేటప్పుడు బ్యాండ్‌కి తగ్గట్టు ఫుల్‌గా డ్యాన్స్ చేసి అలిసిపోయేదాన్ని. 'బేబీ' చిత్రంలో ఓ పాటలో వినాయకుడి విగ్రహం ముందు డ్యాన్స్ చేస్తున్నప్పుడు నాకు చిన్నతనం గుర్తొచ్చింది. ఇప్పటికి కూడా వినాయకుడి వద్ద ఉండే బ్యాండ్ సౌండ్‌కి డ్యాన్స్ చేయకుండా ఆగలేను" అని హీరోయిన్ వైష్ణవీ చైతన్య అన్నారు. 'బేబీ' సినిమాతో సూపర్‌హిట్ అందుకున్నారు తెలుగమ్మాయి వైష్ణవీ చైతన్య. నేడు వినాయక చవితి సందర్భంగా 'సాక్షి'తో ప్రత్యేకంగా ముచ్చటించారామె.. ఆ విశేషాలు...

ఈ వినాయక చవితి చాలా ప్రత్యేకం

– వైష్ణవీ చైతన్య

● ఈ ఏడాది వినాయక చవితిని ఎలా ప్లాన్ చేస్తున్నారు?

గతంలో ప్రతిసారి నేను, తమ్ముడు ప్లాన్ చేసేవాళ్లం. కానీ, ఈ సారి మా అమ్మ, నాన్న ప్లాన్ చేస్తున్నారు. ప్రతి ఏడాది తొమ్మిది రోజులు వినాయకుణ్ణి ఇంట్లో పెట్టి పూజ చేసేవాళ్లం.. కాలనీ వాళ్లని పిలిచి అన్నదానం చేసేవాళ్లం. ప్రతి రోజూ సాయంత్ర భజనలు చేసేవాళ్లం. కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి ఫుల్ హంగామా చేస్తూ ట్యాంక్ బండ్‌కి తీసుకెళ్లి నిమజ్జనం చేసేవాళ్లం. ఈ సారి అలాగే చేయాలనుకుంటున్నాం.

● గత ఏడాదికీ, ఈ ఏడాదికీ మీ స్థాయిలో మార్పు వచ్చింది. గతంలో వైష్ణవీ చైతన్య అంటే ఎవరికీ పెద్దగా తెలియకపోవచ్చు. కానీ, ఇప్పుడు 'బేబీ' హీరోయిన్ అని తెలుసు.. దాన్ని ఎలా చూస్తారు?

ప్రతి ఏడాది కొంచెం ప్రత్యేకంగా ఉంటుంది. అయితే ఈ ఏడాది ఇంకా ఎక్కువ ప్రత్యేకం. ఎందుకంటే 'బేబీ' సినిమా చేశాం.. చాలా పెద్ద హిట్ అయింది. ఎంతో మంది నుంచి యూనిట్‌కి అభినందనలు వచ్చాయి. దాంతో మేము చాలా మోటివేషన్(ప్రేరణ) జోన్‌లో ఉన్నాం. ఇంకా అదే సంతోషంలోనే ఉన్నాం.. కాబట్టి ఈ ఏడాది ఇంకా ప్రత్యేకం అని చెప్పాలి.

● వినాయక చవితి అంటే అమ్మాయిలు ప్రత్యేకించి లెహంగా వంటి బట్టలు కుట్టించుకోవడం చేస్తుంటారు. ఈ సారి కూడా అలాంటివి ఏమైనా కుట్టించుకున్నారా?

నా చిన్నప్పటి నుంచి నా బట్టలన్నీ మా అమ్మే కుట్టేది.. ఈ సారి కూడా అమ్మే కుడుతుంది. తొమ్మిది రోజులు వినాయకస్వామికి ఇంట్లో పూజలు చేస్తాం కాబట్టి తొమ్మిది జతల బట్టలు కుడుతుంది. నవరాత్రులకు కూడా అలాగే చేస్తాం. నా కోసం తొమ్మిది హాఫ్ శారీస్ రెడీ చేసి పెడుతుంది మా అమ్మ.

● హాఫ్ శారీస్ కట్టుకోవడం మీకు ఇష్టమేనా?

చాలా ఇష్టం. ఇంట్లో ఖాళీగా కూర్చుని ఉన్నా సంప్రదాయంగా హాఫ్ శారీస్, చీరలు కట్టుకుంటాను. అవి అంటే నాకు అంత పిచ్చి. నేను జీన్స్ వేసుకోవడం చాలా తక్కువ. ఎప్పుడైనా వేసుకున్నా బొట్టు మాత్రం కచ్చితంగా పెట్టుకుంటా. మన సంప్రదాయం, బొట్టు అనేవి నాకు మంచి ప్రేరణ, నమ్మకాన్ని ఇస్తాయి.

● చవితికి పిండి వంటలు చేయడం మీకు వచ్చా?

నేను చేస్తాను.. నాకు బాగా వస్తాయి. పిండి వంటలు, ఉండ్రాళ్లు, పులిహోర నేను చేస్తాను. స్వీట్స్ మాత్రం అమ్మ చేస్తుంది. స్వీట్స్ అంటే నాకు ఎక్కువ ఇష్టం లేదు కాబట్టి నేను చేయను. వంటలన్నీ బాగా వండుతాను.

● మీ అమ్మ మన సంప్రదాయాల గురించి చెబుతూ మిమ్మల్ని పెంచారా?

మన ఇంట్లో వాళ్లు ఎలా ఉంటే మనం కూడా అలా ఉంటాం కదా!. మా అమ్మ ఎప్పుడూ పూజలు, వంటలు చేస్తూ పాజిటివ్ వైబ్స్‌తో ఉండేది. ఆమెను చూస్తూ నేను కూడా నేర్చుకున్నా. నన్ను అయితే నేర్చుకో అంటూ ఎప్పుడూ ఒత్తిడి చేయదు.

● ఇప్పుడు హీరోయిన్‌గా బిజీగా ఉన్నారు కాబట్టి వంట గదిలోకి వెళ్లే సమయం ఉండదనుకుంటా?

అవును. 'బేబీ' తర్వాత ఆశిష్‌కి జోడీగా ఓ సినిమా, సిద్ధు జొన్నలగడ్డకి జతగా ఓ చిత్రం చేస్తున్నా.

● ఖైరతాబాద్ వినాయకుడు అంటే బాగా ఫేమస్.. అక్కడికి వెళుతుంటారా?

ప్రతి ఏడాది వెళుతుంటాం. గత ఏడాది కూడా వెళ్లాను. ఈ ఏడాది కూడా వెళ్లాల్సిందే. 'బేబీ' సినిమా తర్వాత నేను ఎక్కడికి వెళ్లినా గుర్తు పడుతున్నారు. నన్నే కాదు.. మా కుటుంబ సభ్యులను కూడా గుర్తు పట్టి మాట్లాడటం సంతోషంగా ఉంది.

● చిన్నప్పటి నుంచి హీరోయిన్ కావాలనే లక్ష్యం ఉండేదా? లేకుంటే వేరే ఏదైనా..?

నాకు పదిహేనేళ్ల నుంచి సినిమా అంటే ఇష్టం ప్రారంభమైంది. సినిమా అంటే ఏంటో తెలియని వయసులో ప్రారంభమైన ఇష్టం ఇప్పుడు సినిమానే నా జీవితం అయింది.

● మీకు సినిమా నేపథ్యం లేదు. చిత్ర పరిశ్రమలో ఎలా రాణించ గలుగుతామనిపించిందా? పైగా తెలుగమ్మాయి అంటే అవకాశాలు తక్కువగా ఉంటాయి. సినిమా వద్దు.. వేరే కెరీర్‌ని ఎంచుకోమని మీ తల్లిదండ్రులు చెప్పలేదా?

తెలుగమ్మాయిలకు అవకాశాలు ఇవ్వరనే మాట ఎలా వచ్చిందో నాకు తెలియదు. కానీ, నేనయితే సినిమాలపై ఇష్టం, ప్రేమతో ప్రయత్నాలు చేయడం ప్రారంభించా.. ఆడిషన్స్‌కి వెళ్లేదాన్ని. నమ్మకం కోల్పోకుండా అలా ప్రయత్నించగా అవకాశాలు వచ్చాయి. దేనికైనా సమయం పడుతుంది. అది నటనే కాదు.. వేరే ఏ కెరీర్ అయినా కూడా. మనం కోరుకున్నది వచ్చే వరకు ప్రయత్నిస్తూనే ఉండాలి.

● నటన ఒక్కటేనా. లేకుంటే డైరెక్షన్, ఇతర ఆలోచనలేమైనా ఉన్నాయా?

నాకు చిన్నప్పటి నుంచి డ్యాన్స్ అంటే ఇష్టం. కూచిపూడి, వెస్ట్రన్ డ్యాన్స్ నేర్చుకున్నాను.

● మీ జీవితంలో మరచిపోలేని వినాయక చవితి ఏది?

స్కూల్‌లో చదువుతున్న సమయంలో అందరూ పడుకున్నాక కాలనీలోని వినాయక మండపం వద్ద ఉన్న లడ్డును దొంగతనం చేయాలనుకునేవాళ్లం. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మండపం వద్దకు వెళ్లి లడ్డు దొంగతనం చేసి అందరికీ పంచేవాళ్లం(నవ్వుతూ).

ప్రేక్షకుల వల్లే అది సాధ్యమైంది

– నవీన్ పొలిశెట్టి



● పి.మహేశ్‌బాబు, నాగ్‌అశ్విన్, నవీన్ పొలిశెట్టి, మారుతి, విక్కీ

''మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' విడుదల రోజే ఓ పెద్ద హిందీ సినిమా(జవాన్) రిలీజ్ అవుతోందని తెలిసినప్పుడు ఆందోళన చెందాం. కానీ ఈ నెల 7 నుంచి మొదలైన ప్రీమియర్స్ నుంచి ఇప్పటి వరకూ మా సినిమాకు మంచి స్పందన లభిస్తుండటం చాలా సంతోషంగా ఉంది. ప్రేక్షకుల మౌత్‌టాక్‌తోనే ఇది సాధ్యమైంది.. మాకు పెద్ద హిట్ ఇచ్చిన వారికి ధన్యవాదాలు'' అని హీరో నవీన్ పొలిశెట్టి అన్నారు. అనుష్కా శెట్టి, నవీన్ పొలిశెట్టి జంటగా పి.మహేశ్‌బాబు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. వంశీ, ప్రమోద్, విక్కీ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలైంది. ఈ సినిమా విజయోత్సవంలో నవీన్ మాట్లాడుతూ– ''మా సినిమాను అందరికంటే ముందు చూసిన చిరంజీవిగారు హిట్ అవుతుందన్నారు.. ఆయన మాటే నిజం అయింది'' అన్నారు. ''నాకు వచ్చిన ఓ ఐడియాను నవీన్, అనుష్కలతో పాటు నిర్మాతలు నమ్మకుంటే ఈ సినిమా ఇంత సక్సెస్ అయ్యేది కాదు'' అన్నారు పి.మహేశ్‌బాబు. దర్శకులు మారుతి, నాగ్ అశ్విన్, అనుదీప్ కేవీ, నందినీ రెడ్డి, బుచ్చిబాబు, మేర్లపాక గాంధీ, ప్రొడ్యూసర్స్ అభిషేక్ అగర్వాల్, ఎస్‌కేఎన్ మాట్లాడారు.

యువతకు సందేశం

– ఎమ్మెల్యే రాజాసింగ్



● సత్యనారాయణ, రాజాసింగ్, గూడూరు నారాయణరెడ్డి, అనుశ్రేయ త్రిపాఠి

''నేటి యువతకు సందేశం ఇవ్వడానికే 'రజాకార్' సినిమా తీశారు. ఇలాంటి చిత్రం తీసే ధైర్యం చేసిన మా డైరెక్టర్ సత్యనారాయణకి థ్యాంక్స్'' అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. బాబీ సింహా, వేదిక, అనుశ్రేయ త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే కీలక పాత్రల్లో యాటా సత్యనారాయణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రజాకార్'. సమర్ వీర్ క్రియేషన్స్‌పై గూడూరు నారాయణ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను రాజాసింగ్ విడుదల చేసి, మాట్లాడుతూ–''ఈ సినిమా టీజర్ చూస్తేనే ఎంతో కోపం వస్తోంది.. ఇక సినిమా చూస్తే ఇంకెలా ఉంటుందో ఊహించుకోండి'' అన్నారు. ''తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకకు స్వాతంత్ర్యం వచ్చిన సెప్టెంబర్ 17 మా సినిమాకి కథా వస్తువుగా మారింది. ఆ రోజు జరిగిన విముక్తి పోరాటంతో ఈ సినిమా తీశాను'' అన్నారు యాటా సత్యనారాయణ. ''ఈ చిత్రం మన చరిత్ర గురించి అందరికీ తెలియజేస్తుందనుకుంటున్నాను'' అన్నారు గూడూరు నారాయణ రెడ్డి.

రాజ్యంకోసం మహిళ పోరాటం



● మోనిక, దేవీప్రసాద్

మోనికా రెడ్డి ప్రధాన పాత్రలో రాకేష్ రెడ్డి యాస దర్శకత్వంలో ఓ సినిమా షురూ అయింది. సుధ క్రియేషన్స్‌పై రూపొందుతున్న ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి అంజిరెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, షేడ్స్ స్టూడియో ఫౌండర్ దేవీ ప్రసాద్ బలివాడ క్లాప్ ఇచ్చారు. మోనికా రెడ్డి మాట్లాడుతూ– ''పీరియాడిక్ మైథలాజికల్‌గా రూపొందనున్న చిత్రమిది. కథ అంతా నా పాత్ర చుట్టూ తిరుగుతుంది'' అన్నారు. ''రాజ్యం కోసం ఓ మహిళ ధైర్యసాహసాలతో ఎలా పోరాడింది? అన్నదే ఈ చిత్రం కథాంశం'' అన్నారు రాకేష్ రెడ్డి యాస. ''నయనతార, అనుష్కగార్లలా మోనికకు మంచి పేరు రావాలి'' అన్నారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ భాస్కర్ రెడ్డి.

ఆ నమ్మకం ఉంది

– ఏయం రత్నం

''7/జీ బృందావన కాలనీ' సినిమా ఎంత హిట్ అయిందో తెలిసిందే. ఇప్పుడు మళ్లీ రీ రిలీజ్‌లో కూడా అంతే పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. రవి హీరోగా సెల్వరాఘవన్ దర్శకత్వంలోనే '7/జీ బృందావన కాలనీ' రెండో భాగాన్ని అక్టోబర్ నుంచి ప్రారంభిస్తున్నాం'' అని నిర్మాత ఏయం రత్నం అన్నారు. రవికృష్ణ, సోనియా అగర్వాల్ జంటగా నటించిన చిత్రం '7/జీ బృందావన కాలనీ'. సెల్వరాఘవన్ దర్శకత్వంలో ఏయం రత్నం నిర్మించిన ఈ చిత్రం 2004లో విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాను ఈ నెల 22న రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా రీ రిలీజ్ ట్రైలర్ లాంచ్ వేడుకలో రవికృష్ణ మాట్లాడుతూ– ''ట్రైలర్ చూడగానే మళ్లీ రవి పాత్రలోకి వెళ్లిపోయాను. ఈ సినిమా రెండో భాగానికి ముందు మరోసారి '7/జీ బృందావన కాలనీ' మ్యూజిక్ చూపించేలా ఈ చిత్రం రీ రిలీజ్ జరుగుతోంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో హీరో సోనియా అగర్వాల్, నటుడు సుమన్ శెట్టి మాట్లాడారు.



● సుమన్ శెట్టి, రవికృష్ణ, ఏయం రత్నం, సోనియా

అతని తెలివితేటలు అపారం!



● హర్ష సాయి, మిత్ర, బాలచంద్ర

హర్ష సాయి హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మెగా'. మిత్ర ఈ మూవీలో హీరోయిన్‌గా నటిస్తూ, నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'ఈ కథ రాక్షసులతో నిండిన సముద్రాన్నే కుదిపేసే రాజైన మనిషిది', 'అతని తెలివితేటలు అపారం' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. హర్ష సాయి మాట్లాడుతూ– ''మంచి కథలు చెప్పడానికి ప్రస్తుతం ఉన్న పెద్ద మాధ్యమం సినిమా. నేను చిత్రాలను ఎంచుకోవడానికి ఇదే తొలి కారణం. అలాగే యువ ప్రతిభను ప్రోత్సహించాలనుకోవడం మరో కారణం'' అన్నారు. హీరోయిన్, నిర్మాత మిత్ర మాట్లాడుతూ– ''చిన్న ఆలోచనగా మొదలైన ఈ ప్రాజెక్ట్ చాలా భారీ స్థాయికి వెళ్లింది. 2024లో ఈ సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు. ఈ సినిమాకు సంగీతం: వికాస్ బాడిసా, కెమెరా: కార్తీక్ పళని, సమర్పణ: కల్వకుంట్ల వంశీధర్‌రావు, సహ నిర్మాత: పడవల బాలచంద్ర.

నీతోనే నేను..



● మనోజ్‌కుమార్, బుచ్చిబాబు, బాబా పీఆర్

సూర్య భరత్ చంద్ర, విషిక కోట జంటగా బాబా పీఆర్ దర్శకత్వంలో మనోజ్ కుమార్ అగర్వాల్ నిర్మించిన చిత్రం 'అష్టదిగ్బంధనం'. 'ఎ గేమ్ విత్ క్రైమ్' అనేది ఉపశీర్షిక. ఈ సినిమా ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'ఐ యామ్ విత్ యూ' (నీతోనే నేను) పాట లిరికల్ వీడియోను దర్శకుడు బుచ్చిబాబు విడుదల చేసి, మాట్లాడుతూ – ''ఈ పాట కమర్షియల్‌గా ఉంది. సూర్య, విషిక చాలా బాగా చేశారు. సినిమా హిట్ కావాలి'' అన్నారు. ''మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జాక్సన్ విజయన్.



'నాకు రాసిపెట్టి ఉంది'

అంతా ఒక కలలా అనిపిస్తోంది. గత కొంతకాలంగా చాలా బాగా బౌలింగ్ చేస్తున్నాను. కానీ వికెట్లు మాత్రం దక్కడంలేదు. లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడి బౌలింగ్ చేశా. చివరకు ఇవాళ నేను అనుకున్న ఫలితం వచ్చింది. వన్డేల్లో బంతిని స్వింగ్ చేసేందుకు సాధారణంగా ప్రయత్నిస్తుంటా. టోర్నీ గత మ్యాచ్‌లలో అలాంటిది సాధ్యం కాలేదు. కానీ ఇవాళ మంచి స్వింగ్ లభించింది. అవుట్ స్వింగర్‌ను సమర్థంగా వాడుకోవడం ఆనందంగా అనిపించింది. బ్యాటర్లు డ్రైవ్ చేసేందుకు ప్రయత్నిస్తే అవుటయ్యేలా బంతులు వేశా. గతంలో శ్రీలంకతో మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనకు చేరువగా వచ్చినా చివరకు దక్కలేదు. మనకు ఎంత రాసి పెట్టి ఉంటే అంతే దక్కుతుందని నమ్ముతా. ఇవాళ అదృష్టం నా వైపు ఉంది. భారత్‌కు ప్రాతినిధ్యం వహించడంకంటే గర్వించే విషయం మరొకటి ఉండదు. ఇలాంటి ప్రదర్శనలు మరింత ప్రేరణను అందిస్తాయి. కఠోర శ్రమ, సాధన ఫలితమిస్తున్నాయి. నేను ఇంకా సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి ఉంది. - సిరాజ్

ఫైర్ సిరాజ్...

6 వికెట్లతో చెలరేగిన భారత పేసర్ ● ఒకే ఓవర్లో 4 వికెట్లు
శ్రీలంక 50 ఆలౌట్ ● ఆసియా కప్ విజేత భారత్
ఫైనల్లో 10 వికెట్లతో ఘన విజయం

భారత్, శ్రీలంక మధ్య ఆసియా కప్ ఫైనల్... గత రెండు మ్యాచ్‌లలో లంక జట్టు ప్రదర్శన కారణంగా స్థానిక అభిమానులతో స్టేడియం దాదాపుగా నిండిపోయింది... పాక్‌పై గెలుపు, భారత్‌తో పోరాడిన తీరు తుది పోరుపై కూడా అంచనాలు పెంచాయి... మ్యాచ్ హోరాహోరీగా సాగవచ్చని అనిపించింది... వర్షంతో ఆట 40 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది... స్టేడియంలో కాస్త ఆలస్యంగా వచ్చినవారు సీట్లలో కుదురుకునే ప్రయత్నంలో ఉండగా... ఆదివారం వినోదం కోసం మరికొందరు ఇళ్లలో సిద్ధపడుతున్నారు... కానీ మరో గంట ముగిసేసరికి ఖేల్ ఖతం... లంక ఇన్నింగ్స్ ముగిసేందుకు 15.2 ఓవర్లు సరిపోయాయి... ఆపై భారత్ మరో 6.1 ఓవర్లలో ఫటాఫట్ ఛేదన... ఆసియా కప్ ఎనిమిదోసారి భారత్ సొంతం!

ముందుగా మ్యాచ్ మూడో బంతికి వికెట్‌తో బుమ్రా మొదలు పెట్టాడు... ఆ తర్వాత వచ్చిన సిరాజ్ తన మొదటి ఓవర్‌ను మెయిడిన్‌గా వేసి ప్రమాద సూచిక ప్రదర్శించాడు... ఆ తర్వాత అతని రెండో ఓవర్లో అసలు విధ్వంసం జరిగింది. ఒకటి, రెండు కాదు... ఏకంగా నాలుగు వికెట్లు అతని ఖాతాలో... తన మరుసటి ఓవర్లోనూ ఇదే కొనసాగిస్తూ మరో వికెట్... శ్రీలంక స్కోరు 12/6. అయితే అందులో ఐదు వికెట్లు సిరాజ్‌వే... కొంత విరామం తర్వాత మరో వికెట్ కూడా అతని ఖాతాలోనే ... 7 ఓవర్లు వేశాక అదే జోరుతో మళ్లీ బంతిని అందుకునేందుకు సిద్ధమైనా కెప్టెన్ ఇక చాలని వారించాడు... తర్వాతి మూడు వికెట్లతో హార్దిక్ (3/3) ప్రత్యర్థి ఆట ముగించాడు. 50 ఓవర్ల లంక ఇన్నింగ్స్ కాస్తా 50 పరుగుల ఇన్నింగ్స్‌గా మారిపోయింది!



కొలంబో: హైదరాబాదీ పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ తన వన్డే కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో చెలరేగాడు. టెస్టు క్రికెట్‌ను గుర్తుకు తెచ్చేలా పదునైన స్వింగ్ బౌలింగ్‌తో సత్తా చాటిన అతని ధాటిని తట్టుకోలేక శ్రీలంక బ్యాటింగ్ కుప్పకూలింది. సిరాజ్ అసాధారణ ప్రదర్శనతో అలవోకగా టీమిండియా ఆసియా చాంపియన్‌గా నిలిచింది. సొంతగడ్డపై కనీస ప్రదర్శన కూడా ఇవ్వలేకపోయిన లంక పలు చెత్త రికార్డులు తమ ఖాతాలో వేసుకుంది. ఆదివారం ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఫైనల్లో భారత్ 10 వికెట్ల తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 15.2 ఓవర్లలో 50 పరుగులకే ఆలౌటైంది. కుశాల్ మెండిస్ (34 బంతుల్లో 17; 3 ఫోర్లు), దుషాన్ హేమంత (15 బంతుల్లో 13 నాటౌట్; 1 ఫోర్) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సిరాజ్ (6/21) ఆరు వికెట్లతో లంకను దెబ్బకొట్టాడు. అనంతరం భారత్ 6.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 51 పరుగులు చేసి గెలిచింది. శుబ్‌మన్ గిల్ (19 బంతుల్లో 27 నాటౌట్; 6 ఫోర్లు), ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 23 నాటౌట్; 3 ఫోర్లు) మ్యాచ్ ముగించారు. ఒకదశలో 12/6తో లంక వన్డేల్లో అత్యల్ప స్కోరు (35; జింబాబ్వే) నమోదు చేస్తుందేమో అనిపించినా చివరకు ఆ గండం దాటింది. టోర్నీలో 9 వికెట్లు తీసిన కుల్దీప్ యాదవ్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) జడేజా (బి) సిరాజ్ 2; కుశాల్ పెరీరా (సి) రాహుల్ (బి) బుమ్రా 0; కుశాల్ మెండిస్ (బి) సిరాజ్ 17; సమరవిక్రమ (ఎల్బీ) (బి) సిరాజ్ 0; అసలంక (సి) ఇషాన్ కిషన్ (బి) సిరాజ్ 0; ధనంజయ డిసిల్వా (సి) రాహుల్ (బి) సిరాజ్ 4; షనక (బి) సిరాజ్ 0; వెలలాగె (సి) రాహుల్ (బి) హార్దిక్ పాండ్యా 8; దుషాన్ హేమంత (నాటౌట్) 13; మదుషన్ (సి) కోహ్లి (బి) హార్దిక్ పాండ్యా 1; పతిరణ (సి) ఇషాన్ కిషన్ (బి) హార్దిక్ పాండ్యా 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (15.2 ఓవర్లలో ఆలౌట్) 50. **వికెట్ల పతనం:** 1-1, 2-8, 3-8, 4-8, 5-12, 6-12, 7-33, 8-40, 9-50, 10-50. **బౌలింగ్:** బుమ్రా 5-1-23-1, సిరాజ్ 7-1-21-6, హార్దిక్ పాండ్యా 2.2-0-3-3, కుల్దీప్ యాదవ్ 1-0-1-0.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (నాటౌట్) 23; గిల్ (నాటౌట్) 27; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం** (6.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 51.
బౌలింగ్: మదుషన్ 2-0-21-0, పతిరణ 2-0-21-0, వెలలాగె 2-0-7-0, అసలంక 0.1-0-1-0.

ఆ ఆరు వికెట్లు...

సిరాజ్ రెండో ఓవర్...
తొలి బంతి: పాయింట్ దిశగా నిసాంక డ్రైవ్... జడేజా అద్భుత క్యాచ్.
మూడో బంతి: అవుట్ స్వింగర్‌కు సమరవిక్రమ ఎల్బీడబ్ల్యూ.
నాలుగో బంతి: కవర్ పాయింట్ దిశగా ఆడిన అసలంక... కిషన్ క్యాచ్.
ఆరో బంతి: అవుట్ స్వింగర్‌ను ఆడలేక కీపర్ రాహుల్‌కు ధనంజయ క్యాచ్.
సిరాజ్ మూడో ఓవర్...
నాలుగో బంతి: అవుట్ స్వింగర్...షనక క్లీన్‌బౌల్డ్.
సిరాజ్ ఆరో ఓవర్...
రెండో బంతి: అవుట్ స్వింగర్... డ్రైవ్ చేయబోయి మెండిస్ క్లీన్‌బౌల్డ్.

గ్రౌండ్స్‌మెన్‌కు సిరాజ్ గిఫ్ట్

ఫైనల్లో అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో చెలరేగిన సిరాజ్ తన పెద్ద మనసును చాటుకున్నాడు. టోర్నీలో ప్రతికూల పరిస్థితుల్లోనూ ఎంతో శ్రమకోర్చి పిచ్‌లు సిద్ధం చేసిన ప్రేమదాస స్టేడియం గ్రౌండ్స్‌మెన్‌ను తన తరఫున కానుకను ప్రకటించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా తనకు వచ్చిన 5 వేల డాలర్ల చెక్‌ను (సుమారు 16 లక్షల శ్రీలంక రూపాయలు) వారికి అందించాడు. మరోవైపు ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) కూడా కాండీ, కొలంబో గ్రౌండ్స్‌మెన్‌కు ప్రత్యేక బహుమతిని ప్రకటించింది. 50 వేల డాలర్లు (సుమారు 1 కోటి 60 లక్షల శ్రీలంక రూపాయలు) వారికి ఇస్తున్నట్లు ఏసీసీ అధ్యక్షుడు జై షా వెల్లడించారు.



ఇంతింతై...వటుడింతై...

శ్రీలంక ఇన్నింగ్స్ నాలుగో ఓవర్.... సిరాజ్ వేసిన ఐదో బంతిని ధనంజయ మిడాన్ వైపు ఆడాడు. జోరు మీదున్న సిరాజ్ బంతిని ఆపేందుకు తానే స్వయంగా బౌండరీ వరకు పరుగెత్తాడు. అప్పటికే ఆ ఓవర్లో మూడు వికెట్లు తీసిన సిరాజ్‌కు అంత అవసరం లేదు. కోహ్లికి కూడా అలాగే అనిపించి గిల్‌తో పాటు అతనూ చిరునవ్వులు చిందించాడు. కానీ సిరాజ్ అంకిత భావం ఎలాంటిదో అది చూపించింది. ఒక్కసారిగా మైదానంలోకి దిగితే చాలు వంద శాతం అతను జోష్‌లో కనిపిస్తాడు. ఒక్క క్షణం కూడా ఉదాసీనత కనిపించదు. సిరాజ్ వన్డేల్లో ఇప్పుడు కీలక బౌలర్‌గా ఎదగడమే అనూహ్యం. టెస్టుల్లో తనను తాను నిరూపించుకొని రెగ్యులర్‌గా మారినా ఎంతో మంది పేసర్లు అందుబాటులో ఉన్న వన్డేల్లో అతనికి సులువుగా చోటు దక్కలేదు. 2019లో తొలి వన్డే ఆడి అతను జట్టులో స్థానం కోల్పోయాడు. టెస్టు ప్రదర్శనలు, ఐపీఎల్‌లో చక్కటి బౌలింగ్ కూడా అతనికి వన్డేల్లో చోటు కల్పించలేకపోయాయి. అయిదే దాదాపు ఏడాదిన్నర క్రితం సిరాజ్ కెరీర్‌లో కీలక మలుపు. వేర్వేరు సిరీస్‌లకు బుమ్రా, షమీలాంటి సీనియర్లు తరచుగా విశ్రాంతి తీసుకుంటుండటంతో అతనికి మళ్లీ అవకాశం దక్కింది. దీనిని అతను అన్ని విధాలా అందిపుచ్చుకున్నాడు. మూడేళ్ల విరామం తర్వాత సిరాజ్ మళ్లీ వన్డే ఆడాడు. అంతే... అప్పటి నుంచి అతని ప్రదర్శన ప్రతీ మ్యాచ్‌కు మెరుగవుతూ వచ్చింది. ఏదో ద్వితీయ శ్రేణి జట్టులోకి ఎంపిక చేశాం... సీనియర్లు వస్తే మళ్లీ వెనక్కే అన్నట్లుగా కాకుండా తనను మరోసారి పక్కన పెట్టలేని విధంగా రాణించాడు. ఫిబ్రవరి 2022 నుంచి ఆడిన 28 వన్డేల్లో 4 మ్యాచ్‌లు మినహా ప్రతీసారి వికెట్లు పడగొట్టాడు. అలాగనీ పరుగులు ధారాళంగా ఇవ్వలేదు. ఎకానమీ 5 పరుగులు కూడా దాటలేదు. వికెట్లు దక్కకపోయినా ఎన్నోసార్లు బ్యాటర్‌ను ఇబ్బంది పెట్టి, మెయిడిన్లతో ఒత్తిడి పెంచి మ్యాచ్‌పై సిరాజ్ చూపించిన ప్రభావం అమూల్యం. ఇప్పుడు షమీని దాటి బుమ్రా తర్వాత రెండో ప్రధాన పేసర్‌గా మారాడు. 'సిరాజ్ అరుదైన ప్రతిభావంతుడు' అంటూ పదే పదే రోహిత్ ప్రశంసించడం టీమ్‌లో అతనేమిటో చూపించింది. సిరాజ్ పునరాగమనానికి ముందు ఏడాది కాలంలో కొత్త బంతితో భారత బౌలర్లు పేలవంగా బౌలింగ్ చేశారు. తొలి పది ఓవర్లలో అత్యంత చెత్త ప్రదర్శన (23 వన్డేల్లో 132.10 సగటు) నమోదు చేసిన టీమ్‌గా ఇండియా నిలిచింది. సిరాజ్ వచ్చాక అంతా మారిపోయింది. ఆరంభ ఓవర్లలోనే వికెట్లు తీసి అతను ఇస్తున్న శుభారంభాలు జట్టు విజయానికి బాటలు వేశాయి. కెరీర్ ఆరంభంలో సహజమైన ఇన్‌స్వింగ్ బౌలర్‌గా అడుగు పెట్టిన అతను ఆ తర్వాత అవుట్ స్వింగర్లు వేయడంలో రాటుదేలాడు. ఇప్పుడు అతని అమ్ముల పొదిలో అరుదైన 'వాబుల్ సీమ్' అనే ఆయుధం కూడా ఉంది. జనవరి 25న తొలిసారి ఐసీసీ వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచిన సిరాజ్ అప్పటి నుంచి చెలరేగుతూనే ఉన్నాడు. 29 వన్డేలు పెద్ద సంఖ్య కాకపోవచ్చు గానీ ఎలా చూసినా వన్డేల్లో 19.11 సగటు అసాధారణం. సరిగ్గా వరల్డ్ కప్‌కు ముందు సిరాజ్ సూపర్ ఫామ్ జట్టుకు ఆనందాన్నిచ్చే విషయం. ఇదే జోరు కొనసాగిస్తే ఈ హైదరాబాదీ పేసర్ మెగా టోర్నీలోనూ స్టార్‌గా నిలవడం ఖాయం.

–సాక్షి క్రీడా విభాగం

4 వన్డేల్లో ఒకే ఓవర్‌లో నాలుగు వికెట్లు తీసిన నాలుగో బౌలర్ సిరాజ్. గతంలో చమిందా వాస్ (శ్రీలంక: 2003లో బంగ్లాదేశ్‌పై), మొహమ్మద్ సమీ (పాకిస్తాన్: 2003లో న్యూజిలాండ్‌పై), ఆదిల్ రషీద్ (ఇంగ్లండ్: 2019లో వెస్టిండీస్‌పై) ఈ ఫీట్ నమోదు చేశారు.

6/21 వన్డేల్లో భారత్ తరఫున ఇది నాలుగో అత్యుత్తమ ప్రదర్శన. స్టువర్ట్ బిన్నీ (6/4), కుంబ్లే (6/12), బుమ్రా (6/19) సిరాజ్‌కంటే ముందున్నారు.

263 మిగిలి ఉన్న బంతుల పరంగా (43.5 ఓవర్లు) భారత్‌కు ఇదే అతి పెద్ద విజయం.

16 మ్యాచ్‌లో తొలి 5 వికెట్లు తీసేందుకు సిరాజ్‌కు పట్టిన బంతులు. గతంలో చమిందా వాస్, అలీఖాన్ (అమెరికా) కూడా ఇదే తరహాలో 16 బంతులు తీసుకున్నారు.

129 రెండు ఇన్నింగ్స్‌లు కలిపి ఈ మ్యాచ్ 129 బంతుల్లోనే (21.3 ఓవర్లు) ముగిసింది. తక్కువ బంతుల్లో ముగిసిన మ్యాచ్‌ల జాబితాలో ఇది మూడో స్థానంలో నిలిచింది.

బోపన్న... విజయంతో వీడ్కోలు

- డేవిస్ కప్ కెరీర్ ముగించిన భారత టెన్నిస్ స్టార్
- మొరాకోపై 4–1తో నెగ్గిన టీమిండియా
- వరల్డ్ గ్రూప్–1 ప్లే ఆఫ్ దశకు అర్హత



లక్నో: భారత డబుల్స్ టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న తన డేవిస్ కప్ కెరీర్‌ను విజయంతో ముగించాడు. మొరాకోతో ఆదివారం ముగిసిన వరల్డ్ గ్రూప్–2 పోటీలో భాగంగా జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో బోపన్న-యూకీ బాంబ్రీ (భారత్) ద్వయం 6-2, 6-1తో బెన్‌చెట్రిట్-యూనెస్ లారూసి జంటపై గెలిచింది. 2002లో డేవిస్ కప్‌లో అరంగేట్రం చేసిన 43 ఏళ్ల బోపన్న భారత్ తరఫున మొత్తం 50 మ్యాచ్‌లు ఆడాడు. డబుల్స్‌లో 13 మ్యాచ్‌ల్లో నెగ్గి, 10 మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు. సింగిల్స్‌లో 10 మ్యాచ్‌ల్లో గెలిచి, 17 మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూశాడు. డేవిస్ కప్ నుంచి రిటైరయినప్పటికీ ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో బోపన్న టెన్నిస్ కెరీర్‌ను కొనసాగిస్తాడు. డబుల్స్ మ్యాచ్ తర్వాత జరిగిన సింగిల్స్‌లో సుమిత్ నగాల్ 6-3, 6-3తో యాసిన్ దిల్మీపై నెగ్గడంతో భారత్ 3-1తో విజయాన్ని ఖరారు చేసుకుంది. నామమాత్రమైన ఐదో మ్యాచ్‌లో దిగ్విజయ్ ప్రతాప్ సింగ్ 6-1, 5-7, 10-6తో వాలిద్‌ను ఓడించడంతో భారత్ 4-1తో విజయాన్ని దక్కించుకుంది. ఈ గెలుపుతో భారత జట్టు మళ్లీ వరల్డ్ గ్రూప్–1 ప్లే ఆఫ్ దశకు అర్హత సాధించింది.

సింగపూర్ గ్రాండ్‌ప్రి విజేత కార్లోస్ సెయింజ్

వెర్‌స్టాపెన్, రెడ్‌బుల్ జైత్రయాత్రకు బ్రేక్


కార్లోస్ సెయింజ్

సింగపూర్: ఫార్ములావన్ 2023 సీజన్‌లో ఎట్టకేలకు 15వ రేసులో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్లు కాకుండా మరో జట్టుకు చెందిన డ్రైవర్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన సింగపూర్ గ్రాండ్‌ప్రిలో ఫెరారీ జట్టు డ్రైవర్ కార్లోస్ సెయింజ్ చాంపియన్ అయ్యాడు. నిర్ణీత 62 ల్యాప్‌ల ఈ రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన సెయింజ్ అందరికంటే వేగంగా గంటా 46 నిమిషాల 37.418 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని సంపాదించాడు. 22 రేసుల ఈ సీజన్‌లో తొలి 14 రేసుల్లో రెడ్‌బుల్ డ్రైవర్లు వెర్‌స్టాపెన్ (12), సెర్జియో పెరెజ్ (2) విజేతగా నిలిచారు. అయితే సింగపూర్ గ్రాండ్‌ప్రిలో వీరిద్దరికి నిరాశ ఎదురైంది. వెర్‌స్టాపెన్ ఐదో స్థానంతో, పెరెజ్ ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నారు. లాండో నోరిస్ (మెక్‌లారెన్) రెండో స్థానంలో, లూయిస్ హామిల్టన్ (మెర్సిడెస్) మూడో స్థానంలో నిలిచారు. సీజన్‌లోని తదుపరి రేసు జపాన్ గ్రాండ్‌ప్రి ఈనెల 24న జరుగుతుంది.

ఇలవేనిల్ 'పసిడి' గురి



రియో డి జనీరో: ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్ ఖాతాలో తొలి స్వర్ణ పతకం చేరింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత షూటర్ ఇలవేనిల్ వలరివన్ విజేతగా నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో తమిళనాడుకు చెందిన 24 ఏళ్ల ఇలవేనిల్ 252.2 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. క్వాలిఫయింగ్‌లో ఇలవేనిల్ 630.5 పాయింట్లు స్కోరు చేసి ఎనిమిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఓవరాల్‌గా ప్రపంచకప్ టోర్నీలలో ఇలవేనిల్‌కిది ఐదో స్వర్ణ పతకం. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో భారత షూటర్ సందీప్ సింగ్ 628.2 పాయింట్లు సాధించి 14వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత పొందలేకపోయాడు.

నీరజ్ చోప్రాకు రెండో స్థానం



యుజీన్ (అమెరికా): ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ అథ్లెటిక్స్ మీట్ గ్రాండ్ ఫైనల్స్‌లో భారత జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తన టైటిల్‌ను నిలబెట్టుకోలేకపోయాడు. ఆరుగురు పాల్గొన్న ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన నీరజ్ చోప్రా జావెలిన్‌ను 83.80 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాకుబ్ వాద్లెచ్ జావెలిన్‌ను 84.24 మీటర్ల దూరం విసిరి చాంపియన్‌గా అవతరించాడు. గత నెలలో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన నీరజ్ డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. తొలి ప్రయత్నంలో ఫౌల్ చేసిన నీరజ్ రెండో ప్రయత్నంలో జావెలిన్‌ను 83.80 మీటర్ల దూరం పంపించాడు. మూడో ప్రయత్నంలో 81.37 మీటర్లు దూరం విసిరిన నీరజ్ నాలుగో ప్రయత్నంలో ఫౌల్ చేశాడు. ఆ తర్వాత ఐదో ప్రయత్నంలో 80.74 మీటర్లు, చివరిదైన ఆరో ప్రయత్నంలో 80.90 మీటర్లు విసిరాడు. రెండో స్థానంలో నిలిచిన నీరజ్‌కు 12,000 డాలర్లు (రూ. 9 లక్షల 97 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

దక్షిణాఫ్రికాదే సిరీస్


జాన్సెన్ (5/39)

జొహన్నెస్‌బర్గ్: ఆస్ట్రేలియాతో ఐదు వన్డేల సిరీస్‌ను తెంబా బవుమా నాయకత్వంలోని దక్షిణాఫ్రికా జట్టు 3–2తో సొంతం చేసుకుంది. సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన సఫారీ జట్టు... ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకొని వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవడం విశేషం. ఆదివారం జరిగిన చివరి వన్డేలో దక్షిణాఫ్రికా 122 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. ముందుగా దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 8 వికెట్లకు 315 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (93; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), మిల్లర్ (63; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మార్కో జాన్సెన్ (23 బంతుల్లో 47; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఫెలుక్వాయో (19 బంతుల్లో 38 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించారు. అనంతరం ఆస్ట్రేలియా 34.1 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (56 బంతుల్లో 71; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లు మార్కో జాన్సెన్ (5/39), కేశవ్ మహరాజ్ (4/33) ఆసీస్‌ను దెబ్బ తీశారు.

కాంస్య పతక బౌట్‌లో అభిమన్యు ఓటమి



బెల్‌గ్రేడ్: ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు కాంస్య పతకం చేజారింది. ఆదివారం జరిగిన పురుషుల ఫ్రీస్టయిల్ 70 కేజీల కాంస్య పతక బౌట్‌లో భారత రెజ్లర్ అభిమన్యు 1-12తో అర్మాన్ అంద్రెసియాన్ (అర్మేనియా) చేతిలో ఓడిపోయాడు. క్వార్టర్ ఫైనల్లో అభిమన్యును ఓడించిన అమెరికా రెజ్లర్ అలెన్ రూథర్‌ఫర్డ్ ఫైనల్‌కు చేరుకోవడంతో భారత రెజ్లర్‌కు 'రెపిచాజ్' పద్ధతిలో పతకం కోసం మరో అవకాశం దక్కింది. 'రెపిచాజ్' తొలి బౌట్‌లో అభిమన్యు 3-1తో ముస్తఫో అఖ్‌మెదోవ్ (తజికిస్తాన్)పై గెలిచి కాంస్య పతక మ్యాచ్‌కు అర్హత సాధించాడు. ఆదివారం జరిగిన బౌట్‌లలో భారత రెజ్లర్లు పృథ్వీరాజ్ (92 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో... సచిన్ మోర్ (79 కేజీలు) రెండో రౌండ్‌లో... అమన్ సెహ్రావత్ (57 కేజీలు) రెండో రౌండ్‌లో... నవీన్ (74 కేజీలు) రెండో రౌండ్‌లో ఓడిపోయారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
320	89
67,839	20,192

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	13,708	▽ 218
డోజోన్స్	34,618	▽ 278
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,711	▲ 38
డాక్స్	15,894	▲ 88
షాంఘై	3,118	▽ 9
నికాయ్	33,582	▽ 370

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.29	83.96
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	101.57	104.93
€	యూరో	ఒకటి	86.97	90.07
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	52.66	57.25
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.10	54.96
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.06	62.00
SAR	సౌదీ రియాల్	కాయినేజ్	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హమ్	కాయినేజ్	21.75	23.54
¥	చైనా యువాన్	కాయినేజ్	10.31	12.38

మదుపులోనూ తగ్గేదేలే!



- మహిళలకు సొంతంగా పెట్టుబడుల ప్రణాళికలు
- లక్ష్యాలకు అనుగుణంగా తగిన సాధనాల ఎంపిక
- ఇందుకు కొంత నైపుణ్యాలు అవసరం
- అవసరమైతే నిపుణుల సాయం
- జీవిత, ఆరోగ్య బీమా తప్పనిసరి

పురుషులతో సమానత్వం కోసం మహిళలు దశాబ్దాలుగా పోరాడాల్సి వచ్చింది. సుదీర్ఘకాలం పోరాటం ఫలితంగా.. నేడు మహిళలకు సముచిత స్థానం ఏర్పడింది. ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను పురుషులతో సమానంగా మహిళలూ సొంతం చేసుకుంటున్నారు. స్త్రీలు కేవలం చదువుతోనే ఆగిపోవడం లేదు. కెరీర్ కొనసాగిస్తూ, ఎన్నో విజయాలను నమోదు చేస్తున్నారు. ఉన్నత శిఖరాల దిశగా దూసుకుపోతున్నారు. మహిళలు సొంత కాళ్లపై నిలబడుతూ, మంచి ఆదాయాన్ని ఆర్జిస్తున్న తరుణంలో, తమ సంపదను పెంచుకునేందుకు వారికంటూ ప్రత్యేకమైన పెట్టుబడుల విధానాలు, ప్రణాళికలు అవసరం అవుతాయి. పరిశీలించి చూస్తే ఆర్జించే మహిళల్లో అధిక శాతం మంది పెట్టుబడులు, ఆర్థిక విషయాలకు దూరంగా ఉంటున్న పరిస్థితి కనిపిస్తుంది. పొదుపు, మదుపు గురించి అంతగా తెలియదనే ధోరణి వారిలో కనిపిస్తుంది. కానీ, ఇది సరికాదు. ప్రతి ఒక్క మహిళ తప్పకుండా ఆర్థిక విషయాలు, పెట్టుబడులు, వివిధ సాధనాల గురించి తెలుసుకోవాలి. జీవిత భాగస్వాములపై ఆధారపడక్కర్లేకుండా తమ సంపదను తామే నిర్వహించుకునే సామర్థ్యాలు అవసరం. ఈ దిశగా ఏం చేయాలన్నది చర్చించే కథనమే ఇది.

మహిళలే ఎందుకు?

మన దేశంలో చాలా మంది మహిళలు తమ పెట్టుబడుల వ్యవహారాలను భర్త లేదా తండ్రికే విడిచిపెడుతుంటారు. దీంతో వారికి పెట్టుబడుల వ్యవహారాల గురించి తెలియకుండా పోతుంది. కానీ, ఇది సరికాదు. సంపాదన ఒకరిది అయినప్పుడు, నిర్వహణ బాధ్యతలు మరొకరిపై మోపడం ఎందుకు..? ఇల్లాలిగానే కాదు, ఒంటరిగానూ మహిళలు ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు రావచ్చు. తమ జీవిత లక్ష్యాల సాధన కోసం ఇన్వెస్ట్ చేయడం తప్పనిసరి. సంపాదనను సంపదగా మలిచేందుకు అనుసరించాల్సిన మార్గాలపై మహిళలకు తప్పకుండా అవగాహన ఉండాల్సిందే. కారు కొనుక్కోవాలని, ఆభరణాలు కొనుగోలు చేయాలని, మంచి ట్రిప్లెక్స్ విల్లా సమకూర్చుకోవాలని, సెలవుల్లో ఎక్కడికైనా పర్యటించి రావాలనే కోరికలు, లక్ష్యాలు చాలా మందికి ఉంటాయి. వాటిని నెరవేర్చుకోవడానికి అవసరమైన అడుగులు పెట్టుబడుల రూపంలో వేయాలి. ఆర్థిక, పెట్టుబడుల వ్యవహారాలు నిర్వహించేందుకు మహిళలు ఆర్జనా పరులే కానక్కర్లేదు. గృహలక్ష్మి అయినా సరే ఈ విషయాలు తెలిసి ఉండడం వల్ల ఎంతో లాభం ఉంటుంది. కుటుంబ లక్ష్యాల కోసం మార్కెట్లో పెట్టుబడుల వ్యవహారాలు నిర్వహించడం ఎలాగో తెలుసుకోవాలి. మహిళలు తమ పిల్లల కోసం, కుటుంబ బాధ్యతల కోసం లేదంటే తల్లిదండ్రుల కోసం కెరీర్ మధ్యలో పలు సందర్భాల్లో విరామం తీసుకుంటుంటారు. తమ జీవిత భాగస్వాములతో పోలిస్తే అధిక కాలం జీవించే అవకాశాలు ఉంటాయి. కనుక మహిళలకు తప్పకుండా పెట్టుబడుల వ్యవహారాలు తెలిసి ఉండాలి.



పెట్టుబడుల ద్వారా సంపదను సృష్టించుకోవడం అన్నది నైపుణ్యాలపై ఆధారపడి ఉంటుంది. మొదటగా అసలు అందుబాటులో ఉన్న సాధనాలు ఏంటి? అనేది తెలుసుకోవాలి. తర్వాత వాటిల్లో ఏది తమకు అనుకూలమన్నది తేల్చుకోవాలి. పెట్టుబడుల్లో దేనికీ గ్యారంటీ ఉండదు. వివిధ సాధనాల గురించి లోతుగా తెలుసుకోవడం వల్ల మెరుగైన నిర్ణయాలకు వీలుంటుంది. పెట్టుబడుల అవకాశాలు, ప్రస్తుత మార్కెట్ ధోరణుల గురించి ఆన్‌లైన్‌లో సమాచారాన్ని అందించే

నైపుణ్యాలు అవసరం..

పోర్టళ్లు ఎన్నో ఉన్నాయి. వాటి నుంచి కావాల్సిన సమాచారం తీసుకోవచ్చు. అవసరమైతే నిపుణుల సూచనలు తీసుకోవాలి. పెట్టుబడుల ఆరంభించే ముందు నెలవారీ నగదు ప్రవాహాలను ఒకసారి చెక్ చేసుకోవాలి. వస్తున్న ఆదాయం, పెడుతున్న ఖర్చులపై స్పష్టత ఉండాలి. నెలవారీ వేతనం, అద్దె ఆదాయం, ఇతర రూపాల్లో వచ్చేదంతా ఆదాయం కిందకే వస్తుంది. ఖర్చుల్లో తప్పనిసరి, తప్పనిసరి కాదు అని రెండు భాగాలు చేసుకోవాలి. విచక్షణారహితం కానివి అంటే.. ఇంటికి చెల్లించే అద్దె, గృహ రుణ చెల్లింపులు, పిల్లల స్కూల్ ఫీజులు, గ్రోసరీ, యుటిలిటీ కోసం చేసే ఖర్చు తదితరాలు. విచక్షణారహితం అంటే విలాసం, వినోదం కోసం చేసే ఖర్చులు. వీటి ఆధారంగా నెలవారీ ఎంత పొదుపు చేయాలి, ఎక్కడ ఖర్చులను తగ్గించుకోవాలనే దానిపై స్పష్టత వస్తుంది. దీంతో నెలవారీ బడ్జెట్‌ను రూపొందించుకోవచ్చు.

లక్ష్యాలపై స్పష్టత..

పెట్టుబడికి లక్ష్యాలు తోడు కావాలి. అప్పుడే స్పష్టమైన మార్గం తెలుస్తుంది. వచ్చే ఏడాది కాలానికి ఎలాంటి లక్ష్యాలు ఉన్నాయి. అలాగే, ఐదేళ్లు, పదేళ్లు? ఇలా ప్రశ్నించుకోవాలి. వచ్చే ఏడాది విదేశీ పర్యటనకు వెళ్లొచ్చు. లేదంటే 5–10 ఏళ్లలో సొంతిల్లు సమకూర్చుకోవచ్చు. లేదంటి 20–30 ఏళ్లకు వచ్చే రిటైర్మెంట్ తర్వాతి జీవితానికి నిధిని సమకూర్చుకోవడం కావచ్చు. ఇలా లక్ష్యాలన్నింటినీ నిర్ణయించుకున్న తర్వాత.. విడిగా ఒక్కో దానికి ఉన్న సమయం, ఎంత మొత్తం కావాలి, అందుకు నెలవారీగా ఎంత ఇన్వెస్ట్ చేయాలి, అందుకు అనుకూలించే పెట్టుబడి సాధనాలపై స్పష్టత తెచ్చుకోవాలి.

అత్యవసర నిధి

అన్నింటికంటే ముందు అత్యవసర నిధిని సమకూర్చుకోవాలి. ఏ కారణం వల్ల అయినా ఉన్నట్టుండి ఉద్యోగం కోల్పోవచ్చు. లేదా మానేయాల్సిన పరిస్థితి ఏర్పడొచ్చు. ప్రమాదం కారణంగా ఉద్యోగానికి తాత్కాలికంగా వెళ్లలేకపోవచ్చు. ఇలాంటి ఊహించని ఖర్చులను ఎదుర్కోవాలంటే అందుకు ఉన్న ఏకైక మార్గం అత్యవసర నిధి. అత్యవసర నిధి అనేది ఎప్పుడైనా వినియోగించుకోవడానికి అందుబాటులో ఉండే సాధనం. దీనివల్ల కష్ట కాలంలో రుణాలను ఆశ్రయించకుండా దీని సాయంతో గట్టెక్కవచ్చు. సాధారణంగా అత్యవసర నిధి మూడు నుంచి ఆరు నెలల అవసరాలను తీర్చే స్థాయిలో ఉండాలి. దీన్ని సమకూర్చుకునేందుకు ప్రతి నెలా కొంత చొప్పున ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లాలి. బ్యాంక్ ఖాతా లేదంటే లిక్విడ్ ఫండ్స్‌లో ఈ మొత్తాన్ని ఉంచుకోవచ్చు. ఒకవేళ అత్యవసర నిధి ఏర్పాటుకు సరిపడా నగదు ప్రవాహం లేకపోతే, ఏవైనా అవసరాలను తగ్గించుకుని అయినా ఇన్వెస్ట్ చేయాలి.

బీమా రక్షణ

మహిళలకు జీవిత బీమా పాలసీ అవసరమా? చాలా మందికి ఎదురయ్యే ప్రశ్న ఇది. మహిళలకు కూడా జీవిత బీమా కావాలి. ఎందుకంటే వారు లేని లోటును పూర్తిగా కాకపోయినా, కొంత అయినా అధిగమించేందుకు జీవిత బీమా రక్షణ సాయపడుతుంది. బీమా రక్షణ ఉంటే, దురదృష్టవశాత్తూ ఏదైనా జరిగితే, వారిపై ఆధారపడిన వారు ఇబ్బందుల పాలు కాకుండా ఉంటుంది. జీవిత బీమా అంటే జీవితంపై పెట్టుబడి పెట్టేది. భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టేది. చాలా మంది వివాహం అయి, తమకంటూ కుటుంబం ఏర్పాటైన తర్వాతే జీవిత బీమా గురించి ఆలోచిస్తుంటారు. కానీ, ఇది సరైనది కాదు. యుక్త వయసులోనే జీవిత బీమా పాలసీ తీసుకోవాలి. జీవితంలో వివిధ దశల్లో, పెరిగే తమ బాధ్యతలకు అనుగుణంగా బీమా కవరేజీ మొత్తాన్ని సవరించుకుంటూ వెళ్లాలి. ఇది భవిష్యత్తుకు భరోసానిచ్చేదిగా ఉంటుంది. హెల్త్ ఇన్సూరెన్స్ సైతం మహిళలకు ఎంతో ముఖ్యం. పురుషులతో పోలిస్తే మహిళలకు అనారోగ్య సమస్యల రిస్క్ ఎక్కువ. గుండె జబ్బులు, కేన్సర్, స్ట్రోక్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. అందుకే లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ తప్పకుండా తీసుకోవాలి.



పోర్ట్‌ఫోలియో నిర్వహణ

మహిళలు పెట్టుబడుల నిర్వహణలో పెద్దగా ఆసక్తి చూపించకపోవడాన్ని గమనించొచ్చు. ఇదంతా గతం నుంచి ఉన్న ధోరణి వల్లేనని చెప్పుకోవచ్చు. పెట్టుబడుల నిర్వహణ ఎలా? అన్న సందేహం ఎదురైతే.. ముందు తమ బలాల గురించి తెలుసుకోవాలి. రిస్క్‌కు దూరంగా సంప్రదాయ ధోరణితో ఉంటే డివిడెండ్ చెల్లించే కంపెనీలు, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు, యుటిలిటీ సంస్థలను పరిశీలించొచ్చు. రిస్క్ తీసుకునే వారు లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు పెట్టుబడులు కేటాయించుకోవచ్చు. అయితే మొత్తం పెట్టుబడులు అన్నింటినీ ఒకే చోట కాకుండా, వివిధ సాధనాల మధ్య వైవిధ్యం చేసుకోవడం తప్పనిసరి. తమ జీవిత లక్ష్యాల సాకారానికి, మెరుగైన విశ్రాంత జీవనానికి.. దీర్ఘకాలంలో సంపద సృష్టించుకునేందుకు మహిళల ముందు ఎన్నో మార్గాలున్నాయి. ఇందుకోసం వెంటనే పెట్టుబడులు ప్రారంభించాలి.



చాలా ముందుగా ఆరంభిస్తే కాంపౌండింగ్ ప్రయోజనంతో సంపద వేగంగా వృద్ధి చెందుతుంది. మహిళలకు సంబంధించి జీవిత లక్ష్యాలకు మ్యూచువల్ ఫండ్స్ మెరుగైన మార్గం అవుతుంది. మ్యూచువల్ ఫండ్స్ ఈక్విటీతోపాటు డెట్, బంగారం తదితర సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. నిపుణుల నిర్వహణలో, తగినంత వైవిధ్యం, రిస్క్ బ్యాలన్స్‌తో నడిచే మ్యూచువల్ ఫండ్స్ దీర్ఘకాలంలో మెరుగైన రాబడిని ఇవ్వగలవు. ఇప్పటి వరకు ఉన్న గణాంకాలు ఇదే తెలియజేస్తున్నాయి. స్టాక్స్‌లో నేరుగా ఇన్వెస్ట్ చేసేంత విషయ పరిజ్ఞానం, సమయం లేని వారికి మ్యూచువల్ ఫండ్స్ మెరుగైన మార్గం. పరిమిత పెట్టుబడితోనే ఎన్నో రకాల కంపెనీలు, రంగాల్లో ఎక్స్‌పోజర్ లభిస్తుంది. అందులోనూ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల సగటు కొనుగోలు వ్యయం తగ్గి, అధిక రాబడి లభిస్తుంది.

రైట్స్ ఇష్యూపై సిడ్బీ దృష్టి

రూ. 10,000 కోట్ల సమీకరణ

sidbi

ముంబై: ప్రభుత్వ రంగ సంస్థ చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్(సిడ్బీ) వచ్చే ఆర్థిక సంవత్సరం (2024–25)లో రైట్స్ ఇష్యూ చేపట్టే ప్రణాళికల్లో ఉంది. రూ. 10,000 కోట్ల రైట్స్‌ను జారీ చేయడం ద్వారా ఈక్విటీ మూలధనాన్ని విస్తరించుకునే యోచనలో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో ఆస్తులు(రుణాలు) రూ. 5 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనా వేస్తున్న నేపథ్యంలో రైట్స్ ప్రణాళికలకు తెరతీసింది. గతేడాది(2022–23)లో రుణాలు రూ. 4 లక్షల కోట్లను తాకినట్లు బ్యాంక్ చైర్మన్, ఎండీ శివసుబ్రమణ్యన్ రామన్ పేర్కొన్నారు. బ్యాంకులో కేంద్ర ప్రభుత్వ వాటా 20.8 శాతంకాగా.. ఎస్‌బీఐ 15.65 శాతం, ఎల్ఐసీ 13.33 శాతం చొప్పున వాటాలను కలిగి ఉన్నాయి. మిగిలిన వాటా ఇతర పీఎస్‌యూ బ్యాంకులు, ఆర్థిక సంస్థల చేతిలో ఉంది. ఇటీవల డైరెక్ట్ ఫైనాన్సింగ్‌కు డిమాండ్ ఊపందుకోవడంతో బ్యాంకు వేగవంత వృద్ధిని అంచనా వేస్తోంది. లోన్ బుక్‌లో డైరెక్ట్ ఫైనాన్స్ వాటా రెండేళ్ల క్రితం కేవలం 7 శాతంగా నమోదుకాగా.. ప్రస్తుతం 14 శాతానికి ఎగసింది. రైట్స్ ఇష్యూని రూ. 5,000 కోట్లు చొప్పున రెండు దశలలో చేపట్టనున్నట్లు రామన్ వెల్లడించారు. విస్తరిస్తున్న బ్యాలెన్స్‌షీట్‌కు మద్దతుగా మూలధనాన్ని రూ. 10,000 కోట్లమేర పటిష్ట పరచనున్నట్లు తెలియజేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-9-2023	
విశాఖ	525–00
చిత్తూరు	513–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	516–00
విజయవాడ	516–00
రిటైల్ ధర (డజను)	72.00
15-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	485–00
వరంగల్	487–00
రిటైల్ ధర	5.45

గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ — యస్ సెక్యూరిటీస్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 550
టార్గెట్: రూ. 700

ఎందుకంటే: లూబ్రికెంట్స్ తయారీ దిగ్గజం గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా లిమిటెడ్ ఇటీవల టైరెక్స్ ట్రాన్స్‌మిషన్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. రూ. 103 కోట్లు వెచ్చించి 51 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు వెల్లడించింది. అహ్మదాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు విస్తరించిన టైరెక్స్ ప్రధానంగా డీసీ ఫాస్ట్ చార్జర్లపై దృష్టి పెట్టింది. ప్రభుత్వ రంగ దిగ్గజాలు ఎన్‌టీపీసీ, హెచ్‌పీసీఎల్, పవర్‌గ్రిడ్‌సహా ఎల్కట్రా తదితర కస్టమర్ల కోసం 400 చార్జర్లను ఏర్పాటు చేసింది. ఈవీ చార్జింగ్ విభాగంలో ఇది కంపెనీ చేపట్టిన మూడో కొనుగోలుకాగా.. ఏసీ, బైడైరెక్షనల్ చార్జింగ్ సంస్థ ఇంద్రా రెనెవబుల్స్‌ను సైతం ఇంతక్రితం చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇంద్రా రెనెవబుల్స్ ఎలక్ట్రీఫై పేరుతో సాస్ సంబంధ ఐవోటీ ఆధారిత ఈమొబిలిటీ సొల్యూషన్స్ అభివృద్ధి చేయడంలోనూ నైపుణ్యాలను కలిగి ఉంది.



కాగా.. రానున్న 5–6 ఏళ్లలో దేశీ మార్కెట్ల ద్వారా టైరెక్స్ నుంచి రూ. 500–600 కోట్ల టర్నోవర్‌ను గల్ఫ్ ఆయిల్ అంచనా వేస్తోంది. మరోవైపు బ్యాటరీ బిజినెస్ నుంచి రానున్న ఐదేళ్లలో 20 శాతం వార్షిక ప్రగతిని ఆశిస్తోంది. వెరసి రూ. 200 కోట్ల ఆదాయాన్ని లెక్కకడుతోంది. ఇక కంపెనీకి కీలకమైన లూబ్రికెంట్స్ బిజినెస్‌పై రానున్న మూడేళ్ల కాలంలో ఏడాదికి రూ. 20 కోట్లు చొప్పున పెట్టుబడులు వెచ్చించే ప్రణాళికలు అమలు చేస్తోంది. లూబ్రికెంట్స్ విభాగం వృద్ధిపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తూనే అదనపు పెట్టుబడి అవకాశాలను అన్వేషిస్తోంది. కంపెనీకిగల నెట్‌వర్క్, బ్రాండ్, భాగస్వామ్యాలు, ఇతర లబ్ధికి వీలున్న అవకాశాలకు ప్రాధాన్యత ఇస్తోంది.

సంవర్ధన మదర్‌సన్ — జేఎం ఫైనాన్షియల్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 98
టార్గెట్: రూ. 130

ఎందుకంటే: ఆటో రంగ విడిభాగాల దిగ్గజం సంవర్ధన మదర్‌సన్ ఇంటర్నేషనల్ గత రెండు దశాబ్దాలలో ఏకంగా 30కుపైగా సంస్థలను కొనుగోలు చేసింది. తద్వారా సింగిల్ ప్రొడక్ట్ కంపెనీ స్థాయి నుంచి పలు ఉత్పత్తులు, ప్రదేశాల నుంచి విక్రయాలు నిర్వహించగల దిగ్గజ గ్రూప్‌గా ఆవిర్భవించింది. ఈ కాలంలో మదర్‌సన్ గ్రూప్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 30 శాతం జంప్ చేస్తూ వచ్చింది. 14 బిలియన్ డాలర్లకు చేరింది. వెరసి కంపెనీ ఆటో విడిభాగాల సరఫరాకు ప్రపంచస్థాయి ర్యాంకింగ్స్‌లో 2023కల్లా టాప్–15 జాబితాలో చోటు సాధించింది. అంతక్రితం 2005లో టాప్–40 కంపెనీలలో ఒకటిగా నిలిచింది. అయితే త్రైమాసికవారీ ఆర్డర్లు, ఆదాయ వృద్ధివంటి సాధారణ అంశాలనుకాకుండా రానున్న మూడేళ్ల కాలంలో బిజినెస్ పురోగతికి ప్రాధాన్యత ఇస్తూ కంపెనీ విశ్లేషణను చేపట్టడం సబబుగా భావిస్తున్నాం.



ప్రధానంగా ప్రపంచ ఆటో విడిభాగాల విభాగంలో కంపెనీ ప్రధాన పాత్రను పోషించగల సామర్థ్యాలను కలిగి ఉండటమే దీనికి కారణం. సొంతం చేసుకున్న సంస్థలను లాభాల బాట పట్టించడంలో కంపెనీకి బలమైన ట్రాక్ రికార్డ్ ఉంది. ఆటో విడిభాగాల పరిశ్రమలో 2010కల్లా 0.4 శాతంగా నమోదైన కంపెనీ గ్లోబల్ మార్కెట్ వాటా 2023కల్లా 2.5 శాతానికి చేరింది. ప్రపంచవ్యాప్త కార్యకలాపాలు, పవర్‌ట్రయిన్ అగ్నోస్టిక్ ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియో విస్తరణ, విస్తృతస్థాయిలోని కస్టమర్లు వంటి అంశాలు కంపెనీ వృద్ధికి కొన్నేళ్లపాటు సహకారాన్ని అందించే అవకాశముంది. ఈ అంశాలు మూడేళ్ల కాలంలో కంపెనీ 25 శాతం అంతర్గత రిటర్న్ రేటు(ఐఆర్ఆర్)ను సాధించగలదని భావిస్తున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'డిఫాల్టర్ల'కు చాక్లెట్ ప్యాకెట్లు


- ఎస్‌బీఐ వినూత్న ఐడియా
- సకాలంలో చెల్లింపులను గుర్తు చేయడమే లక్ష్యం



న్యూఢిల్లీ: సకాలంలో నెలవారీ వాయిదాలను కట్టేసేలా రుణగ్రహీతలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వినూత్న పంథా ఎంచుకుంటోంది. ఈఎంఐ కట్టడంలో డిఫాల్ట్ అయ్యే అవకాశం ఉన్న వారికి చాక్లెట్ బాక్సులు పంపి, వాయిదా చెల్లింపుల గురించి గుర్తు చేయడంపై దృష్టి పెడుతోంది. 'రిటైల్ రుణగ్రహీతలకు వారి పేమెంట్స్ గురించి గుర్తు చేసేందుకు కృత్రిమ మేధను ఉపయోగించే రెండు ఫిన్‌టెక్ సంస్థలతో కలిసి వినూత్న విధానాలను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నాం. వీటిలో ఒకటి, రుణగ్రహీతలతో రాజీ కుదుర్చుకోవడం కాగా, రెండోది ఒక రుణ గ్రహీత డిఫాల్ట్ అయ్యే అవకాశాలను గుర్తించడం. ఫిన్‌టెక్ సంస్థ ప్రతినిధులు, అలాంటి రుణ గ్రహీతల ఇళ్లకు చాక్లెట్ల ప్యాకెట్‌తో సందర్శిస్తారు. రాబోయే ఈఎంఐల గురించి వారికి గుర్తు చేస్తారు' అని ఎస్‌బీఐ ఎండీ (రిస్క్, కాంప్లయెన్స్, స్ట్రెస్డ్ అసెట్స్) అశ్విని కుమార్ తివారీ తెలిపారు. సాధారణంగా ఈఎంఐని కట్టకూడదనే యోచనలో ఉన్న రుణగ్రహీతలు .. బ్యాంకు నుంచి వచ్చే ఫోన్స్‌కు స్పందించరని ఆయన చెప్పారు. అలాంటప్పుడు చెప్పాపెట్టకుండా వారి ఇంటికి వెళ్లి, ఆశ్చర్యపర్చడమనేది .. వాయిదాల వసూలుకు మంచి మార్గం కాగలదన్నారు. 15 రోజుల క్రితమే ప్రారంభించిన ఈ విధానం ఇప్పటివరకు సత్ఫలితాలే ఇస్తోందని తివారీ వివరించారు. దీన్ని మరో నాలుగైదు నెలలు కొనసాగిస్తామన్నారు. వడ్డీ రేట్ల పెరుగుదలతో రిటైల్ రుణాల విభాగంలో ఎగవేతలు పెరుగుతున్న నేపథ్యంలో ఎస్‌బీఐ ప్రయోగాత్మక విధానం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎస్‌బీఐ రిటైల్ రుణాలు (వ్యక్తిగత, ఆటో, గృహ, విద్యా రుణాలు) రూ. 12 లక్షల కోట్ల పైచిలుకు ఉంటాయి.

మనీ మార్కెట్ ఫండ్ ఎవరికి అనుకూలం?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడు ఎగ్జిట్ లోడ్ విధిస్తారు. దీన్ని ఎలా అమలు చేస్తారు? - ఎస్ అశోక్

ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే ప్రతి ఒక్కరికీ ఎగ్జిట్ లోడ్ గురించి తెలియాలి. ఇన్వెస్ట్ చేసిన తర్వాత నిర్దేశిత కాలంలోపు పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడు అమలు చేసే చార్జీయే ఎగ్జిట్ లోడ్. ఫండ్ నిబంధనల్లో ఇది స్పష్టంగా ఉంటుంది. ఫండ్ రకాన్ని బట్టి ఎగ్జిట్ లోడ్ వేర్వేరుగా ఉంటుంది. ఏకమొత్తంలో (లంప్‌సమ్) పెట్టుబడి లేదా సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసిన పెట్టుబడి వాయిదా నుంచి ఈ తేదీ పరిగణనలోకి వస్తుంది. ఒకవేళ ఎగ్జిట్ లోడ్ చార్జీలను మ్యూచువల్ ఫండ్ సంస్థ మార్చినట్టయితే.. పెట్టుబడి పెట్టిన తేదీ నాటికి ఉన్న ఎగ్జిట్ లోడ్ విధానమే, ఉపసంహరణ సమయంలో అమలవుతుంది. ఉదాహరణకు రూ.లక్షను 2022 నవంబర్ 1న ఒక పథకంలో ఇన్వెస్ట్ చేసినట్టు అనుకుందాం. ఆ సమయంలో ఎగ్జిట్ లోడ్ 365 రోజులకు 1 శాతంగా ఉంది. పెట్టుబడి తేదీ నాటికి పథకం ఎన్ఏవీ 20గా ఉంది. దీంతో రూ.లక్ష పెట్టుబడికి 5,000 యూనిట్లు వచ్చాయి. 2023 సెప్టెంబర్ 15న రూ.50వేలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. అప్పుడు ఎన్ఏవీ 25 ఉందని అనుకుందాం. రూ.50వేల కోసం 2,000 యూనిట్లను విక్రయించాలి. దీంతో ఏడాదిలోపు (365 రోజుల్లోపు) విక్రయించినట్టు అవుతుంది. కనుక ఎగ్జిట్ లోడ్ పడుతుంది. రూ.50,000 ఉపసంహరణ విలువపై ఒక శాతం ఎగ్జిట్ అంటే రూ.500 చెల్లించాలి. కనుక చేతికి రూ.49,500 వస్తాయి. ఒకవేళ ఈ ఉపసంహరణను 2023 నవంబర్ 1 తర్వాత తీసుకుంటే ఎగ్జిట్ లోడ్ పడదు. సిప్ రూపంలో ఒక్కో పెట్టుబడికి విడిగా ఇది అమలవుతుంది. ఉదాహరణకు 2022 నవంబర్ 1న సిప్ రూపంలో ఒక పథకంలో రూ.10,000 ఇన్వెస్ట్ చేశారు. ఎన్ఏవీ రూ.20గా ఉంది. దీంతో 500 యూనిట్లు వచ్చాయి. అప్పటికి 1 శాతం ఎగ్జిట్ లోడ్ ఉంది. 2022 డిసెంబర్ 1 నుంచి ఎగ్జిట్ లోడ్ 1.5 శాతానికి పెరిగింది. డిసెంబర్ 1న సిప్ రూపంలో రూ.10,000 ఇన్వెస్ట్ చేశారు. ఆ సమయంలోనూ ఎన్ఏవీ రూ.20 దగ్గరే ఉండడంతో మరో 500 యూనిట్లు వచ్చాయి. దీంతో ఉపసంహరణ సమయంలో యూనిట్ల విక్రయంపై ఎగ్జిట్ లోడ్ వేర్వేరుగా అమలవుతుందని గ్రహించాలి.

మనీ మార్కెట్ ఫండ్ అంటే ఏమిటి? ఎవరు ఈ ఫండ్‌లో ఎప్పుడు ఇన్వెస్ట్ చేయవచ్చు? - నాగరాజు

మనీ మార్కెట్ ఫండ్ అన్నది డెట్ మ్యూచువల్ ఫండ్ పథకం. ఏడాది కాలంలో గడువు ముగిసే స్వల్పకాల డెట్ ఇన్‌స్ట్రుమెంట్లు, ఇతర సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఇవి రిస్క్‌లేని అంచనా వేయతగిన రాబడులను ఇవ్వగలవు. ఎందుకంటే అధిక నాణ్యత కలిగిన సాధనాల్లోనే ఇన్వెస్ట్ చేస్తాయి కనుక రాబడులు స్థిరంగా ఉంటాయి. కనుక మనీ మార్కెట్ మ్యూచువల్ ఫండ్ పథకాలు దాదాపు రిస్క్‌లేని, ఎంతో రక్షణతో కూడినవి. స్వల్పకాలానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే ఎక్కువ రాబడులను ఇస్తాయి. ఏడాది కాలానికి ఇన్వెస్ట్ చేసుకునే వారు వీటిని పరిశీలించొచ్చు. బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలో డిపాజిట్లపై రాబడి కంటే అధిక రాబడిని ఇవ్వగలవు. బ్యాంక్ ఖాతాల్లో ఎక్కువ బ్యాలన్స్ ఉంటే ఈ సాధనాల్లోకి మళ్లించుకోవచ్చు. మొత్తం 16 రకాల డెట్ మ్యూచువల్ ఫండ్స్ ఉండగా, లిక్విడ్ ఫండ్స్, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ అన్నవి రిటైల్ ఇన్వెస్టర్లకు అనుకూలంగా ఉంటాయి. మీ పెట్టుబడుల కాల వ్యవధి ఏడాది అయితే లిక్విడ్ ఫండ్స్ మంచివి. ఇవి తక్కువ రిస్క్ పథకాలు. అత్యవసర నిధికి వీటిని ఉపయోగించుకోవచ్చు. ఏడాదికి మించిన దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే షార్ట్ డ్యురేషన్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఏడాది నుంచి మూడేళ్ల కాల సాధనాల్లో ఇవి ఇన్వెస్ట్ చేస్తాయి. డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడంలో ఉన్న ప్రాథమిక లక్ష్యం పెట్టుబడి పరిరక్షణతోపాటు, కొంత రాబడి కోరుకోవడం. ఈ దృష్ట్యా లిక్విడ్ ఫండ్స్, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ సరిపోతాయి.

చంద్రబాబు అరెస్ట్ సక్రమమే

• ఐటీ ఉద్యోగుల భారీ ర్యాలీ • హైదరాబాద్‌లో బాబు చేసిందేమీ లేదు



సాక్షి, మేడ్చల్ (తెలంగాణ) : ఏపీ సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా హైదరాబాద్‌లో ఆదివారం ఐటీ ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్ట్ చేయడం కరెక్టే అంటూ కార్లతో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ క్రమంలో ఐటీ ఉద్యోగులు కీసర ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కార్లలో ర్యాలీ ప్రారంభించి గచ్చిబౌలి వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జై జగన్.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఐటీ ఉద్యోగులు మాట్లాడుతూ.. సంక్షేమాభివృద్ధి పథకాల వల్ల మళ్లీ అధికారంలోకి వచ్చేది సీఎం జగన్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. చంద్రబాబు అవినీతి చేయకపోతే ఆయనకు అన్ని వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. నిన్న ఓఆర్ఆర్‌పై పెయిడ్ ఆర్టిస్టులు చంద్రబాబుకు మద్దతుగా ర్యాలీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఓఆర్ఆర్ కట్టింది.. తెచ్చిందే వైఎస్సార్. ఇక్కడ చంద్రబాబు చేసిన అభివృద్ధి ఏమీ లేదు' అని చెప్పారు.

వక్రతుండం.. భిన్న రూపం

పెన్సిల్ కొనపై ఏకదంతుడు



పెన్సిల్ కొనపై వెంకటేష్ చెక్కిన గణనాథుడు

అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత, మైక్రో ఆర్టిస్ట్ డాక్టర్ గట్టెం వెంకటేష్ వినాయక చవితిని పురస్కరించుకుని రెండు గంటలు శ్రమించి పెన్సిల్ కొనపై ఏకదంతుడి రూపాన్ని చెక్కాడు. 12 మిల్లీమీటర్ల పొడవు, నాలుగు మిల్లీమీటర్ల వెడల్పుతో రూపుదిద్దుకున్న గణనాథుడు అందర్నీ ఆకట్టుకుంటున్నాడు.

–నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)

మొక్కజొన్న కంకిపై 666 గణేశ్ రూపాలు



శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరుకు చెందిన సుప్రసిద్ధ చిత్రకారుడు అమీర్‌జాన్ వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మొక్కజొన్న కంకి విత్తనాలపై 666 వినాయక చిత్రాలను మైక్రో పెయింటింగ్ శైలిలో తీర్చిదిద్దారు. ఆక్రిలిక్ కలర్స్, మైక్రోబ్రష్‌లను వినియోగించి ఆరు గంటల సమయంలో విఘ్నేశ్వరుల చిత్రాలను తీర్చిదిద్దారు.

–నెల్లూరు (బృందావనం)

నాణేల విఘ్నేశ్వరుడు



నాణేలతో తయారు చేసిన వినాయకుడు విగ్రహం

అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన బొమ్మల తయారీ కళాకారుడు వానపల్లి వాసు వారం రోజుల పాటు శ్రమించి నాణేలతో మూడు అడుగుల గణనాథుడిని తయారు చేశాడు. దీనికి పూర్వ కాలంలో వాడిన పైసా, అణా, అర్ధణా నుంచి ప్రస్తుతం వాడుకలో ఉన్న పది రూపాయల కాయిన్స్ వరకు రూ. 10 వేల చిల్లర నాణేలను వినియోగించాడు. నాణేలతో తయారు చేసిన గణనాథుడు మెరిసిపోతున్నాడు.

–నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా)

■ తెలంగాణ

చరిత్రను తప్పుగా చిత్రీకరిస్తే ప్రజలే బుద్ధి చెబుతారు

వాస్తవాలను మరుగున పడేస్తే చరిత్రే ఉండదు: అమిత్ షా

తెలంగాణ విమోచన దినోత్సవంలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి



సాక్షి, హైదరాబాద్: సంతుష్టీకరణ రాజకీయాల కోసం వాస్తవాలను మరుగున పడేస్తే చరిత్రే ఉండదని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. తెలంగాణ చరిత్రను తప్పుగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. హైదరాబాద్ స్టేట్‌కు స్వాతంత్ర్యం రాకుండా స్వతంత్ర రాజ్యంగా ఉంటే.. భారతమాత కడుపులో కేన్సర్ ఉన్నట్లేనని గుర్తించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ఈ ప్రాంతాన్ని రజాకార్ల నుంచి విముక్తి కల్పించేందుకు 'ఆపరేషన్ పోలో' పేరిట నడుం బిగించారన్నారు. రక్తం చుక్క చిందకుండానే.. నిజాం మెడలు వంచి హైదరాబాద్ స్టేట్‌కు స్వాతంత్ర్యం ఇప్పించారన్నారు. కేఎం మున్షీ నేతృత్వంలో, పటేల్ ఆదేశాలతో ఈ ఆపరేషన్ జరిగిందని చెబుతూ వారికి నివాళులు అర్పిస్తున్నామన్నారు. పటేల్ కృషి లేకపోతే భారత్‌లో హైదరాబాద్ స్టేట్‌తో సహా వందలాది సంస్థానాల విలీనం మరింత ఆలస్యమై ఉండేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణతోపాటు కల్యాణ కర్ణాటక, మరాఠా మహారాష్ట్ర ప్రాంత ప్రజలకు శుభాకాంక్షలు చెబుతున్నామన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక కూడా రాజకీయాల కారణంగా విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకపోవడం సరికాదని చెప్పారు. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో 75వ హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని అమిత్‌షా జాతీయజెండాను ఎగురవేశారు. సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఆర్ఏఎఫ్‌లతో కూడిన 30 బలగాల నుంచి పోలీసు వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ స్టేట్ విమోచన కోసం పోరాడి, ఎన్నో త్యాగాలు చేసిన స్వామి రామానందతీర్థ, బూర్గుల రామకృష్ణారావు, కేశవ్‌రావు కోరట్కర్, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, కాళోజి నారాయణరావు, మర్రి చెన్నారెడ్డి, పీవీ నర్సింహారావు వంటి వీరులకు శిరస్సు వంచి అంజలి ఘటిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ విమోచన కోసం పోరాడిన అమరులకు శ్రద్ధాంజలి, యువత, విద్యార్థుల్లో దేశభక్తి పెంపు, రాష్ట్రానికి పునరంకితం కావాలనే మూడు ప్రధాన లక్ష్యాల సాధన కోసం ప్రధాని మోదీ చొరవతో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు.

చెత్త సమస్యకు కొత్త పరిష్కారం

అమలాపురానికి లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్

కరగనున్న 28 వేల మెట్రిక్ టన్నుల చెత్త కొండ

రూ.2.01 కోట్లతో ఏర్పాటు

అమలాపురం టౌన్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం మున్సిపాలిటీ డంపింగ్ యార్డులో కొన్నేళ్లుగా పేరుకుపోయిన 28 వేల మెట్రిక్ టన్నుల చెత్త కొండను కరిగించేందుకు రూ.2.01 కోట్లతో లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఎట్టకేలకు నెలకొల్పారు. భవిష్యత్తులో చెత్త సమస్యకు ఈ ప్లాంట్ ద్వారా పూర్తి పరిష్కారం లభించనుంది. ఏడాది కాల పరిమితితో ఈ ప్లాంట్ ద్వారా మొత్తం చెత్త కొండను నాలుగు రకాల ప్రాసెస్‌తో కరిగించనున్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా గుంటూరు తరుణి అసోసియేట్స్ సంస్థ ఇక్కడ ఈ ప్లాంట్‌ను నెలకొల్పింది. స్థానిక 29వ వార్డులోని శ్మశాన వాటిక, కంపోస్టు యార్డు ఉన్న స్థలంలోనే ప్లాంట్ ఏర్పాటు చేసి మూడు రోజులుగా చెత్త శుద్ధీకరణ చేస్తోంది. మున్సిపాలిటీకి దాదాపు 15 ఏళ్లుగా గుదిబండలా ఉన్న వేల టన్నుల చెత్త కొండ పెను సమస్యగా మారింది. ఇప్పటికే పెరుగుపోతున్న చెత్త కొండను తగ్గించేందుకు మున్సిపాలిటీ అనేకసార్లు పొక్లెయిన్ వినియోగిస్తూ దాదాపు రూ.కోటి వరకూ నిధులు వెచ్చించింది. ఈ క్రమంలో ఇప్పుడు లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ వల్ల ఈ పెను సమస్యకు పరిష్కారాన్ని చూపుతోంది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం, మున్సిపాలిటీ 15 శాతం నిధులను భరించి ఈ ప్లాంట్‌ను నడుపుతున్నాయి.

రోజుకు 200 టన్నులు నాలుగు రకాలుగా శుద్ధీకరణ

ఈ ప్లాంట్ ద్వారా 28 వేల మెట్రిక్ టన్నుల చెత్తను రోజుకు 200 టన్నుల వంతున శుద్ధీకరణ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. బయో రెమిడియేషన్ ప్రక్రియతో లెగసీ వేస్ట్ ల్యాండ్ రిక్లమేషన్, బయో మైనింగ్ విధానంతో చెత్త శుద్ధీకరణ జరుగుతోంది. ఈ ప్లాంట్‌లో లెగసీ చెత్త వేయగానే ఒకేసారి నాలుగు రకాల చెత్త శుద్ధీకరణ, వర్గీకరణ జరుగుతుంది. చెత్తలోని మట్టిని ఓ వైపు వేరు చేస్తుంది. మరోవైపు రాళ్లు, రప్పలను, ఇంకో వైపు గాజు వస్తువులు, మరో వైపు ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేస్తుంది. లెగసీ ట్రీట్‌మెంట్ ద్వారా వచ్చే మట్టిని ఎరువుగా ఉపయోగిస్తారు. రాళ్లు, రప్పల ద్వారా వచ్చిన మెటీరియల్‌ను పల్లపు ప్రాంతాలను మెరక చేసేందుకు వినియోగిస్తారు. గాజు వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులను శుద్ధి చేసి వేరే అవసరాలకు ఉపయోగించే విశాఖపట్నంలోని జిందాల్ పరిశ్రమకు తరలిస్తారు. ఇలా నాలుగు రకాలుగా రీ సైకిలింగ్ చేసిన మెటీరియల్‌ను తిరిగి ఉపయోగించుకునేలా అందుబాటులోకి తెస్తున్నారు.



అమలాపురం కంపోస్ట్ యార్డ్‌లో ఏర్పాటైన లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్

ప్రజలు సహకరించాలి



లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ అమలాపురం మున్సిపాలిటీకి ఓ వరం. ఈ ప్లాంట్ ద్వారా తొలుత 28 వేల మెట్రిక్ టన్నుల చెత్త కొండను లేకుండా చేస్తాం. తర్వాత రెగ్యులర్‌గా వచ్చే చెత్తను ఎప్పటి కప్పుడు తడి, పొడి, ప్రమాదకర చెత్తల వర్గీకరణను పూర్తి స్థాయి సాంకేతిక ప్రక్రియతో రీ సైకిలింగ్ చేసేలా ప్రణాళిక తయారు చేశాం. పట్టణ ప్రజలు క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్), స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మార్గ దర్శకాలను అనుసరిస్తూ చెత్త శుద్ధీకరణకు సహకరించాలి.

– ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపుం మున్సిపాలటీ



విదేశీ విహంగాలు సీజన్‌కు ముందే వచ్చేశాయ్. నేలపట్టులో అతిథి పక్షులు సందడి చేస్తున్నాయ్. రక్షిత కేంద్రంలో కిలకిల రావాలు మార్మోగుతున్నాయ్. ముందుగా చేరుకున్న నత్తగుల్ల కొంగలు కనువిందు చేస్తున్నాయ్.. త్వరలోనేనే గూడ బాతులు.. తెల్లకంకణాయిలు.. తెడ్డుముక్కు కొంగలు.. ఫ్లెమింగోలు తరలిరానున్నాయ్.. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సందర్శకులు ఇబ్బంది పడకుండా పకడ్బందీగా వసతులు కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా చిన్నారులను ఆకట్టుకునేలా పార్కులను సన్నద్ధం చేస్తున్నారు.



కేంద్రంలో విడిది చేస్తున్న నత్తగుల్లకొంగలు



నేలపట్టు పక్షుల కేంద్రం ప్రధాన గేట్లు

విహంగం..విహారం!

నేలపట్టులో నత్తగుల్ల కొంగలు

• సీజన్‌కు ముందే చేరుకున్న అతిథులు
• పక్షుల రక్షిత కేంద్రంలో ఏర్పాట్లు చేపట్టిన అధికారులు
• సందర్శకుల కోసం పక్కాగా వసతులు

దొరవారిసత్రం: ఆసియా ఖండంలో విదేశీ వలస విహంగాలకు అతి పెద్ద సంతానోత్పత్తి కేంద్రంగా బాసిల్లుతున్న నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం 1976లో ఏర్పాటైంది. ఏటా శీతాకాలంలో క్రమం తప్పకుండా నైజీరియా, బర్మా, ఆఫ్ఘనిస్తాన్, ఖజకిస్తాన్ తదితర దేశాల నుంచి గూడబాతులు, నత్తగుల్లకొంగలు, తెడ్డుముక్కుకొంగలు, స్వాతికొంగలు, నారాయణపక్షులు, బాతు జాతికి చెందిన పలు రకాల విహంగాలు ఆకాశ మార్గంలో వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి ఇక్కడకు తరలివస్తుంటాయి. ఇక్కడి చెరువులోని కడప చెట్లపై సుమారు 7 నెలల పాటు విడిది చేసి వాటి సంతానాన్ని అభివృద్ధి చేసుకుని తిరిగి స్వస్థలాలకు వెళ్లిపోతుంటాయి. వీటిని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల నుంచి కూడా పెద్దసంఖ్యలో సందర్శకులు విచ్చేస్తుంటారు.

వలస పక్షుల సంతానోత్పత్తి ఇలా..

పక్షుల కేంద్రానికి వచ్చే వలస విహంగాల జీవన విధానం దాదాపు మనుషులను పోలి ఉంటుంది. విడివిడిగా ఇక్కడకు చేరుకున్న పక్షులు తొలుత ఆడ, మగ జాతులు ఒకదాన్ని ఒకటి అర్థ చేసుకుంటాయి. మగ పక్షికి ఆడ పక్షి గూడు కట్టుకునే పుల్లను అందించి స్నేహం కుదుర్చుకుంటాయి. అనంతరం చెరువులోని కడప చెట్లపై ఆడ,మగ పక్షులు గూళ్లు కట్టుకుని జత కడతాయి. ఆడ పక్షి గుడ్లు (2–3)పెట్టిన తర్వాత మగ పక్షి గుడ్ల రక్షణ బాధ్యత తీసుకుంటుంది. పిల్లలు పిగిలాక కూడా మగ పక్షి పిల్లలకు సంరక్షకుడిగా వ్యవహరిస్తుంది. పక్షులు 24 కిలోమీటర్లు దూరంలోని పులికాట్ సరస్సులో చేపలను వేటాడి పిల్లలకు ఆహారంగా అందిస్తాయి. ఈ సన్నివేశాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. పక్షి పిల్లలు పెద్దవయ్యాక చెరువులోనే పెద్ద పక్షులు ఈత నేర్పుతాయి. అవిఎగిరే స్థాయి వచ్చాక అన్నీ ఆయా దేశాలకు వెనుతిరిగి వెళ్లిపోతాయి.


సీజన్‌కు ముందే సందడి

నేలపట్టు పక్షుల కేంద్రంలో విహంగాల కిలకిలరావాలు సీజన్‌కు ముందే మొదలైంది. సాధారణంగా అక్టోబర్‌లో సీజన్ మొదలై ఏప్రిల్ వరకు కొనసాగుతుంది. అయితే ఎప్పటిలానే ఈ ఏడాది కూడా రెండు వందలకు పైగా నత్తగుల్ల కొంగలు ముందే చేరుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నేరేడు, మారేడు, అత్తిగుంట చెరువుల్లోకి నీరు చేరింది. ఆయా చెరువుల్లో పెరిగిన కడప చెట్లుపై నత్తగుల్ల కొంగలు విడిది చేస్తున్నాయి. వీటితో పాటు పదుల సంఖ్యలో చుట్టపక్కల ప్రాంతాల్లోని పశువురుల కొంగలు, చిన్నస్వాతి కొంగలు, శబరి కొంగలు, నీటి కాకులు తదితరాలు దర్శనమిస్తున్నాయి. మరి కొన్ని విదేశీ విహంగాలు ఆకాశంలో చక్కర్లు కొడుతున్నాయి.

చకచకా ఏర్పాట్లు

పక్షుల రక్షిత కేంద్రంలో వన్యప్రాణి విభాగం, అటవీశాఖ అధికారులు సందర్శకుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేస్తున్నారు. విహంగాల రాక మొదలుకావడంతో పనులను వేగవంతం చేశారు. ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించి రూ.10లక్షలతో చెరువు కట్టపై వ్యూ పాయింట్ల వద్ద షెడ్లు, జింకల పార్కులో తాగునీటి గుంతలు, చెట్ల కింద పర్యాటకుల కోసం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పిల్లల పార్కులో పరికాలకు మరమ్మతులు చేయిస్తున్నారు. మరుగుదొడ్లలో విద్యుద్దీపాలు, పార్కింగ్ స్థలం అభివృద్ధి చేస్తున్నారు. తాగు నీటి కొళాయిలు ఏర్పాటు, మరమ్మతుల్లో నిమగ్నమయ్యారు.

పర్యాటకుల కోసం..



నేలపట్టు పక్షుల కేంద్రంలో పర్యాటకుల సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేశాం. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా పార్కును సిద్ధం చేస్తున్నాం. సీజన్‌కు ముందే నత్తగుల్ల కొంగలు రావడంతో సందర్శకుల రాక ప్రారంభమైంది. అన్ని పక్షులు వస్తే అక్టోబర్ 1వ తేదీ నుంచి టికెట్ కౌంటర్ ప్రారంభిస్తాం. విదేశీ విహంగాలను వీక్షించి ప్రజలు ఆనందించేలా సర్వం సిద్ధం చేస్తున్నాం.

– వి.భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజర్, నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం





పార్కులోని చుక్కల జింకలు



చెరువు కట్టపై వ్యూ పాయింట్లు వద్ద సందర్శకుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన షెడ్లు



పక్షుల కేంద్రంలోని పర్యావరణ కేంద్రం

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.